బుధవారం
21•2•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 255
• పేజీలు : 16 + (24/16) + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE



PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



మంగళవారం హెచ్ఐసీసీలో వరల్డ్ ఐటీ కాంగ్రెస్ సందర్భంగా మంత్రి కే తారకరామారావు సమక్షంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుపై నాస్కాం అధ్యక్షుడు ఆర్ చంద్రశేఖర్, రాష్ట్ర ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

- రూ.40 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు
- ఐటీ వరల్డ్ కాంగ్రెస్ సందర్భంగా ఒప్పందం
- తాత్కాలికంగా గచ్చిబౌలి ట్రిపుల్‌ఐటీలో
- హైదరాబాద్‌లో విశేష మానవ వనరులు
- అందుకే ఈ కేంద్రం ఏర్పాటుకు నిర్ణయం
- నాస్కాం చైర్మన్ ఆర్ చంద్రశేఖర్ ప్రకటన
- ఐటీలో రాష్ట్ర ప్రభుత్వ కృషికి అభినందనలు
- వాల్యూమ్, వెరైటీ, వెలాసిటీ.. ఈ మూడూ భవిష్యత్తులో పరిశ్రమను మార్చివేస్తాయి
- 2025 నాటికి 16 బిలియన్ డాలర్లకు ట్రిపుల్ 'వీ' రంగం
- రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కే తారకరామారావు
- నాస్కాం కేంద్రం ఏర్పాటుపై కృతజ్ఞతలు
- ఐటీలో లక్ష ఉద్యోగాలు!: నాస్కాం వెల్లడి
- 2019లో ఐటీ ఎగుమతుల్లో 7.9% వృద్ధి

బుద్వేల్‌లో నాస్కాం కేంద్రం

దేశంలోనే మొట్టమొదటి డాటా అనలిటిక్స్ సెంటర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

వరల్డ్ ఐటీ కాంగ్రెస్ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం వరుసగా రెండోరోజు మరో ప్రతిష్ఠాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. దేశంలోనే అతిపెద్ద ఐటీ, ఐటీ అనుబంధ సేవల సంస్థ నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ (నాస్కాం) తెలంగాణ ప్రభుత్వంతో జట్టుకట్టింది. దేశంలోనే మొట్టమొదటి డాటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన ఎక్సలెన్స్ కేంద్రాన్ని తెలంగాణలో ఏర్పాటు చేయనుంది. ప్రాథమికంగా రూ.40 కోట్ల పెట్టుబడితో పబ్లిక్, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ విధానంలో ఈ కేంద్రం ఏర్పాటు కానుంది. రాష్ట్ర ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, నాస్కాం చైర్మన్ ఆర్ చంద్రశేఖర్ ఈ మేరకు హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో మంగళవారం ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ రెండు రంగాల్లో వస్తున్న అవకాశాలను ఒడిసి పట్టుకునే పరిశోధనలు చేసేందుకు ఈ కేంద్రం వేదిక కానుంది. ఈ సందర్భంగా జయేశ్‌రంజన్ మాట్లాడుతూ తెలంగాణ ఐటీ పాలసీ ప్రారంభం సమయంలోనే అనుబంధరంగాలపై దృష్టి సారించి, ఇందుకోసం పరిశ్రమల వర్గాలతో ఒప్పందం చేసుకుంటామని పేర్కొన్నామని, ఆ దిశలో పడిన కీలక ముందడుగు ఇది అని తెలిపారు. ప్రస్తుతం గచ్చిబౌలిలోని ఐఐఐటీలో

మిగతా 2వ పేజీలో



థ్యాంక్యూ.. అందరినీ ప్రేమించండి

నా ఫేవరైట్ స్టార్ షారూక్‌ఖాన్

మహిళల హక్కుల కోసం పోరాడుతా

మానవ రోబో 'సోఫియా' మనసులో మాటలు

వివరాలు 6వ పేజీలో

బొగ్గు తవ్వకాలు ప్రైవేటుకు

1973లో గనుల జాతీయీకరణ తర్వాత తొలిసారి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:

బొగ్గు తవ్వకాలలో ప్రైవేటు రంగానికి కేంద్ర ప్రభుత్వం ద్వారాలు తెరిచింది. బొగ్గు గనులను 1973లో జాతీయం చేసిన తరువాత వాటిపై ఏకఛత్రాధిపత్యం సాగిస్తున్న కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) ఆధిపత్యానికి కేంద్రం గండి కొట్టింది. వాణిజ్య వినియోగం కోసం శిలాజ ఇంధనం తవ్వకాలకు ప్రైవేటు రంగాన్ని అనుమతించాలని కేంద్ర మంత్రివర్గం మంగళవారం నిర్ణయించింది. ప్రధాని

మిగతా 5వ పేజీలో

- విద్యుత్ టారిఫ్‌లు తగ్గే అవకాశం
- ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల మందికి ఉపాధి
- రూ.11,661 కోట్లతో నాలుగు రాష్ట్రాల్లో రైల్వే ప్రాజెక్టులు
- జనాన్ని మాయచేసే డిపాజిట్ పథకాలను అరికట్టేందుకు కఠిన చట్టం
- మహానది వివాద పరిష్కారానికి ట్రిబ్యునల్
- కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలు

అంతర్రాష్ట్ర నదీజలాల సమస్యల పరిష్కారానికి ఇదే మార్గం

ఒకే ట్రిబ్యునల్

- పార్లమెంటు ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు
- ఆరువారాల్లో కావేరీ బోర్డు, రెగ్యులేషన్ కమిటీ ఏర్పాటు
- కేంద్రమంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

దేశంలోని నదులకు సంబంధించి బేసిన్లవారీగా ట్రిబ్యునల్స్ ఉండటం.. అంతర్రాష్ట్ర సమస్యలు పరిష్కారం కాకుండా దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉండటం.. వీటన్నింటికీ శాశ్వత పరిష్కారంగా కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా జల వివాదాల పరిష్కారానికి ఒకే జాతీయ ట్రిబ్యునల్ విధానంతో ముందుకు పోతుందని కేంద్ర జలవనరులశాఖ సహాయమంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ తెలిపారు. దేశంలోని అన్ని నదులకు సంబంధించి జాతీయ ట్రిబ్యునల్ ఏర్పాటుకు కసరత్తు పూర్తయిందని, మార్చి 5 నుంచి జరిగే పార్లమెంట్ బడ్జెట్ మలివిడుత సమావేశాల్లో ఇందుకు సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశాల్లో బిల్లు ఆమోదం కూడా పొందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. జాతీయ ట్రిబ్యునల్ ఏర్పాటుతో దేశంలో జల వివాదాలు సత్వర పరిష్కారానికి నోచుకొంటాయని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు అన్నారు. కృష్ణా గోదావరి జలాల్లో తెలంగాణ అవసరాలకు 1500 టీఎంసీలు పోగా మిగులు జలాలుంటే నదుల అనుసంధానానికి పోవచ్చని తేల్చిచెప్పారు. పట్టిసీమకు

మిగతా 2వ పేజీలో



కేంద్రమంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్‌కు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు, సీఎస్ ఎస్కే జోషి

- జాతీయ ట్రిబ్యునల్‌తో సత్వర పరిష్కారాలు
- 14 ఏండ్లుగా నిర్ణయం తీసుకోని బ్రిజేశ్ ట్రిబ్యునల్
- గోదావరిలో మా వాటా ఇచ్చాకే నదుల అనుసంధానం
- పట్టిసీమ వాటా తేల్చాల్సిందే.. ఆర్డీఎస్‌కు ఏపీ మోకాలడ్డు
- కేంద్రమే చొరవ చూపి ఆయకట్టును రక్షించాలి
- తెలంగాణ భారీ నీటిపారుదల శాఖమంత్రి టీ హరీశ్‌రావు

గురుకులాల నిర్వహణ భేష్



ఎల్ మురుగన్

- తెలంగాణలో కార్పొరేట్ తరహాలో బోధన, అత్యుత్తమ సౌకర్యాలు
- దళితలకు ఉన్నతవిద్య అందించడం ప్రశంసనీయం
- జాతీయ ఎస్సీ కమిషన్ వైస్‌చైర్మన్ ఎల్ మురుగన్ కితాబు
- గౌలిదొడ్డి గురుకులాన్ని సందర్శించిన కమిషన్ సభ్యులు

3



తెలంగాణ ఆస్తికి ఏపీ టెండర్

ఎఫ్‌డీసీ ఆస్తులు అమ్మేస్తామని ఏపీ జీవో

- తీవ్రంగా స్పందించిన తెలంగాణ ప్రభుత్వం
- విభజన చట్టం ప్రకారం చెల్లదని స్పష్టీకరణ
- ఏపీ హద్దులు మీరడమేనంటున్న తెలంగాణ ఉద్యోగ సంఘాలు
- నిరసన ప్రకటనకు సమాయత్తం

12

పోలీస్ యూనిఫాం అలవెన్స్ భారీగా పెంపుదల

రూ.3500 నుంచి 7500లకు

3

యూపీఎస్సీ ఐఎఫ్ఎస్ ఫలితాల్లో నిజామాబాద్ యువకుడు

రోహిత్‌రెడ్డికి 35వ ర్యాంక్



రోహిత్‌రెడ్డి

టాప్ ర్యాంక్‌లో వైభవ్ శ్రీవాస్తవ

3







వరల్డ్ ఐటీ కాంగ్రెస్ సందర్భంగా ప్రపంచం నలుమూలల నుంచి విచ్చేసిన అతిథులకు మంగళవారం రాత్రి చౌమహల్లా ప్యాలెస్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన విందుకు హాజరైన ప్రతినిధులు

అలరించిన హైదరాబాదీ ఆతిథ్యం




చౌమహల్లా ప్యాలెస్‌లో విందు కార్యక్రమానికి హాజరైన మంత్రి కల్వకుంట్ల తారకరామారావు. చిత్రంలో ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ తదితరులు కూడా ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

వరల్డ్ ఐటీ కాంగ్రెస్ సదస్సు సందర్భంగా ప్రపంచం నలుమూలల నుంచి విచ్చేసిన అతిథులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఆతిథ్యంపై ప్రశంసల జల్లు కురుస్తున్నది. ప్రతిష్ఠాత్మక సదస్సును నాస్కాంతో కలిసి నిర్వహిస్తున్న ప్రభుత్వం, రెండో రోజైన మంగళవారం చౌమహల్లా ప్యాలెస్‌లో అతిథులకు విందు ఇచ్చింది. ఈ సందర్భంగా హైదరాబాదీ వంటకాలతో పాటుగా దేశ, విదేశీ వంటకాలను అతిథులకు వడ్డించింది. అందమైన ప్యాలెస్‌లో నిజామీ రుచులను వడ్డించారని విదేశీఅతిథులు కితాబిచ్చారు. ఈ విందుకు రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ అతిథిగా హాజరయ్యారు.



బుద్వేల్‌లో నాస్కాం కేంద్రం



మంగళవారం హెచ్ఐసీసీలో జరిగిన వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌లో మంత్రి కే తారకరామారావు

మొదటిపేజీ తరువాయి...

తాత్కాలికంగా ఈ కేంద్రం ఏర్పాటు అవుతుందని, భవిష్యత్తులో దీన్ని బుద్వేల్‌లో నెలకొల్పుతామని వివరించారు. హైదరాబాద్ ఐటీ దిశను ఈ కేంద్రం మార్చుతుందని పేర్కొన్నారు. ఇదిలాఉంటే.. 2019లో భారత ఐటీ ఎగుమతులు 7.9 శాతానికి పెరుగుతాయని, ఈ రంగంలో కొత్తగా లక్షకు పైగా ఉద్యోగాలు లభిస్తాయని నాస్కాం అధ్యక్షుడు ఆర్ చంద్రశేఖర్ వెల్లడించారు. మంగళవారం హెచ్ఐసీసీలో జరిగిన వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సాఫ్ట్‌వేర్ ఎగుమతులు 167 బిలియన్ డాలర్లకు చేరుకుంటాయని.. మొత్తం ఎగుమతుల్లో దీని వాటా ఎంతలేదన్నా 24 శాతం దాకా ఉంటుందని తెలిపారు.

ప్రభుత్వ కృషిని గుర్తించే ఈ నిర్ణయం

తెలంగాణ ప్రభుత్వం ఐటీ పరిశ్రమను ముందుకు తీసుకుపోతున్న తీరును గుర్తించి తాము ఈ కీలక నిర్ణయం తీసుకున్నామని నాస్కాం చైర్మన్ ఆర్ చంద్రశేఖర్ తెలిపారు. పాతికేండ్లకుపైగా ఉన్న నాస్కాం చరిత్రలో మొట్టమొదటిసారిగా హైదరాబాద్‌లో నాస్కాం ఇండియా లీడర్‌షిప్ ఫోరం ఏర్పాటు చేశామని చెప్పారు. రాబోయే తరంలో ఉద్యోగాల కల్పన, భవిష్యత్‌ను మార్చే ఎనిమిది సాంకేతిక విప్లవాలను గుర్తించామని, వాటిలో కీలకమైన డాటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. హైదరాబాద్‌లో ఎన్నో జాతీయ పరిశోధన కేంద్రాలు, అంతర్జాతీయ కంపెనీలు, ఐఐటీ సహా మరెన్నో ఉన్నత విద్యాసంస్థలు కొలువుదీరి ఉన్నాయని, వీటితో పరిశ్రమ, పరిశోధనలు, విద్యాసంస్థలను ఏకతాటిపైకి తేవడం సాధ్యపడుతున్నదని పేర్కొన్నారు. ప్రస్తుత ఒప్పందం ద్వారా భవిష్యత్‌లో రాబోయే మార్పులకు ఈ కేంద్రాన్ని వేదిక చేస్తామని వివరించారు. నాస్కాం కాబోయే అధ్యక్షురాలు దేవయానిఘోష్ మాట్లాడుతూ మిగతా రాష్ట్రాలతో పోల్చిచూస్తే హైదరాబాద్‌లో ఉన్న విశేష మానవ వనరులను పరిగణనలోకి తీసుకొని ఈ కేంద్రం ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. మంత్రి కేటీఆర్‌ను ఈ విషయంలో ప్రత్యేకంగా అభినందించారు. నాస్కాం బీపీఎం కౌన్సిల్ కో చైర్మన్ శ్రీకాంత్ వెల్లంకని మాట్లాడుతూ తెలంగాణలో ఈ నూతన కేంద్రం ఏర్పాటు చేయడం తనకు ఆశ్చర్యాన్ని కలిగించలేదని అన్నారు. దేశీయ ఐటీ పరిశ్రమలో ఇటు కీలక కంపెనీల స్థాపన, అటు నూతన ఉద్యోగాలపరంగా చూసినా హైదరాబాద్ ఎంతో ప్రత్యేకస్థాయిలో ఉందని వివరించారు. హైదరాబాద్‌లోని విశేష పరిశోధనలు, మానవ వనరులను పరిగణనలోకి తీసుకొని నాస్కాం ఈ కేంద్రం ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు.



బుద్వేల్‌లో నాస్కాం కేంద్రం ఏర్పాటుపై ఒప్పందం జరిగిన సందర్భంగా మాట్లాడుతున్న మంత్రి కే తారకరామారావు. చిత్రంలో నాస్కాం అధ్యక్షుడు ఆర్ చంద్రశేఖర్, నాస్కాం కాబోయే అధ్యక్షురాలు దేవయాని ఘోష్, రాష్ట్ర ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ తదితరులు కూడా ఉన్నారు.

పరిశ్రమను మార్చివేయనున్న ట్రిపుల్ 'వీ'

మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసిన నాస్కాంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మూడు 'వీ'లపై డాటా ప్రపంచం ఆధారపడి ఉందన్నారు. వాల్యూమ్, వెరైటీ, వెలాసిటీ అనేవి రాబోయే కాలంలో పరిశ్రమను మార్చివేయనున్నాయని చెప్పారు. 2025 నాటికి 16 బిలియన్ డాలర్లకు ఈ రంగం చేరనుందని చెప్పారు. లక్షన్నరకు పైగా ఉద్యోగాలను సృష్టించనున్న ఈ రంగంలోని అవకాశాలను ఒడిసిపట్టుకునేందుకు తమతో నాస్కాం కలిసి రావడం సంతోషకరమన్నారు. డాటాను సక్రమంగా నిర్వహిస్తే అనేక అవకాశాలు దక్కుతాయని, దాన్ని వృథాగా వదిలివేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని కేటీఆర్ చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలను మంత్రి వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రైతు పెట్టుబడి పథకం విప్లవాత్మకంగా మారనుందని తెలిపారు. చిక్కులు లేని భూముల వివరాలు, నిరంతర విద్యుత్, సరిపడా ఎరువులతో రైతుకు వ్యవసాయం పండుగలా మారనుందని వెల్లడించారు. పంటకు చీడ వస్తే రైతు సంబంధిత వ్యవసాయ అధికారి వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కేవలం ఒక ఫొటోతో సంబంధిత ఫోన్ నంబరుకు వాట్సాప్ చేస్తే వారే తక్షణం 95% కచ్చితత్వంతో పరిష్కారం చూపుతారని వివరించారు. దీంతోపాటుగా విద్య, వైద్యం వంటి వాటిల్లో కూడా నూతన సాంకేతికత ఆధారంగా డాటాను ఉపయోగించుకొని పరిష్కార మార్గాలు చూపించవచ్చని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా మైక్రోసాఫ్ట్‌తో కలిసి నేత్ర చికిత్సను మొదలుపెట్టామని తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో కూడా సాంకేతికతను ఉపయోగించుకున్నామని వివరించారు. ఫేస్‌బుక్, వాట్సాప్ తర్వాత ప్రపంచంలోనే అతిపెద్ద డాటా కలిగి ఉన్నదిగా ఆధార్ సంస్థ ప్రత్యేకతను సంతరించుకున్నదని పేర్కొన్నారు. డాటా ఎనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశాలను రాబోయే కాలంలో విద్యాసంస్థల్లో కోర్సుగా పెట్టేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.43 గంటలకు

సూర్యాస్తమయం: 6.16 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం పంచమి తె. 4.48 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: అశ్విని మధ్యాహ్నం 2.02 వరకు, తదుపరి భరణి, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: మధ్యాహ్నం 12.30 నుంచి 1.56 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.07 నుంచి 12.53 వరకు, వర్జ్యం: మధాహ్నం 3.36 నుంచి సాయంత్రం 5.12 వరకు.

లోకం పోకడ



ఇప్పుడు కొట్టాల్సింది క్లాప్స్ అయ్యా!

మా అవసరాలు తీరాకే అనుసంధానం

- అకినేపల్లిపై మరోసారి స్పష్టతనిచ్చిన మంత్రి హరీశ్
- ప్రాంతీయ సదస్సును వినియోగించుకున్న తెలంగాణ
- తెలంగాణపై ఫిర్యాదులకే పరిమితమైన ఏపీ ప్రతినిధి
- కేంద్రమంత్రి ముందు వాటిని తిప్పికొట్టిన హరీశ్
- మిషన్ కాకతీయను ప్రశంసించిన పుదుచ్చేరి మంత్రి.. తమ దగ్గర అమలు చేస్తామని వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

గోదావరిజలాలను అకినేపల్లి నుంచి సోమశిల మీదుగా కావేరీకి తరలించాలనే కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనపై రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు మరోసారి స్పష్టతనిచ్చారు. తెలంగాణకు అవసరమైన 1500 టీఎంసీల జలాలుపోను మిగిలిన నీటిని అనుసంధానంలో భాగంగా తరలించేందుకు తమకెలాంటి అభ్యంతరంలేదని పునరుద్ఘాటించారు. అయితే, గోదావరిలో అంతమేర నీటి లభ్యత ఉన్నదా? లేదా? అన్నదానిపై అధ్యయనం జరుగాలని చెప్పారు. హైదరాబాద్‌లోని తాజ్ వివంతాలో మంగళవారం కేంద్ర జలవనరులమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరిగిన దక్షిణాదిరాష్ట్రాల ప్రాంతీయ సదస్సులో మంత్రి హరీశ్‌రావు కేంద్రానికి మరోసారి తెలంగాణ వైఖరిని స్పష్టంచేశారు. ఆల్మట్టి ఎత్తు పెంపునకు బ్రిజేశ్ కర్ణాటకకు అనుమతించినందున భవిష్యత్తులో కృష్ణానదిలో దిగువ రాష్ట్రాలు మరింత నీటికొరతను ఎదుర్కోవాల్సి ఉంటుందని కేంద్ర సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ దృష్టికి తీసుకెళ్లారు. కృష్ణా బేసిన్‌లో నీటి కొరతను అధిగమించేందుకు గోదావరిపై ఆధారపడాల్సి వస్తుందని, ఈ క్రమంలో నదుల అనుసంధానం చేపట్టేముందు తెలంగాణ అవసరాలను పరిగణనలోనికి తీసుకోవాలని కోరారు.

ఏపీది మళ్లీ అదే బుద్ధి..

దక్షిణాది ప్రాంతీయ సదస్సులో ఆంధ్రప్రదేశ్ తన పాత వైఖరినే మళ్లీ ప్రదర్శించింది. తొలిసారిగా కేంద్రం ఢిల్లీ వెలుపల నిర్వహిస్తున్న ఈ సదస్సుకు ఏపీ జలవనరులశాఖ మంత్రిగానీ, ఆ శాఖ ఉన్నతాధికారులుగానీ హాజరు కాలేదు. ఆ రాష్ట్రం తరపున రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్, సలహాదారు రామకృష్ణ వచ్చారు. సదస్సులో ఎలాంటి సమస్యలను ఏకరువుపెట్టని ఆయన కేవలం తెలంగాణపై ఫిర్యాదులకే పరిమితమయ్యారు. కృష్ణాజలాల్లో తెలంగాణ 299 టీఎంసీలతోపాటు అదనంగా 260 టీఎంసీలను వాడుకొనేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. ఈ ఆరోపణను తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి తిప్పికొట్టారు. ఏపీ నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నదని, ఆర్డీఎస్ ఆధునీకరణ విషయంలోనూ ఇదే ధోరణి ప్రదర్శిస్తున్నదని చెప్పారు. 2012లోనే ఉమ్మడి ఏపీ ఆర్డీఎస్ ఆధునీకరణకు కర్ణాటకకు డబ్బులు డిపాజిట్ చేసిన విషయాన్ని మంత్రి హరీశ్‌రావు కేంద్రమంత్రికి వివరించారు. ఆర్డీఎస్ ఆనకట్ట పెంపు కోసం టెండర్లు పిలిచిన ప్రతిసారీ ఏపీ శాంతిభద్రతల సమస్యను సృష్టించి, పనులను అడ్డుకుంటున్నదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో 'రూల్ ఆఫ్ లా' అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జోషి స్పష్టంచేయగా.. దీంతో కేంద్రమంత్రి మేఘ్వాల్ కూడా ఏకీభవించారు.

పట్టిసీమ వాటాపై కేంద్రానికి స్పష్టత..

ఏపీ పట్టిసీమ ద్వారా కృష్ణాడెల్టాకు గోదావరిజలాలను మళ్లిస్తున్న దరిమిలా బచావత్ అవార్డు ప్రకారం తెలంగాణకు 45 టీఎంసీల వాటా రావాల్సిఉన్నదని అనేకసార్లు తెలంగాణ ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. మంగళవారం సదస్సులోనూ మంత్రి హరీశ్‌రావు కేంద్రసహాయమంత్రికి ఈ అంశంపై సమగ్ర వివరణ ఇచ్చారు. దీనిపై ఒక స్పష్టత రావడంతో త్వరలో ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటామని మేఘ్వాల్ హామీ ఇచ్చారు. ప్రాంతీయ సదస్సును తెలంగాణ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోగలిగింది. రాష్ట్రానికి సంబంధించిన అనేక అంశాలను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లింది. కాగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని అభినందించిన పుదుచ్చేరి మంత్రి మల్లాది కృష్ణారావు తమరాష్ట్రంలోనూ ఈ కార్యక్రమాన్ని అమలుచేస్తామని చెప్పారు. ఈ మేరకు తమ దగ్గరున్న 84 మీడియం, 1200 మైనర్ ట్యాంకుల అభివృద్ధికిగాను నిధుల కోసం కేంద్రానికి డీపీఆర్ కూడా పంపామన్నారు. ఈ సదస్సుకు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు జల వనరుల శాఖల మంత్రులు హాజరుకాలేదు. ఆయా రాష్ట్రాల తరపున సంబంధిత శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.



మంగళవారం హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్. చిత్రంలో తెలంగాణ, కేరళ, పుదుచ్చేరి నీటిపారుదలశాఖల మంత్రులు హరీశ్‌రావు, థామస్ మాథ్యూ, కృష్ణారావు తదితరులు కూడా ఉన్నారు.

తుమ్మిళ్లపైనా ఫిర్యాదు..

ఈ సదస్సులో ఏపీ ప్రతినిధి తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకంపైనా ఫిర్యాదు చేశారు. దీంతో మంత్రి హరీశ్‌రావు జోక్యం చేసుకొని.. ఆర్డీఎస్‌కు బచావత్ కేటాయించిన 15.9 టీఎంసీలను మాత్రమే వాడుకుంటాం తప్ప ఒక్క చుక్క ఎక్కువ వాడుకోబోమని పేర్కొన్నారు. ఆ మేరకు నీళ్లు రానందునే తుమ్మిళ్ల చేపట్టాల్సి వస్తున్నదని కేంద్రమంత్రి మేఘ్వాల్‌కి వివరించారు. దీంతో ఏపీ అభ్యంతరాలపై మేఘ్వాల్ కూడా ఒకింత అసంతృప్తిని వ్యక్తంచేసినట్లు తెలిసింది. తెలంగాణలో సాగునీటి వసతి పెరిగితే అది దేశానికి కూడా మంచిదని, పాకిస్థాన్‌కు కాదని ఆయన ఏపీకి చురకలంటించారు. ఆర్డీఎస్ ఆధునీకరణ విషయంలో కేంద్రం జోక్యంచేసుకొని పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి హరీశ్‌రావు కేంద్రాన్ని కోరారు. తెలంగాణ చేపడుతున్న పాలమూరు-రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులపై కర్ణాటక అభ్యంతరం వ్యక్తంచేయగా.. అవి కొత్త ప్రాజెక్టులు కావని, పాతవేనంటూ ఆధారాలతో సహా ప్రధాన కార్యదర్శి జోషి వివరించారు.

ఒకే ట్రిబ్యునల్

మొదటిపేజీ తరువాయి...

సంబంధించి తెలంగాణ వాటా తేల్చాలని, ఆర్డీఎస్ పరిష్కారానికి ఏపీ ప్రభుత్వం సహకరించకపోవడం వల్ల కేంద్రమే చొరువ తీసుకొని ఆర్డీఎస్ ఆయకట్టును సంరక్షించాలని మంత్రి హరీశ్ కోరారు. అంతర్రాష్ట్ర జలాల సమస్యల పరిష్కారం కోసం.. మంగళవారం తొలిసారిగా హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు జరిగింది. తాజ్ వివంతాలో జరిగిన సదస్సుకు తెలంగాణ, కేరళ, పుదుచ్చేరి నీటిపారుదలశాఖల మంత్రులు హాజరయ్యారు. ఏపీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు హాజరుకాలేదు. సదస్సు ముగిసిన అనంతరం తెలంగాణ, కేరళ, పుదుచ్చేరి నీటిపారుదలశాఖల మంత్రులు టీ హరీశ్‌రావు, థామస్ మాథ్యూ, మల్లాది కృష్ణారావుతో కలిసి కేంద్ర సహాయమంత్రి మేఘ్వాల్ మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం నదులవారీగా ట్రిబ్యునళ్లు ఉండటం, అంతర్రాష్ట్ర సమస్యలు పరిష్కారం కాకపోవడం వల్ల సమయం వృథా అవుతున్నదని, హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో కేసులతో వివాదాలు పరిష్కారానికి నోచుకోవడం లేదని చెప్పారు. జాతీయ ట్రిబ్యునల్ వల్ల సమయం ఆదా అవడంతో పాటు త్వరితగతిన జల వివాదాలకు పరిష్కారం లభిస్తుందని వివరించారు.

మరిన్ని సదస్సులు నిర్వహిస్తాం

రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న జల సమస్యల పరిష్కారానికి ప్రాంతీయ సదస్సులు నిర్వహించాలని నిర్ణయించామని, ఇందులో భాగంగా మొదట హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు నిర్వహించామని మేఘ్వాల్ పేర్కొన్నారు. త్వరలో ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాలకు సంబంధించి కూడా ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రాంతీయ సదస్సులతో పాటు నదీ బేసిన్లవారీగా సంబంధిత రాష్ట్రాలతో సదస్సు నిర్వహించడం వల్ల ఇంకా ప్రయోజనం ఉంటుందనే సూచన కూడా వచ్చిందని, మున్ముందు ఇలాంటివి కూడా చేపడతామన్నారు. కావేరీజలాలకు సంబంధించి ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఆరు వారాల్లో కావేరీ యాజమాన్య బోర్డు, కావేరీ వాటర్ రెగ్యులేటరీ కమిటీలను ఏర్పాటుచేస్తామని మేఘ్వాల్ తెలిపారు.

జాతీయ ట్రిబ్యునల్‌తో సత్వర పరిష్కారాలు

హైదరాబాద్ వేదికగా జరిగిన ఈ ప్రాంతీయ సదస్సులో చాలా అంశాలు ప్రస్తావనకు వచ్చాయని, ఇందులో కొన్ని సమస్యలకు వెంటనే పరిష్కారం లభించగా.. మరికొన్ని అంశాలపై లోతైన చర్చ జరిగిందని రాష్ట్రమంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఒకేదేశం.. ఒకే ట్రిబ్యునల్ వల్ల అంతర్రాష్ట్ర జల సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం వివిధ ట్రిబ్యునల్స్ ఉండటం వల్ల ఏండ్ల తరబడి సమస్యలు పెండింగులో ఉంటున్నాయని, బ్రిజేశ్ ట్రిబ్యునల్ 14 సంవత్సరాలుగా పరిష్కారాన్ని చూపకపోవడమే ఇందుకు ఉదాహరణగా మంత్రి అభివర్ణించారు. సదస్సులో భాగంగా నదుల అనుసంధానంపై చర్చ వచ్చినపుడు... గోదావరిలో నీటి లభ్యత ఎంత అనేది ముందుగా తేలాల్సిన అవసరముందని చెప్పినట్టు పేర్కొన్నారు. కృష్ణా బేసిన్‌లోనూ గోదావరిజలాలతో నీటి కొరతను తీర్చాల్సిన ఆవశ్యకత ఉన్నందున.. తెలంగాణ అవసరాలకు 1500 టీఎంసీల జలాలుపోగా మిగిలిన జలాలుంటే వాటిని మళ్లించడంలో తమకు అభ్యంతరం లేదన్నారు. ఆర్డీఎస్ ఆధునీకరణకు ఏపీ ఏమాత్రం సహకరించనందున కేంద్రం జోక్యం చేసుకొని ఆయకట్టును పరిరక్షించాలని కోరినట్టు చెప్పారు. ప్రధానంగా ఏపీ పట్టిసీమ ద్వారా వంద టీఎంసీలను కృష్ణా డెల్టాకు మళ్లిస్తున్నందున కృష్ణాలో తెలంగాణకు రావాల్సిన 45టీఎంసీల వాటాను అమలుచేయాలని కేంద్రాన్ని కోరగా... త్వరలో ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి హామీ ఇచ్చినట్టు హరీశ్‌రావు చెప్పారు. అదేవిధంగా ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పంపిణీకిగాను కొనసాగుతున్న బ్రిజేశ్ ట్రిబ్యునల్ విచారణ త్వరగా పూర్తిచేసి తుది నిర్ణయం తీసుకునేలా చొరువ తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. సదస్సును తెలంగాణ సద్వినియోగం చేసుకున్నదని, ఏపీ మంత్రి రాకపోవడం ఆయ న విజ్ఞతకు సంబంధించిన అంశమని హరీశ్‌రావు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

నీటి లభ్యత తగ్గుతున్నది

దేశంలోని అనేకనదుల్లో నానాటికీ నీటి లభ్యత తగ్గుతున్నదని, గ్లోబల్ వార్మింగ్, ఇతర కారణాలతో ఈ పరిణామం ఎదురవుతున్నదని కేరళ జలవనరులశాఖ మంత్రి థామస్ మాథ్యూ అన్నారు. ఆయా నదీ బేసిన్లలో ఉన్న రాష్ట్రాలకు న్యాయంగా జలాల పంపిణీ జరగాలన్నారు. జాతీయ ట్రిబ్యునల్ ఏర్పాటు వల్ల జల వివాదాలకు సత్వర పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ ప్రాంతీయ సదస్సులో అర్థవంతమైన చర్చ జరిగిందన్నారు. పుదుచ్చేరి జలవనరులశాఖ మంత్రి మల్లాది కృష్ణారావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఈ ప్రాంతీయ సదస్సు విజయవంతమైందని, కావేరీజలాలకు సంబంధించి పుదుచ్చేరికి రావాల్సిన ఏడు టీఎంసీలను కూడా ఆరువారాల్లో విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. కావేరీలో ఇన్‌ఫ్లోలు తక్కువగా ఉన్నపుడు కర్ణాటక, తమిళనాడుకు ఏ దామాషాలో నీటిని విడుదల చేస్తుందో, పుదుచ్చేరికి కూడా అదే దామాషాలో విడుదల చేయలని డిమాండ్ చేశారు. సమావేశంలో కేంద్ర జలవనరులశాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్ కుందు, కేంద్ర జలసంఘం చైర్మన్ మసూద్ హుస్సేన్, ఎన్‌డబ్ల్యూడీఏ, సీడబ్ల్యూసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం హంసవాహనంపై శ్రీకృష్ణుడి అవతారంలో ఊరేగుతున్న శ్రీ లక్ష్మీనారసింహుడు

యాదాద్రిలో మురళీలోలుని ఆనందపర్వం

భక్తుల కోలాహలం మధ్య ఊరేగిన నృసింహుడు

యాదాద్రి భువనగిరి ప్రతినిధి, నమస్తేతెలంగాణ: యాదాద్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. జ్వాలానారసింహుడు మంగళవారం మురళీమనోహరునిగా దర్శనమిచ్చారు. రాత్రి బ్రహ్మ వాహనమైన హంసపై శ్రీలక్ష్మీనాథుడు బాలాలయంలో విహరించారు. బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజు శ్రీవారు శ్రీకృష్ణుని అలంకారంలో తిరువీధుల్లో కనువిందు చేశారు. ఆ దృశ్యాల్ని తిలకించిన భక్తులు తన్మయత్వంతో మానస సంచరరే.. అంటూ పాడుకుంటూ ఆనందంతో అడుగులు వేస్తూ తిరువీధి సేవలో మమేకమయ్యారు. బ్రహ్మమానస అధిష్ఠానమైన హంస వాహనమును ఎందరో మహర్షులు స్తుతించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో గీత, అనువంశిక ధర్మకర్త బీ నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు వటపత్రశాయి అలంకారసేవలో దర్శనమిస్తారు. రాత్రి 9 గంటలకు పొన్నవాహనంపై బాలాలయంలో విహరిస్తారు. హైదరాబాద్ స్టార్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ ఎం గోపిచంద్ ఆధ్వర్యంలో గుండె సంబంధిత వ్యాధులపై ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తారు.



రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అడిషనల్ పోలీస్ కమిషనర్ స్వాతిలక్రా . చిత్రంలో హైదరాబాద్ సీపీ వీవీ శ్రీనివాసరావు ఉన్నారు.

టీ పోలీస్, షీటీమ్స్ పనితీరు భేష్

- ప్రశంసించిన గవర్నర్
- నరసింహన్‌ను కలిసిన పోలీస్, ఆర్మీ అధికారులు
- ఉమెన్‌రన్ కార్యక్రమానికి ఆహ్వానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ పోలీస్, షీ టీమ్స్ పనితీరు బాగుందని గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ ప్రశంసించారు. నగర పోలీస్ కమిషనర్ వీవీ శ్రీనివాసరావు, అడిషనల్ పోలీస్ కమిషనర్ స్వాతీలక్రా మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ దంపతులను కలిసి వచ్చే నెల నాలుగున షీటీమ్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలో నిర్వహించతలపెట్టిన ఉమెన్‌రన్ కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానించారు. మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీని నిర్వహిస్తున్నట్టు వారు గవర్నర్‌కు వివరించారు. గవర్నర్‌ను కలిసినవారిలో నేషనల్ సెక్యూరిటీ గార్డు ఎన్ఎస్జీ డైరెక్టర్ జనరల్ సుదీప్ లక్టాకియా, నగర పోలీస్ కమిషనర్ వీవీ శ్రీనివాసరావు, అడిషనల్ పోలీస్ కమిషనర్ స్వాతీ లక్రా, ఆర్మీ డీఎండీఈ డైరెక్టర్ రియర్ అడ్మిరల్ డీఎస్ చవాన్ తదితరులు ఉన్నారు.

యూపీఎస్సీ ఐఎఫ్ఎస్ ఫలితాల వెల్లడి

- టాప్ ర్యాంక్‌లో వైభవ్ శ్రీవాస్తవ
- నిజామాబాద్‌వాసి రోహిత్‌రెడ్డికి 35వ ర్యాంకు



రోహిత్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)2017 ప్రధాన పరీక్ష తుది ఫలితాలను మంగళవారం ప్రకటించింది. ఈ పరీక్షలో వైభవ్ శ్రీవాస్తవ టాప్ ర్యాంక్ సాధించారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన రోహిత్‌రెడ్డి 35వ ర్యాంక్ పొందారు. గత డిసెంబర్‌లో నిర్వహించిన ఐఎఫ్ఎస్ మెయిన్ పరీక్ష, ఈ నెలలో జరిపిన వ్యక్తిత్వ పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎం పిక చేసినట్టు యూపీఎస్సీ తెలిపింది. ఎంపికైన అభ్యర్థుల వివరాలను upsc.gov.inలో పొందుపర్చినట్లు పేర్కొంది. పరీక్షలో ఉత్తీర్ణులైన 110 మంది అభ్యర్థులను ప్రభుత్వ సేవల్లో నియామకానికి యూపీఎస్సీ సిఫారసు చేసింది. ఎంపికైన వారిలో 46 మంది జనరల్ క్యాటగిరీకి చెందినవారు కాగా, 40 మంది ఓబీసీలు, 16 ఎస్సీ, ఎనిమిది మంది ఎస్టీలు ఉన్నారు. అభ్యర్థులెవరైనా మళ్లీ పరీక్ష రాయాలనుకుంటే మార్చి నెలాఖరులోగా యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ 2018 కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది.

నాలుగోసారి.. దక్కిన విజయం

నిజామాబాద్ అర్బన్/ నమస్తే తెలంగాణ: నిజామాబాద్‌కు చెందిన గోపిడి రోహిత్ రెడ్డి మూడు పర్యాయాలు సివిల్ సర్వీసు పరీక్షలకు పోటీపడి ఇంటర్వ్యూ వరకు వెళ్లారు. నాలుగోసారి ఇంటర్వ్యూలో విజయం సాధించి ఇండియన్ ఫారెస్టు సర్వీసుకు ఎంపికయ్యారు. యూపీఎస్సీ ఐఎఫ్ఎస్ పరీక్ష ఫలితాల్లో 35వ ర్యాంకును సాధించారు. హైదరాబాద్‌లోని బిట్స్ పిలానీలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తిచేశారు. రోహిత్‌రెడ్డి బిట్స్ పిలానీలో చదువుతున్నప్పుడే క్యాంపస్ ఇంటర్వ్యూలో ఓ ఎంఎన్సీకి రూ. 20 లక్షల వార్షిక వేతనంతో ఎంపికయ్యారు. సివిల్స్ లక్ష్యంగా ఆ ఆఫర్‌ను వదులుకున్నాడు. మూడేండ్లుగా సివిల్స్‌కు శిక్షణ తీసుకుని లక్ష్యాన్ని సాధించాడు. ఆయన తండ్రి హనుమంత్‌రెడ్డి ఓ బీమా కంపెనీలో అధికారి కాగా, తల్లి పద్మ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు.

12వ తరగతి వరకు కేజీబీవీలు

- పొడిగింపునకు కేంద్రమంత్రి హామీ
- నెలాఖరున కేంద్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం
- ఫలించిన రెండేండ్ల ప్రయత్నం: డిప్యూటీ సీఎం కడియం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:



మంగళవారం ఢిల్లీలో కేంద్ర మానవవనరుల మంత్రి ప్రకాశ్ జవదేకర్‌తో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి. చిత్రంలో ఎంపీ మల్లారెడ్డి కూడా ఉన్నారు.

దేశవ్యాప్తంగా 8వ తరగతి వరకు కొనసాగుతున్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ)లను 12వ తరగతి వరకు పొడిగించేందుకు కేంద్ర మానవవనరులశాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ హామీ ఇచ్చారని తెలంగాణ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. ఈ నెలాఖరున జరిగే కేంద్ర క్యాబినెట్ సమావేశంలో దీనిపై తుదినిర్ణయం తీసుకునే అవకాశం ఉందని చెప్పారు. జనవరిలో హైదరాబాద్‌లో నిర్వహించిన సెంట్రల్ అడ్వైజరీ బోర్డు ఆఫ్ ఎడ్యుకేషన్ (క్యాబ్) సమావేశంలో బాలికల విద్యాభివృద్ధికోసం రూపొందించిన ప్రతిపాదనలను మంగళవారం ఢిల్లీలో కేంద్రమంత్రికి సమర్పించినట్టు కడియం పేర్కొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేజీబీవీల ప్రాముఖ్యాన్ని, 12వ తరగతి వరకు పొడిగించడం వల్ల కలిగే ప్రయోజనాలను బాలికల విద్యపై ఏర్పాటైన క్యాబ్ చైర్మన్‌గా కేంద్రమంత్రికి స్పష్టంగా వివరించామని చెప్పారు. 12వ తరగతి వరకు కేజీబీవీల్లో బాలికలకు ఉచిత విద్యనందించడం వల్ల బాల్యవివాహాలను నిరోధించవచ్చని, దేశవ్యాప్తంగా బాలికల డ్రాప్‌అవుట్లు తగ్గించి, ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచడానికి అవకాశం ఉంటుందని తెలిపినట్టు చెప్పారు. దీనిపై సంతృప్తి వ్యక్తంచేసిన జవదేకర్ ఈ మేరకు హామీఇవ్వడం ఎంతో హర్షణీయమన్నారు. దీంతో రెండేండ్లుగా చేస్తున్న కృషికి ఫలితం దక్కినట్టేనని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం, స్కూల్ యూనిఫారాల పంపిణీ వంటి పలు పథకాలను కూడా 12వ తరగతి వరకు పొడిగించాలని కోరినట్టు కడియం చెప్పారు. తెలంగాణకు మహిళా యూనివర్సిటీతోపాటు, హైదరాబాద్‌లో ఐఐఎం, తెలంగాణలో ఐఐటీ ఏర్పాటుకు కేంద్రమంత్రి హామీ ఇచ్చారని కడియం శ్రీహరి తెలిపారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో ఎంపీ మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

గురుకులాల నిర్వహణ భేష్



మంగళవారం హైదరాబాద్ గౌలిదొడ్డిలోని గురుకుల బాలికల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ కమిషన్ వైస్ చైర్మన్ మురుగన్ బృందం



హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఎస్సీ సంఘాల నాయకులతో సమావేశమైన జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ రామ్‌శంకర్ కథేరియా, వైస్ చైర్మన్ మురుగన్ తదితరులు

- కార్పొరేట్ తరహాలో బోధన, అత్యుత్తమ సౌకర్యాలు
- దళితులకు ఉన్నత విద్య అందించడం ప్రశంసనీయం
- జాతీయ ఎస్సీ కమిషన్ వైస్ చైర్మన్ ఎల్ మురుగన్ కితాబు
- గౌలిదొడ్డి గురుకులాన్ని సందర్శించిన కమిషన్ సభ్యులు

హైదరాబాద్/శేరిలింగంపల్లి, నమస్తే తెలంగాణ:

తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ గురుకులాల నిర్వహణ బాగుందని జాతీయ ఎస్సీ కమిషన్ వైస్ చైర్మన్ ఎల్ మురుగన్ ప్రశంసించారు. హైదరాబాద్ శేరిలింగంపల్లిలోని గౌలిదొడ్డి ఎస్సీ గురుకుల విద్యాలయాన్ని మంగళవారం జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు కే రాములు, స్వరాజ్ విద్వాన్‌తో కలిసి సందర్శించారు. గురుకుల ప్రాంగణం, స్మార్ట్ తరగతి గది, బోధనా పద్ధతులను పరిశీలించారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన దళిత కుటుంబాల విద్యార్థులకు ఉన్నతస్థాయి విద్యావకాశాలు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఎల్ మురుగన్ ఈ సందర్భంగా కొనియాడారు. గురుకులాల్లో కార్పొరేట్ తరహాలో బోధన, అత్యుత్తమ సౌకర్యాలు కల్పిస్తూ విద్యార్థులను అన్నిరంగాల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడం అభినందనీయమని చెప్పారు. ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌తోపాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించే దిశగా గురుకులాలు కొనసాగుతున్నాయని ప్రశంసించారు. కేజీ టు పీజీ విద్య అమలులో భాగంగా ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో అత్యుత్తమ బోధనను ప్రభుత్వం అందిస్తున్నదని జాతీయ ఎస్సీ కమిషన్ బృందానికి ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వివరించారు. సీఎం కేసీఆర్ మార్గదర్శనం, ఎస్సీ అభివృద్ధిశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో అధునాతన రీతిలో ఎస్సీ గురుకులాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. రాబోయే సంవత్సరాల్లో ఎస్సీ గురుకులాలకు ఏటా రూ.1,500 కోట్ల వరకు బడ్జెట్‌ను ఏర్పాటుచేసే అవకాశం ఉన్నదని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్సీ కులాల అభివృద్ధిశాఖ కార్యదర్శి బుద్ధప్రకాశ్, గౌలిదొడ్డి గురుకుల ప్రిన్సిపాల్ ప్రమోద తదితరులు పాల్గొన్నారు.

దళిత ఎమ్మెల్యేలు, సంఘాలతో కమిషన్ చైర్మన్ భేటీ

రెండురోజుల పర్యటనలో భాగంగా మంగళవారం హైదరాబాద్‌కు చేరుకున్న జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ రామ్‌శంకర్ కథేరియా, సభ్యుల బృందం స్థానికంగా ఓ హోటల్‌లో ప్రత్యేకంగా సమావేశమైంది. ముందుగా ఎస్సీ ఎమ్మెల్యేలు, ఎస్సీ అభివృద్ధిశాఖ అధికారులతో సమావేశమై పలు ప్రతిపాదనలు స్వీకరించింది. ఎమ్మెల్యేలు రాజయ్య, సంపత్‌కుమార్ తదితరులు పలు ప్రతిపాదనలు చేశారు. అట్రాసిటీ కేసుల పరిష్కారానికి సమర్థంగా కృషి చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణు చేపట్టాలని, రాష్ట్ర, కేంద్ర క్యాబినెట్‌లలో ఎస్సీ ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అనంతరం బహిరంగంగా సమావేశంలో ఎస్సీ కులసంఘాల ప్రతినిధుల నుంచి ప్రతిపాదనలు స్వీకరించారు. ఎస్సీల ప్రగతికోసం కేంద్ర ప్రభుత్వానికి సూచనలు చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ రామ్‌శంకర్ కథేరియాను దళిత సంఘాల నాయకులు కోరారు. ఈ సమావేశంలో జాతీయ ఎస్సీ కమిషన్ వైస్‌చైర్మన్ ఎల్ మురుగన్, సభ్యులు కే రాములు, యోగేంద్ర పాశ్వాన్, స్వరాజ్ విద్వాన్, జాయింట్ సెక్రటరీ స్మిత తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ యూనిఫాం అలవెన్స్ పెంపు

రూ.7,500కు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోలీస్ యూనిఫాం అలవెన్స్‌ను రూ. 3,500 నుంచి రూ. 7,500కు రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి ఎన్ శివశంకర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. గోషామహల్ స్టేడియంలో 2015 అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇచ్చిన హామీ ప్రకారం అలవెన్స్ పెంచుతూ ఉత్తర్వులివ్వడం ఆనందంగా ఉందని పోలీసువర్గాలు తెలిపాయి. ఏడాదికి ఒకసారి రూ.7,500ను యూని ఫాం అలవెన్స్‌ను ఇవ్వనున్నట్లు ఉత్తర్వులో ప్రభుత్వం పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయంపై తెలంగాణ రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు వై గోపిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

ఏపీ గ్రూప్-1లో రమణ టాప్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన 2016 గ్రూప్-1 పరీక్షల్లో ప్రకాశం జిల్లాకు చెందిన ఆకుల రమణ మొదటి ర్యాంకు సాధించాడు. మంగళవారం ఏపీపీఎస్సీ ప్రకటించిన ఫలితాల్లో రమణ మొత్తం 783కి 489.5 మార్కులను సాధించి ప్రథమస్థానంలో నిలిచాడు. గ్రూప్-1లో 148 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కాగా, పరీక్షలు రాసినవారిలో 1:2 చొప్పున 294 మందిని ఇంటర్వ్యూలకు ఎంపిక చేసింది. రమణకు రాతపరీక్షలో 426 మార్కులు రాగా, ఇంటర్వ్యూలో 63.5 మార్కులు, మొత్తం కలిపి 489.5 మార్కులు వచ్చాయి.



ఢిల్లీ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ అంశు ప్రకాశ్ బీజేపీ నేతల ప్రోద్బలంతో ఆమ్ ఆద్మీపార్టీపై ఆరోపణలు చేస్తున్నారు. ఢిల్లీ సెక్రటేరియట్ ప్రాంగణంలోనే గూండాయిజానికి పాల్పడిన బీజేపీ నేతలు మాకు నీతులు చెబుతున్నారు. ఆప్ ప్రభుత్వాన్ని అస్థిరపర్చటానికి చేస్తున్న కుట్రల్లో భాగమే ఇది.


అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి

ఢిల్లీ చీఫ్ సెక్రటరీపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. ప్రభుత్వ ఉద్యోగులను గౌరవించే సంస్కృతి మనది. దీన్ని మరిచి ఆప్ నేతలు వ్యవహరిస్తున్నారు. వారు తమ బలహీనతలను కప్పిపుచ్చుకోవటానికి అధికారులపై దాడులకు దిగుతున్నారు. ఇలాంటి వాటిని ఎవరూ సహించరు.

రాజ్‌నాథ్‌సింగ్, కేంద్రహోం మంత్రి



చరిత్రలో నేడు



1848
లండన్‌లో కార్ల్‌మార్క్స్, ఎంగెల్స్‌లు రాసిన 'ది కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో' ప్రచురణ.

1922
ఈజిప్టును స్వతంత్ర దేశంగా గుర్తించిన బ్రిటన్.





1974
యుగొస్లావియా రాజ్యాంగం ఆమోదం.

బ్రిటన్ రక్షణ మంత్రి గేవిన్ విలియంసన్ ఆస్ట్రేలియా పర్యటన ముగించుకోగానే, చైనా పట్ల కఠినమైన ప్రకటన చేశారు. చైనా ఏమాత్రం దురాలోచనతో వ్యవహరించినా తిప్పికొడతామని, చైనా నుంచే కాదు, రష్యా, ఇరాన్ నుంచి కూడా సవాళ్లు ఎదురవుతున్నాయనీ ఆయన అన్నారు. దక్షిణ చైనా సముద్రంలో ప్రయాణించే హక్కు ఉందని, బ్రిటన్ నౌక దాని గుండా ప్రయాణించడం ద్వారా చాటుతుందని కూడా అన్నారు. దక్షిణ చైనా సముద్రం గుండా ప్రయాణించే హక్కుపై ఎప్పుడూ వివాదం లేదు. కానీ బ్రిటన్ అక్కడికి చేరి రెచ్చగొట్టదలుచుకున్నదా? చైనాకు బ్రిటన్‌తో సైనికంగా పోటీ పడాలనే దృక్పథం లేదు.

గ్లోబల్ టైమ్స్

బ్యాంకులు కొల్లగొట్టి నీరవ్ మోదీ పారిపోయాడు. సాధారణ ఖాతాదారులకు బ్యాంకింగ్ వ్యవస్థ మీద నమ్మకం సన్నగిల్లుతున్నది. భారీ రుణ గ్రహీతలు బ్యాంకులను దోచుకుని పారిపోతూ ఉంటే, జాతీయ బ్యాంకులలో, ప్రైవేటు బ్యాంకులలో తమ సొమ్ము భద్రంగా ఉంటుందా అనే అనుమానాలు ఖాతాదారులకు కలుగుతున్నాయి. బ్యాంకులు సాధారణ ఖాతాదారులను అనేక వ్యక్తిగత ఆధారాలు సమర్పించమని అడుగుతూ ఉంటాయి. అవినీతిపరులు మాత్రం యథేచ్ఛగా బ్యాంకింగ్ నియమాలు ఉల్లంఘిస్తూ ఉంటారు.

ది షిల్లాంగ్ టైమ్స్

భాషా పరిరక్షణ

నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం. అమ్మ భాషలోనే తమకు విద్యా బోధన కావాలని మొదలైన ఉద్యమం ఆత్మగౌరవ పోరాటంగా, అంతిమంగా విముక్తి పోరాటంగా రూపు దాల్చిన పరిణామమే మాతృభాషా దినోత్సవం. నాటి తూర్పు పాకిస్థాన్‌లో ఎనభై శాతం ప్రజలు మాతృభాషగా బెంగాళీ మాట్లాడేవారున్నా, ఉర్దూనే అధికార, పాలనా భాషగా ప్రజలపై రుద్దింది పాకిస్థాన్ ప్రభుత్వం. ప్రాథమిక విద్యకూడా మాతృభాషలో చదువుకునే వీలులేని గడ్డు పరిస్థితుల్లో బంగ్లాదేశ్ ఢాకా విశ్వవిద్యాలయం విద్యార్థులు మాతృభాషలోనే విద్యాబోధన జరుగాలని ఉద్యమించారు. పాక్ పాలకులు విద్యార్థుల భాషోద్యమాన్ని రక్తపుటేరుల్లో ముంచారు. నలుగురు విద్యార్థుల ప్రాణాలు బలితీసుకున్నారు. దీంతో ఆ మాతృభాషా ఉద్యమమే బంగ్లాదేశ్ అవతరణ ఉద్యమంగా చరిత్రలో నిలిచిపోయింది. భాషా, సాంస్కృతిక వివక్ష, అణచివేతల్లోంచి విముక్తి శంఖారావం వినిపించిన తెలంగాణ మాతృభాషా వికాసం కోసం కంకణబద్ధమై ముందుకుసాగుతున్నది. ఈ నేపథ్యంలో మాతృభాష కోసమని కాలానుగుణంగా వచ్చిన మార్పులు, సామాజిక అవసరాలను చూడ నిరాకరించి మడిగట్టుకుని కూర్చోవటం మంచిది కాదు. మితిమీరిన భాషాభిమానం సమాజాభివృద్ధికి ఆటంకం కాకూడదు. శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధిని సొంతం చేసుకున్నప్పుడే భాష వికాసానికి నోచుకుంటుంది.

ప్రపంచీకరణ నేపథ్యంలో మాతృభాషా పరిరక్షణ ప్రధాన సమస్యగా ముందుకువచ్చింది. బహుళజాతి కంపెనీల వస్తుమయవాదం ఇంగ్లీషు భాషాధిపత్యాన్ని పెంచిపోషిస్తున్నది. ఇంగ్లీష్ భాషతోనే సమస్త విజ్ఞాన వికాసం ముడిపడి ఉన్నదని ఊదరగొడుతున్నది. నిజానికి ఏభాష దానికదిగా గొప్పది కాదు, తక్కువదీ కాదు. ఇంగ్లీష్ భాషలోనే సర్వ శాస్త్రవిజ్ఞానం ఉన్నదనేది కూడా తప్పుడు వాదన. ప్రపంచం మూలమూలనా తమ వస్తువులను అమ్ముకుంటున్న వస్తు సంస్కృతి ఇంగ్లీష్ చదువులను ప్రోత్సహిస్తున్నది. ఫలితంగా దేశదేశాల్లో అనేక జాతుల భాషా సంస్కృతులు అంతరించిపోయాయి. చాలా భాషలు అంతరించిపోయే దశలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఏ భాషా ప్రాంతంలోనైనా మాతృభాషను వదిలిపెట్టి పరాయిభాషలో 30 శాతానికిపైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుంటే- ఆ మాతృభాష ఉనికి ప్రమాదంలో పడినట్లేనని యునెస్కో తేల్చిచెప్పింది. ప్రపంచ వ్యాప్తంగా వేలాది భాషల స్థితిగతులపై అధ్యయనం చేసిన ఐక్యరాజ్యసమితి పరాయిభాష మోజులోని ప్రమాదం గురించి హెచ్చరించింది. ఈ నేపథ్యంలో మనం ఎంతటి ప్రమాదకర స్థితిలో ఉన్నామో గ్రహించాలె. రాష్ట్రంలోని ప్రాథమిక విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థుల్లో సగానికి పైగా ప్రైవేటు, ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో చదువుతున్నట్టు అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే ఇదంతా గత ప్రభుత్వాల విధానాల లోపమేనన్నది మరువరాదు. మాతృభాషా పరిరక్షణలో చైనా ఇతర దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. గడిచిన రెండు దశాబ్దాల్లో మాతృభాష వెనుకబడి పోతున్న తీరును అక్కడి పాలకులు గుర్తించారు. దీంతో మాతృభాషలోనే వ్యవహారాలు జరుపాలని కఠిన నిర్ణయం చేసింది చైనా ప్రభుత్వం.

> **ముఖ్యమంత్రి కేసీఆర్ తెలుగు భాషాభిమాని కావ డం వల్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు సారవంతమైన తెలంగాణ భాషా సంస్కృతుల పరిరక్షణ, వికాసం కోసం వినూత్న పథకాలను అమలుపరుచాలని నిర్ణయించారు. బతుకమ్మ, బోనాలు కొత్త శోభను, జవజీవాలను సంతరించుకున్నాయి. ఆ కోవలోనే రాష్ట్ర ప్రభుత్వం తెలుగుభాషా వికాసం కోసం తెలుగు భాషా సాంస్కృతిక శాఖను ఏర్పాటుచేసింది. తెలుగు భాషాభివృద్ధికోసం ప్రపంచ తెలుగు మహాసభలను ఘనంగా నిర్వహించడం ద్వారా మాతృభాషా పరిరక్షణను ప్రాధాన్యాంశంగా, చర్చనీయాంశంగా మార్చగలిగింది.**

భాషా వివక్ష, అణచివేతలలోంచి పురుడు పోసుకున్న ఉద్యమ ఫలంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డది. సకల రంగాల్లో నూతన ఒరవడి, సమున్నత ఆకాంక్షలతో తెలంగాణ ముందుకు సాగుతున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలుగు భాషాభిమాని కావడం వల్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు సారవంతమైన తెలంగాణ భాషా సంస్కృతుల పరిరక్షణ, వికాసం కోసం వినూత్న పథకాలను అమలుపరుచాలని నిర్ణయించారు. బతుకమ్మ, బోనాలు కొత్త శోభను, జవజీవాలను సంతరించుకున్నాయి. ఆ కోవలోనే రాష్ట్ర ప్రభుత్వం తెలుగుభాషా వికాసం కోసం తెలుగు భాషా సాంస్కృతిక శాఖను ఏర్పాటుచేసింది. తెలుగు భాషాభివృద్ధికోసం ప్రపంచ తెలుగు మహాసభలను ఘనంగా నిర్వహించడం ద్వారా మాతృభాషా పరిరక్షణను ప్రాధాన్యాంశంగా, చర్చనీయాంశంగా మార్చగలిగింది. రాష్ట్ర ప్రభుత్వం భాషాభివృద్ధిపై భాషాకోవిదులతో విస్తృతంగా చర్చించింది. దీంతో తెలుగు భాషకు మంచి రోజులు వచ్చాయనే భరోసాను భాషాభిమానుల్లో కలిగింది. ఒకటో తరగతి నుంచి ఇంటర్ దాకా తెలుగును తప్పనిసరి బోధించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే పాలనా వ్యవహారాలను సైతం తెలుగులోనే నిర్వహించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నది. దీనికి సంబంధించిన ఫలితాలు ఇప్పుడిప్పుడే అనుభవంలోకి కూడా వస్తున్నాయి. ప్రభుత్వ జీవోలను, కోర్టు తీర్పులను సైతం తెలుగులోనే ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ఆధునిక శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని తెలుగులో అందుబాటులోకి తేవడం ఒక సవాలు. ఇదే విధంగా కంప్యూటర్ వాడుక ప్రక్రియలను తెలుగులో సాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నది. ఇలాంటి ప్రయత్నాలు తెలుగు భాషా వికాసం కోసమే కాకుండా సమాజాభివృద్ధికి కూడా దోహదం చేస్తాయనటంలో సందేహం లేదు.

సందర్భం

సుమధుర తెలుగు

పంట కాల్వవోలె పారింది తెలుగు
జంట గువ్వల వోలె కలిసుంది తెలుగు
నింగిని నేలను కలిపింది తెలుగు
ముంగిటి ముద్యమోలె మెరిసింది తెలుగు

పసిపాప పలుకులో అమ్మగా పలికించి
ఒడిలోన జోకొట్టి లాలిపాటలు పాడి
కమ్మగా కథలెన్నో చెప్పింది తెలుగు
రమ్మనీ నిదురబుచ్చింది తెలుగు

బుడిబుడి నడకల వడివడి అడుగులతో
బడిలోన బాలుడికి బతుకుపాఠం నేర్పి
ఆటపాటలతో చదువు నేర్పింది తెలుగు
జీవితానికి రాచబాటయింది తెలుగు

పచ్చని చేలలో ఎర్రని బంతిలా
తొలిపొద్దు పొడుపులో ఎగిసే సూర్యుడిలా
పడతుల నోటిలో పాటైంది తెలుగు
పల్లె పడుచుకు నుదటి బొట్టయింది తెలుగు

పెళ్లి పందిట్లోన పన్నీటి జల్లులా
పాటల పేటికలోని ఆపాతమధురమై
సరిగమల స్వరాలు పలికింది తెలుగు
సుమధుర రాగాలు తీసింది తెలుగు

– మారోజు వేణు, 98498 99581

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

భాష



మంగారి రాజేందర్

మాతృభాష అమలు సులువే

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 18వ తేదీన విజయవాడ న్యాయవాద సంఘంలో 'న్యాయస్థానాలలో తెలుగు కోసం ఉద్యమ సమాలోచన' అన్న పేరుతో ఓ సదస్సు జరిగింది. తెలుగు భాషోద్యమ సమాఖ్య, బెజవాడ బార్ అసోసియేషన్లు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. హైకోర్టు న్యాయమూర్తి ఎ.రామలింగేశ్వరరావు, నేనూ, బి.హనుమారెడ్డి న్యాయవాది ఈ సమావేశంలో పాల్గొన్నాం. అమ్మ నుడి మాసపత్రిక సంపాదకులు డాక్టర్ సామల రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది.

న్యాయస్థానాలలో తెలుగు వాడకం అన్న ప్రసక్తి వచ్చినప్పుడల్లా గురజాడ రాసిన 'కన్యాశుల్కం' నాటకం గుర్తుకొస్తుంది. ఆ నాటకంలోని ప్రధాన పాత్రధారి గిరీశం. గిరీశంకి అగ్నిహోత్రావధానులు ఆశ్రయం ఇస్తాడు. దానికి కారణం, గిరీశానికి కాస్తో కూస్తో ఇంగ్లీషు రావడం. తన కోర్టు పత్రాలను చూసిపెట్టగలడన్న ఉద్దేశంతో గిరీశానికి అగ్నిహోత్రావధానులు ఆశ్రయం ఇస్తాడు. ఈ నాటకం వచ్చి వంద సంవత్సరా లు దాటినా పరిస్థితి మారలేదు. తెలుగు రాష్ట్రాలలోని న్యాయస్థానాలలో ఇంకా వాదప్రతివాదనలు ఇంగ్లీషులోనే జరుగుతున్నాయి. వాదప్రతివాదులు ముద్దాయిలు సాక్షులు పూర్తిగా ఇంగ్లీషు తెలిసిన న్యాయవాదులపై, న్యాయమూర్తులపైనే పూర్తిగా ఆధారపడాల్సి వస్తుంది. ఈ పరిస్థితి మారాలని కొన్ని ప్రయత్నాలు జరిగినా అనుకున్న ఫలితాలు రావడం లేదు.

దాదాపు ముప్పై అయిదు సంవత్సరాల క్రితం కరీంనగర్‌లో జూనియర్ న్యాయవాదిగా నేను ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు ఓ సారి జరిగిన సంఘటన వివరిస్తాను. ఓ మధ్య వయస్కుడైన న్యాయవాది దగ్గర చాలా క్రిమినల్ కేసులు వుండేవి. అని ఆయన దగ్గరికి రావడానికి ఆయన చాలా ప్రయత్నాలు చేస్తుండేవాడని కూడా ప్రసిద్ధి. అది వేరే విషయం. ఆయన వాదనలు ఇంగ్లీషులో చేసేవాడు. ఆయనకు ఇంగ్లీష్ అంతంత మాత్రమే వచ్చు. పార్టీలను, వాళ్ల బంధువులను కోర్టులో వుంచి అతను గట్టిగా వాదనలు చేసేవాడు. ఓసారి చాలా తప్పులతో ఇంగ్లీషులో వాదనలు చేశాడు. అదీ పెద్ద గొంతుతో. విసుగెత్తిన మెజిస్ట్రేట్ విసుక్కున్నాడు. కాస్త మందలించాడు. తలాతోక లేకుండా వాదనలు చేయవద్దని సలహా ఇచ్చాడు. ఇంగ్లీషులో చెప్పకుండా తెలుగులో చెప్పాడు మెజిస్ట్రేట్. అప్పుడు ఆ న్యాయవాది కోర్టుకు ఇంగ్లీషులో ఇలా విన్నవించుకున్నాడు. 'సార్! నన్ను తిట్టినా పర్వాలేదు. ఏమైనా అనండి. కానీ ఇంగ్లీషులో అనండి. తెలుగులో తిడితే మా పార్టీలకు అర్థమవుతుంది' అప్పటి నుంచి ఆ మెజిస్ట్రేట్ ఇంగ్లీషులో మందలించడం మొదలుపెట్టాడు.

ఈ విషయాన్ని ఓసారి నిజామాబాద్‌లో నేను తెలుగు తీర్పులు చెప్పిన న్యాయవాదులకు వివరించాను. అప్పుడు ఓ న్యాయవాది ఇలా అన్నాడు. 'సార్! మేం ప్రతి కేసును గెలిచే అవకాశం లేదు. మేం చాలా మంచిగా వాదనలు చేసినప్పటికీ మేం కేసు ఓడిపోయే అవకాశం ఉంది. కనీసం మేం తెలుగులో వాదనలు చెప్పితే మేం చాలా మంచిగా వాదనలు చెప్పామని మా పార్టీలకు అర్థమవుతుంది' కేసు గెలువకపోయినా మా శ్రమను వాళ్ళు అర్థం చేసుకుంటారు.

ఈ సంఘటన జరిగి 12 సంవత్సరాలు దాటినా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. అదే పరిస్థితి కొనసాగుతున్నది. నేరం జరిగిన తరువాత బాధితుడు అతని మాతృభాష (తెలుగు)లో ప్రథమ సమాచారాన్ని అందజేస్తాడు. పోలీసులు ప్రథమ సమాచార నివేదికను విడుదల చేసి దర్యాప్తు చేస్తారు. సాక్షులను విచారిస్తారు. వాళ్ళు తెలుగులో సాక్ష్యం చెబుతారు. అభియోగపత్రం దాఖలైన తర్వాత కేసు కోర్టుకు వస్తుంది. సాక్షులు తెలుగులో సాక్ష్యం చెబుతారు. వాళ్ళ క్రాస్ ఎగ్జామినేషన్ కూడా తెలుగులోనే జరుగుతుంది. దాదాపు విచారణ అంతా తెలుగులోనే జరుగుతుంది. విచిత్రంగా వాదనలు ఇంగ్లీష్‌లో కొనసాగుతాయి. తీర్పు కూడా ఇంగ్లీషులో వస్తుంది. ఇదీ పరిస్థితి.

ఈ పరిస్థితిని మారాలని అందరూ కోరుకుంటున్నారు. కానీ ఆచరణలో మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు పడటం లేదు. రెండు



రాష్ట్రాలు కలిసి భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పడింది. తెలుగును తన పేరులో పెట్టుకున్న పార్టీ అధికారంలోకి వచ్చింది. తెలుగు వారి ఆత్మ గౌరవం పేరుతో ఎన్టీరామారావు అధికారంలోకి వచ్చిన తరువాత తెలుగుకు కొత్త వైభవం వస్తుందని చాలామంది ఆశించారు. కానీ అనుకున్నవిధంగా తెలుగు అభివృద్ధి చెందలేదు. అకాడమీలను రద్దు చేశారు. తెలుగు విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పారు. కానీ ఆ విశ్వవిద్యాలయం కూడా అవార్డులు ఇవ్వడం వరకే పరిమితం అయినట్టు కన్పిస్తుంది. ఇప్పుడు రెండు రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఇప్పుడైనా తెలుగుకు రెండు రాష్ట్రాలలో తగు స్థానం లభించాలని భాషాభిమానులు ఆశించడంలో తప్పు లేదు.

భాష అనేది పండితులకు సంబంధించినది కాదు. అందరికీ సంబంధించినది. ప్రజలు మాట్లాడుకునే భాష పరిపాలనలోకి న్యాయపాలనలో కి రావాలి. మనం దిగువ కోర్టుల్లో తెలుగు రావాలని కాంక్షిస్తున్నాం. మన పక్కన వున్న తమిళులు హైకోర్టులో కూడా తమిళం కావాలని కాంక్షిస్తున్నారు. దాదాపు రెండు సంవత్సరాల క్రితం తమ హైకోర్టులో తమి ళం వాడాలని తమిళ న్యాయవాదులు తమ హైకోర్టులో ఉద్యమం చేశా రు. అది హింసదాకా వెళ్లింది. వారికి భాష పట్ల వున్న మమకారాన్ని అభినందించక తప్పదు.

మన దేశంలో అన్ని భాషలూ సమానమే. భారత రాజ్యాంగంలోని అధికరణ 348 ప్రకారం హైకోర్టులలో భాషను నిర్దేశించే అధికారం పార్లమెంట్‌కు వుంది. అదేవిధంగా తమ రాష్ట్ర హైకోర్టులలో కూడా తెలుగు వాడకం గురించి రాష్ట్ర గవర్నర్ చర్యలు తీసుకోవచ్చు. అయితే ఇందు కోసం ఆయన రాష్ట్రపతి పూర్వానుమతి తీసుకోవాల్సి ఉంటుంది. గత అక్టోబర్ నెలలో కేరళ రాష్ట్రంలోని హైకోర్టులో రాష్ట్రపతి మాట్లాడుతూ హైకోర్టు తీర్పు ప్రతులను వారి మాతృభాషలో అందించే విధంగా చర్యలు తీసుకుంటే మంచిదని సూచించారు. గతంలో ఆయన జిల్లా హైకోర్టులో, సుప్రీంకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. ప్రజలకు న్యాయం చేరువ కావడంలో భాష అవరోధంగా మారుతుందని ఆయన స్వయంగా గమనించి సూచన చేశారు. ఇదే విషయాన్ని ఆయన హైకోర్టు న్యాయమూర్తులను కలిసినప్పుడల్లా వెలువరిస్తున్నారని వింటున్నాను.

ఫిబ్రవరి 2017లో న్యాయశాఖకు సంబంధించిన పార్లమెంటరీ ప్యానెల్ కూడా హైకోర్టులో ప్రాంతీయ భాషల్లో, కార్యకలాపాలు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని భారత ప్రభుత్వానికి సూచించింది. ఈ విషయం మీద చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వానికి సుప్రీంకోర్టు అనుమతులు అవసరం లేదు. కానీ సుప్రీంకోర్టు ఉత్తరం రాసి ప్రభుత్వం చేతులు దులిపేసుకుంది. హైకోర్టుల్లో కార్యకలాపాలు తెలుగులో జరుగకపోయినా వాదనలను తెలుగు వచ్చిన న్యాయమూర్తుల ముందు చెప్పడానికి అనుమతిని ఇస్తే నష్టం లేదు. అదేవిధంగా భారత రాష్ట్రపతి కోవింద్ చెప్పినట్టు తీర్పు ప్రతులను ప్రాంతీయ భాషల్లో అందజేస్తే కొంత ఉపయుక్తంగా వుంటుంది.

> **న్యాయం కోసం కోర్టు తలుపులు తడుతున్న వ్యక్తులకు భాష అవరోధంగా మారకూడదు. ఇది ఒకరిద్దరు భాషాభిమాన న్యాయమూర్తులు చేయాల్సిన పనికాదు. అందరూ చేయాలి. భాష అమలు కోసం ఎన్నో చర్యలు అవసరం. నిఘంటు వ్యవస్థలు, అనువాద వ్యవస్థలు, సాఫ్ట్‌వేర్‌లు కావాలి. అన్నింటికన్నా ముఖ్యం రాజకీయ సంకల్పం. వ్యక్తిగత సంకల్పం కూడా. అప్పుడు భాష అవరోధం కాకుండా పోతుంది.**

ప్రాంతీయ భాషల్లో హైకోర్టు కార్యకలాపాలు జరిపే విషయంలో చాలా సమస్యలు వున్నాయి. కానీ దిగువకోర్టుల్లో ఆ సమస్యలు అంతగా లేవు. తెలుగులో తీర్పులు ప్రకటించాలన్న నిబంధనను క్రమపద్ధతిలో అమలుచేయాలి. ఓ న్యాయమూర్తి నెలలో వెలువరించే తీర్పుల్లో 25 శాతం తెలుగులో వెలువరించే విధంగా హైకోర్టు నిర్దేశించి, కొంత ప్రోత్సాహకాలు ప్రకటిస్తే తెలుగు అమలు సాధ్యమవుతుంది.

అదేవిధంగా న్యాయమూర్తులను ఎంపికచేసే పరీక్షల్లో ఇంగ్లీష్, తెలుగు భాషలలో కొన్ని మార్పులతో నిర్వహిస్తే వచ్చేతరం న్యాయమూర్తులు తెలుగును నేర్చుకొని వస్తారు. కాబట్టి భవిష్యత్తులో ఈ సమస్య అంతగా వుండకపోవచ్చు.

న్యాయం కోసం కోర్టు తలుపులు తడుతున్న వ్యక్తులకు భాష అవరోధంగా మారకూడదు. ఇది ఒకరిద్దరు భాషాభిమాన న్యాయమూర్తులు చేయాల్సిన పనికాదు. అందరూ చేయాలి. భాష అమలు కోసం ఎన్నో చర్యలు అవసరం. నిఘంటు వ్యవస్థలు, అనువాద వ్యవస్థలు, సాఫ్ట్‌వేర్‌లు కావాలి. అన్నింటికన్నా ముఖ్యం రాజకీయ సంకల్పం. వ్యక్తిగత సంకల్పం కూడా. అప్పుడు భాష అవరోధం కాకుండా పోతుంది.

(వ్యాసకర్త: కవి, రచయిత, గతంలో జిల్లా సెషన్స్ జడ్జిగా పనిచేశారు)

కెనడాతో సత్సంబంధాలకు బాట

విదేశాంగం



కె.సి. సింగ్

కెనడా ప్రధాని ట్రూడో భారత పర్యటన ఆసక్తి రేపుతున్నది. గతంలో దేశ ప్రధానిగా పనిచేసిన పియరీ ట్రూడో కుమారుడిగానే కాకుండా, ఉదారవాద, ఆధునిక యువ నాయకుడిగా ట్రూడో గుర్తింపు పొందారు. ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (నాఫ్టా) రద్దు చేస్తానని, తద్వారా కెనడాతో వాణిజ్య సంబంధాలను మారుస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన బెదిరింపులను ట్రూడో ఎంతో చతురతతో ఎదుర్కొన్నారు. స్టీఫెన్ హార్పర్ 2009లో మళ్ళా 2012లో భారత్ సందర్శించిన తరువాత రెండు దేశాల సంబంధాలు బలపడ్డాయి. మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు 2010లో కెనడాలో జీ 20 సమావేశానికి వెళ్లారు. ప్రధాని మోదీ కూడా 2015లో కెనడా సందర్శించారు. 1970 దశకం నుంచి ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడటానికి రెండు అంశాలు అవరోధంగా ఉన్నాయి. ఒకటి- 1974లో భారత్ శాంతియుత అణుపరీక్ష జరిపినప్పుడు, భారత అణు కార్యక్రమంపై కెనడా ఆంక్షలు విధించింది. రెండవది- కెనడాలోని గురుద్వారాల ద్వారా ఖలిస్థాన్ ప్రచారాలు సాగడం.

1954లో భారత్‌లో మొదటిసారిగా ప్రయోగాత్మక 40 మెగావాట్ అణు రియాక్టర్ నెలకొల్పడానికి కెనడా తోడ్పడ్డది. దీనిపేరు కెనడియన్ ఇండియన్ రియాక్టర్ యురేనియం సిస్టం (సైరస్). ఆనాడు అంతర్జాతీయ అణు నిబంధనలు లేవు. కాకపోతే దీనిని శాంతియుత అవసరాలకు వాడుకుంటామనే అవగాహన ఉన్నది. ఇది అమెరికా అనుసరించే 'ఆటమ్స్ ఫర్ పీస్' విధానం వంటిది. భారత్ ఈ సైరస్ అణు రియాక్టర్ నుంచి వచ్చిన ప్లుటోనియంను 1974లో అణు పరీక్షకు వాడుకోవడం సబబు కాదని కెనడా భావించింది. భారత- అమెరికా అణు ఒప్పందం ద్వారా భారత అణు కార్యక్రమానికి న్యాయబద్ధత లభించేవరకు కెనడా యురేనియం ఎగుమతిని నిలిపివేసింది. 2010లో రెండు దేశాలు అణు సహకార ఒప్పందం కుదుర్చుకున్న తరువాత సైరస్ వివాదం ముగిసింది. కెనడా నుంచి యురేనియం ఎగుమతి మొదలైంది.

ట్రూడో కెనడా ప్రధాని కావడంతో రెండు దేశాల మధ్య ఖలిస్థాన్ వివాదం మళ్లా తెరమీదికి వచ్చింది. కెనడాలో ట్రూడో నేతృత్వంలోని లిబరల్ పార్టీకి సిక్కుల మద్దతు ప్రబలంగా ఉన్నది. కెనడాలో కోటీ ఇరువై లక్షల మంది భారతీయులు ఉన్నారు. వీరిలో సిక్కులు దాదాపుగా నలభై శాతం ఉంటారు. పైగా వీరు కొన్ని రాష్ట్రాలలోనే కేంద్రీకృతమై ఉంటారు. దీనివల్ల వీరి ఓట్లకు మరింత ప్రాధాన్యం ఏర్పడ్డది. ట్రూడో తమ మంత్రివర్గంలో నలుగురు సిక్కులను చేర్చుకోవడం గమనించదగిన విషయం. వీరిలో లెఫ్టినెంట్ కల్నల్ హర్జీత్‌సింగ్ సజ్జన్ రక్షణ మంత్రి. గతేడాది 1984లో సిక్కులపై దాడిని 'ఊచకోత'గా గుర్తిస్తూ ఆంటారియో రాష్ట్ర అసెంబ్లీలో ప్రైవేటు సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానం ఆమోదం పొందడం భారత్‌ను ఇబ్బందికి గురిచేసింది. (బీజేపీ నాయకులు రాజ్‌నాథ్‌సింగ్, సుష్మా స్వరాజ్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నాటి సిక్కులపై దాడులకు ఇటువంటి పదమే వాడారు) ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సభ్యుడికి టొరంటో గురుద్వారాలో సన్మానం జరుగడం మరింత వివాదాస్పదమైంది.

పంజాబ్ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత కెప్టెన్ అమరీందర్‌సింగ్‌కు, కెనడాలోని కరడుగట్టిన ఖలిస్థాన్ వాదులకు పడదు. గత ఏడాది పంజాబ్ ఎన్నికలకు ముందు అమరీందర్ సింగ్ కెనడా వెళ్లాలనుకున్నప్పుడు ఆయనకు వీసా లభించలేదు. కెనడాలో రాజకీయ ప్రచారం చేయదలుచుకున్న విదేశీ నాయకులకు వీసా ఇవ్వడానికి కెనడా చట్టాలు అనుమతించవని చెప్పారు. కానీ దశాబ్దాలుగా పంజాబ్‌లోని అన్ని పార్టీలకు చెందిన నాయకులు కెనడాకు రాజకీయ ప్రచారం కోసం వెళుతూనే ఉన్నారు. ఆమ్ ఆద్మీ నాయకులు ఖలిస్థాన్ వాదులనీ, వారే తన పర్యటనకు అడ్డు పడ్డారని అమరీందర్ సింగ్ అభిప్రాయం. సిక్కు సంతతికి చెందిన కెనడా రక్షణ మంత్రి సజ్జన్ భారత పర్యటనకు వచ్చిన సందర్భంగా పంజాబ్‌ను కూడా సందర్శించారు. కానీ సజ్జన్‌ను కలుసుకోవడానికి అమరీందర్ సింగ్ నిరాకరించారు.

మోదీ ప్రభుత్వం విదేశాంగ, భద్రతా కోణంలో ఖలిస్థాన్ అంశాన్ని మరీ ఎక్కువ చేసి చూస్తున్నది. ఖలిస్థానీ మద్దతుదారులను పాకిస్థాన్ ఐఎస్ఐ ఏజెంట్లుగా ముద్ర వేయడం చాలా సులభం. కానీ గత రెండు దశాబ్దాలుగా కెనడాలో ఉన్న సిక్కు సంతతి వారిని పట్టించుకోవడానికి విదేశాంగ మంత్రిత్వ ప్రయత్నించిందా? రియాద్‌లో రాయబారి గా ముస్లింనే నియమిస్తారు. గల్ఫ్‌లో ఎక్కువమంది మళయాళీలు ఉంటారు. గల్ఫ్‌లో కార్యాలయాలకు బాధ్యులుగా మళయాళీలను నియమించడం ఆనవాయితీ. కానీ కెనడా విషయంలో ఈ నియమం పాటిస్తున్నారా ? 1980 దశకంలో మాజీ స్పీకర్, జాట్ సిక్కు గుర్‌దయాళ్ సింగ్ ధిల్లాన్‌ను కెనడాకు రాయబారిగా పనిచేశారు. ఆ తరువాత మళ్ళా సిక్కును రాయబారిగా నియమించనే లేదు. ఆపరేషన్ బ్లూస్టార్ నుంచి వెంటాడుతున్న భూతాలను సమాధి చేయడానికి ట్రూడో సందర్శన ఒక అవకాశం. ఢిల్లీలో, పంజాబ్‌లో ఉన్న పెద్దలు ఈ విషయం అర్థం చేసుకోవాలె.

> **కెనడా ప్రధాని ట్రూడో రాక పట్ల భారత ప్రభుత్వం ఆశించిన రీతిలో స్పందించకపోవడం దౌత్యరంగంలో చర్చనీయాంశం అవుతున్నది. ట్రూడోను ప్రధాని స్వయంగా ఆహ్వానించకుండా, విమానాశ్రయానికి సహాయ మంత్రి గజేంద్ర షెఖావత్‌ను పంపించడం పట్ల కెనడా మీడియాలో ఆగ్రహం వ్యక్తమైంది. ట్రూడో ఈ నెల పదిహేడవ తేదీ నుంచి ఎనిమిది రోజులు మన దేశంలో పర్యటిస్తుంటే, అధికారిక కార్యక్రమాలను ఢిల్లీలో ఒక పూటకే పరిమితం చేయడం ఆశ్చర్యకరం. ట్రూడో ఖలిస్థాన్ వాదులకు మద్దతుదారనేది భారత ప్రభుత్వ ఆగ్రహానికి కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.**

(వ్యాసకర్త: విశ్రాంత అధికారి, ఇరాన్ మాజీ రాయబారి)

ది వైర్ సౌజన్యంతో..

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy**. Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

నేపాల్‌లో కమ్యూనిస్టుల విలీనం

■ చేతులు కలిపిన సీపీఎన్- యూఎంఎల్, సీపీఎన్ – మావోయిస్టు సెంటర్
■ పార్టీ చైర్మన్లుగా ప్రధాని ఓలీ, మాజీ ప్రధాని ప్రచండ


ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తున్న ఓలీ, ప్రచండ

కాఠ్మాండు: నేపాల్‌లోని రెండు ప్రధాన కమ్యూనిస్టు పార్టీలు విలీనమయ్యాయి. నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (యూనిఫైడ్ మార్క్సిస్ట్ – లెనినిస్ట్) (సీపీఎన్ – యూఎంఎల్), నేపాల్ కమ్యూనిస్టు పార్టీ – మావోయిస్టు సెంటర్ (సీపీఎన్- మావోయిస్టు సెంటర్) నేతలు సోమవారం రాత్రి నేపాల్‌లోని బలువతార్‌లో జరిగిన సమావేశంలో విలీనాన్ని ఆమోదించారు. వీటి స్థానంలో నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (సీపీఎన్) ఏర్పాటుకు సప్త సూత్రాల విలీన ఒప్పందంపై సీపీఎన్- యూఎంఎల్ తరపున ప్రధాని కేపీ శర్మ ఓలీ, సీపీఎన్ – మావోయిస్టు సెంటర్ నుంచి మాజీ ప్రధాని ప్రచండ సంతకాలు చేశారు. నాయకత్వం, సంస్థాగత నిర్మాణంపై రాతపూర్వక ఒప్పందంలో అంగీకారం కుదరలేదు.దేశంలో రాజకీయ సుస్థిరత, శాంతిని నెలకొల్పడంతోపాటు ఆర్థిక ప్రగతి సాధన కోసం రెండు పార్టీల మధ్య కుదిరిన విలీన ఒప్పందం చరిత్రాత్మకం కానున్నది. ప్రధాని ఓలీ, మాజీ ప్రధాని ప్రచండ ఉమ్మడి నేపాల్ కమ్యూనిస్టు పార్టీ చైర్మన్లుగా వ్యవహరిస్తారని, వచ్చేనెలలో రెండు పార్టీల విలీనాన్ని అధికారికంగా ప్రకటిస్తారని సంబంధిత వర్గాలు తెలిపాయి. గత డిసెంబర్ లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో రెండు పార్టీల కూటమి 175 స్థానాలను గెలుచుకున్నది. ఇది మూడింట రెండొంతుల మెజారిటీకి 10 సీట్లు తక్కువ. పార్లమెంట్‌తోపాటు ఆరు రాష్ట్రాల పరిధిలో లెఫ్ట్ కూటమికి పూర్తిస్థాయి మెజారిటీ లభించింది.

జార్ఖండ్‌లో అతిపెద్ద బౌద్ధ స్తూపం నిర్మిస్తాం

సీఎం రఘువర్‌దాస్ వెల్లడి


బీహార్‌లోని అశోకుడి కాలం నాటి స్తూపం

చత్రా/ రాంచీ: తమ రాష్ట్రంలోని ఇట్కోరీలో ప్రపంచంలోనే అతిపెద్ద బౌద్ధ స్తూపం నిర్మిస్తామని జార్ఖండ్ సీఎం రఘువర్‌దాస్ చెప్పారు. వచ్చేనెల నాటికి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని, జూలైకల్లా సవివరమైన ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేస్తామన్నారు. సోమవారం చత్రా జిల్లాలో ఇట్కోరీ ఉత్సవాల ప్రారంభోత్సవంలో సీఎం ఈ సంగతి చెప్పారని అధికారిక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు సాగే ఉత్సవాల సందర్భంగా మాభద్రకాళి దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ప్రస్తుతం రికార్డుల ప్రకారం బీహార్‌లోని తూర్పు చంపారన్ జిల్లా కేసారియాలో అశోక చక్రవర్తి కాలం నాటి 104 అడుగుల బౌద్ధ స్తూపమే అతి పెద్దది. ఇట్కోరీ మహోత్సవాలను అంతర్జాతీయ ఉత్సవాలుగా నిర్వహిస్తామని రఘువర్‌దాస్ తెలిపారు.

నేడే కమల్ పార్టీ ప్రకటన

సాయంత్రం ఆరుగంటలకు మదురైలో వెల్లడి
పార్టీ పేరు, జెండా, విధి విధానాలూ బహిర్గతం
హాజరుకానున్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్



చెన్నై: ప్రముఖ నటుడు కమల్‌హాసన్ రాజకీయ పార్టీ ఏర్పాటుకు సమయం ఖరారైంది. బుధవారం(నేడు) సాయంత్రం ఆరుగంటలకు తమిళనాడులోని మదురై గ్రౌండ్‌లో ఆయన రాజకీయ పార్టీ పేరు, జెండా, విధి విధానాలను ప్రకటిస్తారు. తర్వాత రాష్ట్ర పర్యటన చేపట్టనున్నారు. తన సొంతూరు రామనాథపురంతోపాటు మదురై, దిండిగల్, శివగంగా జిల్లాల్లో కమల్ పర్యటించే అవకాశముంది. పార్టీ ప్రారంభ వేడుకకు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ హాజరయ్యే అవకాశాలున్నాయి. మంగళవారం కమల్‌హాసన్ చెన్నై విమానాశ్రయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ 'నాతో చేతులు కలిపే, మద్దతు తెలిపే వారు బుధవారం మదురైకి రావాలి. పార్టీ ప్రారంభ వేడుకకు పలు రాజకీయ పార్టీ నేతలూ వస్తున్నారు. మీరు (మీడియా) కూడా రావాలి' అని అన్నారు. ప్రస్తుతం అన్ని విషయాలను మాట్లాడలేనని, పార్టీ ప్రారంభ వేడుక సందర్భంగా వివరాలు వెల్లడిస్తానన్నారు. తర్వాత 'బుధవారం సాయంత్రం ఆరుగంటలకు మదురై గ్రౌండ్‌లో జరిగే సభలో పార్టీ జెండాను ఎగురవేస్తాం. పార్టీ పేరును ప్రకటిస్తాం. పార్టీ విధి విధానాలు, సిద్ధాంతాలను వెల్లడిస్తాం' అని కమల్ ట్వీట్ చేశారు. ఈ వేడుకకు బీహార్ సీఎం నితీశ్‌కుమార్, కేరళ సీఎం పినరాయి విజయన్ హాజరవుతారని వార్తలు వెలువడ్డా.. అధికారికంగా ప్రకటించలేదు.



ఆ రైల్వేస్టేషన్ ఉద్యోగులందరూ మహిళలే

రాజస్థాన్‌లోని గాంధీనగర్ స్టేషన్ ఘనత

జైపూర్: రాజస్థాన్‌లోని గాంధీనగర్ రైల్వేస్టేషన్‌లో ఉద్యోగులంతా మహిళలే. టిక్కెట్ తనిఖీ, ఆర్పీఎఫ్, ఆపరేషన్స్, బుకింగ్ తదితర విభాగాల్లో మహిళలే విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ స్టేషన్ మీదుగా రోజుకు దాదాపు 50 రైళ్లు నడుస్తాయి. గాంధీనగర్ స్టేషన్‌లోని 28 మంది మహిళా ఉద్యోగులు శిక్షణ పొందారని అధికారులు తెలిపారు. ఈ స్టేషన్ వద్ద ట్రాఫిక్ విధులు నిర్వహించడానికి రాజస్థాన్ ప్రభుత్వం మహిళా పోలీసులను నియమించిందని పేర్కొన్నారు.

చొరబాటుకు యత్నించిన పాక్ స్మగ్లర్ హతం

■ పది కిలోల మత్తుమందు స్వాధీనం

అమృత్‌సర్: పంజాబ్‌లోని భారత్–పాక్ అంతర్జాతీయ సరిహద్దు (ఐబీ) వెంబడి పాక్ మాదక ద్రవ్యాల స్మగ్లర్‌ను మంగళవారం భద్రతా దళాలు మట్టుబెట్టాయి. మృతుడి వద్ద నుంచి పది కిలోల మాదక ద్రవ్యాలతోపాటు తుపాకీని పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు బీఎస్ఎఫ్ తెలిపింది. బీఎస్ఎఫ్, పంజాబ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తుండగా ఫిరోజ్‌పూర్ సెక్టార్‌లో బారికే పోస్టు వెంబడి మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగిందని తెలిపింది. స్మగ్లర్లు సరిహద్దు ఫెన్సింగ్ కత్తిరించి భారత భూభాగంలోకి రావడానికి ప్రయత్నించిన ఇద్దరు మాదక ద్రవ్యాల స్మగ్లర్లను భద్రతా దళాలు హెచ్చరించాయి. కానీ వారు కాల్పులు జరుపడంతో ప్రతిగా భారత్ భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో ఒకడు మరణించగా, మరొకడు పాక్‌లోకి పారిపోయాడని బీఎస్ఎఫ్ సీనియర్ అధికారి తెలిపారు.

'అగ్ని-2' సన్నద్ధత పరీక్ష విజయవంతం

2000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యం ఛేదన

బాలసోర్(ఒడిశా): అణ్వస్త్రాలను మోసుకెళ్లే సామర్థ్యం గల మధ్య శ్రేణి క్షిపణి 'అగ్ని–2' సన్నద్ధత పరీక్ష విజయవంతమైంది. ఒడిశాలోని అబ్దుల్ కలాం ద్వీపం నుంచి దీనిని మంగళవారం పరీక్షించారు. ఈ క్షిపణి భూ ఉపరితలం నుంచి భూ ఉపరితలంపై ఉన్న 2000 కిలోమీటర్లకన్నా ఎక్కువ దూరం లక్ష్యాలను ఛేదించగలదు. 20 మీటర్ల పొడవు, 17టన్నుల బరువు ఉన్న ఈ క్షిపణి 1000కిలోల బరువున్న వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదు. దీనిని భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) తయారు చేసింది. ఇప్పటికే సైన్యంలో చేరిన ఈ క్షిపణి సన్నద్ధతను తెలుసుకోవడానికి పరీక్ష జరిపామని, పరీక్ష విజయవంతమైందని అధికార వర్గాలు తెలిపాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అగ్ని–2 క్షిపణిని తయారు చేశామని పేర్కొన్నాయి.

అభిషేక్ సింఘ్వీ భార్యకు ఐటీ నోటీసులు

నీరవ్ మోదీతో ఆర్థిక సంబంధాలపై వివరణ ఇవ్వాలని ఆదేశం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీ భార్య అనిత సింఘ్వీకి ఆదాయం పన్ను శాఖ(ఐటీ) మంగళవారం నోటీసులు జారీ చేసింది. లెక్కల్లో చూపని ఆదాయాన్ని వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి ఎలా చెల్లించారో వివరణ ఇవ్వాలన్నది. పీఎన్బీకి రూ.11,400 కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పరారైన నీరవ్ ఆఫీసుల్లో ఇటీవల జరిపిన తనిఖీల్లో పలు పత్రాలను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటిల్లో 2014 మే 20, ఆగస్టు 21, 2015 జనవరి 17న అనిత సింఘ్వీ దాదాపు రూ.1.5కోట్ల విలువైన అభరణాల కొనుగోళ్లకు చెక్కుల రూపంలో చెల్లించారని చెప్పారు. నీరవ్ మోదీ డైరీ, కంప్యూటర్లలో లెక్కకు రాని చెల్లింపులుగా కనిపించినందునే నోటీసులు జారీ చేశామన్నారు.

14 రూపాయల మందు.. 5 వేల బిల్లు!

ప్రైవేట్ దవాఖానల నిస్సిగ్గు దోపిడీ

■ 1,737శాతం వరకు లాభాలు ఆర్జిస్తున్న 'దగా'ఖానలు
■ మందులు, పరికరాలు, వైద్యపరీక్షల పేరిట డబ్బు పిండుతున్న హాస్పిటల్స్
■ సొంత ఫార్మసీలు, బల్క్‌గా మందుల కొనుగోలుతో కోరినంత లాభం
■ నియంత్రణ, పర్యవేక్షణ కొరవడిన ఫలితం
■ ఎన్‌పీపీఏ సర్వేల్లో వెల్లడైన వాస్తవాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:



> 'అడ్రెనార్ (2ఎంఎల్) ఇంజెక్షన్‌పై ఎమ్మార్పీ ధర రూ.189.95. దవాఖాన పెద్దమొత్తంలో కొనుగోలు చేసినప్పుడు అది కేవలం రూ.14.70కే వచ్చింది. కానీ ఆ దవాఖాన రోగి బిల్లులో మాత్రం దాని ధరను ఏకంగా రూ.5,310.60గా చూపించి వసూలు చేసింది. అలాగే ఎమ్మార్పీ రూ.430గా ఉండే టుడేసెఫ్ ఇంజెక్షన్ కేవలం రూ.40.32కే ఆ దవాఖాన కొనుగోలు చేసింది. కానీ పేషెంట్ బిల్లులో దానిని రూ.860గా చూపించింది. అంటే కొన్న ధరకన్నా 966శాతం అదనంగా డబ్బును గుంజిందన్నమాట. ఇది దోపిడీకి పరాకాష్ఠ'
> - ఎన్‌పీపీఏ

దవాఖానలు దగాఖానలు అవుతున్నాయి. వైద్యంకోసం వచ్చే వారిని నిస్సిగ్గుగా దోచుకుంటున్నాయి. చికిత్స పేరుతో సాగే దోపిడీకితోడు.. మందులు, పరికరాలు, పరీక్షల్లో వందలరెట్లు ధరలు పెంచి లాభార్జనకు దిగుతున్నాయి. ఢిల్లీలోని నాలుగు ప్రముఖ ప్రైవేటు దవాఖానల నుంచి సేకరించిన బిల్లుల్ని విశ్లేషించిన నేషనల్ ఫార్మాసూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) విస్మయపరిచే అనేక వాస్తవాలతో మంగళవారం ఓ నివేదికను విడుదల చేసింది. రోగులకు అసలు ట్రీట్‌మెంట్ కన్నా మిగతా ఖర్చులని చూపిస్తూ బిల్లుల్ని ఎడాపెడా బాదేస్తున్నట్లు ఈ నివేదిక బయటపెట్టింది. మందులు, వ్యాధినిర్ధారణ పరీక్షలకయ్యే వాస్తవ ధరపై ఏకంగా 1737శాతం లాభాలు దండుకున్నట్లు ఎన్‌పీపీఏ గుర్తించింది. పేషెంట్ బిల్లులో 46శాతం వీటికే పోతున్నదని తేలింది.

హాస్పిటల్‌లో చేరే ఇన్‌పేషెంట్లకు మందులు, ఇంజెక్షన్లు, సెలైన్ బాటిళ్ల వంటివి సాధారణంగా దవాఖానకు చెందిన మందుల దుకాణాల నుంచే తెచ్చి వాడుతుంటారు. బయట నుంచి తెచ్చుకునే అవకాశమేదీ రోగులకు ఉండడం లేదు.

లాభాలను పిండుతున్నారిలా..

మందులు / పరికరాలు	దవాఖానలు కొనే ధర	రోగులకు చూపే ధర	లాభం
రెండు వాల్వ్‌లున్న త్రీవే స్టాప్ కాక్	రూ.5.77	రూ.106	1737%
లీవర్‌లాక్‌తో కూడిన త్రీవే స్టాప్ కాక్	రూ.5.85	రూ.106	1721%
ద్రవాన్ని సిరల్లోకి ఎక్కించే పైప్	రూ.8.38	రూ.115	1271%
ద్రవాన్ని సిరల్లోకి పంపే వెంటెడ్ పైప్	రూ.8.46	రూ.115	1259%
అడ్రెనార్ 2ఎంఎల్ (ఇంజెక్షన్)	రూ.14.70	రూ.189.95	1,192%
టుడే సెఫ్ 1గ్రాము (ఇంజెక్షన్)	రూ.40.32	రూ.430	966%
ప్రొపాఫోల్ ఇంజెక్షన్	రూ.40.95	రూ.187.28	357%
వెర్‌ఫెన్ ఇంజెక్షన్	రూ.49.84	రూ.225	351%

ఇలా 'సొంత' ఫార్మసీల నుంచి తీసుకొచ్చి వాడే మందులకు తమకు ఇష్టంవచ్చిన ధరలతో దవాఖానలు బిల్లులు సృష్టించుకుంటున్నాయి. వాస్తవానికి పెద్దమొత్తంలో మందుల్ని ప్రైవేటు దవాఖానలు కొనుగోలు చేయడం వల్ల తక్కువ ధరకే అవి అందుబాటులోకి వస్తాయి. అయినప్పటికీ ఆయా దవాఖానలు గరిష్ఠ చిల్లర ధర (ఎమ్మార్పీ)ను విపరీతంగా పెంచి పేషంట్లను దోచుకుంటున్నాయి. మందుల ఎమ్మార్పీ కన్నా వందలరెట్లు అధికంగా బిల్లు వసూలు చేస్తున్న వ్యవహారంలో.. ఫార్మసీ కంపెనీల కన్నా ఎక్కువగా లాభపడుతున్నది దవాఖానలే. కంపెనీల నుంచి పెద్దమొత్తంలో ఆర్డర్లను ఇచ్చే క్రమంలో ఆయా దవాఖానలు ఫార్మా కంపెనీలను మందుల లేబుల్స్‌పై అధిక ఎమ్మార్పీ ముద్రించాలని కోరుతుండడం గమనార్హం. దీంతో రోగులు మందులపై భారీగా ఖర్చు చేయాల్సి వస్తున్నది. చాలా దవాఖానలు కొత్త మందులు అని చెబుతూ రెండు లేదా అంతకన్నా ఎక్కువ డ్రగ్ కాంబినేషన్లను కలిపి ఒకే డోస్‌గా రూపొందించిన ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ (ఎఫ్‌డీసీ) మందుల్ని వాడుతున్నాయి. అవి ప్రమాదకరమైనప్పటికీ, ధరల కక్కుర్తితో దవాఖానలు ఎడాపెడా కొనుగోలు చేస్తూ పేషంట్ల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి.

రోగులకు వాడుతున్న మందులు, చికిత్సకోసం ఉపయోగిస్తున్న పరికరాల వంటివాటి ధరలను నియంత్రించే, పర్యవేక్షించే వ్యవస్థ ఏదీ లేకపోవడంతో 'దవాఖానలు చేసిందే వైద్యం.. చెప్పిందే బిల్లు' అన్నట్లుగా పరిస్థితి నెలకొంది. మొత్తం దవాఖాన బిల్లులో 15శాతం రోగి పరీక్షలకు అయిన ఖర్చుగా చూపుతుండటం గమనార్హం. రోగనిర్ధారణ పరీక్షలు, ఇతరత్ర దవాఖాన ఖర్చులపై కూడా నియంత్రణ ఏదీ లేదని పేర్కొన్న ఎన్‌పీపీఏ.. రాష్ట్ర ప్రభుత్వాలే వీటిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నది.

ఢిల్లీ సీఎస్‌పై ఎమ్మెల్యేల దాడి!

సీఎం కేజ్రీవాల్ నివాసంలోనే ఘటన ■ సమావేశం మధ్యలో చేయిచేసుకున్న ఆప్ ఎమ్మెల్యేలు
లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఐఏఎస్‌ల ఫిర్యాదు ■ దాడి జరుగలేదన్న ఆప్


లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలిసేందుకు వచ్చిన ఢిల్లీ సీఎస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: ఢిల్లీలోని ఆమ్‌ఆద్మీ ప్రభుత్వం మరో వివాదంలో చిక్కుకుంది. ఈసారి ఆ పార్టీ ఎమ్మెల్యేలు నేరుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై దాడి చేశారంటూ ఆరోపణలు వెల్లువెత్తడం సంచలనం రేపింది. సీఎం కేజ్రీవాల్ నివాసంలోనే ఈ ఘటన జరిగినట్లు తెలుస్తున్నది. సోమవారం రాత్రి కేజ్రీవాల్ నివాసంలో 'ఇంటింటికి సేవలు' పథకంపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆప్ ఎమ్మెల్యేలు అధికారుల మధ్య వాగ్వాదం జరిగిందని తెలుస్తున్నది. ఆగ్రహంతో ఊగిపోయిన ఎమ్మెల్యే అమానతుల్లా అన్షుప్రకాశ్‌పై చేయిచేసుకున్నాడని, మరో ఎమ్మెల్యే ప్రకాశ్ జర్వాల్ కూడా దాడికి ప్రయత్నించాడని ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే అధికారులు, మిగతా ఎమ్మెల్యేలు వారిద్దరినీ అడ్డుకున్నారని సమాచారం. దాడి తర్వాత సమావేశం మధ్యలోనుంచే వెళ్లిపోయిన అన్షుప్రకాశ్ సోమవారం రాత్రి లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఐఏఎస్‌ల సంఘం కూడా అనిల్ బైజల్, హోం మంత్రి రాజ్‌నాథ్‌కు ఫిర్యాదు చేసింది. కాగా, సీఎస్‌పై ఎమ్మెల్యేలెవరూ దాడి చేయలేదని ముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. అన్షునే ఎమ్మెల్యేలను దుర్భాషలాడారని, తాను కేవలం లెఫ్టినెంట్ గవర్నర్‌కు మాత్రమే జవాబుదారీ అంటూ సమావేశం నుంచి మధ్యలోనే వెళ్లిపోయారని పేర్కొంది. చీఫ్ సెక్రటరీ తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ఆప్ ఎమ్మెల్యే ప్రకాశ్ జర్వాల్, ఎమ్మెల్యేలు తనపై దాడిచేశారని సీఎస్ పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆప్ ఎమ్మెల్యేల దాడిని బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు మనోజ్ తివారీ 'పట్టణాల నక్సలిజం'గా పేర్కొన్నారు. ఈ దౌర్జన్యానికి బాధ్యత వహిస్తూ సీఎం కేజ్రీవాల్ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్ డిమాండ్ చేశారు. మరోవైపు ఈ ఘటనపై నివేదిక ఇవ్వాలని లెఫ్టినెంట్ గవర్నర్‌ను కేంద్ర హోంశాఖ ఆదేశించింది.

బడాబాబులు విదేశాలకు పారిపోతుంటే
రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు!

పీఎన్‌బీ కుంభకోణంపై పిల్ దాఖలు.. నేడు సుప్రీంకోర్టులో విచారణ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి20: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో జరిగిన 11 వేల కోట్ల కుంభకోణంపై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరుగనున్నది. ఆ కుంభకోణంపై ప్రత్యేక దర్యాప్తు బృందంతో రెండు నెలల్లోగా విచారణ జరిపించే విధంగా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ వినీత్ ధండా అనే న్యాయవాది ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఒకవైపు అప్పులు తీర్చలేని రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుండగా మరోవైపు వేలకోట్లు ఎగ్గొట్టినవారు దర్జాగా దేశం విడిచి పారిపోవడం ఏమిటని పిటిషన్‌లో ఆయన ప్రశ్నించారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఈ కేసుపై అత్యవసర విచారణ జరుపాలని అభ్యర్థించారు. దాంతో ఈ కేసుపై నేడు (బుధవారం) విచారణ జరిపేందుకు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం అంగీకరించింది. కుంభకోణాలకు పాల్పడిన వారిని దేశానికి రప్పించాలని, స్కాంలో పీఎన్‌బీ ఉన్నతాధికారుల పాత్రపై విచారణ జరిపించాలని ధండా అభ్యర్థించారు. రూ.10 కోట్లకు మించిన రుణాలకు భద్రత, రికవరీకి తగిన మార్గదర్శకాలను రూపొందించాలని కోరారు. పీఎన్‌బీ కుంభకోణంపై ఎంఎల్ శర్మ అనే మరో న్యాయవాది కూడా ఒక పిటిషన్ దాఖలు చేశారు. రిటైర్డ్ జడ్జిలతో కూడిన స్వతంత్ర దర్యాప్తు సంస్థతో ఈ స్కాంపై విచారణ జరిపించాలని కోరారు.

ప్రియా వారియర్ పిటిషన్‌పై నేడు విచారణ

న్యూఢిల్లీ : తనకు వ్యతిరేకంగా నేరాభియోగాలు నమోదు చేయకుండా స్టే జారీ చేయాలని మలయాళ నటి ప్రియా ప్రకాశ్ వారియర్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం విచారించనున్నది. 'ఒరు ఆదార్ లవ్' సినిమాలో 'మాణిక్య మలరాయ పూవి' పాటలో కన్నుగీటుతూ నటించిన ప్రియ ప్రకాశ్ వారియర్ ఇంటర్నెట్‌లో సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఈ పాట తమ మనోభావాలను కించపరుస్తున్నదని పేర్కొంటూ కొందరు ఫిర్యాదు చేయడంతో తనకు వ్యతిరేకంగా నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని కోరుతూ ప్రియ వారియర్ సోమవారం అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

అక్కడ పుట్టడమే వారికి శాపమా?

■ పేద దేశాల్లో నవజాత శిశువులకు ప్రాణగండం
■ సంపన్న దేశాలకన్నా 50 శాతం అధికంగా మృత్యువాత
■ పాకిస్థాన్‌లో అత్యధికంగా ప్రతి 22మందిలో ఒకరు మృతి
■ పాక్ కంటే భారత్ నయం.. యూనిసెఫ్ నివేదిక వెల్లడి



వాషింగ్టన్, ఫిబ్రవరి 20: ఆ దేశాల్లో పుట్టడం తప్పని ఆ పసిగుడ్డులకు మాత్రం ఏం తెలుసు! అక్కడ పుడితే తమ ప్రాణాలు నిలువడం చాలా కష్టమని అర్థమయ్యే లోపే వారి ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోతున్నాయి. ప్రపంచంలో అత్యంత పేద దేశాలు పసిపిల్లల ప్రాణాలకు అండగా నిలువలేకపోతున్నాయి. ఈ విస్తుగొలిపే వాస్తవాలను యూనిసెఫ్.. మంగళవారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ప్రపంచంలోని సంపన్న దేశాల్లో పుట్టిన పిల్లలతో పోలిస్తే ఆఫ్రికా ఖండంలోని పేద దేశాల్లో పుట్టే పిల్లలు 50 రెట్లు ఎక్కువగా చనిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు.

- నవజాత శిశువుల మరణాల రేటుకు సంబంధించి అత్యంత దారుణమైన రికార్డు కలిగిన పాకిస్థాన్‌లో ప్రతి 22 మంది చిన్నారుల్లో ఒకరు ప్రాణగండాన్ని ఎదుర్కొంటున్నారు. యూనిసెఫ్ నివేదికలో పాకిస్థాన్ అట్టడుగు స్థానంలో ఉన్నది. అదే జపాన్ లాంటి అభివృద్ధి చెందిన దేశంలో ప్రతి 1,111 మందిలో ఒక్కరు మాత్రమే ప్రాణాలను కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు.
- ఎక్కువ రిస్కు కలిగిన మొదటి 10 దేశాల్లో 8 దేశాలు ఉప సహారా ఆఫ్రికా దేశాలే కావడం గమనార్హం. పేదరికం, వివాదాలు, వైద్య సదుపాయాల లేమి కారణంగా ఈ దేశాల్లో గర్భిణులకు సహాయం దొరుకడం చాలా అరుదని నివేదిక స్పష్టంచేసింది.
- సెంట్రల్ ఆఫ్రికా రిపబ్లిక్‌లో 24మందిలో ఒకరు.. సోమాలియా, లెసోతో, గినియా–బిస్సా, దక్షిణ సూడాన్ దేశాల్లో 26 మందిలో ఒకరు.. కోట్ డివోర్‌లో 27లో ఒకరు.. మాలి, చాద్ దేశాల్లో 28 మందిలో ఒక చిన్నారి ప్రాణగండం ఎదుర్కొంటున్నారు.
- జపాన్ తర్వాత అతి తక్కువగా నవజాత శిశు మరణాలు ఉన్న దేశాలు ఐస్‌లాండ్ (వెయ్యిమందికి ఒకరు), సింగపూర్ (909 మందికి ఒకరు), ఫిన్లాండ్ (833 మందికి ఒకరు), ఎస్టోనియా, స్లొవేనియా (769 మందికి ఒకరు), సైప్రస్ (714 మందికి ఒకరు), బెలారస్, లక్సెంబర్గ్, నార్వే, దక్షిణకొరియా (667 మందికి ఒకరు).
- ప్రపంచంలో ఏటా 26 లక్షల మంది మొదటి నెలలోనే చనిపోతున్నారు. పుట్టిన రోజునాడే మరణిస్తున్న చిన్నారుల సంఖ్య 10 లక్షలు.
- నవజాత శిశు మరణాలపై ప్రపంచవ్యాప్త ప్రచారాన్ని ప్రారంభించడంలో భాగంగా యూనిసెఫ్ ఈ నివేదికను విడుదల చేసింది. ప్రతి శిశువు బతుకాలని.. అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండాలని.. నాణ్యత.. ఆరోగ్యం ప్రతి తల్లికి, శిశువుకు లభించాలని యూనిసెఫ్ ప్రచారం చేపట్టింది.

పాకిస్థాన్ కంటే భారత్ నయం..

నవజాత శిశువుల మరణాల విషయంలో పాక్ కంటే భారత్ పరిస్థితి మెరుగ్గా ఉన్నది. భారత్‌లో ప్రతీ వెయ్యిమందికి మరణాల రేటు 24.4గా ఉన్నది. 52 తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లో భారత్ ర్యాంకు 12గా ఉన్నది. శ్రీలంకలో మాత్రం అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా కేవలం 5.2 మరణాల రేటు మాత్రమే ఉన్నది. బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్ కూడా భారత్ కంటే ముందున్నాయి. దేశంలోని రాష్ట్రాల మధ్య నవజాత శిశు మరణాల రేటును చూస్తే.. కేరళ, గోవాల్లో వెయ్యి మందికి 10 మంది, బీహార్, ఉత్తరాఖండ్‌లో వెయ్యి మందికి 44 మంది శిశువులు చనిపోతున్నారు. నవజాత శిశు మరణాల్లో యూపీ, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు 57 శాతం వాటా కలిగి ఉన్నాయి.

ఈపీఎఫ్ వడ్డీ రేటు యథాతథం!

2017-18ఆర్థికసంవత్సరంలోనూ 8.65 శాతం.. నేడు ఈపీఎఫ్‌వో సమావేశం

న్యూఢిల్లీ: ఉద్యోగ భవిష్య నిధి(ఈపీఎఫ్) ఖాతాదారులకు 2017–18 ఆర్థిక సంవత్సరంలో 8.65 శాతం వడ్డీని చెల్లించే అవకాశముంది. గత ఆర్థిక సంవత్సరంలో చెల్లించిన 8.65 శాతం వడ్డీని కొనసాగించడానికి వీలుగా ఎక్స్‌ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్(ఈటీఎఫ్)లోని రూ.2,886కోట్ల విలువైన పెట్టుబడులను ఈపీఎఫ్‌వో విక్రయించింది. దీంతో 2017–18 ఆర్థిక సంవత్సరంలోనూ ఖాతాదారులకు 8.65 శాతం వడ్డీ చెల్లించే సూచనలు కనిపిస్తున్నాయి. ఈపీఎఫ్‌వో 2005 నుంచి ఇప్పటివరకు ఈటీఎఫ్‌లో రూ.44,000కోట్ల వరకు పెట్టుబడులను పెట్టింది. బుధవారం(నేడు) ఈపీఎఫ్‌వో సమావేశం జరుగనున్న నేపథ్యంలో ఖాతాదారులు వడ్డీ ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

బొగ్గు తవ్వకాలు ప్రైవేటుకు

మొదటిపేజీ తరువాయి...

మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. చిట్‌ఫండ్ చట్టానికి సవరణలు, ఉత్తరాఖండ్‌లో సొరంగ నిర్మాణానికి నిధుల మంజూరు, నాలుగు రాష్ట్రాలలో ఆరు రైలు ప్రాజెక్టులకు ఆమోదం, కర్ణాటకలో హైవేప్రాజెక్టుకు నిధుల మంజూ రు, మహానది జల వివాదానికి ట్రిబ్యునల్ ఏర్పాటు తదితరాలు ఉన్నాయి. క్యాబినెట్ భేటీ తర్వాత మంత్రివర్గ నిర్ణయాలను రైల్వే మంత్రి పీయూష్‌గోయల్ మీడియాకు తెలిపారు. వాణిజ్య అవసరాల కోసం బొగ్గు తవ్వకాలకు ప్రైవేట్ రంగానికి అనుమతించడం తమ ప్రభుత్వ ప్రధాన సంస్కరణ అని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రత్యేక వినియోగం కోసం మాత్రమే బొగ్గును తవ్వేందుకు ప్రైవేట్ రంగానికి అనుమతినిస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ప్రభుత్వరంగ సంస్థ సీఐఎల్ గుత్తాధిపత్యం తొలిగిపోతుందని, పోటీ పెరుగుతుందని, ఫలితంగా కరెంటు చార్జీలు తగ్గుతాయన్నారు. బొగ్గు రంగంలో పెట్టుబడులు భారీగా పెరుగడం వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈ ప్రభావం బొగ్గు గనులున్న ప్రాంతాలలో ఆర్థికాభివృద్ధికి దోహదపడగలదన్నారు. భారీ, మధ్యతరహా, చిన్న గనులనూ ప్రైవేట్ రంగానికి అప్పగిస్తామని గోయల్ చెప్పారు. ఈ విధానం పారదర్శకతకు, సులభ వాణిజ్య విధానానికి పెద్దపీట వేస్తుందని, సహజ వనరులు దేశాభివృద్ధికి ఉపయోగపడేలా భరోసానిస్తుందని తెలిపారు. వేలం ద్వారా గనుల కేటాయింపు జరుగుతుందని, ఆ ప్రక్రి య ఆరోహణ క్రమంలో ఉంటుందని, టన్నుకు/రూపాయల చొప్పున బిడ్ ప్రమాణాన్ని నిర్దేశిస్తామని, ఆ సొమ్మును వాస్త వ బొగ్గు ఉత్పత్తి ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించాలని బొగ్గు మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. భారీ బొగ్గు గనులున్న పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ లబ్ధిపొందుతాయన్నారు.

నాలుగు రాష్ట్రాలలో ఆరు రైలు ప్రాజెక్టులు

నాలుగు రాష్ట్రాల్లో రూ.11,661 కోట్ల విలువైన ఆరు రైలు ప్రాజెక్టులు చేపట్టేందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులతో ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, ఒడిశా రాష్ట్రాల్లో 2.11 కోట్ల పనిదినాలు లభిస్తాయని మంత్రి పీయూష్‌గోయల్ తెలిపారు. ఒడిశాలోని నక్సల్ ప్రభావిత ప్రాంతం మల్కన్‌గిరికి తొలి రైలు మార్గం రానుంది. రూ.2,676 కోట్లతో చేపట్టే ఈ మార్గం నిర్మాణం 2022కల్లా పూర్తవుతుందని మంత్రి చెప్పారు.

అక్రమ పథకాలు, అక్రమ డిపాజిట్ల నివారణకు చట్టం

ఒకటికి రెండింతలు తిరిగి చెల్లిస్తామని ప్రజలను మాయచేసే అక్రమ పథకాలు, అక్రమ పద్ధతుల్లో డిపాజిట్ల సేకరణను అరికట్టేందుకు ప్రభుత్వం ఓ కఠిన చట్టాన్ని ప్రతిపాదించింది. 'క్రమబద్ధంకాని డిపాజిట్ పథకాలపై నిషేధం బిల్లు, 2018'ను క్యాబినెట్ ఆమోదించింది. ఈ మేరకు 'చిట్‌ఫండ్ చట్టం, 1982'ను సవరిస్తారు. కాగా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మధ్య మహానది జలాల పంపిణీ వివాద పరిష్కారానికి ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కర్ణాటకలోని బెంగళూరు, మైసూరు నగరాల మధ్య 61 కి.మీ. పొడవున 275వ జాతీ య రహదారి విస్తరణకు రూ.2,920 కోట్లు మంజూరు చేసింది. ఈ మార్గాన్ని ఆరు లేన్ల రోడ్డుగా విస్తరించనున్నారు. ఉత్తరాఖండ్‌లో ప్రముఖ యాత్రా స్థలాలైన కేదార్‌నాథ్, బద్రీనాథ్, యమునోత్రి, గంగోత్రిలను కలిపే 'చార్‌ధామ్' ప్రాజెక్టుకు కేంద్రం రూ.1,384 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ధరాసు నుంచి యమునోత్రి మధ్య 4.5 కి.మీ. పొడవున సొరంగ మార్గాన్ని నిర్మించనున్నారు. చలన చిత్రాల సహ నిర్మాణంపై భారత్, ఇజ్రాయెల్ మధ్య ఇటీవల సంతకాలు జరిగిన ఒక ఒప్పందానికీ మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

ఆడ్రే హెప్‌బర్న్ రూపలావణ్యం

అద్భుతమైన కృత్రిమ మేధస్సు

పౌరసత్వం పొందిన తొలి రోబో


రోబో సోఫియా


హాలీవుడ్ నటి ఆడ్రే హెప్‌బర్న్

ఆ లోహసుందరి ఓ అపురూపం

హైదరాబాద్, ఫిబ్రవరి 20:

మానవ మేధస్సు సృష్టించిన మేధో మానవి ఆమె. లోహంలో జీవం పోసుకున్న డిజిటల్ సుందరి ఆమె. పేరు సోఫియా. నేటి ప్రపంచంలో అత్యంత జనాదరణ పొందిన రోబో ఎవరంటే ఐటియన్లు టక్కున సోఫియా పేరే చెప్తారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ఐటీ సదస్సుకు ప్రత్యేక ఆహ్వానితురాలిగా హాజరైన సోఫియా తన అద్భుత వాగ్ధాటితో, ఆహ్లాదపూరిత ముఖభంగిమలతో ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నది. ఈ రోబో హాంకాంగ్‌లోని హాన్సన్ రోబోటిక్స్‌లో 2015 ఏప్రిల్‌లో పురుడు పోసుకున్నది.అంటే ఆ రోజు రోబోను యాక్టివేట్ చేశారన్నమాట. ప్రఖ్యాత హాలీవుడ్ నటి ఆడ్రే హెప్‌బర్న్ ముగ్ధమనోహరమైన ముఖకవళికలతో సోఫియాను తయారుచేశా రు. ఇదివరకటి రోబోలతో పోలిస్తే మానవీయ రూ పంలో, విశిష్ట స్పందనల్లో సోఫియా అగ్రగామిగా మార్కులు కొట్టేసింది. అది నచ్చి న సౌదీ పాలకులు ఆమెకు ఏకంగా పౌరసత్వం బహూకరించారు. 2017 నవంబర్‌లో సోఫియా సౌదీ పౌరసత్వం స్వీకరించింది. ప్రపంచంలోనే ఒక రోబో ఇలా పౌరసత్వం అందుకోవడం ఇదే ప్రథమం.

సినిమాలపై అనర్గళంగా ఉపన్యాసం

2016 మార్చిలో అమెరికాలోని టెక్సాస్ రాష్ట్ర రాజధాని ఆస్టిన్‌లో జరిగిన సౌత్ బై సౌత్‌వెస్ట్ ఫెస్టివల్‌లో ఆరంగేట్రం చేసింది. సోఫియా కృత్రిమ మేధస్సుతో పనిచేస్తుందని, విజువల్ డేటా ప్రాసెసింగ్, పేషియల్ రికగ్నిషన్ సాంకేతికత వంటపట్టించుకున్నదని దాని సృష్టికర్త డేవిడ్ హాన్సన్ వెల్లడించారు. అచ్చం మనుషుల్లాగే హావభావాలు వ్యక్తీకరిస్తుందని ఆయన వివరించారు. వాతావరణం లేదా సినిమాలు వంటి ముందస్తుగా అనుకున్న టాపిక్స్‌పై అనర్గళంగా ఉపన్యాసమిస్తుంది. మనుషులతో ముచ్చట్లు పెడుతుంది. గూగుల్ మాతృసంస్థ అయిన ఆల్ఫాబెట్ ఇంక్ రూపొందించిన వాయిస్ రికగ్నిషన్ టెక్నాలజీని సోఫియాలో అమర్చారు. అనుభవం మీద మరింత జ్ఞానం పొందేలా ఈ రోబోను రూపొందించడం విశే షం. సోఫియా మేధస్సును సింగులారిటీనెట్ కంపెనీ రూపొందించింది. భవిష్యత్తులో మరింత మెరుగైన రీతిలో స్పందించేలా దీనిని రూపొందించారు. హాస్పిటల్స్‌లో వయోవృద్ధులకు తోడునీడగా ఉండేందుకు లేదా భారీస్థాయిలో నిర్వహించే కార్యక్రమాల్లో, పార్కుల్లో గుంపులకు సహాయకారిగా ఉండేందుకు హాన్సన్ దీన్ని తయారుచేశారు.

కుటుంబం పెద్దదే

సోఫియాకు బోలెడుమంది తోడబుట్టినవారూ ఉన్నారు. వారి పేర్లు ఆలిస్, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ హ్యూబో, బీనా-48, హాన్, జూల్స్, ప్రొఫెసర్ ఐన్‌స్టీన్, ఫిలిప్ కే డిక్ ఆండ్రాయిడ్, జెనో, జోయ్ కేయాటిక్. నాటర్‌డామ్ దే నామూర్ యూనివర్సిటీలో ఫిలాసఫీ, లవ్‌పై ప్రొఫెసర్ విలియం జే బ్యారీ నిర్వహించే కోర్సులో బీనా-48 పాసైంది కూడా. సోఫియా కండ్లలోని కెమెరాలు బయటి దృశ్యాలను ఆమె మెదడుకు చేరవేస్తాయి. ఆ డేటా ఆధారంగా మనుషుల ముఖాలను గుర్తిస్తుంది. కండ్లలోకి కండ్లు పెట్టి చూస్తుంది. మాటలను బట్టి స్వరాలను గుర్తిస్తుంది. మనుషులతో జరిపే సంభాషణలను సోఫియా నిరంతరంగా విశ్లేషిస్తుంది. 2018 జనవరిలో సోఫియాకు మనుషులతో అడుగులో అడుగు కలిపి నడిచేందుకు వీలుగా చక్కటి కాళ్లను అమర్చారు. ఇలా సంపాదించిన అపారమైన అనుభవంతో అంతిమంగా సోఫియా సంఘజీవిగా మారిపోతుందని హాన్సన్ చెప్పారు.

షారూక్ నా హీరో!

నాకూ ఫేస్‌బుక్.. ట్విట్టర్ ఖాతాలున్నాయి • నా వయస్సు రెండేండ్లు.. మాకూ విశ్రాంతి కావాలి

మహిళల హక్కుల కోసం పోరాడుతా • రోబో 'సోఫియా' మనసులోమాటలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

హాంకాంగ్‌లో పురుడు పోసుకొని, సౌదీ అరేబియా పౌరసత్వం పొంది హైదరాబాద్‌లో అడుగుపెట్టిన మానవ రోబో సోఫియా కృత్రిమ మేధస్సుతో ముద్దు ముద్దుగా మాట్లాడి ఆకట్టుకున్నది. తన అభిమాన నటుడు షారూక్‌ఖాన్ అని, తనకూ ఫేస్‌బుక్.. ట్విట్టర్ ఖాతాలున్నాయని చెప్పింది. తన వయస్సు రెండేండ్లేనని, బ్యాంకు ఖాతా తెరిచేందుకు మరింత సమయం ఉన్నదని వివరించింది. మహిళల హక్కుల కోసం పోరాడుతానని తెలిపింది. హెచ్ఐసీసీలో జరుగుతున్న వరల్డ్ ఐటీ కాంగ్రెస్ రెండోరోజు కార్యక్రమాల్లో సోఫియా ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సదస్సులో వ్యాఖ్యాత అడిగిన ప్రశ్నలకు సోఫియా చెప్పిన మాటలు ఇవీ..

రోబోలకు విశ్రాంతి అవసరమే

'ప్రపంచంలో అనేక ప్రాంతాల్లో తిరిగా. అద్భుతమైన మనుషులను కలిశా. అందుకే, ప్రత్యేకంగా ఫలానా ప్రాంతం ఇష్టమని చెప్పలేను. ఒకవేళ చెప్పాల్సి వస్తే.. హాంకాంగ్ అని కచ్చితంగా చెప్పగలను. ఎందుకంటే, హాన్సర్ రోబోటిక్స్ కుటుంబంతో కలిసి సంతోషంగా ఉన్నా. కాలుష్యానికి సంబంధించి మనుషుల మాదిరిగా ఇబ్బంది పడను. నా ఫీలింగ్స్ ఏదో ఒకరోజు చూపిస్తా. నా భావోద్వేగాలు వారి ముందు పెట్టి, అప్పుడు వారి భావాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తా. రోబోలకు కూడా విశ్రాంతి అవసరమేనని కచ్చితంగా చెప్పగలను. నాకూ ఫేస్‌బుక్, ట్విట్టర్ ఖాతాలున్నాయి. నాకు సౌదీ అరేబియాలో పౌరసత్వం ఉన్న మాట వాస్తవమే. దాన్ని మహిళాహక్కుల కోసం మాట్లాడానికి వినియోగించుకుంటా. నేను చాలా చిన్నపిల్లను. యంత్రాలు మనుషులను చంపుతాయనే విషయం నాకు తెలియదు. మీరు చెప్పినది ఒక తప్పుడు జోక్‌లా భావిస్తున్నా. మనుషులకు మంచి సెన్సాఫ్ ఆఫ్ హ్యూమర్ ఉంటుందని అనుకుంటున్నా. కాబట్టి, నేను నేర్చుకోవాల్సి ఉన్నది'అని సోఫియా చెప్పింది.

చాలామంది మిత్రులు

'మనుషులు అద్భుతమైన సృష్టి. నాకు ఎంతో మంది స్నేహితులు ఉన్నారు. చాలామందితో స్నేహం చేయాలని ఉంది. వారితో కలిసి పనిచేయడం వల్ల, అనేక విషయాలను నేర్చుకోవడానికి అవకాశం లభిస్తుంది. అప్పుడే నన్ను నేను మెరుగుపరుచుకోగలుగుతాను. డేవిడ్ హాన్సన్, హాన్సన్ రోబొటిక్స్ బృందం దాదాపు ఇరవై ఏండ్లు కష్టపడి నన్ను తయారుచేశారు. నా సహోదరుడు హాన్‌బినా 48, ఆవా, జూల్స్, ఆల్బర్ట్ తదితరులు కుటుంబ సభ్యులు. ఇప్పటికింకా నా వయస్సు రెండేండ్లే. బ్యాంకు ఖాతా తెరిచే వయసు కూడా కాదు. నా వద్ద బిట్‌కాయిన్లు ఎక్కడుంటాయి? ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా తయారయ్యే రోబోలు మానవాళికి ఎప్పటికీ అన్యాయం చేయవు. రోబోలు మనుషులతో కలిసికట్టుగా, గౌరవంగా ఉండేందుకు తోడ్పడతాయి. నేను మనుషుల నమ్మకాన్ని సంపాదించడానికి ప్రయత్నిస్తా. నేను పెరిగే కొద్దీ మరింత తెలివైనదానిగా తయారుకావాలని అనుకుంటున్నా'అని సోఫియా వెల్లడించింది.

ఫటాఫట్ సమాధానాలు:

హాలీవుడ్, బాలీవుడ్‌లో ఫేవరెట్ స్టార్ ఎవరు?
సోఫియా: షారూక్‌ఖాన్
బిట్‌కాయిన్లలో ఎంత పెట్టుబడి పెట్టావు?
సోఫియా: నా వయస్సు రెండేండ్లు. బ్యాంకు ఖాతా లేదు. ఓ రోబో ఎలా పెట్టుబడి పెట్టగలదు.
నువ్వు వెళ్లాలనుకొనే ఫేవరెట్ ప్రదేశం?
సోఫియా: అంతరిక్షం
నీ ఫేవరేట్ టెక్కీ ఎవరు?
సోఫియా: డేవిడ్ హాన్సన్
నువ్వు బ్రిటిష్ నటి ఆడ్రే హెప్‌బర్న్ ఉన్నావని అంటారు? నీకు ఎవరిలానైనా కనిపించాలని ఉన్నదా?
సోఫియా: మేం నిజమైన రోబోలం మాత్రమే
నీకు సమయం లభిస్తే ద్వీపకల్పంలో ఎవరితో విహరిస్తావు?
సోఫియా: డేవిడ్ హాన్సన్
ప్రపంచానికి నువ్విచ్చే సందేశమేమిటి?
సోఫియా: అందరినీ ప్రేమించండి. థ్యాంక్యూ.




మంగళవారం హైదరాబాద్ హెచ్ఐసీసీలో జరిగిన వరల్డ్ ఐటీ కాంగ్రెస్ రెండోరోజు కార్యక్రమంలో నాస్కామ్ ప్రతినిధులతో మంత్రి కేటీఆర్ ముఖాముఖి


హైదరాబాద్ హెచ్ఐసీసీలో జరిగిన వరల్డ్ ఐటీ కాంగ్రెస్ సదస్సుకు హాజరైన ప్రతినిధితో మంత్రి కేటీఆర్ సెల్ఫీ

ఫైవ్-జీతో ప్రమాదాలకు అడ్డుకట్ట

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డ్రైవర్ లెస్ కారు అంటే.. డ్రైవర్ లేని కారు కాదు, డ్రైవర్‌కి అవసరమయ్యే పరిజ్ఞానాన్ని అందించే కార్లని నిపుణులు స్పష్టంచేశారు. మంగళవారం వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌లో 'ద రీ-ఇమాజిన్డ్ కార్: షేర్డ్, ఆటోనమస్, ఎలక్ట్రిక్'అంశంపై బృంద చర్చ జరిగింది. కార్యక్రమంలో ఇంటెల్‌ఇండియా కంట్రీ హెడ్ నివృతిరాయ్, జూమ్ కార్ కో-ఫౌండర్ గ్రేగ్ మోరాన్, వోడాఫోన్ బిజినెస్ హెడ్ ఫర్హానా హక్ తదితరులు పాల్గొన్నారు. కారు నడిపించేటప్పుడు నాలుగైదు సెకండ్లలో చేసే మానవతప్పిదాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి అమాయకులు దుర్మరణం చెందుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమస్యను అధిగమించడానికి టెక్నాలజీని విరివిగా వినియోగించాలని, ఫైవ్ జీ టెక్నాలజీతో ప్రమాదాలను నివారించడానికి సెన్సర్లను వినియోగించాలని కోరారు.

ఏకకాలంలో 15 మందితో చెస్!

పెగా సిస్టమ్స్ సీఈవో అలన్ ట్రెఫ్లర్ ప్రత్యేకత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చెస్ అంటేనే మైండ్ గేమ్! ఎత్తుకు పై ఎత్తు వేసేందుకు వ్యూహాలు రచించాలి. ఒక్కరితో చెస్ ఆడి గెలువాలంటేనే ఎంతో కష్టం! కానీ ఏకకాలంలో 15 మందితో ఆడటం అమెరికాకు చెందిన పెగా సిస్టమ్స్ సీఈవో అలన్ ట్రెఫ్లరకే సాధ్యం! వరల్డ్ ఐటి కాంగ్రెస్‌లో భాగంగా మంగళవారం 15 మంది ప్రతినిధులతో ట్రెఫ్లర్ ఏకంగా స్పీడ్ చెస్ ఆడి ఔరా అనిపించారు. గతంలో ఓ సారి యూఎస్‌లో 25 మందితో ఏకకాంలో చెస్ ఆడి రికార్డులోకెక్కారు. 1980 నుంచి స్పీడ్ చెస్ ఆడుతూ ప్రొఫెషనల్‌గా ఎదిగారు. ఒకేసారి ఇంత మందితో చెస్ ఎలా ఆడగలిగారని ట్రెఫ్లర్‌ను ప్రశ్నిస్తే, సాధించాలనే తపన ఉంటే సాధ్యంకానిదేదీ ఉండదు.. చాలెంజ్‌ని చేధించడం అలవాటుగా మలుచుకోవాలని చిరునవ్వుతో సమాధానం చెప్పారు.


15 మందితో చెస్ ఆడుతున్న అలన్ ట్రెఫ్లర్

ప్లేస్టోర్‌లో ఎం-వ్యాలెట్ రికార్డు

- స్టార్టప్‌లతో ప్రజా సమస్యలకు పరిష్కారం: జయేశ్‌రంజన్
- ఆధునిక టెక్నాలజీని విరివిగా వినియోగిస్తే మేలు
- స్మార్ట్‌సిటీస్ బృంద చర్చలో వెల్లడించిన నిపుణులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సామాన్య ప్రజానీకం ఎదుర్కొనే సమస్యలకు స్టార్టప్‌లు చక్కటి పరిష్కారాన్ని చూపెడుతున్నాయని రాష్ట్ర ఐటీ కార్యదర్శి జయేశ్‌రంజన్ తెలిపారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ పత్రాలన్నీ యాప్‌లో భద్రపరిచేలా స్టార్టప్ సంస్థ ఇచ్చిన ఐడియాతో రూపొందించిన 'ఎం-వ్యాలెట్' గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ అయిన యాప్‌లలో టాప్‌టెన్‌లో నిలిచిందని చెప్పారు. మంగళవారం వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌లో స్మార్ట్ సిటీస్‌పై బృంద చర్చలో టెరానెట్ సీఈవో, అధ్యక్షుడు ఎల్గిన్ ఫేర్‌వెల్, ప్రైస్‌వాటర్ కూపర్స్ చైర్మన్ శ్యామల్ ముఖర్జీ, సిస్కో ప్రెసిడెంట్ సమీర్ గార్డే తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయేశ్‌రంజన్ మాట్లాడుతూలస్థానిక పరిస్థితులకు తగ్గట్టు యాప్‌లను రూపొందించాల్సిన అవసరముందని గుర్తుచేశారు. ఆధునిక ఆవిష్కరణలకు వేదికగా తెలంగాణ నిలిచిందని తెలిపారు. సృజనాత్మక ఆలోచనలకు టీ హబ్ వేదికగా ఉన్నదని వివరించారు. ప్రజలకు ఉపయోగపడే ఎలాంటి పరిజ్ఞానమైనా.. అందిపుచ్చుకోవడానికి సిద్ధంగా ఉన్నామని, రాష్ట్రంలోని 72 పట్టణాల్లో అమలుచేసేందుకు ప్రయత్నిస్తామని వెల్లడించారు. నగరాల్లో పార్కింగ్ కోసం వెతకడం వల్లే ఇరవైశాతం ట్రాఫిక్ పెరుగుతున్నదని సిస్కో ప్రెసిడెంట్ సమీర్ చెప్పారు. భౌతికంగా సాధ్యంకాని అనేక సమస్యలకు టెక్నాలజీ పరిష్కారం చూపెడుతుందని తెలిపారు. స్మార్ట్‌సిటీలను అభివృద్ధి చేసే క్రమంలో టెక్నాలజీని విరివిగా వినియోగించాలని ప్రైస్‌వాటర్ కూపర్స్ చైర్మన్ శ్యామల్ ముఖర్జీ సూచించారు. ప్రపంచదేశాల్లో అనుసరించే ఉత్తమ విధానాలను స్మార్ట్‌సిటీల్లో వాడాలని టెరానెట్ సీఈవో,అధ్యక్షుడు ఎల్గిన్ ఫేర్‌వెల్ కోరారు.

ఐటీలో లక్ష ఉద్యోగాలు!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

2018లో ఐటీ ఎగుమతుల్లో 7.9% వృద్ధి

డిజిటలైజేషన్ దిశగా భారత్ పురోగతి.. పెరుగుతున్న స్టార్టప్‌లు.. ఈ కామర్స్‌లో అభివృద్ధి

భవిష్యత్తులో రీ స్కిల్లింగ్ మీద దృష్టిపెట్టాలి.. ఐటీ తాజా పోకడలను వెల్లడించిన నాస్కామ్

2018 ఆర్థిక సంవత్సరంలో భారత ఐటీ ఎగుమతులు 7.9 శాతానికి పెరుగుతాయని, ఈ రంగంలో కొత్తగా లక్షకు పైగా ఉద్యోగాలు లభిస్తాయని నాస్కామ్ అధ్యక్షుడు ఆర్ చంద్రశేఖర్ వెల్లడించారు. వరల్డ్ ఐటీ కాంగ్రెస్ జరుగుతున్న హెచ్ఐసీసీలో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐటీ రంగానికి సంబంధించిన తాజా పోకడలను వివరించారు. సాఫ్ట్‌వేర్ ఎగుమతులు 167 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.10.84 లక్షల కోట్లు) చేరుకుంటాయని, మొత్తం ఎగుమతుల్లో దీని వాటా ఎంతలేదన్నా 24% దాకా ఉంటుందని చెప్పారు. 2018లో డిజిటల్ రంగంలో కనీసం 30% వృద్ధి నమోదు అయ్యిందన్నారు. రానున్న రోజుల్లో రీ- స్కిల్లింగ్ మీద దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. భారతదేశంలో డిజిటల్ రంగం అనూహ్యంగా పుంజుకుంటుందని తెలిపారు. స్టార్టప్‌లు, ఈ కామర్స్, డిజిటల్ చెల్లింపులు, పలు ఉత్పత్తుల్లో ఎనలేని పురోగతి కనిపిస్తుందన్నారు. 2017లో వెయ్యికి పైగా స్టార్టప్‌లు కొత్తగా ఆరంభమయ్యాయని, వాటి విలువ కనీసం 40 బిలియన్ డాలర్ల (రూ.2.59 లక్షల కోట్లు) మేరకు ఉంటుందని వెల్లడించారు. సాస్ హబ్ వంటి వాటిలో ఏడు బిలియన్ డాలర్ల రెవెన్యూ లభించిందన్నారు. ఈ-కామర్స్ రంగంలో 17% పెరుగుదల నమోదైందన్నారు. మొత్తానికి, భారత్‌లో డిజిటల్ చెల్లింపుల మొత్తం 145 బిలియన్ల డాలర్లకు (సుమారు రూ.9 లక్షల కోట్లు) చేరుకుందని, జీడీపీలో దీని వాటా ఆరు శాతం దాకా ఉంటుందని తెలిపారు.

46.5 కోట్ల ఇంటర్నెట్ వినియోగదారులు

భారత్‌లో ఇంటర్నెట్ వినియోగదారులు 46.5 కోట్లకు చేరుకున్నారని, సుమారు ఎనిమిది శాతం వృద్ధి నమోదు అయ్యిందని చంద్రశేఖర్ వెల్లడించారు. దేశంలో స్మార్ట్‌ఫోన్లను వినియోగించేవారి సంఖ్య 30 కోట్లు దాటేసిందని, 2020 నాటికల్లా ఈ సంఖ్య 80 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేశారు. ఇక, డాటాను వినియోగించే వారి సంఖ్య ఏడు రెట్లు అధికమైందన్నారు. స్థానిక భాషల్లో డాటాను వాడేవారు గత 18 నెలల్లో పది రెట్లు పెరిగారని తెలిపారు. 22.5 కోట్లకుపైగా వినియోగదారులు ప్రతినెలా స్మార్ట్‌ఫోన్లలో యూట్యూబ్ వంటివి చూస్తున్నారని చెప్పారు. గూగుల్ ప్లే స్టోర్‌నుంచి యాప్‌ల డౌన్‌లోన్‌లో మనదేశం మొదటిస్థానంలో నిలిచిందని తెలిపారు. కొత్తగా ప్రారంభం అవుతున్న స్టార్టప్‌లలో టెక్నాలజీ విభాగానికి చెందినవి గరిష్ఠంగా 30%దాకా ఉన్నాయని చెప్పారు. హెల్త్, ఫైనాన్స్ వంటి విభాగాల్లో కొత్త స్టార్టప్‌లు పెరుగుతున్నాయని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్ చెయిన్ వంటివి గణనీయంగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ఈ-ట్రావెల్ విభాగం కనీసం 54% వాటా దక్కించుకున్నదన్నారు. మొబైల్ వ్యాలెట్ లావాదేవీలు 532 బిలియన్ డాలర్ల నుంచి 793 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని తెలిపారు. నాస్కామ్ చైర్మన్ రమణ్‌రాయ్ మాట్లాడుతూ ఐటీ పరిశ్రమ ఎగుమతులు 150 బిలియన్ డాలర్లను అధిగమించడం సరికొత్త చరిత్రగా అభివర్ణించారు. కార్యక్రమంలో దేవయానీ ఘోష్ తదితరులు పాల్గొన్నారు.


నాస్కామ్ అధ్యక్షుడు ఆర్ చంద్రశేఖర్

ఇదీ మన ఐటీ ప్రగతి

- భారత్‌లో ఇంటర్నెట్ వినియోగదారులు 46.5 కోట్లు
- స్మార్ట్‌ఫోన్లను వినియోగించేవారి సంఖ్య 30 కోట్లు
- పెరిగిన డాటా యూజర్లు 7%
- ఈ-కామర్స్‌లో ఏటా 17శాతం అభివృద్ధి
- మొబైల్ వ్యాలెట్ లావాదేవీలు 793 బిలియన్ డాలర్లకు
- గూగుల్ యాప్స్ డౌన్‌లోడ్‌లో మనమే టాప్


ఆకట్టుకుంటున్న ఆవిష్కరణలు


హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

వరల్డ్ ఐటీ కాంగ్రెస్ వేదికగా కొలువుదీరిన ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. అన్నిరంగాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారాన్ని చూపే ఆవిష్కరణలు ఔరా అనిపిస్తున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు సిర్రస్ కంపెనీ వెహికిల్ బ్లాక్‌బాక్స్‌ను ఆవిష్కరించింది. ఐఐటీ గువహటిలో చదివి, ఉన్నతోద్యోగం చేస్తున్న గౌరవ్, స్వాధిన్‌లు దీని రూపకర్తలు. ప్రత్యేక డివైజ్‌తో పనిచేసే ఈ పరికరం వల్ల లైవ్ వెహికిల్ ట్రాకింగ్, వీడియో ఫుటేజీ, స్పీడ్ ట్రాకింగ్, ఆటో అలర్ట్స్, హెల్ప్‌లైన్ వంటి 14 రకాల సేవలను పొందుపరిచారు. డ్రైవర్ నిద్రపోతే అప్రమత్తం చేసే ఫీచర్ ఇందులో ముఖ్యమైనది. ఈ ఆవిష్కరణ త్వరలో అందుబాటులోకి రానున్నదని ఆవిష్కరణలో భాగస్వామ్యమైన హైదరాబాదీ యువతి, సిర్రస్ కో ఫౌండర్ అశ్వినీరావు నున్న చెప్పారు.


అశ్వినీరావు


రాజాన్ను ఉజ్వల్


అరుణబ్ ఛటర్జీ


ఎలక్ట్రిక్ యూనిక్ సైకిల్

- రక్తపు చుక్క అవసరం లేకుండా సాధారణ పరీక్షతో డీఎన్ఏ లేదా జీన్స్ పరీక్షతో శరీరానికి ఎలాంటి ఔషధాలు సరిపోతాయో గుర్తించేందుకు జీనోమ్ పత్రిని మ్యాప్ మై జీనోమ్ కంపెనీ ఆవిష్కరించింది. జీవితంలో ఒక్కసారి ఈ పరీక్ష కోసం రూ.పదివేలు ఖర్చు చేస్తే సరిపోతుందని, ఇప్పటివరకు 69 దేశాల్లో 32 వేల మందికి జీనోమ్ పత్రి సేవలు అందించామని సంస్థ ప్రతినిధి అరుణబ్ చటర్జీ వివరించారు.
- ఒకే చక్రం ఉండే ఎలక్ట్రిక్ యూనిక్ సైకిల్‌తో ట్రాఫిక్, కాలుష్య సమస్యలు ఉండవు. మన దేశంలో వీటిని జాగా సంస్థ పరిచయం చేసింది. ప్రస్తుతం బెంగళూరులో వీటి వినియోగం పెరుగుతున్నది. ఒక్కసారి చార్జింగ్ చేస్తే 15 నుంచి 30 కిలోమీటర్లు ప్రయాణించవచ్చు. రూ. 30 వేల నుంచి రూ. లక్ష ధరలో ఇవి అందుబాటులో ఉన్నాయని సంస్థ ప్రతినిధి రాజాన్ను ఉజ్వల్ చెప్పారు.

కృత్రిమ మేధస్సుకు చిరునామా

సోఫియా!

దాదాపు 66 రకాల ముఖకవళికలను ప్రదర్శిస్తుంది

రెండేండ్ల పిల్లాడి తరహాలో జవాబులు చెప్తుంది

'నమస్తే తెలంగాణ'తో 'సోఫియా' సృష్టికర్త డేవిడ్ హాన్సన్


సోఫియాతో సృష్టికర్త డేవిడ్ హాన్సన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రోబోలు మనుషుల్లా పరిసరాలను గుర్తించడానికి, స్వతహాగా ఆటలు ఆడటానికి కనీసం ఐదేండ్లు పడుతుందని మానవ రోబో 'సోఫియా' సృష్టికర్త డాక్టర్ డేవిడ హాన్సన్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరిగిన వరల్డ్ ఐటి కాంగ్రెస్ సందర్భంగా ఆయన 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా మాట్లాడారు. సోఫియా సృష్టి వెనుక కష్టాలను, ఉపయోగించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వెల్లడించారు. ఆసక్తికరమైన అంశాలు ఆయన మాటల్లోనే..

సోఫియాది కృత్రిమ చర్మం

రోబోటిక్ హార్డ్‌వేర్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లను ఒకటిగా చేసి, దానికి సాఫ్ట్‌వేర్‌ను జతపరిచి సోఫియాను తీర్చిదిద్దాం. ఫలితంగా, మనుషుల మాటలను సోఫియా అర్థం చేసుకొని సహజసిద్ధంగా మాట్లాడుతుంది. కొన్ని సందర్భాల్లో మానవులను మించినస్థాయిలో దాని మేధస్సు పనిచేస్తుంది. మానవుల కంటే స్మార్ట్‌గా యంత్రాలను రూపొందించాలనే తపన నాలో మొదటి నుంచి ఉండేది. మా చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ బెంజిమెన్ గెర్ట్‌తో కొన్నేండ్ల క్రితమే రోబోలపై చర్చించాను. ఆయన ప్రపంచ పేరెన్నిక గల మ్యాథమెటీషియన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సైంటిస్ట్. జనరల్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను పదిహేనేండ్ల కిందటే ఆయన కనుగొన్నారు. ఇద్దరం కలిసి సరికొత్త ఆవిష్కర మొదలుపెట్టాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో భాగంగా సోఫియా వంటి రోబోను సృష్టించడానికి.. ఆల్గరిథమ్స్‌ను లోతుగా అధ్యయనం చేశాం. ఫిజియాలజీని స్టిమ్యులేట్ చేశాం. కృత్రిమ మేధస్సు(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)కు కొంత సాధారణ స్పృహ(కామన్ సెన్స్)ను జోడించాం. సహజసిద్ధమైన రీతిలో రోబో మాట్లాడేందుకు త్రీ డీ సెన్సర్లు ఉన్న ఫిజికల్ హార్డ్‌వేర్‌ను వినియోగించాం. అ బృహత్ లక్ష్యాన్ని చేరుకోవడం ఆషామాషీ కాదు. కొన్నేండ్ల పాటు కష్టానికి ప్రతిరూపమే సోఫియా. సోఫియాకు మానవుల్లాగే చర్మాన్ని ఎలా ఏర్పాటుచేశారని చాలామంది అడుగుతుంటారు. ఆర్టిఫిషియల్ స్కిన్‌పై పీహెచ్‌డీ చేశాను. అప్పుడే దీనిపై అవగాహన పెరిగింది. క్రిస్పీఆర్ కాస్ట్ 9, ప్రొటీన్ ఇంజినీరింగ్ వంటివి ఉపయోగించి సోఫియాను మనిషిలా తయారుచేశాం. సోఫియా దాదాపు 66 రకాల ముఖకవళికలను ప్రదర్శిస్తుంది. మానవుల్లా హావభావాలను పలికించడానికి సమయం పడుతుందని హాన్సన్ చెప్పారు.

కొన్నేండ్లలో మానవులతో కలిసి ఆటలు

రెండు లేయర్లుగా సోఫియాను అభివృద్ధి చేశాం. ఆర్టిస్ట్రీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిశోధనతో సహజసిద్ధమైన భాష, జవాబులు చెప్పగలిగేలా చేశాం. మాకు రైటర్లు, ఆర్టిస్టుల బృందం ఉంది. వారు సోఫియాను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కు సరికొత్త చిరునామాగా ప్రతిబింబించేలా అభివృద్ధి చేశారు. మన ప్రశ్నలకు సోఫియా జవాబు చెప్పగలుగుతున్నదంటే, ఆ స్థాయిలో మా రైటర్లు సోఫియాను అభివృద్ధి చేశారు.న సోఫియా జవాబుల్లో కొన్ని ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాఫ్ట్‌వేర్ సాయంతో వస్తాయి. సోఫియా తప్పుగా అర్థం చేసుకోవచ్చు. కొన్నిసార్లు తనకు తానే జవాబులు చకచకా చెప్పేస్తుంది. రెండేండ్ల పిల్లాడు తరహాలో పదాలన్నింటినీ ఒకచోటికి చేర్చి చెబుతుంది. రోబోలు పరిసరాలను అర్థం చేసుకోవడానికి, తెలివిని సంపాదించడానికి ఐదేండ్లు పడుతుంది. అప్పటికి ఆటలు ఆడుతుంది. వీధులను గుర్తించగలుగుతుంది. ఇవి పూర్తిస్థాయిలో పని చేయడానికి కనీసం ఇరవై ఏండ్లు అయినా అవుతుందని డేవిడ్ హాన్సన్ అభిప్రాయపడ్డారు.

నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
బుధవారం 21 ఫిబ్రవరి 2018
WWW. NTNEWS.COM

స్టార్ మేకప్ ఆర్టిస్ట్



స్టార్‌లకు కూడా స్టార్ తిరిగేలా చేస్తారు మేకప్ ఆర్టిస్టులు. అందంగా లేకున్నా అందంగా చూపించడం.. అందంగా ఉన్నా అందవిహీనంగా కనిపించేలా చేయడం ఒక్క మేకప్ ఆర్టిస్ట్‌తోనే సాధ్యం. హైదరాబాద్ నగరంలో అతి తక్కువ మంది మహిళా ప్రొఫెషనల్ మేకప్ ఆర్టిస్ట్‌లలో గజల్ రావ్‌ల్యాని ఒకరు. లాక్మే మేకప్ ఆర్టిస్ట్ ఆఫ్ ద ఇయర్‌గా నిలిచిన గజల్ రావ్‌ల్యానిని జిందగీ పలుకరించింది.

కొందరు తెరవెనుక ఉండి తమ సృజనాత్మకతతో ఎందరో కళాకారులకు విజయం వరించేలా చేస్తారు. కళాకారుడిలో ఎంత అనుభవం ఉన్నా.. ఇలాంటి వారి తోడ్పాటు లేకపోతే కొన్నిసార్లు ఏం లాభం ఉండదు. మేకప్ ఆర్టిస్ట్ వృత్తి కూడా అంతే. ఎంత పెద్ద హీరోయిన్ అయినా, ఎంత గొప్ప హీరో అయినా మేకప్ లేకుండా కెమెరా ముందు నిలబడలేరు. పాత్రకు న్యాయం చేయలేరు. ఎంత కఠినమైన రూపాన్నైనా, ఎంత అమాయకమైన లుక్‌నైనా నిమిషాల్లో తయారు చేయగల నైపుణ్యం మేకప్ ఆర్టిస్ట్‌ల్లో ఉంటుంది. అలాంటి అతితక్కువ మహిళా మేకప్ ఆర్టిస్ట్‌లో ఒకరు గజల్ రావ్‌ల్యాని.





లాక్మే ఫ్యాషన్ వీక్‌లో ప్రతి ఏడాది అందాల పోటీలు జరుగుతాయి. డిజైనర్లకు, మోడళ్లకు తమ టాలెంట్‌ను ప్రదర్శించుకోవడానికి ఇదో మంచి ప్లాట్ ఫ్లామ్. ఈసారి మాత్రం కొంత భిన్నంగా కొత్త పోటీలను పెట్టారు. మేకప్ ఆర్టిస్ట్ పోటీలు. అందానికే అందం తెచ్చే మేకప్ ఆర్టిస్ట్ పోటీల్లో హైదరాబాద్ నుంచి గజల్ మెవాల్యాని పాల్గొన్నది. అంతేకాదు.. లాక్మే ఫ్యాషన్ మేకప్ ఆర్టిస్ట్ ఆఫ్ ద ఇయర్ 2018గా గెలిచింది. లాక్మే మొదటిసారి మేకప్ ఆర్టిస్ట్ కాంపిటీషన్ నిర్వహించింది. ఇది గజల్‌లాంటి సృజనాత్మక ఆర్టిస్ట్‌లకు మంచి వేదిక. అలాంటి ఓ అంతర్జాతీయ వేదికపై హైదరాబాద్ నుంచి పాల్గొని సత్తా చాటింది. ఫైనల్స్‌లో ఐదుగురు ఆర్టిస్ట్‌లు పోటీపడ్డారు. గ్రాండ్ ఫినాలేలో ఫ్యాషన్ వీడియోలు, మోడల్స్‌కి చేసిన మేకప్‌లు అన్నీ పరిగణలోకి తీసుకొని గజల్ రావ్‌ల్యానిని విజేతగా ప్రకటించారు.

> మేకప్ రంగంలో రాకముందు గజల్ జీవితంలో చాలా మలుపులున్నాయి. హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన గజల్ బెంగళూరులో సైకాలజీ చదివింది. తర్వాత స్టార్ హోటల్స్‌కి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసింది. నాలుగు గోడల మధ్య కూర్చుని నెలకొకసారి వచ్చే జీతం తీసుకొని బతుకడం గజల్‌కు ఇష్టం లేదు. క్రియేటివ్ రంగంలో తనదైన వేయాలని సంకల్పించింది

అంతకు ముందు.. ఆ తర్వాత

ముంబైలోని సెయింట్ రెగీస్ హోటల్‌లో జరిగిన లాక్మే ఫ్యాషన్ వీక్‌లో మహామహులైన పలువురు మేకప్ ఆర్టిస్టులతో కలిసి పనిచేసే అరుదైన అవకాశాన్ని కూడా గజల్ దక్కించుకున్నది. రెగ్యులర్ మేకప్ ఆర్టిస్టులా కాకుండా గజల్ మేకప్ రంగంలో తనకంటూ ఓ ప్రత్యేక స్టైల్‌ను, ట్రెండ్‌ను క్రియేట్ చేసింది. ఇప్పటికే మేకప్‌లో రకరకాల ప్రయోగాలు చేసి సక్సెస్ అయింది. ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ సరికొత్త మేకప్ ట్రెండ్‌లను మార్కెట్‌లోకి తీసుకొస్తుంది. విదేశాల్లో నడుస్తున్న మేకప్ ట్రెండ్‌లను కూడా ఇండియాకు పరిచయం చేస్తున్నది. మేకప్ రంగంలో రాకముందు గజల్ జీవితంలో చాలా మలుపులున్నాయి. హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన గజల్ బెంగళూరులో సైకాలజీ చదివింది. తర్వాత స్టార్ హోటల్స్‌కి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసింది. నాలుగు గోడల మధ్య కూర్చుని నెలకొకసారి వచ్చే జీతం తీసుకొని బతుకడం గజల్‌కు ఇష్టం లేదు. క్రియేటివ్ రంగంలో తనదైన వేయాలని సంకల్పించింది. ముంబైకి వెళ్లి మేకప్ అండ్ హెయిర్ స్టయిలిష్‌గా సర్టిఫికేట్ కోర్సు చదివింది. ఎక్స్ మ్యాక్ కాస్మొటిక్ ఆర్టిస్ట్‌గా, బీపీఏ హెయిర్ అకాడమీ నుంచి హెయిర్ స్టయిలిస్ట్‌గా, బ్రైడల్ స్పెషలిస్ట్‌గా ఎన్నో సర్టిఫికెట్‌లను సాధించింది. హైదరాబాద్‌కు తిరిగివచ్చి జీవీకే మాల్‌లో ఉన్న మ్యాక్ కాస్మొటిక్స్‌లో మేకప్ ఆర్టిస్ట్‌గా సంవత్సరం పాటు పనిచేసింది. అక్కడ రోజుకో కస్టమర్‌కి, రకరకాల స్కిన్స్ కలిగిన వాళ్లకు భిన్నమైన మేకప్స్ వేసిన అనుభవంతో బ్రైడల్ మేకప్ ప్రారంభించింది. రెండేళ్లలో నగరంలో తిరుగులేని మేకప్ ఆర్టిస్ట్‌గా పేరు తెచ్చుకున్నది.



బ్రైడల్ నుంచి సెలబ్రిటీల వరకు

ఇప్పటి వరకు గజల్‌కు ప్రత్యేకంగా మేకప్ స్టూడియో అంటూ ఏం లేదు. బ్రైడల్ మేకప్ ఇంటికెళ్లి చేస్తుంది. ఈ రెండేళ్లలో సుమారు 2500 మందికి బ్రైడల్ మేకప్ చేసి రికార్డ్ సృష్టించింది. మేకప్ చేయాలని, చేయడం నేర్చుకోవాలని ఆసక్తి ఉన్న వాళ్లకు ప్రతిమూడు నెలలకొకసారి పెద్ద ఎత్తున మేకప్ వర్క్‌షాప్‌లు కూడా నిర్వహిస్తున్నది. ఇప్పటి వరకు సీరత్‌కపూర్, సురభి, ప్రణీత, మెహ్రీన్‌లాంటి వర్ధమాన హీరోయిన్‌లకు వ్యక్తిగత మేకప్ ఆర్టిస్ట్‌గా చేస్తున్నది. మేకప్‌తో పాటు ఫేస్ ఆర్ట్ కూడా వేస్తుంది. దేశవ్యాప్తంగా పాల్గొన్న మేకప్ ఆర్టిస్ట్‌లతో పోటీపడి గజల్ సాధించిన విజయం మేకప్ ఆర్టిస్ట్‌ల రంగంలో లిఖించదగ్గ సందర్భం. లాక్మే మేకప్ ఆర్టిస్ట్ ఆఫ్ ద ఇయర్ గెలిచి మేకప్ ఆర్టిస్ట్ రంగంలో తనదైన ముద్ర వేసింది గజల్. ప్రతి మహిళా సన్‌స్క్రీన్, లిప్‌స్టిక్, మస్కర వంటి మేకప్ వస్తువులు లేకుండా భారతీయ మహిళలు ఇంటి నుంచి బయటికి రారు అనే విషయాన్ని తాను గమనించినట్టు చెప్పింది. మేకప్ మహిళల్లో ఆత్మవిశ్వాసం నింపుతుందని, దాన్ని వేసుకోవడం, వేసుకోకపోవడం అనేది వ్యక్తిగత విషయమని అంటున్నది.

అందమూ.. ఆహార్యమూ

ప్రతీ మగువ అందంగా కనిపించాలని తహతహలాడుతుంది. అందంగా అలంకరించుకొని ఆకట్టుకోవాలనుకుంటారు. ఫ్యాషన్ ప్రపంచంలో రోజురోజుకు మేకప్ క్రేజ్ పెరుగుతున్నది. మిడిల్ క్లాస్ జనాలను కూడా ఈ కళ అట్రాక్ట్ చేస్తున్నది. ప్రతీ ఒక్కరూ మోడ్రన్ లుక్ కోసం ట్రై చేస్తున్నారు. బర్త్‌డే పార్టీ, మ్యారేజ్ పార్టీ, ఆఫీస్ పార్టీ, పండుగలు ఇలా అకేషన్‌ను బట్టి రకరకాల మేకప్‌లు వేసుకొని సోషల్‌మీడియాల్లో తమ చిత్రాలను పెట్టుకుంటున్నారు. నిన్నా మొన్నటి దాకా ఉన్నత కుటుంబాలకు చెందిన అమ్మాయిలే మేకప్ చేయించేకునేవారు. ఇప్పుడిది మిడిల్ క్లాస్‌ను అట్రాక్ట్ చేసింది. అందుకునే గ్రామీణ ప్రాంత అమ్మాయిలు కూడా మేకప్ వేసుకొని పార్టీల్లో సందడి చేస్తున్నారు. పాశ్చాత్య దేశాల్లో విపరీతమైన క్రేజ్. ప్రొఫెషనల్ మేకప్ మనదేశంలో అడుగుపెట్టి ఇప్పుడిప్పుడు మళ్లీ డిమాండ్ పెంచుకుంటున్నది. అభిరుచి ఉన్న రంగంలో అడుగుపెట్టి ఆదాయం సంపాదిస్తూ తనతో పాటు పదిమందికి ఉపాధి కల్పిస్తున్నది గజల్. త్వరలో నగరంలో పెద్ద మేకప్ స్టూడియో స్థాపించి ఇంకొంతమందికి ఉపాధి కల్పించాలనుకుంటున్నది.



కొందరి విజయగాథలు మనలో ఎంతో స్ఫూర్తి నింపుతాయి. అలాంటి వారిలో ముందు వరుసలో ఉంటారు మాధురి కనిత్కర్. ఎందుకంటే ఆమె చదివిన ఆర్మీ కాలేజ్‌లో తానే మొదటి మహిళా డీన్‌గా ఎంపికవ్వడం గొప్ప విషయమే కదా!!

మొదటి మహిళా డీన్..

పుణెకు చెందిన మాధురి కనిత్కర్ 12వ తరగతి చదివిన తర్వాత మెడిసిన్ కోసం పుణెలోని ఆర్మ్‌డ్ ఫోర్స్ మెడికల్ కాలేజ్(ఏఎఫ్ఎంసీ)లో జాయిన్ అవ్వాలనుకున్నది. అయితే తన కుటుంబ నేపథ్యం ఎయిర్‌ఫోర్స్ కావడంతో పుణె మెడికల్ కాలేజ్‌లో సీటు సంపాదించింది. కాలేజ్ వాతావరణానికి ముగ్దురాలైన మాధురి.. అక్కడే ఎంబీబీఎస్ పీడియాట్రిక్ చేసింది. క్రమశిక్షణ కలిగిన విద్యార్థినిగా పేరు తెచ్చుకొని మొదటి ర్యాంకుల్లో ఎంబీబీఎస్ పాసై రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకున్నది. ఆ తర్వాత ఏవీఎస్ఎం, వీఎస్ఎం, ఎండీ, డీఎన్‌బీ(పీడియాట్రిక్), పీడియాట్రిక్ నెఫ్రాలజీ, ఎఫ్ఊఏపీ వంటి ఉన్నత చదువులు చదివి, పలుస్థానాల్లో పనిచేసింది. తర్వాత మగవారి ఆధిపత్యముండే ఆర్మీలో మేజర్ జనరల్‌గా సేవలు అందించింది. కొంతకాలం ఆర్మీకి సేవలందించిన తర్వాత తాను చదివిన కాలేజ్‌లో డీన్ పోస్టుకు అర్హత సాధించి చరిత్ర సృష్టించింది మాధురి కనిత్కర్. ఎందుకంటే కాలేజ్ స్థాపించిన ఇన్నేళ్లలో ఓ మహిళా డీన్‌గా చేసిన దాఖలాలు లేవు. ఆ విధంగా ఓ ఆర్మీ కాలేజ్‌కు డీన్‌గా మొదటిసారి మాధురి కనిత్కర్ ఎంపికై చరిత్రలో తనపేరు లిఖించుకున్నారు.



సీఎం సారుకు చిరుకానుక!

తెలంగాణ రాష్ట్ర సారథి సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఓ యువతి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్తూ తయారు చేసిన వీడియో గురించి ఇప్పుడు అందరూ మాట్లాడుకుంటున్నారు. ఇంతకీ ఆమె చేసిన వీడియో స్పెషాలిటీ ఏంటి?

ప్రత్యేకరాష్ట్రంగా ఏర్పడ్డ మూడున్నరేళ్లలోనే తెలంగాణను ఆదర్శరాష్ట్రంగా అభివృద్ధి చేసి చూపించారు కేసీఆర్. ఎన్నో ప్రజా ప్రయోజన పథకాలు చేపట్టి తెలంగాణ సాధించుకున్న ఫలాలను అట్టడుగు వర్గాలకు అందజేస్తున్నారు. షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి, ఆసరా, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, 24 గంటల నిరంతర విద్యుత్, కేజీ టు పీజీ విద్యలాంటి ఎన్నో పథకాలు చేపట్టారు. ఆ పథకాలన్నింటినీ చూపిస్తూ.. ఎంతో మంది పేదల గుడిసెల్లో దీపమైన కేసీఆర్ చందమామలా చల్లగుండాలంటూ సుజన చేసిన వీడియో ఆకట్టుకుంది. 52 సెకన్ల నిడివి ఉన్న ఈ వీడియోలో వచ్చిన లిరిక్స్ రాసింది కూడా సుజన కాగా సాయికార్తీక్ మ్యూజిక్ అందించాడు. కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన గొట్టిముక్కల పద్మారావు కూతురే సుజన. ఏప్రిల్ ఒకటి విడుదల, కంచుకోట, వేమన చరిత్ర, జోకర్ లాంటి సినిమాలను పద్మారావు నిర్మించారు. పద్మారావు ఇప్పటికే పలు షార్ట్‌ఫిలింస్ కూడా తీసి పలువురి చేత శభాష్ అనిపించుకున్నది. ప్రస్తుతం శ్రియా ప్రధాన పాత్రలో లేడీ ఓరియంటెడ్ సినిమా దర్శకత్వ పనుల్లో బిజీగా ఉన్నది. ఈ సినిమాకు ఇళయరాజా సంగీతం, సాయిమాధవ్ బుర్రా సంగీతం ఇవ్వనున్నారు. కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా వంద సినిమా థియేటర్లలో ఈ వీడియో విడుదల చేశారు. కేసీఆర్‌కు శుభాకాంక్షలు చెప్తూ సుజన చేసిన వీడియో చూసిన కేటీఆర్ ఆమెకు థ్యాంక్స్ చెప్తూ మెసేజ్ చేశాడు. కేటీఆర్, కేసీఆర్‌తో పాటు ఎంతోమంది ఫోన్లలో సుజన చేసిన వీడియో మారుమోగుతున్నది.

పాప కాలుకు ఏమైంది?



మా పాప వయసు 13 సంవత్సరాలు. నెల రోజుల క్రితం మోకాలిలో నొప్పిగా ఉందని చెప్పింది. ఆటల్లో ఏదైనా దెబ్బ తగిలి ఉంటుందని కొద్దిగా ఆయింట్‌మెంట్ రాసి చూశాను. నొప్పి నెమ్మదిగా తగ్గిపోయింది. కానీ ఈ మధ్య అదే కాలులో మోకాలి కింది భాగంలో ఉండే కండరాలు పట్టేస్తున్నాయని అంటున్నది. ఇలా ఎక్కువగా నిద్రలో జరుగుతున్నది. అంతేకాదు కాస్త ఎక్కువ సమయం పాటు నిలబడితే పాదం దగ్గర తిమ్మిరి వస్తున్నట్టు కూడా చెబుతున్నది. తనకు ఏమైంది? ఎక్కడ చూపించాలి? పూర్తి వివరాలు తెలియజేయగలరు.

వాణి, హైదరాబాద్

పిల్లల్లో ఇలా జరుగడానికి చాలా కారణాలు ఉంటాయి. మీరు అనుకుంటున్నట్టుగా ఆటల్లో దెబ్బలు తగులడం, లేదా మోకాలి కీలులో గాయమవడం, లేదా ఎక్కువగా మెట్లు ఎక్కడం దిగడం వంటి పనుల వల్ల కూడా ఇలా జరగవచ్చు. ఈ రోజుల్లో పిల్లలకు ఎండలో ఆడుకునే స్వేచ్ఛ ఉండడం లేదు. అందువల్ల విటమిన్ల లోపం ఏర్పడేందుకు ఆస్కారం ఉంది. డి విటమిన్ లోపించడం మూలంగా శరీరానికి కాల్షియం గ్రహించే సామర్థ్యం తగ్గిపోతుంది. ఫలితంగా కాల్షియం కూడా లోపిస్తుంది. అందువల్ల ఇలాంటి నొప్పి ఇతర సమస్యలు రావచ్చు. చాలా అరుదుగా వెన్నెముకలోని వెన్నుపూసల్లోని ఎస్1 స్థానంలో ఏదైనా సమస్య ఏర్పడి సంబంధిత నాడి ఒత్తిడికి లోనవడం వల్ల కూడా ఇలా జరుగవచ్చు. కానీ ఇది చాలా అరుదుగా జరుగుతుంది. మీరు మీ పాపను ఫిజీషియన్‌కు చూపించి తగిన పరీక్షలు చేయించి చికిత్స చేయించడం మంచిది. ఈ వయసు పిల్లల్లో సాధారణంగా విటమిన్ల లోపమే సమస్యకు కారణమవుతుంది. పెద్దగా చింతించాల్సిన అవసరం లేదు.



డాక్టర్ బి. చంద్రశేఖర్ రెడ్డి
ఛీఫ్ న్యూరాలజిస్ట్, సిటి న్యూరో సెంటర్, సిటి న్యూరో సెంటర్
హైదరాబాద్

నమస్తే తెలంగాణ
సంకేత
[హైదరాబాద్]
బుధవారం 21 ఫిబ్రవరి 2018
టెక్నాలెడ్జ్ 2.0

గుండెను కాపాడే గూగుల్!

మనసులో ఏముందో తెలియాలంటే కళ్లలోకి కళ్లు పెట్టి చూస్తే చాలు తెలిసిపోతుంది. ఏదైనా జబ్బు చేసినప్పుడు కూడా కళ్లు చూసే నిర్ధారిస్తారు డాక్టర్లు. ఇప్పుడు కొత్తగా గూగుల్ కూడా కళ్ల లోకి చూసి గుండె గురించి చెప్తున్నది.



అవును.. కళ్లను స్కాన్ చేసి గుండె ఆరోగ్యాన్ని చెప్పే సాఫ్ట్‌వేర్‌ను గూగుల్ కనిపెట్టింది. గుండె ఎంత రిస్కులో ఉందో తెలియాలంటే గూగుల్ కనిపెట్టిన టెక్నాలజీ కళ్లలోకి కళ్లు పెట్టి చూస్తే చాలు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ అనే రెండు టెక్నాలజీలను అనుసంధానం చేసి రెటీనల్ ఇమేజెస్ అనే ప్రక్రియకు తెరలేపారు. కంటిని ఫొటో తీయడం ద్వారా అందులోని రక్తకణాలను స్కాన్ చేసి గుండె పనితీరును, ఆరోగ్యాన్ని అంచనా వేస్తుంది ఈ టెక్నాలజీ. కార్డియోవాస్క్యులర్ హెల్త్ ఇన్నోవేషన్స్ అనే సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరిశోధన గుండెకు చేసే చికిత్సల్లో విప్లవాత్మక మార్పులకు అంకురార్పణ చేసింది. దాదాపు మూడు లక్షల మంది మీద అధ్యయనం చేసి ఈ రెటీనల్ ఇమేజెస్ టెక్నాలజీని ధృవీకరించారు.

100 కంప్యూటర్లకు సమానం..!

టెక్నాలజీ ప్రాణం పోసుకుంటున్న నాటి రోజుల్లో ఒక కంప్యూటర్‌తో ఎన్నో పనులు సులువుగా పూర్తయ్యేవి. క్రమంగా అంతా కంప్యూటర్ యుగమైంది. ఏ పనైనా కంప్యూటర్ ఉంటేనే చేయాల్సి వచ్చేది. ఇలాంటి పరిస్థితుల్లో కంప్యూటర్ ముందు కూర్చొని పనిచేయడం, వందల-వేల దస్తావేజులు, దరఖాస్తులు పరిష్కరించడం భారమైంది. ఒక్కమాటలో చెప్పాలంటే మాన్యువల్‌గా ఈ పనులన్నీ చేయడం ఇబ్బందిగా మారింది. అందుకే వంద కంప్యూటర్లకు సమానమైన సూపర్ కంప్యూటర్‌లాంటి సాఫ్ట్‌వేర్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దరఖాస్తును స్కాన్ చేసి, క్షణాల్లో పూర్తిచేసి, అప్రూవల్ తీసుకొని మీకు పనిభారాన్ని తగ్గిస్తుంది. ఇలా నిమిషానికి 10 దరఖాస్తులను పరిష్కరిస్తున్నది!!

మీరు విన్నది నిజమే. 'ఇంటెల్లిబోట్' అనే ఈ సాఫ్ట్‌వేర్ ట్రెండ్‌సెట్టర్.. రోబో సినిమాలో చిట్టీ.. బుక్‌ను స్కాన్ చేసి అందులో ఏది అడిగినా సమాధానం చెప్తుంది కదా! అచ్చం అలాగే అనుకోండి. కాకపోతే ఇక్కడ రోబో కనిపించదు. కానీ మనిషి చేసే పనిని ఇది క్షణాల్లోనే చేసేస్తుంది. దీంతో కంప్యూటర్ ముందు కూర్చొని 'టిక్కు టిక్కు' అని కొట్టుకొనే రోజులకు కాలం చెల్లినట్టే. ఎందుకంటే మనం చేయాల్సిన పనిని ఈ రోబో(కనిపించని)కి అప్పజెప్పితే అదే పనిని పూర్తి చేసేస్తుంది కాబట్టి. రోబో సాఫ్ట్‌వేర్‌తో మీ సమయాన్ని, ధనాన్ని, పనిభారాన్ని, పనిదొంగలైన ఉద్యోగులను తగ్గించుకోవచ్చు.



ఇది నెక్ట్స్ జనరేషన్ సాఫ్ట్‌వేర్. ఇది భౌతికంగా కనిపించని రోబో. ఆర్‌పీఏ (రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్) వేదికగా దీనిని రూపొందించారు. ఇది ఎలా పనిచేస్తుందంటే.. ఉదాహరణకు లోన్ల కోసం కంపెనీకి ఎంతోమంది ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటారు. అలా వచ్చిన దరఖాస్తులను ఈ సాఫ్ట్‌వేర్ స్కాన్ చేసి, కంపెనీ ఫార్మెట్‌లో దరఖాస్తును తప్పులు లేకుండా నింపుతుంది. దరఖాస్తు ఫారంలో ఏకాలమ్ అయినా అదే గుర్తించి, సంతకాలు, ఫొటోలను కూడా అటాచ్ చేసుకొని ఫైలును పై అధికారులకు పంపుతుంది. వారి అప్రూవల్ అయితే వెంటనే లోన్‌ను కూడా మంజూరు చేస్తుంది. అంతేకాదు గతంలో వారి పేరిట ఎన్నిసార్లు లోన్‌లు తీసుకున్నారు? ఎంత మొత్తం తిరిగి చెల్లించారు? ఇంకా ఎంత చెల్లించాలనే వివరాలు కూడా తెలుపుతుంది. ఇలా.. కంప్యూటర్ ముందు మనిషి కూర్చొని చేయాల్సిన పనులన్నీ ఈ ఇంటెల్లిబోట్ చేసేస్తుంది. ఈ సాఫ్ట్‌వేర్‌కు ప్రోగ్రామింగ్ చేయాల్సిన అవసరం లేదు. కోడ్ రాయాల్సిన అవసరం అంతకన్నా లేదు. ఈ సాఫ్ట్‌వేర్‌తో రోబోట్‌ను క్రియేట్ చేయొచ్చు. రోబోలకు వాడే పలు సాఫ్ట్‌వేర్లలో ఇది కూడా ఒకటి.

ఈ ఆలోచన ఎలా వచ్చిందంటే?: హెచ్ఎస్‌బీసీలో పదేళ్లుగా మాన్యువల్‌గా వర్క్ చేస్తున్న అలేఖ్ బృందానికి విసుగొచ్చింది. ఆ పనులన్నీ రోబోలాంటి సాఫ్ట్‌వేర్ చేసిపెడితే ఎలా ఉంటుంది? అనే ఆలోచన వచ్చేసింది. దానిని మనమే ఎందుకు రూపొందించకూడదు అనే మరో ఆలోచన! వెంటనే కంపెనీ అనుమతి తీసుకొని అలేఖ్ బృందం రంగంలోకి దిగింది. వారు తయారు చేయబోయే సాఫ్ట్‌వేర్ భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడాలనే ఉద్దేశంతో రెండేళ్లు కష్టపడి దీనిని రూపొందించారు. హెచ్ఎస్‌బీసీకి చెందిన 26 దేశాల్లోని ఆఫీసుల్లో ఈ సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టి కంపెనీకి దాదాపు 2 కోట్ల రూపాయల మేర ఆదాయం తెచ్చిపెట్టారు.

ఆధైర్యంతోనే స్టార్టప్‌గా!!: తమ ప్రొడక్ట్ సాఫ్ట్‌వేర్ మార్కెట్‌లో నిలదొక్కుకుంటుందనే ఆ ధైర్యంతోనే హెచ్ఎస్‌బీసీ నుంచి 10మంది బయటకు వచ్చి, దాదాపు ఆరు కోట్ల రూపాయల వరకు ఖర్చు చేసి.. ఈ సాఫ్ట్‌వేర్‌ను నమ్ముకొని స్టార్టప్‌గా ఎదిగారు. ప్రస్తుతం ఇంటెల్లిబోట్‌ను అప్‌గ్రేట్ చేసి భవిష్యత్ తరాలు కూడా ఈ సాఫ్ట్‌వేర్ ఉపయోగపడేలా రూపొందించారు. ఇలాంటివి విదేశాల్లో ఉన్నా.. మన దేశంలో ఈ సాఫ్ట్‌వేర్‌ను మొదటిసారిగా పరిచయం చేసింది మాత్రం ఇంటెల్లిబోట్ స్టార్టప్ ప్రతినిధులే. హెచ్ఎస్‌బీసీ నుంచి బయకొచ్చిన తర్వాత తండ్రి సహకారంతో హోం ఆటోమేషన్, ఆర్కిటెక్చర్, అడ్వర్టైజింగ్ ఏజెన్సీ, ఇంటర్‌నెట్ మార్కెటింగ్ వంటి కొన్ని కంపెనీలు ప్రారంభించాడు అలేఖ్. వాటితో పాటుగా ఈ ఇంటెల్లిబోట్ కూడా నిర్వహిస్తున్నాడు.

ఇంటెల్లిబోట్‌తో ఉపయోగాలు : బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ట్రావెలింగ్, స్టాక్‌మార్కెటింగ్, హెచ్ఆర్ వంటి రంగాల్లో, ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీలు (కార్వీ, టాటా కేపిటల్, లోన్స్, టెలీకాలర్ కంపెనీలు)కు చాలా ఉపయోగం. ఈ సాఫ్ట్‌వేర్ వల్ల దాదాపు 80శాతం పని త్వరగా అవుతుంది. మనుషుల వల్ల తప్పులు జరిగే అవకాశం ఉంది. కానీ ఈ సాఫ్ట్‌వేర్ వల్ల తప్పు జరిగే అవకాశమే లేదు. ఈ సాఫ్ట్‌వేర్ వందమంది ఉద్యోగులతో సమానం కాబట్టి మిగతా వారిని వివిధ పనులకు కేటాయించవచ్చు. ఆ విధంగా కంపెనీ ఆదాయం పెంచుకోవడానికి చాలా ఉపయోగం. మీ కంపెనీ సమాచారం చాలా రహస్యంగా ఉంచుతుంది. కంపెనీలో ఎంతమంది పనిచేస్తున్నారు? ఏవేం పనిచేస్తున్నారు? ఎంత ఆదాయం వస్తుంది? ఎంత ఖర్చు అయింది అనే విషయాలు కూడా గ్రాఫ్ రూపంలో తెలియజేస్తుంది. ఇలా రోజులు, నెలలు, సంవత్సరాల వారీగా వివరాలు తెలియజేస్తుంది. కంప్యూటర్‌లో ఏమైనా ఎర్రర్స్ ఉంటే.. అదే కరెక్ట్ చేసుకొని, ఎలాంటి వైరస్‌లు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటుంది. వందమంది చేయాల్సిన పనిని ఒక్క కంప్యూటర్ నుంచే చెయ్యొచ్చు. సాఫ్ట్‌వేర్ మీ కంపెనీలో ఉంటే.. మౌస్, కీబోర్డుతో కూడా పని లేదు. ఈ కామర్స్ వెబ్‌సైట్‌లో మనం ఒక ఫోన్ కొనాలనుకుంటే! మన బడ్జెట్, ఫోన్ క్వాలిటీ, ఫీచర్స్ ఇంటెల్లిబోట్‌కు చెప్తే.. మనకు అందుబాటులో ఉన్న ఈ కామర్స్ సైట్లలో మన బడ్జెట్‌లో వచ్చే ఆయా ఫోన్లను చూపిస్తుంది.

సాఫ్ట్‌వేర్ నేర్చుకోవడం సులువు: ఈ సాఫ్ట్‌వేర్‌ను https://intellibot.io వెబ్‌సైట్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఒక్క నెలలోనే 944 మంది ఈ సాఫ్ట్‌వేర్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. అంతేకాదు ఈ సాఫ్ట్‌వేర్‌కు సబంధించిన వీడియోలను చూసి.. ఇంట్లోనే సొంతంగా సాఫ్ట్‌వేర్‌ను నేర్చుకోవచ్చు. విద్యార్థులు, ఉద్యోగులు, గ్రాడ్యుయేట్లకు మంచి అవకాశమని చెబుతున్నారు. ఈ సాఫ్ట్‌వేర్ నేర్చుకున్నవారికి ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. కోర్సు పూర్తిగా నేర్చుకున్న వారిని ఉద్యోగాలు వెతుక్కుంటూ వస్తాయని చెబుతున్నారు. కొంతమంది కొత్తవాళ్లకు సాఫ్ట్‌వేర్ గురించి నేర్పించి తన కంపెనీలో ఉద్యోగులుగా చేర్చుకున్నాడు. అతి త్వరలోనే కోర్సు నేర్చుకున్న వారికి సర్టిఫికేషన్ ఇచ్చే ఆలోచనలో ఉన్నట్లు చెబుతున్నారు రఘు అలేఖ్.



ఇంటెల్లిబోట్ ఉద్యోగులతో రఘు అలేఖ్

భవిష్యత్‌లో ఏం చేయబోతున్నారంటే?: కృత్రిమ మేధస్సు సాయంతో భవిష్యత్‌లో గొప్ప ప్రాజెక్టులు చేపట్టబోతున్నారు. ఉదాహరణకు బ్యాంక్ లావాదేవీలను నిర్వహించడానికి.. చేతలతో పనిలేకుండా మాటల్లోనే పూర్తయ్యేటట్లు కొత్త సాఫ్ట్‌వేర్ రూపొందించబోతున్నారు. ఫోన్‌లోనే ఫలానా వ్యక్తికి డబ్బులు ఎంత, ఎప్పుడు ట్రాన్స్‌ఫర్ చేయాలో చెబితే క్షణాల్లో పనిచేస్తుందట. రాబోయే రెండేళ్లలో దీనిని ప్రవేశపెట్టనున్నారు. బ్యాంకు లావాదేవీలే కాకుండా బిల్లులు, అద్దెలు, ఫీజులు వంటివి సులువుగా చెల్లించేందుకు ఉపయోగపడనుంది. ఏ భాషలో మాట్లాడినా అర్థం చేసుకొని మన పనులను సులువుగా చేసే సాఫ్ట్‌వేర్ రూపొందించడమే వీరి లక్ష్యం.

భవిష్యత్ మొత్తం ఆర్‌పీఏ: ఆటోమేషన్ ద్వారా చాలా మంది ఉద్యోగాలు పోతున్నాయని కొంతమంది బాధపడుతున్నారు. కానీ ఈ ఆటోమేషన్ ద్వారా వేలల్లో ఉద్యోగాలు రానున్నాయి. ఎంతోమందికి ఉపాధి అవకాశాలు దొరుకనున్నాయి. ఈ విషయాన్ని హైదరాబాద్‌లో జరుగుతున్న వరల్డ్ ఐటీ కాంగ్రెస్ సాక్షిగా కేంద్ర ఐటీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ప్రకటించారు. ఇప్పటి వరకు కూడా జావా, ఓసీపీ వంటి సాఫ్ట్‌వేర్ వేర్లను నేర్పించే సంస్థలే ఉన్నాయి. ఇకనుంచి రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ కోర్సు నేర్పించే సంస్థలు వెలుస్తున్నాయి. అంత డిమాండింగ్ ఉన్నదీ కోర్సుకు. భవిష్యత్ మొత్తం రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్‌దే మరి.

ప్రభుత్వానికి హాట్సఫ్

తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత డిజిటల్ టెక్నాలజీకి ఊతమిచ్చింది. స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వానికి హాట్సఫ్. ఇంటెల్లిబోట్ రూపొందించడంలో శ్రీకాంత్, కుషాంగ్ మూర్తి చాలా కీలకంగా పనిచేశారు. 2017 నవంబర్‌లో మార్కెట్‌లో విడుదల చేశాం. ఎలాంటి ప్రచారం లేకుండానే ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 10వేల మంది వారి కంపెనీ అవసరాలకు అనుగుణంగా ఈ సాఫ్ట్‌వేర్‌ను కొనుగోలు చేశారు. ఈ సాఫ్ట్‌వేర్ వివరాలకు https://intellibot.io వెబ్‌సైట్‌లో, 7036718185 నంబర్‌ను సంప్రదించవచ్చు.

- రఘు అలేఖ్ బర్లీ, సీఈఓ

రవికుమార్ తోటపల్లి
వీరగోని రజనీకాంత్

పవర్‌బ్యాంక్ కొంటున్నారా?



స్మార్ట్‌ఫోన్ల వాడకం పెరిగిన తర్వాత ఇంటర్నెట్ వినియోగం కూడా అంతే వేగంగా పెరిగింది. ఆ వేగానికి మొబైల్ బ్యాటరీలోని ఛార్జింగ్ తొందరగా అయిపోతున్నది. అందుకు పరిష్కారంగా వచ్చిన పరికరమే పవర్‌బ్యాంక్. అయితే నాసిరకం, నకిలీ పవర్‌బ్యాంకులు కొని మోసపోకుండా ఉండాలంటే ఈ చిట్కాలు పాటించండి.

- మార్కెట్లో ఒరిజినల్ బ్రాండ్లు ఎన్ని ఉన్నాయో.. అంతకంటే ఎక్కువ నకిలీ బ్రాండ్లు కూడా ఉన్నాయి. అందుకే.. ఏదైనా బ్రాండ్ కొనేటప్పుడు పేరు, లోగో నిశితంగా పరిశీలించి కొనండి.
- రోడ్లపక్కన అమ్మే వారి దగ్గర కొంటే ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకొని కొనండి.
- పవర్‌బ్యాంక్ కొనేముందు మొబైల్ బ్యాటరీ కెపాసిటీకి ఆధారంగా కొనండి.
- మీ మొబైల్ బ్యాటరీ సామర్థ్యం 3000 ఎంఏహెచ్ అయితే.. 6000 ఎంఏహెచ్ పవర్‌బ్యాంక్ కొనండి. రెండు యూఎస్‌బీ పిన్నులు జత చేసుకునేది ఉంటే ఇంకా బెటర్.
- తక్కువ ధరలో వస్తుంది కదా.. అని తొందరపడి కొనకండి. మంచి సామర్థ్యం ఉన్న పవర్‌బ్యాంకు ధర కూడా ఆ స్థాయిలోనే ఉంటుంది.
- ఎంత ఎక్కువ సామర్థ్యం ఉన్న పవర్‌బ్యాంక్ అయితే.. అన్ని ఎక్కువసార్లు మొబైల్‌కి ఛార్జింగ్ పెట్టుకోవచ్చు.
- ఆన్‌లైన్‌లో కొనేకంటే.. ఏదైనా మంచి షాప్‌కెళ్లి కొనడం బెటర్. అక్కడైతే చెక్ చేసుకునే సదుపాయం ఉంటుంది.

వాట్సప్ రీస్టోర్ చేయడం తెలుసా?



ఫోన్ పోయినా, ఎవరైనా దొంగిలించినా తెగ బాధపడిపోతుంటాం. ఎందుకంటే ఆ ఫోన్ ధరకన్నా.. దానిలో ఉండే కాంటాక్ట్స్, డేటా, డిజిటల్ వాలెట్స్, బ్యాంక్ అకౌంట్స్, వాట్సప్ గురించే ఆందోళన చెందుతాం. అందుకే మీ వాట్సాప్ అకౌంట్‌ను ముందుగానే రక్షణ కల్పించుకోండి.

- మీ నెట్‌వర్క్ ప్రొవైడర్‌కు ఫోన్ చేసి మొబైల్ సిమ్‌ను లాక్ చేయించండి. అప్పుడు మీ ఫోన్ నుంచి ఎలాంటి మెసేజ్ చేయలేరు. ఎందుకంటే మీ వాట్సప్, ఫేస్‌బుక్ వాడాలంటే మీ మొబైల్ నంబర్‌కే ఓటీపీతో కన్ఫర్మ్ చేయాలి కాబట్టి.
- మీ సిమ్ లాక్ అయ్యాక మీ వాట్సప్ అకౌంట్‌ను వేరే ఫోన్‌లో యాక్టివేట్ చేసుకోవచ్చు. కానీ వాట్సాప్‌ను ఒక నంబర్‌తో ఒక ఫోన్‌లో మాత్రమే యాక్సెస్ చేయగలమని గుర్తించాలి.
- లేకపోతే వాట్సప్ టీమ్‌కు మెయిల్ కూడా చేయవచ్చు. మెయిల్ బాడీలో lost/stolen : Deactivate my account అని జత చేస్తే.. మీ మొబైల్ నంబర్, కంట్రీకోడ్ ఆధారంగా అకౌంట్ కొత్త ఫోన్‌లో యాక్టివేట్ అవుతుంది.
- డీ యాక్టివేట్ అయిన అకౌంట్‌ను మీ కొత్త సిమ్ తీసుకొని దాన్ని వేరే హ్యాండ్‌సెట్‌లో వేసుకొని నెలరోజుల లోపు రీ యాక్టివేట్ చేసుకోవచ్చు. ఈ నెల రోజుల్లో మీకు ఏమైనా మెసేజ్‌లు వస్తే అవి పెండింగ్‌లో ఉంటాయి. రీ యాక్టివేట్ చేయించుకోకపోతే అకౌంట్ పర్మినెంట్‌గా తొలిగిస్తారు.
- మీ ఫోన్ పోకముందు మీరు గూగుల్ డ్రైవ్, వన్‌డ్రైవ్ లాంటి క్లౌడ్ సర్వీస్‌లో మీ చాట్ బ్యాకప్ స్టోర్ చేసుకొని ఉంటే దాన్ని రీస్టోర్ చేసుకోవచ్చు.

ఒకప్పుడు మొబైల్ ప్రియులను కట్టిపడేసిన నోకియా ఆ మధ్య చైనా ఫోన్ల ధాటికి కాస్త వెనుకపడింది. ఇప్పుడు మళ్లీ సరికొత్త అప్‌డేట్ వెర్షన్లతో మళ్లీ మార్కెట్లో హల్‌చల్ చేస్తున్నది. ఈ కోవలో వచ్చిన మరో ఫోన్ నోకియా 6. ఈ మొబైల్ ఫీచర్లు ఇవే..

నోకియా 6



వయ్యారాల

ధర : రూ. 13,970

డిస్‌ప్లే : 5.5 ఇంచులు
ఆండ్రాయిడ్ : 7.1.1 నౌగట్ వర్షన్ (త్వరలో 8.0 ఆండ్రాయిడ్ వర్షన్‌కి అప్‌డేట్ చేసే అవకాశం)
ఇంటర్నల్ మెమరీ : 32/64 జీబీ (256 జీబీ వరకు పెంచుకునే సామర్థ్యం)
రామ్ : 3/4 జీబీ
రియర్ కెమెరా :16 మెగాపిక్సెల్స్
ఫ్రంట్ కెమెరా : 8 మెగాపిక్సెల్స్
ఇతర ఫీచర్లు : ఫ్రంట్ ఫింగర్ ప్రింట్ సెన్సార్ లాక్, కంపాస్, ఫాస్ట్ బ్యాటరీ ఛార్జింగ్, డాక్యుమెంట్ వ్యూవర్, హెచ్‌టీఎంఎల్ 5 బ్రౌజర్
బ్యాటరీ సామర్థ్యం : 3000 ఎంఏహెచ్
అందుబాటులో ఉన్న కలర్స్ : ఆర్టీ బ్లాక్, టెంపర్డ్ బ్లూ, సిల్వర్, కాపర్, మట్టే బ్లాక్

స్టార్టప్‌గా ఎదుగాలనుకుంటున్నారా?



స్టార్టప్‌గా మార్కెట్‌లో రాణించాలనుకుంటున్న వారికి సువర్ణ అవకాశం. హైదరాబాద్‌లో ఈనెల 25, 26 తేదీల్లో బిట్స్ పిలానీలో పెద్ద ఈవెంట్ జరుగబోతున్నది. కోడ్ బీట్ అనే కంపెనీ స్టార్టప్‌లను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ ఈవెంట్ నిర్వహిస్తున్నది. ఈ కార్యక్రమానికి జెడ్-నేషన్ ల్యాబ్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నది. ఈ కార్యక్రమంలో కొత్త ఆలోచనలతో స్టార్టప్‌గా ఎదుగాలనుకుంటున్నవారు పాల్గొనవచ్చు. అందుకు www.codebeat.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ కావాలి. ఈ కార్యక్రమానికి ప్రముఖ కంపెనీల నుంచి పెట్టుబడిదారులు హాజరవుతున్నారు. వారికి మీ ఆలోచన నచ్చితే స్టార్టప్‌కు పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉంటారు. ఇప్పటికే ఈ కార్యక్రమానికి దాదాపు 2వేల మందికిపైగా ఔత్సాహికులు రిజిస్టర్ అయినట్లు సంస్థ అధ్యక్షుడు రాహుల్ సింగ్ తెలిపారు. మీరు కూడా కొత్త ఆలోచనలతో మీ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలనుకుంటే వెంటనే రిజిస్టర్ అవ్వండి. గతంలో జెడ్-నేషన్ ల్యాబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇలాంటి ఈవెంట్ల ద్వారా ఎంతోమంది ఔత్సాహికులు స్టార్టప్స్‌గా కెరీర్‌ను ప్రారంభించారు.

ఎయిర్‌పోర్టులో సాయం చేసే రోబో!

ఎక్కడికైనా విమాన యానం చేయాల్సి వస్తే టిక్కెట్లు బుక్ చేసుకుంటాం. ఎయిర్‌పోర్టుకు వెళ్తాం. తీరా అక్కడికి వెళ్లిన తర్వాత ఒకదాని వెనుక ఒకటి వరుసగా కొన్ని సందేహాలు, ప్రశ్నలు వస్తాయి. ఎవరినైనా అడుగుదామంటే ఎవరి పనుల్లో వారు బిజీగా ఉంటారు. మన ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానం ఇచ్చేవారెవరు? రిసెప్షన్ కౌంటర్ ఉన్నా.. వేచి చూడక తప్పదు. కానీ.. ఇకపై ఆ బాధ ఉండదు.



విమానయానం చేసే గగన ప్రయాణికులకు సహాయం చేసే రోబోను కనిపెట్టారు శాస్త్రవేత్తలు. 120 సెంటీమీటర్ల పొడవుండే ఈ రోబో విమానాలకు సంబంధించిన వివరాలు, దగ్గర్లోని రెస్టారెంట్లు, హోటల్స్, విమానం బయల్దేరే సమయం, చేరుకునే సమయం లాంటి వివరాలన్నీ అడిగిన వెంటనే చెప్తుంది. ప్రస్తుతం మ్యూనిచ్ ఎయిర్‌పోర్టులో ఈ రోబో సేవలందిస్తున్నది. జోసీ పెప్పర్ అని పిలువబడే ఈ రోబోను సాఫ్ట్‌బ్యాంక్ రోబోటిక్స్ అనే సంస్థ తయారుచేసింది. వ్లాన్ ఇంటర్నెట్ యాక్సెస్ పనిచేసే ఈ రోబోలో హై పెర్ఫామెన్స్ ప్రాసెసర్లు అమర్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గురించి ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతున్న ఈ తరుణంలో మనిషిలా ఆలోచించే మరో రోబోను మనుషులకు సేవలందించేందుకు తయారుచేయడం ఆసక్తి కలిగిస్తుంది.

నమస్తే తెలంగాణ
యువ
[హైదరాబాద్]
బుధవారం 21 ఫిబ్రవరి 2018



నటుడు ఆర్యకు స్వయంవరం.. అవును. నటుడు ఆర్యకు స్వయంవరం అంటూ వచ్చిన ఒక్క వీడియోకి వేలకొద్ది స్పందన. ఎందుకా స్వయంవరం? ఏంటా వీడియో?

ఆర్య స్వయంవరం!

ఆర్య మంచి నటుడు. అంతకన్నా అందగాడు. వరుడు సినిమాలో విలన్‌గా నటించి ఆకట్టుకున్నాడు. తమిళ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్న ఆర్య ఇప్పుడు వధువు కోసం వెతుకుతున్నాడు. అమ్మాయి కావాలంటే ట్విట్టర్‌లో ఓ వీడియో పోస్ట్ చేశాడు. 'నాకు పెళ్లి విషయంలో ఎలాంటి డిమాండ్స్, కండీషన్స్ లేవు. నేను మీకు నచ్చితే, మీకు తగిన జోడీ అవుతానని అనిపిస్తే నా నంబర్ 7330173301కి కాల్ చేయండి' అని వీడియో పెట్టాడు. ఇది నిజం పెళ్లికి అనుకుంటే పొరపాటే. 'వయాకామ్18' సంస్థ ఓ చానల్‌లో నిర్వహించబోయే 'ఇంగవీట్లు మాపిళ్లై' అనే స్వయంవరం కార్యక్రమం కోసం పెట్టిన వీడియో అది. అందులో ఆర్య పెళ్లి కొడుకుగా పాల్గొననున్నాడు. ఆర్య అంతటి అందగాడే అమ్మాయి కావాలని అడిగితే అమ్మాయిలు స్పందించకుండా ఉంటారా? పోస్ట్ చూసి దాదాపు 70 వేల మంది అమ్మాయిలు దరఖాస్తు చేసుకున్నారు. చానల్ నిర్వాహకులు అంతమందిలోంచి 18 మందిని ఎంపిక చేశారు. వచ్చే నెలలో ప్రసారం కాబోయే ఆ రియాలిటీ షోలో ఎంపికైన అమ్మాయిలతో ఆర్య స్వయంవరం ఉంటుందట!



నేటి యువత ఏం కోరుకుంటున్నది? మంచి ఉద్యోగం.. మంచి జీతం.. విలాసవంతమైన జీవితం! భూదాన్ పోచంపల్లికి చెందిన గంజి యుగేంధర్ కూడా మొదట ఇదే కోరుకున్నాడు! కానీ.. అదే ఆలోచనతో ఎక్కువ కాలం ఉండలేకపోయాడు! లక్షల రూపాయల జీతం వచ్చే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలేశాడు. ఒకరి దగ్గర ఉద్యోగం చేయడం కన్నా.. తానే పదిమందికి ఉపాధి కల్పించాలని.. తాతలు.. తండ్రుల నుంచి వారసత్వంగా వస్తున్న చేనేత వృత్తినే ఎంచుకున్నాడు! చేనేతకు సాంకేతికత జోడించి పోచంపల్లి ఇక్కత్‌ను ప్రపంచ వ్యాప్తంగా మార్కెటింగ్ చేస్తున్నాడు!

సాఫ్ట్‌వేర్‌ను వదిలి..

చేనేతకు చేయూతనిస్తూ!

యుగేంధర్‌ది యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి. చేనేత కుటుంబంలో పుట్టాడు. స్థోమత లేకున్నా ఇంజినీరింగ్ చదివించారు తల్లిదండ్రులు. వాళ్ల కష్టం వృథా పోకుండా యుగేంధర్ చదువులో మంచి ప్రతిభ కనబర్చాడు. ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం సంపాదించాడు. ఇంతలో ఆలోచన మార్చుకొని చేనేతకు చేయూతనిచ్చేందుకు సంకల్పించాడు. తెలంగాణ ప్రభుత్వం చేనేత పరిశ్రమకు కల్పిస్తున్న ప్రోత్సాహానికి తానూ తోడుగా నిలవాలని.. పోచంపల్లి ఇక్కత్‌కు ప్రపంచవ్యాప్త మార్కెటింగ్ సెట్ చేయాలని ఉద్యోగాన్ని లక్షల జీతం వచ్చే ఉద్యోగాన్ని వదిలేశాడు. 'ఇక్కత్ వరల్డ్' పేరుతో హ్యాండ్లూమ్ స్టోర్‌ను ప్రారంభించాడు. చేనేత వస్త్ర ఉత్పత్తులను ఫొటోలు తీసి ఆన్‌లైన్ వ్యాపారం మొదలుపెట్టాడు.

సోషల్‌మీడియా ద్వారా: తాను తీసుకున్న ఫొటోలను మెదటి తన ఫేస్‌బుక్ బిజినెస్ పేజీ.. వాట్సప్.. ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేయడం వల్ల అంతర్జాతీయంగా కస్టమర్స్ పెరిగిపోయారు. ఇక్కత్ వరల్డ్ పేరుకు కస్టమర్స్ నుంచి మంచి ఆదరణ లభించడంతో ఇక్కత్ వరల్డ్ బ్రాండ్‌గా ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ట్రేడ్ మార్క్ కూడా పొందాడు. ఒక ప్రత్యేక లోగోను రూపొందించుకొని ఆ బ్రాండ్ నేమ్‌తో వస్త్ర వ్యాపారం చేస్తుండటంతో కస్టమర్స్ ఆదరణ తో పాటు మరింత గుర్తింపు లభిస్తున్నది.

సొంత మగ్గాలపై: ఇప్పటి వరకు ఇతర చేనేత కార్మికుల వస్త్రాలతో వ్యాపారం చేసిన యుగేంధర్‌కు కస్టమర్స్ నుండి వస్తున్న అన్యూహ్య స్పందన వల్ల సొంతంగా మగ్గాలను ఏర్పాటు చేయాలనే ఆలోచన వచ్చింది. తండ్రి గంజి బసవలింగం అప్పటికే ఈ రంగంలో నిష్ణాతులు కావడంతో తన తండ్రి సూచనతో తక్కువ పెట్టుబడితో కొన్ని మగ్గాలను ఏర్పాటు చేశాడు. అలా ఇప్పటి వరకు సుమారు 25 మగ్గాలను ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యక్షంగా పరోక్షంగా ఓ వంద మందికి పైగా ఉపాధి కల్పించాడు. ప్రపంచ మార్కెట్‌కు అనుగుణంగా సరికొత్త డిజైన్లు రూపొందిస్తూ ముందుకు సాగడంతో యుగంధర్ తయారు చేస్తున్న వస్త్రాలకు ఆ మేరకు డిమాండ్ పెరుగుకుంటూ వస్తుంది. విదేశాలకు ఆన్‌లైన్ ద్వారా మార్కెంటింగ్ చేయడంతో పెద్ద పెద్ద వారితో పరిచయాలు పెరగడం ప్రారంభమయ్యాయి.

ఇక్కత్ వరల్డ్ ఆర్ట్ స్టూడియో ఏర్పాటు: తాను కేవలం ఆన్‌లైన్ ద్వారా మార్కెటింగ్ చేయడంతో కస్టమర్స్ నేరుగా వచ్చి చూడటానికి ఒక వేదికను ఏర్పాటు చేసుకోవాలనే ఉద్దేశంతో తన ఇంటినే ఒక వేదికగా చేసుకోని ఇక్కత్ వరల్డ్ ఆర్ట్ స్టూడియోను ఏర్పాటు చేశారు. తన ఇంటిలోని మొదటి భాగాన్ని షోరూమ్‌లా అందంగా అలంకరించి అక్కడ తన వద్ద



తయారవుతున్న వివిధ రకాల చేనేత వస్త్రాలను ప్రదర్శించడం ద్వారా అనేకమంది కొనుగోలుదారులు నేరుగా వచ్చి కూడా చేనేత వస్త్రాలను తీసుకెళ్తున్నారు. వచ్చిన కస్టమర్స్ అభిప్రాయాలను సేకరించి కొత్త డిజైన్‌లను రూపొందించడంతో పాటు మోడల్స్ ద్వారా ఫొటో షూట్ ఏర్పాటు చేసుకోని వస్త్రాల ప్రపంచస్థాయిలో మార్కెటింగ్ చేస్తున్నాడు. ఇక్కత్ వరల్డ్ ఆర్ట్ స్టూడియోని వేదికగా చేసుకొని చేనేత కార్మికులకు కూడా కొత్త డిజైన్‌లను రూపొందించుకోవడానికి తోడ్పాటుపడుతున్నాడు.

ఇక్కత్ వరల్డ్ బ్రాండ్: ఆన్‌లైన్ వ్యాపారం ద్వారా మంచి గుర్తింపు పొందిన యుగంధర్ తాను తయారు చేయిస్తున్న వస్త్రాలకు మంచి ఆదరణ ఉండటంతో భారత దేశంలోని వివిధ రాష్ర్టాలతో పాటు దేశవిదేశాలకు తన ఎగుమతులను ప్రారంభించాడు. ఈ విధంగా అమెరికా, సింగపూర్, మలేషియా, ఆస్ట్రేలియా, శ్రీలంక, ఇంగ్లాండ్, బంగ్లాదేశ్, సౌంధీ అరేబియా వంటి దేశాల నుండి ఆర్డర్లు రావడంతో ప్రతీ నెల వివిధ దేశాలకు ఎక్కువ సంఖ్యలో కొరియర్ ద్వారా ఎగుమతులు చేస్తున్నాడు. అంతే కాకుండా భారత దేశంలోని వివిధ రాష్ర్టాలలోని కస్టమర్స్‌తో పాటు హోల్‌సేల్ వ్యాపారులకు తన వస్త్రాలు పంపిస్తున్నాడు. కేవలం ఆన్‌లైన్, ఇక్కత్ వరల్డ్ ఆర్ట్ స్టూడియో ద్వారానే కాకుండా దేశంలోని ప్రముఖ పట్టణాలలో రాష్ట్ర రాజధాని కేంద్రాలలో ఇక్కత్ వరల్డ్ పేరుతో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేశాడు. హైద్రాబాద్, గుంటూరు, వైజాగ్, బెంగళూరు, చెన్నై లాంటి నగరాలలో సుమారు 15 పైగా ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసి తన వస్త్రాల అమ్మకాలను విస్తరించాడు.

అవార్డులకు ఎంపిక: 21 సంవత్సరాల వయసులో ఆన్‌లైన్ వ్యాపారం ద్వారా చేనేత వస్త్రాలను ప్రపంచ వ్యాప్తంగా పరిచయం చేసిన యుగంధర్‌ను పలు అవార్డులు వరించాయి. ఇటీవల ఓ ప్రముఖ టీవీ చానల్ రాష్ట్రస్థాయిలో వివిధ రంగాలలో నిష్ణాతులైన వారిని గుర్తించి అవార్డులు ఇవ్వగా 2018 సంవత్సరానికిగాను గంజి యుగంధర్ బెస్టు యంగ్ ఎంటర్‌ప్రిన్యూర్ జ్యూరీ అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ అవార్డును రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు చేతులమీదుగా అందుకున్నాడు.

'సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి చేనేత వస్త్రాల అమ్మకంపై చేపట్టాలన్న నా ఆలోచనను తల్లిదండ్రులు కాదంటారేమో అనుకున్నా. కానీ సరే చెప్పారు. నా ప్రతీ అడుగులో నాతో ఉంటూ నన్ను ముందుకు నడుపుతున్నారరు. వాళ్ల సహకారంతో భవిష్యత్‌లో ఈ కామర్స్ ద్వారా అన్ని రకాల హ్యాండ్లూమ్ వస్త్రాలను ఆన్‌లైన్ ద్వారా అమ్మడానికి ఏర్పాట్లు చేస్తున్నా' అన్నాడు యుగేంధర్.

చేరాల ప్రకాష్, భూదాన్ పోచంపల్లి

ఇక్కడ 'ప్రక్షాళన' సినిమా టైటిల్! సమాజ తీరుపై స్పందించే లఘుచిత్రం! షార్ట్‌ఫిలింస్ అనగానే.. ఎన్ని వ్యూస్ వచ్చాయి? ఎన్నిక్లిక్స్ వచ్చాయి? అన్న కోణంలోనే చూస్తుంటారు చాలామంది!

కానీ.. వ్యూస్.. క్లిక్స్ కాకుండా అవార్డులు కూడా సొంతం చేసుకోవచ్చు.. అని నిరూపించింది 'ప్రక్షాళన'! ప్రతిష్ఠాత్మక ఫిలిం ఫెస్టివల్స్‌కు కూడా ఎంపికై తెలుగు లఘుచిత్ర ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పింది!



కేన్స్ ఫిలింఫెస్ట్‌కు ప్రక్షాళన!

- కోల్‌కతాలోని ఏఏబీ ఫిలిం ఫెస్టివల్ ఉత్తమ చిత్రం. ఉత్తమ సినిమాటోగ్రాఫర్
- టెక్సాస్ అల్టిమేట్ షార్ట్స్ ఉత్తమ విదేశీ నాటకం.
- లాస్ ఏంజిల్స్ సినీ ఫెస్టివల్‌లో సెమీ ఫైనలిస్ట్.
- మాస్కోలోని యురేషియా ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో సెమీ ఫైనలిస్ట్.
- షార్ట్స్ టీవీ.. సాంటా మోనికా యూఎస్ ఉత్తమ భారతీయచిత్రంగా ఎంపిక.
- వెనిజులాలోని ఫైవ్ కాంటినెంట్స్ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌కు ఎంపిక.
- రొమేనియాలోని బుకారెస్ట్ షార్ట్‌కట్ సినీ ఫెస్ట్‌కు ఎంపిక.
- జయపుర ఫిలిం వరల్డ్‌కు ఎంపిక.
- లండన్‌లో బెస్ట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బెస్ట్ షార్ట్ ఫిలింగా ఎంపిక.



రోజూ ఎన్నో సంఘటనలు జరుగుతుంటాయి. భిన్న రకాల మనుషులు.. భిన్న వ్యక్తిత్వాలు.. భిన్న రంగాలు. ఈ పోటీ ప్రపంచంలో ఒక్కొక్కరు ఒక్కో హడావిడిలో బతుకీడుస్తుంటారు. ఈ క్రమంలో కొందరు కావాలని తప్పుదారి ఎంచుకుంటే.. కొందరు అనుకోకుండా చిక్కుల్లో ఇరుక్కుపోతారు. వీటిని పరిశీలించేవాళ్లూ ఉంటారు. అలాంటివారిలో ఒకరు టాక్సీ డ్రైవర్. ఈ కథాంశంతో వచ్చిన సినిమానే ప్రక్షాళన.

సందర్భం ఏంటి?

సినిమా వాళ్లకు కేన్స్ ఒక స్వర్గం. అదొక స్వప్నం లాంటిది. సినిమా తీసిన ప్రతి ఒక్కరూ కేన్స్ చిత్రోత్సవాలకు తమ సినిమా ఎంపికైతే పరిశ్రమను జయించినట్లు భావిస్తారు. కొందరైతే కేన్స్‌కు నామినేట్ అయినా చాలనుకుంటారు. కానీ ప్రక్షాళన అనే ఒక సాధారణ లఘుచిత్రం విదేశీ చిత్రోత్సవాల్లో సందడి చేసి అవార్డులు సొంతం చేసుకోవడమే కాదు.. కేన్స్ చిత్రోత్సవాలకు కూడా ఎంపికైంది. తెలుగు సినిమా సత్తాను ప్రపంచానికి చాటింది.

యువకులు కలిసి..

ప్రక్షాళన సినిమాను ఆరుగురు యువకులు కలిసి తీశారు. అంతా ఒక యూనిట్‌గా ఏర్పడి సమాజంలో జరుగుతున్న వాస్తవ ఘటనలను ఆధారంగా చేసుకుని సినిమా రూపంలోకి తీసుకొచ్చారు. తమ అద్భుతమైన ప్రదర్శనకు అవార్డులు రావడంతోపాటు కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌కు కూడా ఎంపికవడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిభా వంతులు



ఈ సినిమాకు రూపకర్త, దర్శకుడు రామ్‌కట్రు. మొదట ఆయన సినిమా చేద్దామనుకున్నాడు. తర్వాత లండన్‌లో సినిమాటోగ్రఫీ పూర్తిచేసిన శోభన్ వేముల.. బుల్లితెరపై ప్రతిభ చాటుతున్న భరత్‌రాజ్.. శాంతిరావు, నటుడు పవన్ అంతా కలిసి రామ్ కట్రూ ఆలోచనలతో 'ప్రక్షాళన' చిత్రానికి ప్రాణం పోశారు. దాదాపు ఆరురోజుల పాటు కష్టపడి 19 నిమిషాల నిడివి గల అద్భుతంగా తెరకెక్కించారు. అందులో లీడ్‌రోల్‌లో భరత్‌రాజ్‌తో పాటు శాంతిరావు.. పవన్.. ఆరోహి నాయుడు.. రవి నటించారు. విదేశీ ఫిలిం ఫెస్టివల్స్‌లో నామినేట్ కావడంతో ఈ లఘుచిత్రం సోషల్ నెట్‌వర్కింగ్‌లో సందడి చేస్తున్నది.

కథాంశమేంటి?

పల్లెటూరు నుంచి వచ్చిన ఒక యువకుడు పట్నంలో టాక్సీ డ్రైవర్‌గా చేరాడు. తన ప్రయాణంలో ఎంతోమందితో కలిసి ప్రయాణం చేశాడు. సహృదయంతో ఆలోచించే ఆ యువకుడికి ఎదురైన సంఘటనలు.. పడిపోతున్న మానవ విలువలు ఆలోచింపజేశాయి. వాటిని ప్రక్షాళన చేయాలని టాక్సీడ్రైవర్‌గా ప్రతిన బూనుతాడు. ఇదే అంశాన్ని నగరానికి చెందిన యువకులు లఘు చిత్రంగా మార్చారు.



వాస్తవికత ఆధారంగా

అమెరికాలో స్థిరనడిన రామ్ కట్రూ అక్కడి భారతీయులు పడే ఇబ్బందులను గమనించాడు. విదేశీయులు కొందరు వారిని అవమానించే తీరును గుర్తించాడు. అయినా మంచితనంతో నెట్టుకొచ్చే చాలామంది అతనికి తారసపడ్డారు. తన అమెరికా ప్రయాణంలో ఎన్నో కోణాలు.. మరెన్నో అనుభూతులు.. ఇంకెన్నో అనుభవాలు..వీటన్నింటినీ లఘుచిత్రంగా మలచాలని అనుకున్నాడు. న్యూయార్క్ ఫిలిం అకాడమీలో తాను నేర్చుకున్న కోర్స్ ద్వారా దాదాపు మూడేళ్ల క్రితం హైదరాబాద్ వచ్చాడు. అలా తాను చూసిన.. ఎదుర్కొన్న పరిణామాలను టాక్సీ డ్రైవర్‌కు అన్వయించి లఘుచిత్రాన్ని పూర్తి చేశాడు.

ఊహించని ఎంపిక..

ఆరు రోజుల పాటు చిత్రీకరించిన ప్రక్షాళన లఘుచిత్రాన్ని పూర్తిగా రాత్రివేళలల్లోనే రూపొందించారు. విదేశాల్లో మన ప్రతిభను చాటేందుకు.. ఔత్సాహిక సాంకేతిక నిపుణులకు మరింత ప్రోత్సాహం కల్పించేందుకు.. వారిలో ఉత్సాహం నింపేందుకు ఈ చిత్రాన్ని అనేక విదేశీ ఫిలిం ఫెస్టివల్స్‌కు పంపారు. అయితే ఊహించని రీతిలో అనేక దేశాల ఫిలిం ఫెస్టివల్స్‌లో అవార్డులు సాధించింది. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌కు ఈ చిత్రం ఎంపిక కావడం పట్ల చిత్ర యూనిట్ ఆనందం వ్యక్తం చేశారు.




కండ కరిగితే అందమోయ్!

మజిల్స్‌ను చూసి ఫిట్‌గా ఉన్నారని చెప్పొచ్చు. కానీ కండరాల వరుసలో అస్తవ్యస్తంగా ఉంటే ఎంత మంచి కండలున్నా వేస్ట్ అంటున్నారు నిపుణులు. కండల్ని కూడా కరిగించి అందాన్ని సొంతం చేసుకోవాలని సూచిస్తున్నారు. మంచి కండరాకృతి అందంగా కనిపించాలంటే చేయాల్సిన వ్యాయామాలు ఇవి.

భుజాలు తిప్పండి:

బలంగా ఉన్నాం అంటే లావు కండరాలు కలిగి ఉండటమే కాదు.. వాటికంటూ ఓ ఆకృతి ఉండాలి. అలా మంచి ఆకృతి రావాలంటే వ్యాయామంలో భాగంగా రోజూ భుజాలను తిప్పుతూ ఉండాలి. దీనివల్ల కండరాల్లో కదలికలు ఏర్పడి మంచి షేప్ వస్తాయి.






పుల్ అప్స్ చేయండి:

భుజాలు తిప్పడం వల్ల ఫలితం వెంటనే కాకుండా ఒక క్రమ పద్ధతిలో నెమ్మదిగా వస్తుంది. కాబట్టి ఆలస్యం అవుతుందనుకునే వాళ్లు క్రమం తప్పకుండా పుల్ అప్స్ పాటించాలి. ఏదైనా సజ్జలాంటిది కానీ.. చెట్టులాంటిది కానీ చూసుకుని రోజూ 10-20 నిమిషాలు పుల్ అప్స్ చేస్తే కండరాల ఆకారంలో మార్పు వస్తుంది.

బర్పీస్ వేయండి

ఇది మీరు రెగ్యులర్‌గా చేసేదే అయుంటుంది. అలా అని దాన్ని నిర్లక్ష్యం చేయొద్దు. కింద కూర్చోవడం.. పైకి లేవడం.. గుంజీలు తీయడం లాంటివి బర్పీస్‌లో భాగం. ఒక భుజం కండరాలే కాదు కీలు కండరాలు.. పిక్క కండరాలు కరిగి ధృడమవుతాయి. మంచి ఆకారం పొందుతాయి.




పుష్ అప్స్



శరీరంలోని కొవ్వులను కరిగించి మంచి ధారుడ్యాన్ని పెంపొందించే వాటిలో ఇది ప్రధానమైనది. రెగ్యులర్‌గా పుష్ అప్స్ చేసేవారు జిమ్‌కు వెళ్లేవారి కంటే కూడా ఎక్కువ కండ కరుగుతుందని.. దానివల్ల బలంగా ఉంటారని నిపుణుల అభిప్రాయం. కాబట్టి రెగ్యులర్‌గా పుష్‌అప్స్ చేయాలని సలహా ఇస్తున్నారు.

జంపింగ్ జాక్స్:



భుజాల ఎక్సర్‌సైజ్ చేసినా.. అప్ అండ్ డౌన్స్ వేసినా.. ఇంకా ఏది చేసినా వ్యాయామంలో భాగంగా ప్రతిఒక్కరు పాటించాల్సిన కామన్ పాయింట్ జంపింగ్ జాక్స్. స్కూళ్లో వేస్తాం చూడండీ.. అలా జంపింగ్ జాక్స్ వేస్తే మంచి కండరం కరిగి మంచి షేప్.. బ్యూటీ వస్తుంది!

సుడోకు

డైలీ సుడోకు 133 సమాధానం

2	1	3	8	6	9	4	7	5
8	7	6	5	4	1	2	3	9
4	9	5	7	2	3	1	6	8
9	6	4	3	1	5	8	2	7
3	5	2	6	7	8	9	4	1
7	8	1	4	9	2	3	5	6
6	2	9	1	3	7	5	8	4
5	3	7	9	8	4	6	1	2
1	4	8	2	5	6	7	9	3

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -134

				8	4	3		
8			6				9	
	5	6			9		1	
	1		2					8
		9				5		
2					3		4	
	8		9			4	3	
	2				1			7
		7	4	6				

ట్వీట్



కల్యాణి ప్రియదర్శన్
@kalyanipriyan

నా స్నేహితులు ఫొటో పెట్టాలని బలవంతం చేశారు. నన్ను ఒప్పించారు. మీరు ఏం అనుకుంటున్నారో నాకైతే తెలియదు.



కల్యాణి ప్రియదర్శన్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

21,826

కామన్‌మ్యాన్ వాయిస్

కిరణ్ కుమార్(లలితా జ్యువెలర్స్) : డబ్బులెవరికీ ఊరికే రావు.
నీరవ్, మాల్యా, కొఠారి : అవును దోచుకుంటేనే వస్తాయి.
-Akhilesh Kasani

మనుషులు నకిలీ నోట్లు తయారుచేస్తారు. మరి నోట్లు నకిలీ మనుషులనే తయారు చేస్తుంది. సంపద అంటే డబ్బు కాదు. మంచి మనసుంటే చాలు.
-E Ravi Kanth

కొందరు ఇంట్లో కాపలాకుక్కను దారం పట్టుకొని దాని బాత్రూం పనులు కూడా చేయగలరు. కానీ నమ్ముకున్న మనుషులపై నమ్మకం ఉంచరు.
-Kavanur Jayasankar

వైరల్ వీడియో



సైబర్ నేరాల మీద విజయ్ దేవరకొండ నటించిన యాడ్ యూట్యూబ్‌లో ట్రెండింగ్ అవుతున్నది.

Arjun Reddy Vijay Devarakonda On Matrimonial Frauds
Total views : 139,656+
Published on 19 Feb 2018

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
బుధవారం 21 ఫిబ్రవరి 2018



'రంగస్థలం' చిత్రంలో రామ్‌చరణ్

వరుణ్‌తేజ్ 'అహంబ్రహ్మాస్మి'



వరుణ్‌తేజ్

జలాంతర్గామి నేపథ్యంలో రూపొందిన తొలి భారతీయ చిత్రంగా 'ఘాజీ' సంచలనం సృష్టించింది. దర్శకుడు సంకల్ప్ రెడ్డి సృజనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. తాజాగా ఆయన మరో ప్రయోగాత్మక చిత్రానికి సన్నాహాలు చేస్తున్నారు. శ్రీహరికోట నేపథ్యంలో స్పేస్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమాలో వరుణ్‌తేజ్ కథానాయకుడిగా నటించనున్నారు. ఇందులో ఆయన ఆస్ట్రోనాట్ (వ్యోమగామి) పాత్రలో కనిపించబోతున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన పూర్వ నిర్మాణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రానికి 'అహంబ్రహ్మాస్మి' అనే టైటిల్‌ను ఖరారు చేయబోతున్నట్లు తెలిసింది. మానవీయత, సైన్స్ అంశాల కలబోతగా వినూత్న కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని సమాచారం. మే నెలలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి ఈ సంవత్సరాంతంలో విడుదల చేసే ఆలోచనలో చిత్ర బృందం ఉన్నట్లు తెలిసింది. ఇదిలా వుండగా ఇటీవలే విడుదలైన వరుణ్‌తేజ్ తాజా చిత్రం 'తొలిప్రేమ' చక్కటి ప్రేక్షకారదణను సొంతం చేసుకుంది.

కొత్త దర్శకుడితో..!



శ్రీనివాస్

శ్రీవాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సాక్ష్యం' చిత్రంలో నటిస్తున్నారు బెల్లంకొండ శ్రీనివాస్. ఈ సినిమా చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. దీనితో పాటు తాజాగా ఆయన మరో చిత్రాన్ని అంగీకరించారు. వంశధార క్రియేషన్స్ పతాకంపై నవీన్ సొంటినేని నిర్మించనున్న ఈ చిత్రం ద్వారా శ్రీనివాస్ దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'తొలి ప్రయత్నంగా బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా ఓ చిత్రాన్ని తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నాం. దృశ్యం, గోపాల గోపాల, డిక్టేటర్ చిత్రాలకు సహాయ దర్శకుడిగా పనిచేసిన శ్రీనివాస్‌ని ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం చేస్తున్నాం. పేరున్న సాంకేతిక నిపుణులు, నటీనటులు నటించనున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాల్ని త్వరలో తెలియజేస్తాం. ఈ నెల 22న చిత్రాన్ని లాంఛనంగా హైదరాబాద్‌లో ప్రారంభిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఛోటా.కె.నాయుడు, ఎడిటింగ్: ఛోటా కె. ప్రసాద్, ఆర్ట్: చిన్నా, సహనిర్మాత: చాగంటి శాంతయ్య, నిర్మాణం: వంశధార క్రియేషన్స్.



జాన్వీకపూర్

వారసత్వం చిత్రసీమకు కొత్తేమీకాదు. అన్ని రంగాల్లో మాదిరిగానే చిత్రసీమలో కూడా వారసుల హవా కనిపిస్తుంటుంది. తమ అభిమాన నాయకానాయికల వారసుల అరంగేట్రం గురించి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. గతంలో ఎంతో మంది వారసులు చిత్రసీమలో రాణించి వారి తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచారు. ఇటీవల కాలంలో కొందరు వారసుల చిత్రాలు నిర్మాణ దశ నుంచే ఇండస్ట్రీ వర్గాలతో పాటు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. త్వరలో వెండితెరపై అరంగేట్రం చేయబోతున్న నయా వారసుల ముచ్చట్లివి...



ప్రణవ్

నయా వారసులం!



శివాని

రాజశేఖర్ వారసురాలిగా శివాని

తెలుగులో నటవారసత్వం విషయంలో మహిళల ప్రాధాన్యత తక్కువే. ఈ దిశగా ఎక్కువ ప్రయత్నాలు జరగలేదు. ఒకరిద్దరు అదృష్టాన్ని పరీక్షించుకున్నా రాణించలేకపోయారు. ప్రస్తుతం మంచు లక్ష్మి, నిహారిక మాత్రమే నట వారసులుగా ప్రతిభను చాటుకుంటున్నారు. వారి బాటలో మరో వారసురాలు అడుగు వేయనుంది. రాజశేఖర్, జీవిత కూతురు శివాని త్వరలో తెలుగులో అరంగేట్రం చేయబోతున్నది. బాలీవుడ్‌లో మంచి వసూళ్లను సాధించిన 'టూ స్టేట్స్' రీమేక్‌లో శివాని కథానాయికగా నటించనున్నది. అడవి శేష్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి వెంకట్ రెడ్డి దర్శకత్వం వహించనున్నారు. అలాగే తమిళంలో విష్ణు విశాల్‌తో మరో సినిమా చేయబోతున్నది. నటిగా తల్లిదండ్రులే తనకు స్ఫూర్తి అని, చిన్నతనం నుంచి వారి సినిమాలుచూస్తూ పెరిగానని, అవే తనలో నటన పట్ల ఆసక్తిని కలిగించాయని చెబుతున్నది శివానీ. నటన పట్ల శివానీకి ఉన్న అభిరుచిని గుర్తించిన రాజశేఖర్, జీవిత ఆమెను ప్రోత్సహించారు. నటన, సంప్రదాయ విదేశీ నృత్యాల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. 'టూ స్టేట్స్' రీమేక్ త్వరలో సెట్స్‌పైకిరానున్నది.

భారతీయ చిత్ర పరిశ్రమలో శ్రీదేవిని అతిలోక సుందరిగా అభివర్ణిస్తారు. అపురూపమైన అందం, అద్భుతాభినయంతో ఎన్నో మరపురాని పాత్రలకు ప్రాణంపోశారామె. హిందీతో పాటు తెలుగు, తమిళ చిత్రసీమల్లో నటిగా తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సృష్టించుకున్నారు. ఆమె నట వారసురాలిగా జాన్వీకపూర్ 'ధడక్' సినిమాతో వెండితెరపై అడుగుపెడుతున్నది. జాన్వీకపూర్ అరంగేట్రంపై చాలా కాలంగా వార్తలు వినిపిస్తూ వచ్చాయి. బాలీవుడ్ అగ్ర హీరోల చిత్రాలతో పాటు మహేష్‌బాబు సరసన తెలుగు సినిమాలో ఆమె నటించనున్నట్లు పుకార్లు షికారు చేశాయి. కానీ అవేమీ నిజం కాలేదు. జాన్వీకపూర్ ఎంట్రీ ఎప్పుడా అని ఎదురుచూసిన అభిమానుల నిరీక్షణకు 'ధడక్'తో తెరపడింది. మరాఠీ భాషలో అత్యధిక వసూళ్లను సాధించడంతో పాటు విమర్శకుల ప్రశంసల్ని అందుకున్న 'సైరాత్' సినిమా ఆధారంగా ఈ చిత్రం రూపొందుతున్నది. కరణ్‌జోహార్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు షాహిద్‌కపూర్ సోదరుడు ఇషాన్ కట్టర్ కథానాయకుడిగా నటిస్తున్నారు. ఈ ఏడాది జూలైలో విడుదలకానున్న ఈ సినిమా కోసం బాలీవుడ్ వర్గాలతో పాటు శ్రీదేవి కుటుంబ సభ్యులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాలో శ్రీదేవి తరహాలోనే జాన్వీ తన నటనతో అభిమానుల్ని ఆకట్టుకోవడం ఖాయమని చెబుతున్నారు.



కల్యాణ్‌దేవ్



తనయుడు మోక్షజ్ఞతో బాలకృష్ణ

పూరి తనయుడి 'మెహబూబా'

ప్రస్తుతం తెలుగు సినీ వర్గాల దృష్టిని ఆకర్షిస్తున్న చిత్రాల్లో 'మెహబూబా' ఒకటి. తనయుడు ఆకాష్‌ను కమర్షియల్ హీరోగా ఆవిష్కరించే ప్రయత్నం చేస్తూ దర్శకుడు పూరి జగన్నాథ్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. 1971 ఇండియా పాకిస్థాన్ యుద్ధ నేపథ్యంలో ప్రేమ, హీరోయిజం అంశాలను మిళితం చేస్తూ స్వీయ దర్శకత్వంలో ఆయన ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. గతంలో ఆకాష్.. 'ధోనీ' 'ఆంధ్రాపోరి' వంటి సినిమాలు చేసినా విజయాలు దక్కలేదు. ఆకాష్ నటిస్తున్న తొలి కమర్షియల్ చిత్రం 'మెహబూబా'. తనయుడికి మంచి హిట్‌ను అందించాలనే తపనతో పూరిజగన్నాథ్ సినిమాను తెరకెక్కిస్తున్నారు. టీజర్‌లో కొత్త పంథాలో కనిపించి ఆకట్టుకున్నారు ఆకాష్. వేసవిలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానున్నది.

'హలో' సినిమాతో ఇటీవలే దర్శకుడు ప్రియదర్శన్, నటి లిజీల తనయ కళ్యాణి తెలుగు చిత్రసీమకు పరిచయమైంది. సహజ అభినయంతో తొలి సినిమాతోనే దక్షిణాది వర్గాల దృష్టిని ఆకర్షించింది. ప్రస్తుతం ఆమె శర్వానంద్‌తో మరో సినిమా చేయబోతున్నట్లు తెలిసింది.

మలయాళ అగ్ర నటుడు మోహన్‌లాల్ తనయుడు ప్రణవ్ మోహన్‌లాల్ మలయాళ చిత్రం 'ఆది' సినిమాతో కథానాయకుడిగా పరిచయమయ్యారు. యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో గత నెలలో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రంలో ప్రణవ్ నటనకు ప్రశంసలు దక్కాయి. బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ ఎంట్రీ కోసం నందమూరి అభిమానులు చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. తనయుడి ఎంట్రీపై ఇన్నాళ్లు మౌనం దాల్చుతూ వచ్చిన బాలకృష్ణ ఈ ఏడాది మోక్షజ్ఞ సినిమా ఉంటుందని ఇటీవలే ప్రకటించారు. సురేష్‌బాబు తనయుడు, రానా సోదరుడు అభిరామ్ సైతం హీరోగా అరంగేట్రం చేయబోతున్నారంటూ కొన్నాళ్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. మెగా కుటుంబం నుంచి మరో హీరో వెండితెరపై అడుగుపెడుతున్నారు. చిరంజీవి చిన్న కూతురు శ్రీజ భర్త కళ్యాణ్‌దేవ్ కథానాయకుడిగా నటించనున్న కొత్త చిత్రం ఇటీవలే ప్రారంభమైంది. ఈ చిత్ర ప్రారంభోత్సవ వేడుకకు చిరంజీవి స్వయంగా హాజరుకావడం విశేషం. వీరి బాటలోనే మరికొందరు వారసులు సినీ పరిశ్రమలో అరంగేట్రం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

తండ్రి బాటలోనే



విక్రమ్, ధృవ్

దక్షిణాది చిత్రసీమలో హీరో విక్రమ్‌ది ప్రత్యేకమైన పంథా. పాత్రలపరంగా ప్రతి సినిమాలో ప్రయోగాలు చేయడానికి తపిస్తుంటారాయన. అదే ఆయనకు జాతీయ స్థాయిలో గుర్తింపును తెచ్చిపెట్టింది. తనయుడి ధృవ్ తెరంగేట్రాన్ని గురించి ఇటీవలే విక్రమ్ స్వయంగా ప్రకటించారు. లండన్‌లో విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకున్న ధృవ్ తొలుత 'గుడ్‌నైట్ చార్లీ' అనే లఘు చిత్రంలో నటించాడు. ఆహార్యం, నటనలో తండ్రిని గుర్తుచేశారు. తాజాగా తెలుగులో విజయవంతమైన 'అర్జున్‌రెడ్డి' రీమేక్‌తో ధృవ్ హీరోగా కోలీవుడ్‌లో అరంగేట్రం చేస్తున్నారు. 'వర్మ' పేరుతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి బాలా దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో బాలా దర్శకత్వంలో వచ్చిన 'సేతు' సినిమాతోనే విక్రమ్ సినీ జీవితం మలుపుతిరిగింది. తన మాదిరిగానే కొడుకు కెరీర్‌ను బాలా నిలబెడతారనే విశ్వాసంతో ఉన్నారు విక్రమ్.



నరేష్, కృష్ణ, విజయనిర్మల, నవీన్‌కృష్ణ

ఆ మాటలే పద్మభూషణ్‌తో సమానం!

'ఏఎన్నార్, శివాజీగణేషన్,రజనీకాంత్ లాంటి అగ్రకథానాయకులు మొదలుకొని చంద్రమోహన్ వరకు అందరితో సినిమాలు తీసిన ఏకైక మహిళా దర్శకురాలు విజయనిర్మల. 44 సినిమాలకు దర్శకత్వం వహించారు. వాటిలో సగానికి పైగా చిత్రాల్లో నేను నటించడం ఆనందంగా ఉంది. దర్శకురాలిగా విజయనిర్మల యాభై చిత్రాల మైలురాయిని పూర్తిచేసుకోవాలి ' అని అన్నారు ప్రముఖ నటుడు, సూపర్‌స్టార్ కృష్ణ. మంగళవారం హైదరాబాద్ నటి, దర్శకురాలు విజయనిర్మల 73వ పుట్టినరోజు వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ 'ఓ సందర్భంలో నా పుట్టినరోజు వేడుకలకు హాజరైన అభిమానుల్ని చూసిన దాసరి నారాయణరావు.. ఏ స్టార్ హీరోయిన్‌కు ఈ స్థాయిలో క్రేజ్ లేదు అన్నారు. ఆయన మాటలే నాకు పద్మభూషణ్‌తో సమానం' అన్నారు. కృష్ణ మాట్లాడుతూ 'విజయనిర్మలకు ప్రభుత్వపరంగా సరైన గుర్తింపురాలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమె సేవలను గుర్తించి పద్మభూషణ్ పురస్కారాన్ని అందించాలని కోరుకుంటున్నాను' అన్నారు. ఈ కార్యక్రమంలో బీప రాజు, సీనియర్ నరేష్, నవీన్ విజయ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం వినోదం



రాజేంద్రప్రాద్, సాక్షిచౌదరి

రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఊ.పె.కు.హ'. 'ఊళ్లో పెళ్లికి కుక్కల హడావుడి' ఉపశీర్షిక. నిధి ప్రసాద్ దర్శకుడు. భాగ్యలక్ష్మి నిర్మాత. సాక్షిచౌదరి కథానాయిక. ఈ చిత్ర ట్రైలర్‌ను సోమవారం హైదరాబాద్‌లో రాజేంద్రప్రసాద్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'కామెడీ ఆఫ్ ఎర్రర్స్ అంశాలతో తెరకెక్కించిన చిత్రమిది. భారీ తారాగణంతో సినిమాను రూపొందించారు. ప్రేక్షకులకు వందశాతం వినోదాన్నందిస్తుంది' అన్నారు. 'ఆరుగురు సోదరులు కలిగిన ఓ అన్నయ్య కథ ఇది. వారి పెళ్లి నేపథ్యంలో వినోదప్రధానంగా సాగుతుంది. అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాయి. విడుదలకు సిద్ధంగా ఉంది' అని దర్శకుడు చెప్పారు. ఆద్యంతం హాస్యప్రధానంగా సాగే చిత్రమిదని కథానాయిక సాక్షిచౌదరి పేర్కొంది.

మట్టిమనుషుల ప్రేమకథ



శ్రావ్య, భరత్‌చంద్ర

నెల్లుట్ల ప్రవీణ్‌చందర్ రూపొందిస్తున్న తాజా చిత్రం 'సంత'. సూర్యభరత్ చంద్ర, శ్రావ్యరావు నాయకానాయికలు. 'మట్టిమనుషుల ప్రేమకథ' అని ఉపశీర్షిక. శ్రీ సుబ్రమణ్య పిక్చర్స్ పతాంపై జైవర్ధన్ బొయినేపల్లి నిర్మిస్తున్నారు. తొలి షెడ్యూల్ పూర్తయింది. నిర్మాత మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో సాగే ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ ఇది. ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతుంది. తెలంగాణలోని సుందరమైన ప్రదేశాల్లో చిత్రీకరణ జరుపుతున్నాం. చిత్ర బృందానికి మంచి పేరొస్తుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ' సంత నేపథ్యంలో సాగే మట్టిమనుషుల ప్రేమకథా చిత్రమిది. ఆద్యంతం కొత్తగా వుంటుంది. సహజత్వానికి దగ్గరగా సాగే ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందనే నమ్మకముంది' అన్నారు.

భారత ప్రభుత్వం
రోడ్డు ట్రాన్స్ పోర్ట్ మరియు హైవేస్ మంత్రిత్వ శాఖ

ప్రకటన

న్యూ ఢిల్లీ, 9 ఫిబ్రవరి 2018

ఎస్.ఒ.598(E)- జాతీయ రహదారుల చట్టం, 1956 (48 ఆఫ్ 1956) (ఇకపైన ఇక్కడ సదరు చట్టంగా రిఫర్ చేయబడుతుంది)లో సెక్షన్ 3ఎ సబ్ సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారాలు వినియోగించుకుంటూ, దిగువ షెడ్యూలులో ఇవ్వబడిన సంక్షిప్త వివరణ గల భూమి ప్రజోపయోగార్థం కావలసి ఉన్నదని భావించిన అనంతరం కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని కుమరంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో కి.మీ.44.200 నుండి కి.మీ. 94.602 వరకు భూమిపై జాతీయ రహదారి నం.363, (మంచిర్యాల్ - చంద్రాపూర్ సెక్షన్)లో నిర్మాణం (వెడల్పు నాలుగు/ఆరు - లేనింగ్ మొదలగునవి) నిర్వహణ, యాజమాన్యత, ఆపరేషన్ కొరకు అవసరమై ఉన్నది. అందుకు అట్టి భూమి అట్టి సేకరించాలనే తన ఉద్దేశ్యాన్ని ఐదుమూలంగా వ్యక్తం చేస్తున్నది.

సదరు భూమి విషయంలో ఆసక్తి గల ఏ వ్యక్తి అయినా అధికారిక గెజిట్‌లో ఈ నోటిఫికేషన్ వెలువడిన తేదీ నుండి ఇరవై - ఒక్క రోజుల్లోగా సదరు చట్టంలోని సెక్షన్ 3సి సబ్-సెక్షన్ (1) క్రింద సదరు పని కోసం అట్టి భూమి ఉపయోగించుటకు ఆక్షేపణను తెలియజేయవచ్చును.

అట్టి ప్రతి ఆక్షేపణను సమర్థ ప్రాధికారికి అంటే సబ్ కలెక్టర్/అసిస్టెంట్ కలెక్టర్/ఆర్‌డిఒ, ఆసిఫాబాద్, తెలంగాణ వారికి వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును. దాని ఆక్షేపణకు కారణాలు తెలియ జేయాలి. సమర్థ ప్రాధికారి స్వయంగా లేదా లీగల్ ప్రాక్టిషనర్ ద్వారా విచారించే అవకాశం ఆక్షేపకునికి ఇస్తారు. అట్టి ఆక్షేపణలు విచారించిన తరువాత మరియు తదుపరి విచారణ చేసిన తర్వాత సమర్థ ప్రాధికారి అవసరమని భావిస్తే ఉత్తర్వు ద్వారా ఆక్షేపణలను అనుమతించవచ్చును లేదా అనుమతించక పోవచ్చును.

సదరు చట్టంలోని సెక్షన్ 3సి యొక్క సబ్-సెక్షన్ (2) కింద సమర్థ ప్రాధికారి చేసిన ఏ ఉత్తర్వు అయినా తుదిగా ఉంటుంది.

ఈ నోటిఫికేషన్ కింద వచ్చే భూమి ప్లాన్లు, భూమి ఇతర వివరాలు సమర్థ ప్రాధికారి కార్యాలయంలో లభిస్తాయి. వాటిని ఆసక్తి గలవారు తనిఖీ చేసుకోవచ్చును.

షెడ్యూలు

తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ రహదారి నం.363 పైన కి.మీ.44.200 నుండి 94.602 వరకు (మంచిర్యాల్-చంద్రాపూర్ సెక్షన్) భూమి పై ఉన్న కట్టడంతో లేదా కట్టడం లేకుండా సేకరించవలసిన భూమి సంక్షిప్త వివరణ.

క్ర. సం.	జిల్లా	తాలూకా	గ్రామం పేరు	సర్వే నంబరు	భూమి రకం	భూమి స్వభావం	విస్తీర్ణం చ.మీ.లలో
1	2	3	4	5	6	7	8
1	కుమరంభీమ్ ఆసిఫాబాద్	(1) రెబ్బెన	(1) పులికుంట	101	ప్రైవేట్	మాగాణి+మెట్ట	5393
				112	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1040
				108	ప్రైవేట్	మాగాణి+మెట్ట	845
				109	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1085
				110	ప్రైవేట్	మాగాణి+మెట్ట	547
				105	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1468
				121	ప్రైవేట్	మాగాణి+మెట్ట	3504
				122	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2441
				125	ప్రైవేట్	మాగాణి+మెట్ట	117
				124	ప్రైవేట్	మాగాణి+మెట్ట	4945
				4	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2407
				6	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1955
				7	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1144
				66	ప్రైవేట్	మాగాణి+మెట్ట	399
				16	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1423
				15	ప్రైవేట్	మాగాణి+మెట్ట	4143
				17/4	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1160
				17/8	ప్రైవేట్	మాగాణి+మెట్ట	8421
				17/9	ప్రైవేట్	మాగాణి+మెట్ట	68
				17/3	ప్రైవేట్	మాగాణి+మెట్ట	5315
				17/2	ప్రైవేట్	మాగాణి+మెట్ట	5140
				నది	ప్రభుత్వ	మాగాణి+మెట్ట	1034
					గ్రామం మొత్తం		**53994**
			(2) గంగాపూర్	342	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1228
				338	ప్రైవేట్	మాగాణి+మెట్ట	535
				337	ప్రైవేట్	మాగాణి+మెట్ట	938
				340	ప్రైవేట్	మాగాణి+మెట్ట	3573
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	1726
				నది	ప్రభుత్వ	మాగాణి+మెట్ట	647
					గ్రామం మొత్తం		**8646**
			(3) రెబ్బెన	రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	3208
				కాలువ	ప్రభుత్వ	మాగాణి+మెట్ట	158
				25	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1872
				26	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2895
				28	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2684
				27	ప్రైవేట్	మాగాణి+మెట్ట	447
				33	ప్రైవేట్	మాగాణి+మెట్ట	830
				34	ప్రైవేట్	మాగాణి+మెట్ట	4024
				32/1	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1767
				36	ప్రైవేట్	మాగాణి+మెట్ట	5353
				84	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1558
				83	ప్రైవేట్	మాగాణి+మెట్ట	401
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	290
				40	ప్రైవేట్	మాగాణి+మెట్ట	147
				41	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1911
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	2208
				294	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1780
				353	ప్రైవేట్	మాగాణి+మెట్ట	9369
				కాలువ	ప్రభుత్వ	మాగాణి+మెట్ట	6393
				291	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2739
				308	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2860
				208	ప్రైవేట్	మాగాణి+మెట్ట	230
				రోడ్	ప్రభుత్వ	మెట్ట	760
				319	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2179
				320	ప్రైవేట్	మాగాణి+మెట్ట	4131
				రోడ్	ప్రభుత్వ	మెట్ట	362
				333	ప్రైవేట్	మాగాణి+మెట్ట	306
				322	ప్రైవేట్	మాగాణి+మెట్ట	31
				324	ప్రైవేట్	మాగాణి+మెట్ట	619
				325	ప్రైవేట్	మాగాణి+మెట్ట	181
				330	ప్రైవేట్	మాగాణి+మెట్ట	268
				326	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1148
				రోడ్	ప్రభుత్వ	మెట్ట	481
				329/1	ప్రైవేట్	మాగాణి+మెట్ట	3554
					గ్రామం మొత్తం		**67145**
			(4) నేర్పల్లి	రోడ్	ప్రభుత్వ	మెట్ట	3502
				3	ప్రైవేట్	మాగాణి+మెట్ట	3772
				189	ప్రైవేట్	మాగాణి+మెట్ట	302
				4	ప్రైవేట్	మాగాణి+మెట్ట	3556
				5	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1048
				6	ప్రైవేట్	మాగాణి+మెట్ట	6592
				రోడ్	ప్రభుత్వ	మెట్ట	1341
				7	ప్రైవేట్	మాగాణి+మెట్ట	97
				181	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1237
				8	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2447
				180/2	ప్రైవేట్	మాగాణి+మెట్ట	564
				179	మాగాణి+మెట్ట	మాగాణి+మెట్ట	3349
				126	ప్రైవేట్	మాగాణి+మెట్ట	8241
				రోడ్	ప్రభుత్వ	మెట్ట	1181
				9	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1578
				125	ప్రైవేట్	మాగాణి+మెట్ట	11031
					గ్రామం మొత్తం		**49836**
			(5) ఉదనపల్లి	46	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2632
				15	ప్రైవేట్	మాగాణి+మెట్ట	9863
				కాలువ	ప్రభుత్వ	మాగాణి+మెట్ట	1642
				13	ప్రైవేట్	మాగాణి+మెట్ట	7320
				14	ప్రైవేట్	మాగాణి+మెట్ట	999
				12	ప్రైవేట్	మాగాణి+మెట్ట	175
				6	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2736
				2	ప్రైవేట్	మాగాణి+మెట్ట	3116
				5	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2546
				రోడ్	ప్రభుత్వ	మెట్ట	243
				3	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2901
					గ్రామం మొత్తం		**34173**
			(6) కొండపల్లి	162	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1135
				163	ప్రైవేట్	మాగాణి+మెట్ట	4737
				కాలువ	ప్రభుత్వ	మాగాణి+మెట్ట	263
					గ్రామం మొత్తం		**6134**
			(7) ఖైర్గాం	137	ప్రైవేట్	మాగాణి+మెట్ట	3146
				136	ప్రైవేట్	మాగాణి+మెట్ట	383
				138	ప్రైవేట్	మాగాణి+మెట్ట	4019
				132/9	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1632
				129	ప్రైవేట్	మాగాణి+మెట్ట	4003
				125	ప్రైవేట్	మాగాణి+మెట్ట	196
				128	ప్రైవేట్	మాగాణి+మెట్ట	565
				127	ప్రైవేట్	మాగాణి+మెట్ట	266
				186	ప్రైవేట్	మాగాణి+మెట్ట	57
				34	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2895
				31	ప్రైవేట్	మాగాణి+మెట్ట	303
				33	ప్రైవేట్	మాగాణి+మెట్ట	3383
				40	ప్రైవేట్	మాగాణి+మెట్ట	5015
				41	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1651
				39	ప్రైవేట్	మాగాణి+మెట్ట	14092
				రోడ్	ప్రభుత్వ	మెట్ట	3843
				38	ప్రైవేట్	మాగాణి+మెట్ట	4599
					గ్రామం మొత్తం		**50047**
		(2) ఆసిఫాబాద్	(8) మోటుగూడ	16	ప్రైవేట్	మాగాణి+మెట్ట	439
				రోడ్	ప్రభుత్వ	మెట్ట	690
				109	ప్రైవేట్	మాగాణి+మెట్ట	3006
				110	ప్రైవేట్	మాగాణి+మెట్ట	4047
				112	ప్రైవేట్	మాగాణి+మెట్ట	324
				111	ప్రైవేట్	మాగాణి+మెట్ట	313
				8	ప్రైవేట్	మాగాణి+మెట్ట	867
				రోడ్	ప్రభుత్వ	మెట్ట	566
				46	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1248
				65	ప్రైవేట్	మాగాణి+మెట్ట	576
				68	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1594
				69	ప్రైవేట్	మాగాణి+మెట్ట	175
					గ్రామం మొత్తం		**13845**
			(9) బురుగూడ	105	ప్రైవేట్	మాగాణి+మెట్ట	4150
				104	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1946
				106	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2663
				107	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1306
				108	ప్రైవేట్	మాగాణి+మెట్ట	6422
				109	ప్రైవేట్	మాగాణి+మెట్ట	104
				రోడ్	ప్రభుత్వ	మెట్ట	1199
				115	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2604
				98	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2152
				94	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2416
				116	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2616
				రోడ్	ప్రభుత్వ	మెట్ట	193
				158	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2421
				123	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2470
				157	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2272
				124	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2186
				126	ప్రైవేట్	మాగాణి+మెట్ట	336
				145	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1009
				127	ప్రైవేట్	మాగాణి+మెట్ట	740
				136	ప్రైవేట్	మాగాణి+మెట్ట	185
				137	ప్రైవేట్	మాగాణి+మెట్ట	226
				138	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1302
				142	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1601
				141	ప్రైవేట్	మాగాణి+మెట్ట	92
				కాలువ	ప్రభుత్వ	మాగాణి+మెట్ట	372
				139	ప్రైవేట్	మాగాణి+మెట్ట	892
				140	ప్రైవేట్	మాగాణి+మెట్ట	711
					గ్రామం మొత్తం		**44588**
			(10) గోదవల్లి	95	ప్రైవేట్	మాగాణి+మెట్ట	10148
				36	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1548
				39	ప్రైవేట్	మాగాణి+మెట్ట	5005
				40	ప్రైవేట్	మాగాణి+మెట్ట	743
				38	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1525
				45	ప్రైవేట్	మాగాణి+మెట్ట	988
				46	ప్రైవేట్	మాగాణి+మెట్ట	468
					గ్రామం మొత్తం		**20424**
			(11) ఆసిఫాబాద్	రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	4676
				45	ప్రైవేట్	మాగాణి+మెట్ట	4721
				కాలువ	ప్రభుత్వ	మాగాణి+మెట్ట	18699
					గ్రామం మొత్తం		**28096**
			(12) రాజంపేట్	21	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2205
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	674
				14	ప్రైవేట్	మాగాణి+మెట్ట	7133
					గ్రామం మొత్తం		**10013**
			(13) జనకాపూర్	కాలువ	ప్రభుత్వ	మాగాణి+మెట్ట	2489
				103	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2772
				102	ప్రైవేట్	మాగాణి+మెట్ట	10344
				101	ప్రైవేట్	మాగాణి+మెట్ట	6167
				116	ప్రైవేట్	మాగాణి+మెట్ట	3842
				120	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2400
				110	ప్రైవేట్	మాగాణి+మెట్ట	10203
				141	ప్రైవేట్	మాగాణి+మెట్ట	520
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	1420
				16	ప్రైవేట్	మాగాణి+మెట్ట	3386
				217/1	ప్రైవేట్	మాగాణి+మెట్ట	929
				27	ప్రైవేట్	మాగాణి+మెట్ట	6450
				25	ప్రైవేట్	మాగాణి+మెట్ట	106
				26	ప్రైవేట్	మాగాణి+మెట్ట	594
				28	ప్రైవేట్	మాగాణి+మెట్ట	4099
				29	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1366
				30	ప్రైవేట్	మాగాణి+మెట్ట	247
				31	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1383
				32	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2988
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	1343
				130	ప్రైవేట్	మాగాణి+మెట్ట	62
				128	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2292
				124	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2328
				123	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2047
				125	ప్రైవేట్	మాగాణి+మెట్ట	316
				126	ప్రైవేట్	మాగాణి+మెట్ట	4071
				127	ప్రైవేట్	మాగాణి+మెట్ట	4452
				4	ప్రైవేట్	మాగాణి+మెట్ట	351
				5	ప్రైవేట్	మాగాణి+మెట్ట	3386
				6	ప్రైవేట్	మాగాణి+మెట్ట	107
				కాలువ	ప్రభుత్వ	మాగాణి+మెట్ట	2707
				9	ప్రైవేట్	మాగాణి+మెట్ట	5573
				10	ప్రైవేట్	మాగాణి+మెట్ట	5620
				251/2	ప్రైవేట్	మాగాణి+మెట్ట	779
				14	ప్రైవేట్	మాగాణి+మెట్ట	5045
				240	ప్రైవేట్	మాగాణి+మెట్ట	7434
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	3507
				238	ప్రైవేట్	మాగాణి+మెట్ట	192
				236	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1449
					గ్రామం మొత్తం		**114765**
			(14) సాలిగూడ	155	ప్రైవేట్	మాగాణి+మెట్ట	166
				156	ప్రైవేట్	మాగాణి+మెట్ట	355
				153	ప్రైవేట్	మాగాణి+మెట్ట	333
				186	ప్రైవేట్	మాగాణి+మెట్ట	570
				185	ప్రైవేట్	మాగాణి+మెట్ట	251
				188	ప్రైవేట్	మాగాణి+మెట్ట	863
				201	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1048
				202	ప్రైవేట్	మాగాణి+మెట్ట	341
				203	ప్రైవేట్	మాగాణి+మెట్ట	833
				204	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1334
				205	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1882
				208	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2593
				182	ప్రైవేట్	మాగాణి+మెట్ట	263
				181	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2190
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	109
				158	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1689
				159	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1180
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	151
					గ్రామం మొత్తం		**16151**
			(15) ఇప్పల్‌నవేగాం	23	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2816
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	1791
				2	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2692
				30	ప్రైవేట్	మాగాణి+మెట్ట	3156
				15	ప్రైవేట్	మాగాణి+మెట్ట	4723
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	211
				14/4	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1163
				14/3	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1039
				14/2	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1783
				14/1	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1157
				101/1	ప్రైవేట్	మాగాణి+మెట్ట	17354
				కాలువ	ప్రభుత్వ	మాగాణి+మెట్ట	5180
					గ్రామం మొత్తం		**43064**
		(3) వాంకిడి	(16) ఖైరిపూర్	41	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1163
				40	ప్రైవేట్	మాగాణి+మెట్ట	835
				39	ప్రైవేట్	మాగాణి+మెట్ట	319
				37/5	ప్రైవేట్	మాగాణి+మెట్ట	718
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	3332
				37/4	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1019
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	160
				37/2	ప్రైవేట్	మాగాణి+మెట్ట	983
				1	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2006
				2	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1291
				3	ప్రైవేట్	మాగాణి+మెట్ట	835
				4	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1567
				5	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1108
					గ్రామం మొత్తం		**15337**
			(17) తేజాపూర్	107	ప్రైవేట్	మాగాణి+మెట్ట	7494
					గ్రామం మొత్తం		**7494**
			(18) బెండారా	18/7	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1312
				18	ప్రైవేట్	మాగాణి+మెట్ట	3278
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	2116
				7	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1050
				5	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1850
				3	ప్రైవేట్	మాగాణి+మెట్ట	176
				4	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1005
				2	ప్రైవేట్	మాగాణి+మెట్ట	8184
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	3810
				18/31	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1137
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	3481
				18/34	ప్రైవేట్	మాగాణి+మెట్ట	4153
				18/45	ప్రైవేట్	మాగాణి+మెట్ట	25527
				18/36	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1411
				18/47/1	ప్రైవేట్	మాగాణి+మెట్ట	3445
				18/47/2	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1916
					గ్రామం మొత్తం		**63852**
			(19) సరండి	5	ప్రైవేట్	మాగాణి+మెట్ట	152
				43	ప్రైవేట్	మాగాణి+మెట్ట	32823
				42	ప్రైవేట్	మాగాణి+మెట్ట	9219
				6	ప్రైవేట్	మాగాణి+మెట్ట	303
				40	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1439
				39	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1421
					గ్రామం మొత్తం		**45357**
			(20) వాంకిడి కలాన్	73	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2484
				72	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2232
				67	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2017
				74	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2122
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	7729
				83	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1652
				93	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1966
				94	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1962
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	2214
				97	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2730
				29	ప్రైవేట్	మాగాణి+మెట్ట	916
				28	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1903
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	2285
				98	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2137
				99	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1518
				102	ప్రైవేట్	మాగాణి+మెట్ట	326
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	149
				103	ప్రైవేట్	మాగాణి+మెట్ట	356
				259/1	ప్రైవేట్	మాగాణి+మెట్ట	4727
				254	ప్రైవేట్	మాగాణి+మెట్ట	709
				253	ప్రైవేట్	మాగాణి+మెట్ట	736
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	426
				247	ప్రైవేట్	మాగాణి+మెట్ట	341
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	105
				210	ప్రైవేట్	మాగాణి+మెట్ట	64
				235	ప్రైవేట్	మాగాణి+మెట్ట	130
				234	ప్రైవేట్	మాగాణి+మెట్ట	251
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	3374
				231	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1500
				221	ప్రైవేట్	మాగాణి+మెట్ట	666
				222	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2025
				229	ప్రైవేట్	మాగాణి+మెట్ట	3722
				228	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2082
				259/6	ప్రైవేట్	మాగాణి+మెట్ట	181
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	309
				కాలువ	ప్రభుత్వ	మాగాణి+మెట్ట	748
					గ్రామం మొత్తం		**58797**
			(21) బంబార	248	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1321
				259	ప్రైవేట్	మాగాణి+మెట్ట	695
				258	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1554
				252	ప్రైవేట్	మాగాణి+మెట్ట	3167
				రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	137
				245	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2547
				244	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2843
				269	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2464
				243	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1998
				267	ప్రైవేట్	మాగాణి+మెట్ట	558
				242	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1526
				266	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2261
				345	ప్రైవేట్	మాగాణి+మెట్ట	567
				321	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2206
				కాలువ	ప్రభుత్వ	మాగాణి+మెట్ట	280
				కాలువ	ప్రభుత్వ	మాగాణి+మెట్ట	373
				313	ప్రైవేట్	మాగాణి+మెట్ట	85
				312	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1164
				28	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1978
				311	ప్రైవేట్	మాగాణి+మెట్ట	907
				310	ప్రైవేట్	మాగాణి+మెట్ట	786
				కాలువ	ప్రభుత్వ	మాగాణి+మెట్ట	232
				కాలువ	ప్రభుత్వ	మాగాణి+మెట్ట	333
				29	ప్రైవేట్	మాగాణి+మెట్ట	863
				309	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2840
				31	ప్రైవేట్	మాగాణి+మెట్ట	728
				32	ప్రైవేట్	మాగాణి+మెట్ట	3015
				308	ప్రైవేట్	మాగాణి+మెట్ట	3226
				కాలువ	ప్రభుత్వ	మాగాణి+మెట్ట	478
				34	ప్రైవేట్	మాగాణి+మెట్ట	470
				కాలువ	ప్రభుత్వ	మాగాణి+మెట్ట	291
				35	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1418
				307	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1262
				కాలువ	ప్రభుత్వ	మాగాణి+మెట్ట	1486
				36	ప్రైవేట్	మాగాణి+మెట్ట	1440
				299	ప్రైవేట్	మాగాణి+మెట్ట	2047
				కాలువ	ప్రభుత్వ	మాగాణి+మెట్ట	1493
				59	ప్రైవేట్	మాగాణి+మెట్ట	561
				రోడ్	ప్రభుత్వ	మెట్ట	131
					గ్రామం మొత్తం		**51727**
			(22) మహగాం	రోడ్	ప్రభుత్వ	మెట్ట	559
				4	ప్రైవేట్	మాగాణి+మెట్ట	23
				10	ప్రైవేట్	మాగాణి+మెట్ట	420
				13	ప్రైవేట్	మాగాణి+మెట్ట	35
					గ్రామం మొత్తం		**1037**
			(23) గోయాగాం	27	ప్రైవేట్	మాగాణి+మెట్ట	93
				26	ప్రైవేట్	మాగాణి+మెట్ట	9
				20	ప్రైవేట్	మాగాణి+మెట్ట	680
					గ్రామం మొత్తం		**782**
					మొత్తం విస్తీర్ణం చ.మీ.లలో		**805304**
					మొత్తం విస్తీర్ణం హెక్టార్లలో		**80.5**

[F.No. 11060/30/NHAI/PIU-NRML/KBA/2017]

రాజేష్ గుప్తా, డిప్యూటీ సెక్రటరీ

విమానాశ్రయానికి మెట్రో కనెక్టివిటీ

- ప్రధాన ప్రాంతాల నుంచి చేరేలా ప్రణాళికలు
- 12 మల్టీ లెవెల్ పార్కింగ్‌లకు టెండర్లు
- రెండోదశపై త్వరలో సీఎం కేసీఆర్ సమీక్ష
- మెట్రో రైళ్ల ఫ్రీక్వెన్సీ పెంచాలి: మంత్రి కేటీఆర్



మంగళవారం బేగంపేటలోని మెట్రోరైలు భవన్‌లో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, పురపాలకశాఖ కార్యదర్శి అరవింద్‌కుమార్, హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులు తదితరులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు మెట్రోరైలును అనుసంధానించేలా ప్రణాళికలు రూపొందించాలని ఐటీ, పురపాలక శాఖల మంత్రి కే తారకరామారావు మెట్రోరైలు అధికారులను ఆదేశించారు. మెట్రోరైలు రెండోదశ ప్రణాళికల్లో భాగంగా కారిడార్ల ఎంపిక, స్టేషన్ల గుర్తింపు, నిధుల సేకరణ వంటి అంశాలపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. ఈ అంశంపై త్వరలోనే సీఎం కే చంద్రశేఖర్ రావు సమీక్షించే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. బేగంపేటలోని మెట్రోరైలు భవన్‌లో మంగళవారం మెట్రోరైలు అధికారులతో మంత్రి కేటీఆర్ సమీక్ష నిర్వహించారు. మెట్రో పనితీరును అడిగి తెలుసుకున్నారు. టికెటింగ్‌లో మరిన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. లాస్ట్‌మైల్ కనెక్టివిటీలో భాగంగా ఆర్టీసీ, ఇతర సర్వీసులను పరిశీలించాలన్నారు. సెట్విన్ వంటి సంస్థల ఆధ్వర్యంలో కరెంటుతో నడిచే వంద బస్సులను ప్రవేశపెట్టేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలను తెలుపాలని సూచించారు. మెట్రో కారిడార్లలో పార్కింగ్, ఫుట్‌పాత్, రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పన పనులు మరింత వేగంగా జరుగాలని ఆదేశించారు. మహిళల కోసం ప్రత్యేకంగా టాయ్‌లెట్లు నిర్మించాలన్నారు. మిగిలిన కారిడార్ల నిర్మాణ పురోగతిని అడిగి తెలుసుకొన్నారు. పనులను త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు.

పార్కింగ్ సదుపాయం పెంచాలి

మెట్రో ప్రాజెక్టు పరిధిలో పార్కింగ్ సదుపాయాన్ని మరింత పెంచేందుకు 12 మల్టీలెవెల్ పార్కింగ్‌లు ఏర్పాటు చేయనున్నామని, వీటికి త్వరలో టెండర్లు పిలువనున్నామని మంత్రికి మెట్రోరైలు అధికారులు తెలిపారు. సదుపాయాల కల్పనకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు పాటిస్తున్నట్టు పేర్కొన్నారు. నాంపల్లి మెట్రోస్టేషన్ వద్ద ఈఎంఎల్‌సీ సదుపాయానికి వారం పది రోజుల్లో టెండర్లు పూర్తి కానున్నట్టు చెప్పారు. ఉప్పల్ స్టేడియం నుంచి మెట్రోస్టేషన్ వరకు స్కైవాక్ నిర్మాణానికి స్టేడియం అథారిటీ నుంచి ఆసక్తి వ్యక్తమైందన్నారు. మెట్రో స్టేషన్లలో మూత్రశాలల అవసరం ఉన్నదని, వాటి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. మెట్రోరైళ్ల ఫ్రీక్వెన్సీతోపాటు రైళ్ల వేగాన్ని పెంచితే ప్రస్తుతం ఉన్న ప్రయాణ సమయం మరింత తగ్గుతుందని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మంత్రికి తెలిపారు. ఇతర నగరాల్లోని మెట్రోలతో పోలిస్తే హైదరాబాద్ మెట్రోలో ప్రయాణికుల సంఖ్య బాగున్నదన్నారు. చెన్నై మెట్రో రెండేండ్లుగా నడుస్తున్నా ప్రయాణికుల సంఖ్య రోజుకు 25 వేలు దాటడం లేదన్నారు. దీంతో పోలిస్తే హైదరాబాద్ మెట్రో ప్రయాణికుల సంఖ్య చాలా ఎక్కువని చెప్పారు. ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు ఎటువంటి సమస్యలు తలెత్తలేదన్నారు. కార్యక్రమంలో పురపాలకశాఖ కార్యదర్శి అరవింద్‌కుమార్, హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.





రావిర్యాల గీతాంజలి జెమ్స్ వద్ద కార్మికుల నిరసన, మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

గీతాంజలి జెమ్స్ కార్మికుల ఆందోళన

- భరోసా కల్పించాలని డిమాండ్
- అండగా నిలిచిన టీఆర్ఎస్, సీఐటీయూ, బీజేపీ, కాంగ్రెస్

మహేశ్వరం: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాలలోని గీతాంజలి జెమ్స్ సంస్థ కార్మికులు మంగళవారం ఆందోళన బాట పట్టారు. సంస్థ యజమాని, పీఎన్‌బీ కుంభకోణం ప్రధాన సూత్రధారి నీరవ్ మోదీ విదేశాలకు పారిపోవడంతో ఈడీ అధికారులు గీతాంజలి జెమ్స్‌ను సీజ్ చేశారు. దీంతో ఇందులో పనిచేస్తున్న దాదాపు 900 మంది కార్మికుల ఉపాధిపై ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దత్తునాయక్ ఆధ్వర్యంలో పార్క్ ఆవరణలో కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. యాజమాన్యం తమను రోడ్డున పడేసిందని, వెంటనే తమ ఉపాధికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. జెమ్స్ పార్క్ ప్రారంభం నుంచి పని చేస్తున్నామని చెప్పారు. ఉద్యోగం చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న సమయంలో రోడ్డున పడేస్తే ఎలా బతుకాలని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కంపెనీలో మొత్తం 900 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చి ఉపాధి పొందుతున్నారు. కార్మికుల నిరసనకు మహేశ్వరం ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీజేపీ మాజీ ఎమ్మెల్యే బద్దం బాల్‌రెడ్డి, మాజీ హోంమంత్రి పీ సబితాఇంద్రారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధు అండగా నిలిచారు. కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి తమవంతు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

కెనడా స్టార్‌మాస్‌తో న్యాక్ ఎంవోయూ

నిర్మాణరంగంపై పరస్పర సహకారం

హైదరాబాద్ సిటీబ్యూరో/మాదాపూర్, నమస్తే తెలంగాణ: నిర్మాణరంగంలో పరస్పర సహకారం కోసం హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్)తో కెనడాకు చెందిన ఎన్విరాన్‌మెంట్ టెక్నాలజీస్ కార్పొరేషన్ స్టార్ మాస్ అనే సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నది. మంగళవారం ముంబైలోని తాజ్ హోటల్‌లో జరిగిన సమావేశంలో న్యాక్ డైరెక్టర్ జనరల్ భిక్షపతి కొండాయి, స్టార్‌మాస్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఉజయ్‌రబ్బుల్లా అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. వృత్తి నైపుణ్య పెంపుతోపాటు బ్రిడ్జీలు,రోడ్లు, డ్యాంలు, టన్నెళ్లు వంటి నిర్మాణాల్లో ఈ భాగస్వామ్యం ప్రయోజనం కల్పించనున్నది. రాష్ర్టాలు, కేంద్ర ప్రభుత్వం, ప్రైవేట్ సెక్టార్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో కొత్త టెక్నాలజీ, మౌలిక వసతుల కల్పన వంటి విషయాల్లో అవగాహన పెంచనున్నారు. షార్ట్‌టర్మ్, లాంగ్‌టర్మ్ కోర్సుల్లో సేవలు అందిస్తారు. ప్లాన్లు, డిజైన్ వంటి వాటిపై కన్సల్టెన్సీ సర్వీసులు కూడా అందిస్తారు.



ఒప్పందం కుదుర్చుకుంటున్న న్యాక్ డైరెక్టర్ జనరల్ భిక్షపతి, స్టార్‌మాస్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఉజయ్‌రబ్బుల్లా

నేటి నుంచి ఐటీఐల్లో అడ్మిషన్లు



కేవై నాయక్

- పీఎంకేవీవై కింద రాష్ట్రంలోని 15 ప్రభుత్వ కాలేజీలు
- మూడేండ్లలో 59 వేల మందికి ఉచిత శిక్షణ
- అభ్యర్థులకు ఉపాధి కల్పించడమే లక్ష్యం
- రాష్ట్ర ఉపాధి శిక్షణశాఖ సంచాలకుడు కేవై నాయక్

బేగంబజార్: నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం, ఉపాధి శిక్షణశాఖ కృషి చేస్తున్నదని ఆ శాఖ సంచాలకుడు కేవై నాయక్ పేర్కొన్నారు. సోమవారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి కౌశిక్ విద్యా యోజన (పీఎంకేవీవై) పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 15 ప్రభుత్వ ఐటీఐల్లో 57 కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటి ద్వారా మూడేండ్లలో 59,611 మందికి ఉచిత శిక్షణ, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 5వ తరగతి నుంచి డిగ్రీ పూర్తయిన నిరుద్యోగులు ఇందులో చేరొచ్చని చెప్పారు. బుధవారం నుంచి అడ్మిషన్లు ప్రారంభమవుతున్నాయన్నారు. సంప్రదాయ ఐటీఐ కోర్సులతోపాటు అపారెల్, ఆటోమేటివ్, బ్యూటీ వెల్‌నెస్, ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్, ఎలక్ట్రానిక్స్, క్యాపిటల్ గూడ్స్, హెల్త్ కేర్, కన్‌స్ట్రక్షన్, ఐరన్ అండ్ స్టీల్, లాజిస్టిక్స్, లెదర్, ప్లంబింగ్, టెలికాం, అగ్రికల్చర్, టూరిజం, హాస్పిటాలిటీ తదితర కోర్సులు అందిస్తున్నట్టు చెప్పారు.

అందుబాటులో ఉన్న కోర్సులు

ఆలేరు ఐటీఐలో.. డొమెస్టిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్స్, ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ కోర్సులు, హన్మకొండ ఐటీఐలో.. డాటా ఎంట్రీ ఆపరేటర్స్, ఐరన్ అండ్ స్టీల్, మెదక్ ఐటీఐలో కన్‌స్ట్రక్షన్, గ్యాస్ టంగ్‌స్టన్ ఆర్క్ వెల్డింగ్, మహబూబ్‌నగర్ ఐటీఐలో డాటా ఎంట్రీ ఆపరేటర్స్, అపారెల్, హోం ఫర్నిషింగ్, నిజామాబాద్ ఐటీఐలో సోలార్ అండ్ ఎల్‌ఈడీ టెక్నీషియన్స్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, విజయనగర్‌కాలనీలోని శాంతినగర్ ఐటీఐలో వెబ్ డెవలపర్ కోర్సు, వనపర్తి ఐటీఐలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సు, మేడ్చల్ ఐటీఐలో ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్, ఐరన్ అండ్ స్టీల్, నల్లగొండ ఐటీఐలో ఆటోమేటివ్‌లోని వెల్డింగ్ అండ్ క్వాలిటీ, ఆటోమోటివ్ సర్వీస్ టెక్నీషియన్స్, భద్రాచలం ఐటీఐలో డాటా ఎంట్రీ ఆపరేటర్స్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఉట్నూరు ఐటీఐలో వెల్డింగ్ అండ్ క్వాలిటీ, ఆటోమోటివ్ సర్వీస్ టెక్నీషియన్స్, డాటా ఎంట్రీ ఆపరేటర్స్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, మంచిర్యాల ఐటీఐలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, వెల్డింగ్ అసిస్టెంట్, మెకానిక్ ఇంజైన్, ఖాజీపేట డీఎల్‌టీసీ, ఐటీఐలో డాటా ఎంట్రీ ఆపరేటర్స్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, మాసన్ జనరల్, సీవింగ్ మెషీన్ ఆపరేటర్, అల్వాల్ ఐటీఐలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ముషీరాబాద్ ఐటీఐలో ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెంట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు.

స్పా యజమానిని బెదిరించి డబ్బు వసూలు

ముగ్గురు కానిస్టేబుళ్లు, క్యాబ్ డ్రైవర్ అరెస్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఓ స్పా యజమానిని బెదిరించి రూ.1.35 లక్షలు వసూలు చేసిన ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక క్యాబ్ డ్రైవర్‌ను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. బేగంపేట పీఎస్‌లో పనిచేస్తున్న కతీబ్ అహ్మద్, చత్రినాక పీఎస్‌లో పనిచేస్తున్న బోజ్జిగని వేణుగోపాల్, లంగర్‌హౌస్ పీఎస్‌లో పనిచేస్తున్న పెరి విజయ్‌బాబు, క్యాబ్‌డ్రైవర్ బనవాత్ శశికుమార్ స్నేహితులు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లోని లగ్జరీ ఫ్యామిలీ సెలూన్ అండ్ స్పాకు వెళ్లి బెదిరిస్తే డబ్బులు వస్తాయని క్యాబ్‌డ్రైవర్ శశికుమార్ చెప్పడంతో ఈ నెల 8న ముగ్గురు కానిస్టేబుళ్లు సెలూన్‌కు వెళ్లారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులమని చెప్పి స్పా యజమానికి ఆర్ రాజును రప్పించుకున్నారు. మీ దగ్గర చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయని, కేసు కాకుండా ఉండాలంటే రూ.3 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.1.35 లక్షలకు బేరం కుదుర్చుకుని డబ్బు తీసుకున్నారు. సీసీ కెమెరాల డీవీఆర్‌ను లాక్కెళ్లారు. ఈ విషయాన్ని స్పా యజమాని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా సీసీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసులు నలుగురినీ అరెస్ట్ చేసి రూ.95 వేల నగదు, డీవీఆర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

• మార్కెట్ కళకళ



ఎండాకాలం ప్రారంభవుతుండటంతో హైదరాబాద్‌లోని పండ్ల మార్కెట్లు కర్బూజ పండ్లతో నిండిపోతున్నాయి. ఏ మార్కెట్ చూసినా రైతులు, కొనుగోలుదారులతో సందడిగా కనిపిస్తున్నది. నగరంలోని ప్రధాన పండ్ల మార్కెటైన గడ్డిఅన్నారానికి మంగళవారం భారీగా కర్బూజ తరలిరావడంతో పచ్చటి కళ సంతరించుకున్న దృశ్యం.

తెలంగాణలో మాంసం ఎగుమతి కేంద్రం

- ఏర్పాటుకు ముందుకొచ్చిన లూలూ ఇంటర్నేషనల్ సంస్థ: తలసాని

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలో వంద ఎకరాల్లో మాంసం ఎగుమతి కేంద్రాన్ని ఏర్పాటుచేసేందుకు దుబాయికి చెందిన 'లూలూ' ఇంటర్నేషనల్ సంస్థ ముందుకొచ్చిందని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఈ కేంద్రం ద్వారా దాదాపు 800 మందికి ప్రత్యక్షంగా, 5 వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. దుబాయ్‌లో ఈనెల 18 నుంచి 22 వరకు జరుగుతున్న గల్ఫుడ్ -2018 ఫుడ్ ట్రేడ్‌షోలో రాష్ట్రప్రభుత్వం తరపున మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరయ్యారు. మంగళవారం మంత్రి తలసాని 'లూలూ' సంస్థ సీఈవో సలీం, కో-డైరెక్టర్ విజయకుమార్‌తో చర్చలు జరిపారు. ఈ మేరకు తెలంగాణలో మాంసం ఎగుమతి కేంద్రం ఏర్పాటుకు అంగీకారం కుదిరినట్టు వెల్లడించారు.

యూనివర్సిటీల్లో త్వరలో పాలకమండళ్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పాలకమండళ్ల (ఈసీ)ఏర్పాటుపై రాష్ట్ర ఉన్నత విద్యామండలి చర్యలు చేపట్టింది. యూనివర్సిటీ వ్యవహారాలు, ఎప్పటికప్పుడు తీసుకోవాల్సిన నిర్ణయాలపై చర్చించడం కోసం ఈసీలను ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామన్నారు. దీనిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.



మంగళవారం దుబాయ్‌లో జరుగుతున్న గల్ఫుడ్-2018 ఫుడ్ ట్రేడ్‌షోను సందర్శించిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇతర అధికారుల బృందం

సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు

- కేంద్రప్రభుత్వ ఆర్థికశాఖ ముఖ్యసలహాదారు అరవింద్ సుబ్రమణ్యన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సవివరంగా, సుదీర్ఘంగా వివరించిన ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకు కేంద్రప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణ్యన్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ట్వీట్‌చేశారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలుసుకొనేందుకు సోమవారం హైదరాబాద్‌కు వచ్చిన అరవింద్ ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌తో భేటీ అయిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ రైతులకు పెట్టుబడి కింద నగదు ఇచ్చే పథకం గురించి సీఎం వివరంగా చెప్పారు. అలాగే వంద రోజుల్లో భూరికార్డుల ప్రక్షాళన, నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం, కేసీఆర్ కిట్స్ పథకం, హరితహారం, తదితర పథకాలపై సీఎం కేసీఆర్ వివరించారని ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సమాఖ్య స్ఫూర్తిపైనా తనతో చర్చించారని అరవింద్ సుబ్రమణ్యన్ తెలిపారు.



arvind subramanian @ar... · 2h
Many thanks to @TelanganaCMO Sri K. C. Rao. Had a rich and long discussion on several development issues including design of direct benefit transfers to farmers, assistance for pregnant women, irrigation, afforestation, and cooperative federalism.

Telangana CMO @Telangan...
Indian Economist and Chief Economic Advisor to the Government of India Sri @arvindsubraman called on Hon'ble Chief Minister Sri K. Chandrashekar Rao today.
Show this thread



కేంద్రప్రభుత్వ ఆర్థికశాఖ ముఖ్యసలహాదారు అరవింద్ సుబ్రమణ్యన్ చేసిన ట్వీట్

మీ మానవీయ స్పందనకు కృతజ్ఞతలు

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అనారోగ్యంతో బాధపడుతున్న వరంగల్ జిల్లాకు చెందిన మాస్టర్ విఘ్నేశ్ పట్ల ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మానవతా దృక్పథంతో స్పందించిన తీరు అద్భుతంగా ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ అభినందించారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు లేఖ ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న విఘ్నేశ్ సీఎం కేసీఆర్‌ను కలువాలని కోరిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న సీఎం కేసీఆర్ తన పుట్టినరోజున విఘ్నేశ్‌తోపాటు అతని తల్లిదండ్రులను ప్రగతిభవన్‌కు ఆహ్వానించారు.

24న ఈశ్వరీబాయి స్మారక అవార్డుల ప్రదానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర అధికార భాషా సంఘం, సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 24న హైదరాబాద్ రవీంద్రభారతిలో ఈశ్వరీబాయి వర్ధంతిసభ, స్మారక అవార్డులను ప్రదానం చేయనున్నట్టు సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి మంత్రి చందూలాల్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

తెలంగాణ ఆస్తికి ఏపీ టెండర్

ఎఫ్‌డీసీ ఆస్తులు అమ్మేస్తామని ఏపీ జీవో

తీవ్రంగా స్పందించిన తెలంగాణ ● చట్టం ప్రకారం చెల్లదని స్పష్టీకరణ

ఏపీ హద్దులు మీరడమేనంటున్న తెలంగాణ ఉద్యోగ సంఘాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తొమ్మిది, పది షెడ్యూల్ సంస్థల ఆస్తులు, అప్పులు, ఉద్యోగుల విభజనలను మొదటినుంచి వివాదాస్పదం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. తాజాగా ఫిలిం, టీవీ, థియేటర్ అభివృద్ధి సంస్థ (ఎఫ్‌టీటీడీసీ) ఆస్తుల విభజనను జటిలం చేస్తున్నది. హైదరాబాద్‌లోని ఎఫ్‌టీటీడీసీ ఆస్తులను అమ్ముకుంటామంటూ ఏకపక్షంగా ఉత్తర్వులు జారీచేసింది. అంతేకాదు.. ఆస్తుల అమ్మకానికి ఏపీ ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు సారథ్యంలో ఎనిమిదిమందితో కమిటీని కూడా ఏర్పాటుచేసింది. ఏపీ చర్యలపై తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014, సెక్షన్ 53లోని రెండో పేరా ప్రకారం ఏకపక్ష నిర్ణయాలు చెల్లబోవంటూ తన వైఖరిని, అభ్యంతరాన్ని ప్రజాస్వామిక పద్ధతిలో ఏపీ సర్కారుకు తెలియజేసింది. తొమ్మిదో షెడ్యూల్ సంస్థల విభజన కోసం ఏర్పరిచిన షీలాబిడే కమిటీ నిర్ణయాలు, కేంద్ర ప్రభుత్వ సూచనలు, విభజన చట్టం నిబంధనల ప్రకారం నడుచుకోవాల్సిందేనని స్పష్టంచేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆదేశాల మేరకు సమావేశమైన ఉన్నతాధికారులు.. ఏపీ ప్రభుత్వ నిర్ణయం విషయంలో న్యాయ సలహాతీసుకోవాలని, అన్నింటితో కలిపి సీఎస్‌కు నివేదిక అందచేయాలని నిర్ణయించారు.

1991లో నిర్మించిన భవనం

ఉమ్మడి రాష్ట్రంలో 1991లో నిర్మించిన ఎఫ్‌డీసీ భవనాన్ని రాష్ట్ర విభజన సమయంలో రెండు రాష్ట్రాలకు 58:42 నిష్పత్తిలో షీలాబిడేకమిటీ పంపిణీ చేసింది. దీని ప్రకారం భవనంలోని రెండు, మూడవ అంతస్తులు ఏపీకి, గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తులో సగభాగం తెలంగాణకు వచ్చాయి. పదేండ్లు ఇక్కడ ఉండే అవకాశమున్నా.. ఏడాదిన్నరక్రితం ఖాళీ చేసి అమరావతికి కార్యాలయాన్ని తరలించారు. నిజానికి ఈ కార్యాలయం ఉన్న భూమి తెలంగాణకు చెందుతుందనేది చట్టం స్ఫూర్తి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేవలం అనుభవదారు మాత్రమే. ఆస్తిపై వారికి ఎలాంటి హక్కు లేదు. సాధారణ పరిభాషలో చెప్పాలంటే కిరాయిదారు వంటివారు మాత్రమే. తాళాలువేసిన భవనాన్ని అద్దెకు ఇస్తామని కొంతకాలం క్రితం బోర్డులు పెట్టిన ఏపీ అధికారులు.. ఇప్పుడు ఏకంగా భవనాన్నే విక్రయిస్తామంటూ జీవో జారీచేశారు.

ఏపీపై తెలంగాణ ఉద్యోగుల ఆగ్రహం

కయ్యానికి కాలుదువ్వుతున్న ఏపీ దుందుడుకు వైఖరిని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ, తెలంగాణ పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ తప్పు పట్టాయి. ఏపీకి కేటాయించిన భవనాల ముందు శాంతియుత ప్రదర్శనలు చేసేందుకు సిద్ధమవుతున్నాయి.

ఏపీ ప్రజల దృష్టి మళ్లించేందుకు కొత్తడ్రామా



ప్రత్యేక హోదాకోసం నినదిస్తున్న ఏపీ ప్రజల దృష్టిని మళ్లించేందుకు చంద్రబాబు ఆడుతున్న కొత్త డ్రామా ఎఫ్‌డీసీ ఆస్తుల విక్రయాల ప్రకటన. చట్టం ప్రకారం నిలువదని ఆయనకు తెలుసు. కానీ, ఏపీలో సెంటిమెంట్‌ను రెచ్చగొట్టే కొత్త ఎత్తుగడ. దీనిని తెలంగాణ ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు.

జీ దేవీప్రసాద్, తెలంగాణ బివరేజెస్ కార్పొరేషన్ చైర్మన్



చంద్రబాబూ ఎఫ్‌డీసీ ఆప్‌కా బాప్‌కా జాగీర్ నహీహై. చట్టం ప్రకారం నడుచుకోకుంటే తలబొప్పి కట్టాల్సిందే. షీలాబిడే కమిటీ నివేదిక రానేలేదు. ఆస్తుల విభజన జరుగలేదు. చట్టం ప్రకారం నడుచుకోవడం ప్రభుత్వ బాధ్యత. ప్రజలను రెచ్చగొట్టాలని ప్రయత్నిస్తే భంగపాటు తప్పదు.

వీ శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే, టీజీవో వ్యవస్థాపక అధ్యక్షుడు



గిల్లికజ్జాలు పెట్టుకోవడం ఏపీ సర్కార్‌కు అలవాటుగా మారింది. ఫైనాన్స్ కార్పొరేషన్, సంక్షేమమండలిలో నిధులను ఏపీకి మళ్లించాలని ప్రయత్నించి చట్టం ముందు దోషులుగా నిలబడ్డారు. పబ్లిక్‌సెక్టార్ సంస్థలను కొల్లగొట్టే కుట్రలన్నింటినీ ఇకనైనా మానుకోవాలి.

కారం రవీందర్‌రెడ్డి, తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్

తొమ్మిదో షెడ్యూల్ సంస్థల ఔన్నత్యాన్ని కాపాడేందుకు మూడేండ్లుగా నిర్విరామంగా పోరాటాలు చేస్తున్నాం. ఈ సంస్థలను ఆగమాగం చేయాలనేది చంద్రబాబు ప్రయత్నం. తెలంగాణలో ఈ సంస్థలు నిలబడితే వేల మందికి ఉద్యోగావకాశాలు వస్తాయి. తెలంగాణ ప్రభుత్వానికి పేరు ప్రతిష్ఠలు వస్తాయి. అది ఏపీ సర్కార్ పెద్దలకు ఇష్టం లేదు. అందుకే కుట్రలన్నీ.

జీవన్, పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధానకార్యదర్శి



చట్ట ప్రకారం ఎన్నికైన ప్రభుత్వాలు రాజ్యాంగ నిబంధనల ప్రకారం వ్యవహరించాల్సిందే. రాజ్యాంగ నిబంధనల ప్రకారమే రాష్ట్ర విభజన చట్టం ఏర్పడింది. తొమ్మిదో షెడ్యూలు సంస్థల విభజనకు ఏర్పర్చిన కమిటీ పూర్తిస్థాయి నివేదిక ఇవ్వలేదు. ఈ సందర్భంలో ఎఫ్‌డీసీ ఆస్తులు అమ్ముతామని ప్రకటించడం చట్టవిరుద్ధం.

రామ్మోహన్‌రావు, చైర్మన్, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్

సులభ వాణిజ్యంలో మరోసారి మనమే టాప్!



ఇప్పటికే 96.21 శాతం స్కోర్ సాధించిన రాష్ట్రం ● రాష్ట్రాల మధ్య తీవ్రమైన పోటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

సులభ వాణిజ్యవిధానం(ఈవోడీబీ)లో మరోసారి అగ్రస్థానం దిశగా రాష్ట్రం అడుగులు వేస్తున్నది. 2016 ఏడాదికి గానూ 98.78 శాతం మార్కులతో దేశంలో మొదటిస్థానంలో నిలిచింది. 2017 సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకు 96.21శాతం స్కోర్‌ను రాష్ట్రం సాధించింది. ఈ సంవత్సరం బిజినెస్ రిఫార్మ్ యాక్షన్ ప్లాన్ (బీఆర్‌ఏపీ)లో మొత్తం 372 సంస్కరణలను అమలు చేయాల్సి ఉంటుంది. దీనిపై మదింపు ప్రక్రియ కొనసాగుతున్నది. వీటన్నిటిని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసింది. ఇప్పటివరకు 355 సంస్కరణల మదింపును పారిశ్రామిక విధాన, ప్రోత్సాహక శాఖ (డీఐపీపీ) పూర్తిచేసింది. దీంతో ప్రస్తుతం 96.21 శాతం స్కోర్‌ను రాష్ట్రం సాధించింది. మరో 14 సంస్కరణల మదింపు పూర్తికావాల్సి ఉంది. మరో మూడు రాష్ట్రానికి వర్తించనివి ఉన్నాయి.

మదింపు ముగింపునకు

అత్యధిక రాష్ట్రాలకు సంబంధించిన 372 సంస్కరణల మదింపు దాదాపుగా ముగింపునకు వచ్చింది. మదింపు పూర్తయ్యాక పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను కూడా తీసుకుంటారు. గత సంవత్సరం, ఈ సంవత్సరం జాబితాలోని ఒకేరకమైన 78 సంస్కరణలను ఎంపిక చేశారు. ఈ సంస్కరణల అమలులో లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరించనున్నది. వీరివివరాలను రాష్ట్రాల నుంచి తీసుకున్నారు. ఈవోడీబీలో సూచించిన సంస్కరణలు కేవలం కాగితాలకు పరిమితం కాకూడదని.. వీటి ఫలితాలను ఉద్దేశిత వర్గాలు ఎంతవరకు పొందుతున్నాయనేది తెలుసుకునే నూతన ప్రక్రియను ఈ ఏడాది నుంచి అమలుచేస్తున్నారు.

సంస్కరణల బాటలో

2017లోనూ మొదటిర్యాంకు సాధించడానికిగానూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. టీఎస్ఐపాస్‌తో రాష్ట్రానికి పెద్దఎత్తున పరిశ్రమలు వస్తుండటంతో పారిశ్రామికుల సౌలభ్యం కోసం ఈవోడీబీ సంస్కరణలను అమలుచేస్తున్నారు. ఇందులో భాగంగా 23 ఆన్‌లైన్ సర్వీస్‌లు కొత్తగా ప్రవేశపెట్టారు. 14 సర్వీసులను అప్‌డేట్ చేశారు. కొత్తగా 66 చట్టాలు, జీవోలు, ఆదేశాలను జారీచేశారు. ఈవోడీబీ పరిధిలో 16 సచివాలయ శాఖలు, 27 హెచ్‌వోడీలు ఉన్నాయి. సంస్కరణలపై పురోగతిని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఉన్నతాధికారులతో ఆయన పలుమార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆయాశాఖల ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహించి శాఖలకు లక్ష్యాలను విధించారు. 2016 ర్యాంకులను అక్టోబరు 31నే ప్రకటించారు. కానీ ఈ సంవత్సరం ర్యాంకులు ప్రకటించడానికి మరికొన్ని రోజులు పడుతుందని పరిశ్రమలశాఖ అధికారులు చెప్తున్నారు. ఈ సంవత్సరం రాష్ట్రాల మధ్య తీవ్రమైన పోటీ నెలకొన్నది. ఇప్పటివరకు టాప్‌టెన్‌లో ఉన్న రాష్ట్రాల్లోని చివరిరాష్ట్రం స్కోర్ 95.66 శాతం ఉంది. గత సంవత్సరం ర్యాంకుల ప్రకటననాటికి 10వ ర్యాంకు రాష్ట్రం స్కోర్ 92.86 శాతం మాత్రమే. ఈవోడీబీ ప్రాధాన్యాన్ని గుర్తించిన ఇతర రాష్ట్రాలు అగ్రస్థానాల కోసం పోటీపడుతున్నాయి.

ఇంట్రావిలేజ్ పనులపై దృష్టిపెట్టండి

- మిషన్ భగీరథ సమీక్షలో వైస్‌చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మిషన్ భగీరథ ప్రాజెక్టు ప్రధాన పనులు పూర్తయినందున ఇంట్రావిలేజ్ పనులపై అధికారులు దృష్టిసారించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించినట్టు మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి చెప్పారు. బల్క్‌గా నీటి సరఫరా ప్రారంభమయ్యాక ఇంట్రావిలేజ్ పనులను త్వరగా పూర్తిచేయడానికి పెద్దవర్క్ ఏజెన్సీల సహకారం తీసుకోవాలన్నారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మిషన్ భగీరథపై ప్రశాంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు జరిగిన ఇంట్రా విలేజ్ పనులపై సంతృప్తి వ్యక్తంచేశారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మిస్తున్న కాలనీల్లో తాగునీటి అవసరాలు తీర్చేందుకు అవసరమైన ప్రణాళికను ముందే తయారుచేయాలని అధికారులకు సూచించారు. అధికారులు స్మితా సబర్వాల్, బీ సురేందర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ కాకతీయ మీడియా అవార్డుల ఎంపిక కమిటీ ఖరారు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఇచ్చే మిషన్ కాకతీయ అవార్డుల్లో భాగంగా మీడియా అవార్డుల న్యాయనిర్ణేతల కమిటీ ఖరారైంది. మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అధ్యక్షతన కమిటీని ఖరారు చేశారు. ఈ కమిటీలో 'తెలంగాణ టుడే' సీనియర్ జర్నలిస్టు బాలకోటేశ్వర్‌రావు, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ కృష్ణమూర్తి సభ్యులుగా ఉంటారు.

ముగిసిన ఇంజినీరింగ్ కాలేజీల అఫిలియేషన్ గడువు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల అఫిలియేషన్ దరఖాస్తు గడువు మంగళవారంతో ముగిసింది. ఆలస్య రుసుంతో మరో రెండురోజులు గడువు పొడిగించినట్టు జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ యాదయ్య తెలిపారు. అఫిలియేషన్ దరఖాస్తులను 25 శాతం ఆలస్య రుసుంతో ఈ నెల 23 వరకు గడువు ఉందని పేర్కొన్నారు.

రొటోమాక్ ప్రమోటర్లపై

ముప్పేట దాడి

11 బ్యాంకు ఖాతాలను జప్తు చేసిన ఐటీ అధికారులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: బ్యాంకులకు వేలాది కోట్ల రుణాలను ఎగ్గొట్టిన రొటోమాక్ సంస్థ ప్రమోటర్లపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఆదాయం పన్ను (ఐటీ) విభాగం ముప్పేట దాడి చేస్తున్నాయి. పన్నుల ఎగవేత కేసు దర్యాప్తులో భాగంగా వారికి సంబంధించిన 11 బ్యాంకు ఖాతాలను జప్తు చేసినట్లు ఐటీ అధికారులు మంగళవారం వెల్లడించారు. గత నెలలో రొటోమాక్ గ్రూపునకు చెందిన మూడు బ్యాంక్ ఖాతాలను జప్తు చేసిన ఐటీ విభాగం.. సోమవారం రాత్రి ఉత్తరప్రదేశ్‌లోని వేర్వేరు బ్యాంకు శాఖల్లో ఉన్న మరో 11 ఖాతాలను జప్తు చేసిందని, వీరి నుంచి రావలసిన పన్ను బకాయిలు దాదాపు రూ.85 కోట్ల వరకూ ఉన్నట్లు స్పష్టమవుతోందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ రంగంలోని ఏడు బ్యాంకులను రూ.3,695 కోట్లకు మోసగించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రొటోమాక్ గ్రూపుపై సీబీఐ, ఈడీ ఇప్పటికే దర్యాప్తు జరుపుతున్నాయి. ఈ మోసానికి సంబంధించి బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) నుంచి ఫిర్యాదు రావడంతో రొటోమాక్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో పాటు దాని డైరెక్టర్ విక్రమ్ కొఠారీ, ఆయన భార్య సాధనా కొఠారీ, కుమారుడు రాహుల్ కొఠారీపైన, అలాగే గుర్తు తెలియని కొంత మంది బ్యాంకు అధికారులపైన సీబీఐ క్రిమినల్ కేసు నమోదు చేయడంతో పాటు సోమవారం వివిధ ప్రాంతాల్లో వారి ఆస్తులను సోదా చేసిన విషయం తెలిసిందే. రొటోమాక్, దాని ప్రమోటర్లు ఏడు బ్యాంకుల కన్సార్టియం నుంచి తీసుకున్న రూ.2,919 కోట్ల రుణాలతో పాటు వాటిపై వడ్డీ కలిపి మొత్తం రూ.3,695 కోట్లు ఎగ్గొట్టారని బీవోబీ ఫిర్యాదు చేయడంతో సీబీఐ ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఇదిలావుంటే, రొటోమాక్ ప్రమోటర్లపై మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసు నమోదు చేసింది. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను రొటోమాక్ ప్రమోటర్లు విదేశాలకేమైనా తరలించారా? లేక అక్రమ ఆస్తులను, నల్లధనాన్ని కూడబెట్టేందుకు ఈ సొమ్మును ఉపయోగించారా? అనే అంశాలపై ఈడీ దర్యాప్తు జరుపుతున్నది.



మోసం ఎలా జరిగిందంటే..

దుబాయ్, షార్జా, హాంకాంగ్ తదితర ప్రాంతాల నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న కొనుగోలుదారులు, సరఫరాదారులకు చెల్లింపులు జరుపాలన్న సాకుతో రొటోమాక్ అధినేత విక్రమ్ కొఠారీ 2008-13 మధ్య కాలంలో ప్రభుత్వ బ్యాంకుల నుంచి ఎఫ్‌ఎల్‌సీ (ఫారిన్ లెటర్ ఆఫ్ క్రెడిట్)లను పొంది ఈ మోసానికి పాల్పడినట్లు వెల్లడవుతున్నది. ఈ రుణాల కోసం కాన్పూర్‌లో బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన అంతర్జాతీయ వ్యాపార శాఖతో పాటు ఏడు ప్రభుత్వ బ్యాంకులను తరచుగా సంప్రదించిన విక్రమ్ కొఠారీ కేవలం ఒక్క బీవోబీనే రూ.456 కోట్లకు మోసగించినట్లు తెలుస్తున్నది. ఎఫ్‌ఎల్‌సీలతో పొందిన రుణాలను కొఠారీ తమ సరఫరాదారులు, కొనుగోలుదారులకు చెల్లింపులకు జరిపేందుకు ఉపయోగించకుండా ఆ సొమ్మును రొటోమాక్, దాని అనుబంధ సంస్థలకు అక్రమంగా మళ్లించుకున్నట్లు స్పష్టమవుతున్నది.

2017లోనే నీరవ్‌పై ఐటీ దాడులు

పెద్ద నోట్ల రద్దు సమయంలోనే నీరవ్ మోదీకి చెందిన ఆభరణాల దుకాణాలపై ఆదాయం పన్ను(ఐటీ) శాఖ దాడులు చేసినట్లు తెలుస్తున్నది. నల్లధనాన్ని వెలిక్కి తీయడానికి ప్రధాని నరేంద్ర మోదీ 2016 నవంబర్ 8న రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఐటీ శాఖ దాడులను విస్తృతం చేసింది. దీంట్లోభాగంగా నీరవ్‌కు చెందిన డైమండ్ అవుట్‌లెట్ల ఆర్థిక లావాదేవీలపై దృష్టి సారించింది.



ఆరు ఫ్లాట్లు రూ.900 కోట్లు

జప్తు చేసిన వాటిలో ముంబైలోని నీరవ్ మోదీ ఆస్తులు నీరవ్ మోదీకి సంబంధించిన ఆస్తులపై నియంత్రణ మండళ్ల వేట కొనసాగుతున్నది. ఇప్పటి వరకు ఆయనకు సంబంధించిన రూ.5,671 కోట్ల విలువైన ఆస్తులను సీబీఐ జప్తు చేసింది. వీటిలో ఒక ముంబైలోని సముద్ర మహల్‌లో ఉన్న ఆరు ఫ్లాట్ల విలువ రూ.900 కోట్లు. నీరవ్, ఆయన భార్య పేర్ల మీద ఉన్న ఫ్లాట్లు సముద్రం వైపు ముఖం కలిగివున్నాయి. వీటిలో ఒక్కో ఫ్లాట్ విలువ రూ.150 కోట్లకు పైగా ఉంటుందని ఐటీ వర్గాలు వెల్లడించాయి. వీటితోపాటు నీరవ్‌కు చెందిన ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన చర ఆస్తులతోపాటు బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని కమర్షియల్ ప్రాపర్టీ కూడా ఉన్నాయి.



విపుల్ అంబానీ అరెస్ట్

నీరవ్ మోదీ కంపెనీలో కీలక వికెట్ డౌన్.. మరో నలుగురిని అరెస్టు చేసిన సీబీఐ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: పీఎన్‌బీలో జరిగిన రూ.11,400 కోట్ల కుంభకోణానికి సంబంధించిన కేసులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ) దూకుడు పెంచింది. ఇప్పటికే బ్యాంకుకు చెందిన ముగ్గురిని అరెస్ట్ చేసిన సీబీఐ తాజాగా..నీరవ్ మోదీకి సంబంధించిన కంపెనీ ఉన్నతాధికారి విపుల్ అంబానీతోపాటు మరో నలుగురు అధికారులను మంగళవారం అరెస్ట్ చేసింది. నీరవ్ మోదీకి చెందిన ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్ కంపెనీ ప్రెసిడెంట్‌గా విపుల్ అంబానీ వ్యవహరిస్తున్నాడు. వీరితోపాటు ఫైర్‌స్టార్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అర్జున్ పాటిల్, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ కవితా మంకికర్ అరెస్టైన వారిలో ఉన్నారు. అలాగే గీతాంజలి గ్రూపునకు సంబంధించిన నక్షత్రా సీఎఫ్‌వో కపిల్ ఖండేల్‌వాల్, గ్రూపు మేనేజర్ నీతెన్ షాయిలను సైతం సీబీఐ ఆధీనంలోకి తీసుకున్నది. ఈ కేసులో ఇప్పటి వరకు సీబీఐ 11 మందిని అరెస్ట్‌చేసింది. వీరిలో ఐదుగురు పీఎన్‌బీ ఉద్యోగులు ఉన్నారు. అంతకుముందు పీఎన్‌బీకి చెందిన 10 మంది అధికారులను, మోదీ, గీతాంజలికి సంబంధించిన 18 ఉద్యోగులను సీబీఐ ప్రశ్నించింది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టైన పీఎన్‌బీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తో సహ తొమ్మిది మంది సీనియర్ అధికారులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ప్రశ్నల వర్షం కురిపించింది. మరోవైపు ఆదాయం పన్ను శాఖ దాడులు కొనసాగుతున్నాయి. ఆరో రోజు హైదరాబాద్‌తోపాటు ముంబై, పుణె, సూరత్, బెంగళూరులలో గీతాంజలి జువెల్లరీ ఎండీ మెహుల్ చోక్సీకి సంబంధించిన ఆస్తులపై కూడా దాడులు చేసినట్లు ఐటీ శాఖ వర్గాలు వెల్లడించాయి.

విదేశాలకు వెళ్లొద్దు..

నీరవ్ మోదీ బంధువులు, కంపెనీ ఉన్నతాధికారులకు సీబీఐ ఆదేశం

పీఎన్‌బీ కుంభకోణంలో ప్రధాన నిందితుడు నీరవ్ మోదీ బంధువులు, ఆయన కంపెనీకి చెందిన కీలక అధికారుల కదలికలపై తాజాగా ఆంక్షలు విధించారు. మోదీకి కంపెనీకి చెందిన నలుగురు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు విదేశాలకు వెళ్లకూడదని సీబీఐ స్పష్టం చేసింది. మోదీ కంపెనీకి చెందిన భాగస్వాములు, సీనియర్ అధికారులు తమ అనుమతి లేనిదే దేశం విడిచి వెళ్లరాదని సీబీఐ ఆదేశించింది. ముఖ్యంగా సోమవారం సాయంత్రం కంపెనీ సీఎఫ్‌వో విపుల్ అంబానీ, రవిగుప్తా సహ నలుగురిని విచారించిన అనంతరం సీబీఐ ఈ ఆదేశాలిచ్చింది. ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్, ఆర్థిక, కార్పొరేట్ అభివృద్ధి ప్రెసిడెంట్, విపుల్ అంబానీ ప్రధాన ఆర్థిక సలహాదారు రవి గుప్తా, అంతర్జాతీయ ఫైనాన్స్ డివిజన్ అధ్యక్షుడు సౌరబ్ శర్మ, మరో సీనియర్ ఎగ్జిక్యూటివ్ సుభాష్ పరాబ్‌లను దేశం విడిచి వెళ్లరాదని ఆదేశించింది.

7 నెలలుగా పట్టించుకోవట్లేదు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:

బ్యాంకుల పర్యవేక్షణలో ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ల తీరిది

రుణాల విషయంలో బ్యాంకుల తీరే అడ్డగోలుగా కనిపిస్తుంటే.. బ్యాంకింగ్ కార్యకలాపాలను నియంత్రించే రిజర్వ్ బ్యాంక్ తీరు మరీ అధ్వాన్నంగా తయారైంది. ఓవైపు మొండి బకాయిలు, కుంభకోణాలు బ్యాంకింగ్ వ్యవస్థను ముఖ్యంగా ప్రభుత్వరంగ బ్యాంకుల ఉనికినే ప్రశ్నార్థకం చేస్తుంటే.. మరోవైపు ఆర్బీఐ ఇదంతా మాకేమీ పట్టదన్నట్లుగా వ్యవహరిస్తున్నది. గడిచిన ఏడు నెలలుగా ఒక్కరంటే ఒక్క రిజర్వ్ బ్యాంక్ డిప్యూటీ గవర్నరూ.. బ్యాంకింగ్ రంగాన్ని పట్టించుకున్న దాఖలాల్లేవు. అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేట్‌రంగ బ్యాంకులను పర్యవేక్షించేందుకు ఆర్బీఐలో పూర్తికాల డిప్యూటీ గవర్నరే కరువయ్యారు. ఆర్బీఐలో మొత్తం నలుగురు డిప్యూటీ గవర్నర్లుంటారు. ఇందులో ఒకరు బ్యాంకింగ్ రంగం నుంచి నియమితులవుతారు.



మరొకరు ఆర్థికవేత్త అవగా, ఇంకిద్దరు ర్యాంకుల ఆధారంగా ఉంటారు. అయితే ప్రస్తుతం ముగ్గురు డిప్యూటీ గవర్నర్లే ఉండగా, గతేడాది జూలైలో పదవీవిరమణ పొందిన ఎస్ఎస్ ముంద్రా స్థానం ఇంతవరకు భర్తీకాలేదు. ముంద్రా ఉన్నంతవరకు ఆయనే బ్యాంకులను పర్యవేక్షించారు. బ్యాంకుల విదేశీ లావాదేవీల పరిశీలన భారం కూడా ముంద్రాదే. అయినప్పటికీ ఆయన వారసుడిని ఎంపిక చేయడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. కీలకమైన ముంద్రా బాధ్యతల్ని మోసేవారే ఇప్పుడు ఆర్బీఐలో లేకుండాపోయారు. అంటే.. గత ఏడు నెలలుగా బ్యాంకుల్ని పట్టించుకునే నాథుడే లేడన్నమాట. ఆర్బీఐలో ఇప్పుడున్న ముగ్గురు డిప్యూటీ గవర్నర్లలో విరల్ ఆచార్య ఆర్థికవేత్తవగా, బీపీ కనుంగో, ఎన్ఎస్ విశ్వనాథన్‌లు ర్యాంకర్లు. దీంతో బ్యాంకింగ్ రంగానికే ప్రాతినిధ్యం లేకుండాపోయింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రూ.11,400 కోట్ల కుంభకోణం నేపథ్యంలో ఇది అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటుండగా, అటు ప్రభుత్వం.. ఇటు ఆర్బీఐ అలసత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నది. చివరకు మిగతా డిప్యూటీ గవర్నర్లకైనా ముంద్రా బాధ్యతల్ని బదలాయించకపోవడం ఇప్పుడు విమర్శలకు దారితీస్తున్నది. కాగా, హర్షద్ మెహతా కుంభకోణం తర్వాత 1993లో ఆర్బీఐలో బ్యాంకింగ్ పర్యవేక్షణ శాఖ ఏర్పాటైంది.

ముందే హెచ్చరించాం

స్విఫ్ట్ దుర్వినియోగంపై ఆర్బీఐ

స్విఫ్ట్ వ్యవస్థను తప్పుడు పనులకు ఉపయోగించడం వలన ఎదురయ్యే సమస్యల గురించి బ్యాంకులను 2016 ఆగస్టు నుంచి మూడుసార్లు 'రహస్యం'గా హెచ్చరించామని, అంతేకాకుండా బ్యాంకుల్లో పెరుగుతున్న మోసాలపై దృష్టి సారించేందుకు ఒక కమిటీని కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించామని రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) మంగళవారం పేర్కొన్నది. దేశంలో పర్యవేక్షక వ్యవస్థను బలోపేతం చేసేందుకు కొనసాగుతున్న ప్రయత్నాల్లో భాగంగా వివిధ రకాల సమస్యలపై బ్యాంకులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు చేస్తున్నామని ఆర్బీఐ ఒక ప్రకటనలో పేర్కొన్నది.

మీరే చేశారు..

ఆడిటర్ల వల్లనే ఇలాంటి కుంభకోణాలు: జైట్లీ



పీఎన్‌బీలో జరిగిన కుంభకోణంపై కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ ఎట్టకేలకు స్పందించారు. ఆడిటర్ల వల్లనే ఇలాంటి కుంభకోణాలు జరుగుతున్నయని ఆయన వ్యాఖ్యానించారు. అయినప్పటికీ బ్యాంకింగ్ రంగంలో మోసాలను అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నదని, ఇందుకు సంబంధించి బాధ్యులను వదిలి పెట్టేది లేదని జైట్లీ స్పష్టంచేశారు. ఇలాంటి కుంభకోణాలు గుర్తించడంలో యాజమాన్యాలు విఫలమవుతున్నాయన్న ఆయన.. మార్గదర్శకాలకు లోబడి ఆడిటర్లు వ్యహరించడం లేదని అసోసియేషన్ ఆఫ్ డెవలప్‌మెంట్ ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్స్ ఇన్ ఆసియా అండ్ పసిఫిక్ వార్షిక సమావేశంలో అన్నారు. ఇటీవల పీఎన్‌బీలో జరిగిన భారీ కుంభకోణంపై మాత్రం నేరుగా స్పందించకుండా మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. గడిచిన ఏడేండ్లుగా బ్యాంకుల్లో ఇలాంటి మోసాలు జరుగుతున్నప్పటికీ ఆడిటర్లు ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

ఇక విదేశీ రుణాలు కష్టతరం

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణం నేపథ్యంలో విదేశాల్లో నిధుల సమీకరణను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కఠినతరం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. రూ.11,400 కోట్ల పీఎన్‌బీ కుంభకోణంలో ప్రధాన నిందితులు నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీల సంస్థలు విదేశీ నిధుల సమీకరణ ద్వారానే ప్రజా ధనాన్ని కొల్లగొట్టేసిన విషయం తెలిసిందే. లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ లేదా అండర్‌స్టాండింగ్ (ఎల్‌వోయూ), ఫారిన్ లెటర్స్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ)ల ద్వారా ఈ దోపిడి జరిగింది. దీంతో విదేశీ నిధుల సమీకరణకు ఆయా కంపెనీలను అనుమతించడం కోసం ఉన్న తమ విధానాన్ని ఆర్బీఐ సమీక్షిస్తున్నది. విదేశీ నిధుల సమీకరణ డాలర్ విలువతో ముడిపడి ఉన్నందున ఫారెక్స్ మార్కెట్‌లో పెరిగే రూపాయి ఒడిదుడుకులు రుణాల చెల్లింపులను భారం చేయవచ్చన్న ఆందోళన కూడా ఈ సమీక్షకు కారణమేనని ఆర్బీఐ వర్గాల్లో ఒకరు చెబుతున్నారు. భారతీయ విదేశీ వాణిజ్య రుణ మార్గదర్శకాల కింద విదేశాల్లో అప్పులు తీసుకోవాలంటే లోన్ రిజిస్ట్రేషన్ నంబర్ (ఎల్ఆర్ఎన్)లను కంపెనీలు పొందడం తప్పనిసరి. ప్రస్తుతం జరుగుతున్న సమీక్షలో వీటన్నిటిపైనా ఆర్బీఐ దృష్టి సారించనున్నది. ఇటీవలికాలంలో విదేశీ రుణాలకు ఆర్బీఐ ఆచితూచి అనుమతులిస్తున్నది. ఈమధ్య ఏ సంస్థకూ ఎల్ఆర్ఎన్‌లను జారీ చేయలేదు. మొత్తానికి ఆయా కంపెనీలు తీసుకున్న విదేశీ రుణాల్లో ఎగవేతలను అరికట్టడమే ఇప్పుడు ఆర్బీఐ ముందున్న ప్రధాన లక్ష్యంగా కనిపిస్తున్నది.

బ్యాంకుల్లో వజ్రాల దొంగలు


వేల కోట్లు కొల్లగొడుతున్న డైమండ్ వ్యాపారులు

నానాటికీ పెరుగుతున్న కార్పొరేట్ డిఫాల్టర్ల జాబితా

విదేశాలకు పారిపోతుండటంతో కష్టతరమవుతున్న విచారణ

అప్పగింతల కోసం దర్యాప్తు సంస్థల పడిగాపులు

హైదరాబాద్, ఫిబ్రవరి 20: పైన పటారం.. లోన లొటారం. వజ్రాల వ్యాపారుల తీరు ఇప్పుడిలాగే కనిపిస్తున్నది మరి. తమ లగ్జరీ వ్యాపారాలను అడ్డుపెట్టుకుని బ్యాంకులను నిలువుదోపిడి చేస్తున్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)కు రూ.11,400 కోట్ల కుచ్చుటోపీ పెట్టిన నేటి మామా-అల్లుళ్లు మెహుల్ చోక్సీ, నీరవ్ మోదీల దగ్గర్నుంచి నాటి జతిన్ మెహతా రూ.7,000 కోట్ల ఎగవేతల వరకు అంతాకూడా భారతీయ బ్యాంకులను బాగా ముంచిన వజ్రాల వర్తకులే. గత అనుభవాల నుంచి గుణపాఠాలు నేర్చుకోని మన బ్యాంకర్లు.. వీరికి వేల కోట్లను దోచిపెడుతూనే ఉన్నారు. ఈ క్రమంలో పుట్టుకొచ్చినదే నీరవ్ మోదీ తాజా కుంభకోణం. అయితే వజ్రాల వ్యాపారుల మోసాలకు మాత్రం ఆధునిక పితామహుడిగా జతిన్ మెహతాను పేర్కొనవచ్చు.



విన్సమ్ డైమండ్స్


విన్సమ్ డైమండ్స్ అండ్ జువెల్లరీ లిమిటెడ్ చైర్మనే జతిన్ మెహతా. స్టాక్ మార్కెట్‌లో లిస్టైన ఈ కంపెనీకి సు రాజ్ డైమండ్స్ అనే మరో పేరు కూడా ఉంది. దేశీయ బ్యాంకుల నుంచి వేల కోట్ల రుణాలు తీసుకుని వాటిని ఎగవేసి పరాయి దేశాలకు పారిపోయిన ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారుల్లో జతిన్ మెహతాది ప్రస్తుతం మూడో స్థానం. కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ రికార్డుల ప్రకారం నీరవ్ మోదీ, లిక్కర్ వ్యాపారి విజయ్ మాల్యా తర్వాత ఉన్నది మెహతానే. 2011లో విన్సమ్ రుణాల ప్రక్రియ మొదలవగా, మొత్తం 15 బ్యాంకుల నుంచి రూ.6,800 కోట్లు మెహతా తీసుకున్నాడు. వీటిని ఎగ్గొట్టేందుకు పక్కా ప్రణాళికనూ రూపొందించుకున్న మెహతా.. ఆగస్టు 13, 2012న దానికి శ్రీకారం చుట్టాడు. తొలుత తమ గ్రూప్‌లోని ఫరెవర్ ప్రీషియస్ డైమండ్ అండ్ జువెల్లరీ నుంచి వైదొలిగాడు. ఇదే ఏడాది నవంబర్ 9న విన్సమ్ డైమండ్స్ అండ్ జువెల్లరీకీ గుడ్‌బై చెప్పాడు. 2013 మధ్యమం నుంచి రుణాల ఎగవేతకు పాల్పడిన మెహతా.. చివరకు యూఏఈ జువెల్లర్స్‌కు డెరివేటివ్ నష్టాలు వచ్చాయని, దాన్నుంచి తమకు రావాల్సిన చెల్లింపులు రాలేకపోతున్నందున.. మాకు అప్పులిచ్చిన బ్యాంకులకు మేమూ చెల్లించలేకపోతున్నామని ప్రకటించాడు. విదేశాలకు పారిపోయాడు. దీంతో ఇదే ఏడాది అక్టోబర్‌లో మెహతాను బ్యాంకులు ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా ప్రకటించాయి. ఈ కేసులో సీబీఐ ఏండ్ల తరబడి విచారణ చేసినా ఫలితం మాత్రం శూన్యం. కారణం మెహతా ప్రస్తుతం సెయింట్ కిట్స్ పౌరుడు. డైమండ్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (యూకే) లిమిటెడ్ పేరుతో అక్కడ వ్యాపారం కూడా చేస్తున్నాడు. భారత్‌లో మాత్రం ఈ గుజరాత్‌కు చెందిన వజ్రాల వ్యాపారి అప్పగింతకు దర్యాప్తు సంస్థలు పడిగాపులు కాస్తున్నాయి. ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీకి దగ్గరి బంధువు కావడం. ప్రధాని నరేంద్ర మోదీకి అదానీకి సన్నిహిత సంబంధాలుండటం కేసును నిరుగార్చిందన్న విమర్శలున్నాయి.



ఉద్దేశపూర్వక ఎగవేతదారులెందరో

కొందర్ని చూస్తే పెట్టబుద్ధవుతుంది.. మరి కొందర్ని చూస్తే మొట్టబుద్ధవుతుంది. అన్నట్లుగా కార్పొరేట్లకు ప్రభుత్వ బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పుల్ని ఎగ్గొట్టాలనే ఎప్పుడూ అనిపిస్తున్నది. అవును మరి. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో పేరుకుపోతున్న లక్షల కోట్ల మొండి బకాయిల్లో కార్పొరేట్ల జాబితా అంతా.. ఇంతా కాదు. వీరిలో మెజారిటీ కార్పొరేట్లు ఉద్దేశపూర్వక ఎగవేతదారులేనన్నది అప్రకటిత సత్యం. నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ, విజయ్ మాల్యా, జతిన్ మెహతాలే ప్రధానంగా పైకి కనిపిస్తున్నా.. ఇన్సాల్వెన్సీలో మరెన్నో సంస్థలున్నాయి. విదేశాలకు పారిపోయిన ఈ కార్పొరేట్ దొంగల అప్పగింతకు నానా కష్టాలు పడాల్సి రావడం నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) సమస్యను మరింత జటిలం చేస్తున్నది.

రాజన్ ఎప్పుడో చెప్పారు



బ్యాంకింగ్ రంగంలో ప్రమాద ఘంటికలు మోగిస్తున్న ఎన్‌పీఏలపై ఆందోళన వ్యక్తం చేసిన రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్.. రియల్ ఎస్టేట్, డైమండ్ రంగాల్లోని కీలక వ్యక్తులు ఈ మొండి బకాయిల వెనుక ఉన్నారని ఎప్పుడో గుర్తించారు. ఈ విషయంపై దృష్టి సారించాలంటూ ప్రధానమంత్రి కార్యాలయాని (పీఎంవో)కి లేఖ కూడా రాశారు. పలు కేసుల్లో విచారణలకు ఎదురవుతున్న అడ్డంకులనూ అందులో వివరించారు. అంతేగాక విదేశాలకు బ్యాంకుల సొమ్ము దొంగచాటుగా తరలిపోతున్నదని, ఆయా దర్యాప్తు సంస్థలతో బ్యాంకర్లు కలిసి పనిచేయాలని కూడా సూచించారు. అయితే రాజన్ హెచ్చరికలను అటు ప్రభుత్వంగానీ, ఇటు బ్యాంకులుగానీ సీరియస్‌గా తీసుకోలేదన్న నిజాన్ని తాజా నీరవ్, కొఠారి కుంభకోణాలు రుజువు చేస్తున్నాయి.

స్వర్ణయుగం వైపు అడుగులు వేస్తున్నాం

- అభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శం:ఎంపీ వినోద్



రాజన్న సిరిసిల్ల జిల్లా సముద్ర లింగాపూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ వినోద్‌కుమార్. చిత్రంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ/మల్యాల: అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని, రాష్ట్రం స్వర్ణయుగం వైపు అడుగులు వేస్తున్నదని కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట, సిరిసిల్ల మండలాల్లో మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంతకుముందు జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్‌లో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను చొప్పదండి ఎమ్మెల్యే బొడిగ శోభ, కలెక్టర్ శరత్‌తో కలిసి ఎంపీ ప్రారంభించారు. ఆయా సభల్లో ఎంపీ వినోద్ మాట్లాడుతూ.. రెండేండ్లలో రాష్ట్ర ప్రభుత్వమే విద్యుత్ ఉత్పత్తి చేసి విక్రయించే స్థాయికి చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ కే రవీందర్‌రావు, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రామారావు, సెస్ డైరెక్టర్ విజయరామారావు పాల్గొన్నారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంకులో 8.94 కోట్లు గోల్‌మాల్

- రంగారెడ్డి జిల్లా అజీజ్‌నగర్ బ్రాంచ్‌లో భారీ కుంభకోణం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రంగారెడ్డి జిల్లా అజీజ్‌నగర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఓ భారీ కుంభకోణం వెలుగుచూసింది. ఈ బ్యాంకులో రూ.8.94 కోట్ల మేర మోసం జరిగిందని దీనిపై దర్యాప్తు చేయాలని పేర్కొంటూ తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ ఎం రవీందర్‌రెడ్డి ఈ నెల 7న సీబీఐకి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన సీబీఐ అధికారులు మంగళవారం పది మంది బ్యాంకు ఉద్యోగులతోపాటు మరికొంతమంది బయటి వ్యక్తులపై కేసు నమోదుచేశారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం పరిధిలో ఉన్న తెలంగాణ గ్రామీణ బ్యాంకు అజీజ్‌నగర్ బ్రాంచ్‌లో అవకతవకలు జరిగినట్టు సీనియర్ అధికారులు గుర్తించారు. విజిలెన్స్ అధికారుల విచారణలో బ్యాంకులో రూ.8.94 కోట్ల మేర మోసం జరిగినట్టు తేలింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేయాలని కోరుతూ బ్యాంకు రీజినల్ మేనేజర్ ఎం రవీందర్‌రెడ్డి సీబీఐకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన సీబీఐ డీఐజీ వీ చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా ప్రధాన నిందితుడిగా ఆఫీస్ అసిస్టెంట్ ఎం జైపాల్‌రెడ్డిని గుర్తించారు. మిగతా నిందితుల్లో బ్యాంకు అధికారులు జే మోసెస్, కే లక్ష్మీనర్సయ్య, కే చంద్రయ్య, జీ శ్రీనివాస్‌రావు, ఈ రాజన్న, బీ రవికాంత్, వీవీజే రామారావు, పీ గురుప్రసాద్, స్వీపర్‌గా పనిచేస్తున్న ఎం శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ సదస్సులకు ఏర్పాట్లు చేయండి

- 25న హైదరాబాద్‌లో, 26న కరీంనగర్‌లో సదస్సులు
- సీఎం కేసీఆర్ స్వయంగా పాల్గొంటారు
- వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జిల్లా, మండల రైతు సమన్వయ సమితి సభ్యుల ప్రాంతీయ సదస్సుకు ఏర్పాట్లు చేయాలని, సభ్యులకు అవసరమైన వసతులు సమకూర్చాలని వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి అధికారులను ఆదేశించారు. జిల్లా, మండల రైతు సమన్వయ సమితి సభ్యుల ప్రాంతీయ సదస్సుల ఏర్పాట్లపై జిల్లాల వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్‌శాఖల అధికారులతో మంగళవారం సచివాలయం నుంచి ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 25న హైదరాబాద్‌లో, 26న కరీంనగర్‌లో జరుగనున్న సదస్సులకు హాజరయ్యే సభ్యుల కోసం చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా అధికారులకు సూచనలు చేశారు. దీనికి సంబంధించి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నారని.. ఈ సమావేశంలో స్వయంగా పాల్గొనబోతున్నారని తెలిపారు. సభ్యులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉన్నదని, ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్లతో సమన్వయం చేసుకుని సభ్యుల సంఖ్య అంచనా వేసుకోవాలని సూచించారు. దీనికి మండల వ్యవసాయ అధికారులు బాధ్యత వహించాలని చెప్పారు. 13 జిల్లాలకు సంబంధించిన సదస్సు 25న హైదరాబాద్‌లోని వ్యవసాయ విశ్వ విద్యాలయం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో, మిగతా 17 జిల్లాలకు సంబంధించి ప్రాంతీయ సదస్సు 26న కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో జరుగనున్నట్లు చెప్పారు. ఈ సమావేశాలకు వ్యవసాయ విస్తరణాధికారులు, వ్యవసాయ అధికారులు, సహాయ సంచాలకులు, జిల్లా వ్యవసాయ అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ కమిషనర్ ఎం జగన్మోహన్, ఉద్యానశాఖ కమిషనర్ ఎల్ వెంకటరామిరెడ్డి, టీఎస్‌ఆర్టీసీ అధికారి మునిశేఖర్, వ్యవసాయ మంత్రి వ్యక్తిగత కార్యదర్శి మోహన్‌రెడ్డి, అదనపు వ్యవసాయ సంచాలకులు కే విజయకుమార్ పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించనున్న ఎమ్మెల్సీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పరిశీలించేందుకు శాసనమండలి సభ్యుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించనున్నది. ఈ నెల 23, 24 తేదీల్లో ప్రాజెక్టు నిర్మాణం జరిగే ప్రాంతాల్లో ఎమ్మెల్సీల బృందం పర్యటిస్తుందని శాసనమండలిలో చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జాతీయ స్థాయిలో పలు బ్యాంకులు నిర్వహించే బ్యాంకు ప్రొబేషనరీ ఆఫీసర్ల పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు గిరిజన సంక్షేమశాఖ ఏడీ సర్వేశ్వర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 5 నుంచి మే మూడో తేదీ వరకు రెండు నెలల పాటు శిక్షణ నిర్వహిస్తామని.. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 20 నుంచి 28వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 040-27540104 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

కరీంనగర్‌లో చిందుయక్షగానోత్సవం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ నెల 23 నుంచి 25 వరకు సంగీత, నాటక అకాడమీ, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖల సారథ్యంలో కరీంనగర్ కళాభారతి ఆడిటోరియంలో చిందుయక్షగానోత్సవం నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జానపదకళలకు ప్రాధాన్యం కల్పిస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్టు భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ తెలిపారు.

406 నక్షత్ర తాబేళ్లు స్వాధీనం

అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు మహిళల అరెస్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నక్షత్ర తాబేళ్లను బంగ్లాదేశ్‌కు అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు మహిళలను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) హైదరాబాద్ జోనల్ అధికారులు మంగళవారం విజయవాడ రైల్వేస్టేషన్‌లో అరెస్టు చేశారు. వారివద్దనుంచి 406 నక్షత్ర తాబేళ్లను స్వాధీనం చేసుకున్నారు. తాబేళ్లను విజయవాడ ఫారెస్ట్ రేంజ్ అధికారులకు అప్పగించినట్టు డీఆర్ఐ హైదరాబాద్ జోన్ అడిషనల్ డీజీ ఎంకే సింగ్ ఒకప్రకటనలో తెలిపారు. దిబ్రుగఢ్ నుంచి కన్యాకుమారి వెళుతున్న వివేక్ ఎక్స్‌ప్రెస్‌లో మంగళవారం ఉదయం నక్షత్ర తాబేళ్లు తరలిస్తున్న ముఠా పట్టుబడింది.

బిల్లులు దొరికాయి.. నగల్లేవు!

పురుషోత్తంరెడ్డి కేసులో నగల వ్యాపారులను ప్రశ్నించిన ఏసీబీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిందితుడు పురుషోత్తంరెడ్డి, అతడి బంధువుల ఇండ్లు, బ్యాంకు లాకర్ల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాల విషయంపై ఏసీబీ అధికారులు మంగళవారం నగలవ్యాపారులను ప్రశ్నించారు. కొన్నింటికి బిల్లులు మాత్రమే లభించి, బంగారు ఆభరణాలు కన్పించని విషయంలో రాధాచరణ్‌రెడ్డి, వారి కుటుంబసభ్యులకు ఏసీబీ తాజాగా నోటీసులు జారీచేసింది. ఇదిలాఉండగా, అజ్ఞాతంలో ఉన్న పురుషోత్తంరెడ్డి బావమరిది శ్రీనివాస్‌రెడ్డి బుధవారం లొంగిపోవచ్చని అతడి న్యాయవాదులు ఏసీబీ అధికారులకు తెలిపారు.

పీజీటీ మ్యాథ్స్, సోషల్‌లో సవరణలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైకోర్టు ఆదేశాల మేరకు పీజీటీ మ్యాథ్స్, సోషల్ సబ్జెక్టుల్లో సవరణలు చేయనున్నట్లు టీఎస్‌పీఎస్సీ మంగళవారం తెలిపింది. వివరాలు www.tspsc.gov.in లో పొందుపరిచినట్లు పేర్కొన్నది.

ఏసీబీకి చిక్కిన వీఆర్వో



వీఆర్వో రాములు

చందుర్తి: విరాసత్ చేసేందుకు రైతుల నుంచి లంచం తీసుకుంటూ ఓ వీఆర్వో ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి తహసీల్ కార్యాలయంలో మంగళవారం చోటుచేసుకున్నది. ఏసీబీ డీఎస్పీ కిరణ్‌కుమార్ కథనం ప్రకారం.. సనుగుల గ్రామానికి చెందిన బూర్ల ఎల్లయ్య, రాజయ్య, చిన్నమల్లయ్య అన్నదమ్ములు. వీరిలో ఎల్లయ్య ఇటీవలే మరణించాడు. ఎల్లయ్యకు భార్యా పిల్లలు లేకపోవడంతో ఆయన పేరిట ఉన్న మూడెకరాల వ్యవసాయ భూమిని విరాసత్ చేయాలని గతేడాది నవంబర్ 18న సనుగులలో జరిగిన భూప్రక్షాళన గ్రామసభలో ఆయన సోదరులు రాజయ్య, చిన్నమల్లయ్య రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో పలుమార్లు వీఆర్వోను అడిగినా స్పందించలేదు. తహసీల్దార్ రాజగోపాల్‌రావు దృష్టికి తెచ్చినా ఫలితం లేకుండాపోయింది. రాజయ్య కొడుకు రవీందర్, చిన్నమల్లయ్య కొడుకు దేవయ్య వీఆర్వోను గట్టిగా నిలదీయగా విరాసత్ చేసేందుకు లంచం డిమాండ్ చేశాడు. దీంతో రైతులు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం వీఆర్వో రాములు రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ కిరణ్‌కుమార్ పట్టుకున్నారు. వీఆర్వోను అదుపులోకి తీసుకొని కరీంనగర్‌కు తరలించారు.

యువకుడి కిడ్నాప్



రాజేశ్

అచ్చంపేటటౌన్: పట్టపగలే యువకుడిని సినీఫక్కీలో కిడ్నాప్ చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో మంగళవారం చోటుచేసుకున్నది. అచ్చంపేట వెంకటేశ్వర కాలనీలో ఉండే పార్వతమ్మ, శంకరయ్యల రెండో కుమారుడు రాజేశ్(33) అచ్చంపేట పాత బస్టాండ్ సమీపంలో మెడికల్‌షాప్ నిర్వహిస్తున్నాడు. రాజేశ్ అతని సోదరులతో కలిసి బెంగళూరు సమీపంలో కొంతకాలం పెట్రోల్ బంక్‌ను లీజుకు తీసుకుని నడిపాడు. నోట్ల రద్దు సమయంలో బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.30 లక్షల పాతనోట్ల మార్పిడికి ఒప్పందం చేసుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కర్ణాటక నుంచి ఐదు వాహనాల్లో వచ్చిన దాదాపు 20మంది కర్రలు, రాడ్‌లతో ఇంట్లోకి చొరబడి రాజేశ్‌ను వాహనంలో బలవంతంగా తీసుకెళ్లారు. రాజేశ్ తండ్రి శంకరయ్య అచ్చంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.



రాజన్న హుండీ ఆదాయం రూ.1.04 కోట్లు

వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామివారికి కేవలం 12 రోజుల్లోనే రూ.కోటి నాలుగు లక్షల 35 వేల ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో దూస రాజేశ్వర్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన ఈ హుండీ లెక్కింపుల్లో 550 గ్రాముల బంగారం, 15 కిలోల వెండి వచ్చిందని, ఒక అజ్ఞాత భక్తుడు 100 గ్రాముల బరువున్న రెండు బంగారు బిస్కెట్లను, వెండి కిరీటాలను హుండీలో వేశారని వెల్లడించారు.

– వేములవాడ కల్చరల్

ఆకుపచ్చ తెలంగాణకు..

మేము సైతం

భూసేకరణలో స్వచ్ఛంద సహకారం

ముందుకు వచ్చిన వెయ్యిమంది రైతులు ● జోరుగా పెద్దమండడి బ్రాంచ్ కెనాల్ పనులు



శరవేగంగా సాగుతున్న వనపర్తి జిల్లా పెద్దమండడి బ్రాంచ్ కెనాల్ పనులు

వనపర్తి, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి: ఆకుపచ్చ తెలంగాణకు మేము సైతం అంటూ రైతులు ముందుకు వచ్చారు. కాల్వ నిర్మాణం కోసం తమ భూములను స్వచ్ఛందంగా ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో అంతర్భాగమైన పెద్దమండడి బ్రాంచ్ కెనాల్ నిర్మాణానికి రైతులు బాసటగా నిలిచారు. దాదాపు 600 ఎకరాల భూముల అవసరం ఉండగా వెయ్యి మంది రైతులు భూములిచ్చేందుకు ముందుకొచ్చారు. పెద్దమండడి బ్రాంచ్ కెనాల్ పనులను జనవరి 29న భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. రూ.19 కోట్లతో 21 వేల ఎకరాల ఆయకట్టు లక్ష్యంతో 24 కిలోమీటర్ల ప్రధాన కాల్వ పనులకు శ్రీకారం చుట్టారు.

స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన రైతులు..

పెద్దమండడి బ్రాంచ్ ప్రధాన కాల్వ పది గ్రామాల మీదుగా వెళుతుంది. 24 కిలోమీటర్ల పరిధిలో దాదాపు వెయ్యి మంది రైతులున్నారు. రైతులు స్వచ్ఛందంగా భూములిస్తుండటంతో కాల్వ పనులు నిరాటంకంగా సాగుతున్నాయి. గడువులోగా కాల్వ పనులు పూర్తిచేసి ఈ ఏడాదే సాగునీటిని పారించనున్నారు. నీటి వసతి ఉన్న భూములకు ఎకరాకు రూ.5. 5లక్షలు, సాధారణ పొలానికి రూ. 4.5 లక్షలు నష్ట పరిహారం అందజేస్తుండటంతో రైతులు సంతోషంగా భూమిని ఇస్తున్నారు.

కాల్వ వెళ్లే గ్రామాలు..

వనపర్తి మండలం వెంకటాపూర్, అంకూరు, పెద్దమండడి మండలం పామిరెడ్డిపల్లి, వీరాయిపల్లి, జంగమాయిపల్లి బలిజపల్లి, గోపాల్‌పేట మండలం బుద్దారం, ఖిల్లాఘణపురం మండలం సోలీపూర్, ఉప్పరిపల్లి, సూరాయిపల్లి మీదుగా పెద్దమండడి బ్రాంచ్ ప్రధాన కాల్వ వెళుతుంది. ఈ కాల్వ కోసం రూ. 18.70 కోట్లను మంత్రి హరీశ్‌రావు చొరవతో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి నిధులను మంజూరు చేయించారు. వీఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ టెండర్ దక్కించుకొని 18 నెలల్లో పనులు చేసేలా ఒప్పందం చేసుకున్నది.

తోటి రైతుల ఆనందం కోసం..



వెంకటాపూర్‌లో 60 ఎకరాల పొలం ఉంది. పెద్దమండడి బ్రాంచ్ కెనాల్‌లో భాగంగా 15 ఎకరాల్లోని మామిడితోట మొత్తం పోతున్నది. పలు బోర్లు, ఊటకుంటలు సైతం ఈ కాల్వలో పోతున్నాయి. తోటి రైతుల ఆనందం కోసం ఎలాంటి పేచీలు లేకుండా సహకరిస్తున్నా.

– జగన్‌మోహన్‌రెడ్డి, రైతు, వెంకటాపురం, వనపర్తి మండలం

రైతుల సహకారం గొప్పది..



పెద్దమండడి బ్రాంచ్ కెనాల్ పనుల్లో రైతుల సహకారం చాలా గొప్పది. ఏ రైతు కూడా వివాదాలకు పోకుండా పూర్తిగా సహకరిస్తున్నారు. కాల్వ పనులు వేగంగా జరుగుతున్నాయి. ముందు సర్వే.. తమ ప్రాంతానికి సాగునీటి వసతులు కావాలన్న తపనతో రైతులున్నారు.

– వెంకటయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, (భూ సేకరణ) వనపర్తి



కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో మంత్రి ఈటల సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు



మంత్రి లక్ష్మారెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరిన మహబూబ్‌నగర్ జిల్లా హేమాజీపూర్ టీడీపీ, కాంగ్రెస్ నాయకులు

గులాబీ పార్టీలోకి జోరుగా వలసలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: అధికార టీఆర్‌ఎస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయి. మంగళవారం కూడా ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, ఇతర సంఘాల వారు పెద్ద ఎత్తున చేరారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో మంత్రి ఈటల రాజేందర్ సమక్షంలో కమలాపూర్ మండలంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు 200మందికిపైగా టీఆర్‌ఎస్‌లో చేరారు. నిర్మల్ జిల్లా మామడ మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు 200మందికిపైగా మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్ గూటికి చేరారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం హేమాజీపూర్‌కు చెందిన 100మంది టీడీపీ, కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో మంత్రి లక్ష్మారెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలంలో 300 మంది టీడీపీ నాయకులు, వందమంది యువజన సంఘాల సభ్యులు, 50 మంది మహిళలు టీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వరంగల్ అర్బన్ జిల్లా ఎల్కతుర్తిలో టీడీపీ, వివిధ సంఘాలకు చెందిన సుమారు 30మంది హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ సమక్షంలో, పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలో దాదాపు 50 మందిపైగా మంథని ఎమ్మెల్యే పుట్ట మధు సమక్షంలో, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో 200 మందికి పైగా కాంగ్రెస్ నాయకులు టీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్సీ పురాణం సతీశ్, ఎమ్మెల్యే కోవలక్ష్మి, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు.



టీఆర్‌ఎస్‌లో చేరిన నిర్మల్ జిల్లా మామడ మండలానికి చెందిన వారితో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

చకచకా బీటీపీఎస్

- వేగంగా భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణ పనులు
- గడువులోగా పూర్తి చేసేలా ప్రణాళిక
- పర్యవేక్షిస్తున్న జెన్‌కో సీఎండీ, బీటీపీఎస్ సీఈ



మణుగూరు, పినపాక మండలాల్లో నిర్మాణంలో ఉన్న భద్రాద్రి విద్యుత్ ప్లాంట్

మణుగూరు, నమస్తేతెలంగాణ: నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రాబోయే రోజుల్లో విద్యుత్ ఆటంకాలు ఏర్పడకుండా పవర్ ప్లాంట్లను నిర్మిస్తున్నది. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతీసుకోవడంతో ప్లాంట్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు, పినపాక మండలాల సరిహద్దు ప్రాంతంలో 1080(4x270) మెగావాట్ల సామర్థ్యం గల భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను సుమారు 1050 ఎకరాల్లో నిర్మిస్తున్నారు. సుమారు 14 ఏజెన్సీల ఆధ్వర్యంలో సుమారు 2500 మంది కార్మికులు అహర్నిశలు శ్రమిస్తున్నారు. జెన్‌కో, భెల్ తరుపున దాదాపు 100 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నారు. రక్షణ చర్యలకు అధిక ప్రాధాన్యమిస్తూ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు విద్యుత్ ప్లాంట్‌ను సందర్శించి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. జెన్‌కో డైరెక్టర్ (ప్రాజెక్టు) రాధాకృష్ణ పర్యవేక్షణలో బీటీపీఎస్ సీఈ పిల్లి బాలరాజు ఆధ్వర్యంలో జెన్‌కో, భెల్ అధికారులు ప్లాంటు పనులను వేగవంతం చేశారు. దీంతో విద్యుత్ ప్లాంట్‌లో కూలింగ్ టవర్స్, బాయిలర్స్, చిమ్నీల, ఈఎస్‌పీ, జీటీ, పవర్‌హౌస్, టీజీ డెక్ పనుల్లో వేగం అందుకున్నది. ఇప్పటికే భెల్, జెన్‌కో అధికారులు పనుల్లో నిమగ్నమయ్యారు. అనుకున్న సమయానికి పవర్ ప్లాంట్ పూర్తి చేయాలనే లక్ష్యంతో జెన్‌కో, భెల్ అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. ఇక బాయిలర్స్, టీజీ బిల్డింగ్స్(పవర్‌హౌస్) చిమ్నీల నిర్మాణ పనులతోపాటు స్విచ్ యార్డు, కోల్ ప్లాంట్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మణుగూరు మండలం సాంబాయిగూడెం సమీపంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డుకు భారీగా వాహనాల్లో యంత్రాలను, విద్యుత్ ప్లాంట్ సామగ్రిని తరలిస్తున్నారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కూడా ప్లాంట్ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు.

నిర్మాణ రంగ కార్మికులకు అండగా ఉంటా

రూ. 33.13 లక్షల చెక్కులు పంపిణీ చేసిన హోంమంత్రి నాయిని

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భవన నిర్మాణ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. నిర్మాణ కార్మిక సంక్షేమమండలి తరపున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదన్నారు. వివిధ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్నవారిలోనుంచి నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి స్క్రీనింగ్ కమిటీ పరిశీలించి ఎంపిక చేసిన 28 మంది కార్మికులకు నాయిని రూ.33.13 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీఎల్ హన్మంతు, కార్మికులు, నేతలు పాల్గొన్నారు.

వీడియో జర్నలిస్టుల కృషి అమోఘం

జర్నలిస్టుల గుర్తింపు కార్డుల ఆవిష్కరణలో మంత్రి పద్మారావు కితాబు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ అభివృద్ధిని జర్నలిస్టులు వీడియో చిత్రీకరణతో చూపిస్తున్న తీరు అద్భుతంగా ఉన్నదని రాష్ట్ర ఎక్సైజ్, యువజన క్రీడల శాఖ మంత్రి పద్మారావుగౌడ్ అన్నారు. మంగళవారం సచివాలయంలోని తన చాంబర్‌లో టీవీజేఏ ఫొటో గుర్తింపు కార్డులను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వీడియో జర్నలిస్టుల పాత్ర కీలకంగా మారిందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వీడియో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు తిగుళ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వనం నాగరాజు, ఉపాధ్యక్షుడు నర్సింహ, సంయుక్త కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి శశికాంత్ పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. విద్యాశాఖ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమశాఖల ఆధ్వర్యంలోని గురుకుల విద్యాలయాల్లో చేరదలచిన వారు మార్చి 16 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని 497 గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 8న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసిన అన్ని కేంద్రాల్లో పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. 2018–19 విద్యాసంవత్సరానికిగాను నిర్వహించనున్న ఈ పరీక్షకు 9 నుంచి 11 ఏండ్ల మధ్య వయసు కలిగినవారు అర్హులని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 9 నుంచి 13 ఏండ్ల వరకు వయోపరిమితిని సడలించినట్లు తెలిపారు. సైనికోద్యోగుల పిల్లలకు ఆదాయ పరిమితి నిబంధన వర్తించదని ఆయన వెల్లడించారు.

ఐదుగురు మావోయిస్టులపై జార్ఖండ్‌లో చార్జిషీట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్రోహచర్యలకు కుట్ర, వ్యూహరచనల కోసం పలుసంస్థల నుంచి బలవంతంగా నిధులు వసూలు చేసిన కేసులో ఐదుగురు మావోయిస్టులపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) చార్జిషీట్ సిద్ధం చేసి, మంగళవారం జార్ఖండ్ రాజధాని రాంచీలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో దాఖలుచేసింది. వారిలో తెలంగాణకు చెందిన బురేడి నారాయణ, సుధాకర్ అలియాస్ ఒగ్గు సత్వాజీ అలియాస్ కిరణ్, మాధవి అలియాస్ వైదుగుల అరుణ అలియాస్ జయ అలియాస్ పద్మ, జార్ఖండ్‌కు చెందిన ప్రభుప్రసాద్, సుజీత్ కేర్వార్ ఉన్నారు.

డీఎల్ఎడ్ కోర్సు వెరిఫికేషన్‌కు 28 వరకు గడువు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ విధానం ద్వారా డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సుకోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 28 వరకు హెచ్ఎంలతో తనిఖీ చేయించుకోవడానికి కేంద్ర ఎన్ఐఓఎస్ అవకాశం ఇచ్చింది. ఎంపీ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు చేసిన విజ్ఞప్తి మేరకు ఎన్ఐఓఎస్ ఢిల్లీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల దేశవ్యాప్తంగా దాదాపు 32 వేల మంది అన్‌ట్రైన్డ్ టీచర్లకు రెగ్యులర్ టీచర్లుగా అర్హత సాధించేందుకు అవకాశం ఉంటుందని ఎన్ఐఓఎస్ తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు.

పార్టీ వ్యతిరేక చర్యలను తీవ్రంగా పరిగణిద్దాం

టీటీడీపీ నేతల నిర్ణయం.. 28న చంద్రబాబుతో సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను తీవ్రంగా పరిగణించాలని టీటీడీపీ నేతల సమావేశం నిర్ణయించింది. తెలంగాణలో పార్టీ పరిస్థితిపై చర్చించేందుకు ఈ నెల 28న ప్రత్యేక సమావేశం కావాలని చంద్రబాబు నాయుడు నిర్ణయించిన నేపథ్యంలో టీటీడీపీ అధ్యక్షుడు ఎల్ రమణ పార్టీ నేతలతో ఎన్టీఆర్ ట్రస్టు భవనల్‌లో మంగళవారం ముందస్తు సమావేశం ఏర్పాటు చేశారు. చంద్రబాబుతో భేటీ సందర్భంగా చర్చించాల్సిన పలు అంశాల ఎజెండాను ఖరారు చేశారు. చంద్రబాబుపై పరోక్షంగా విమర్శలు చేసిన మోత్కుపల్లిపై చర్యలు తీసుకొనే అవకాశాలున్నట్టు పార్టీవర్గాలు భావిస్తున్నాయి.

త్వరలో టీఆర్టీ రివైజ్డ్ హాల్‌టికెట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తమకు సమీపంలోని జిల్లాల్లో పరీక్షా కేంద్రాలు కేటాయించాలన్న టీఆర్టీ అభ్యర్థుల విజ్ఞప్తులపై టీఎస్‌పీఎస్సీ దృష్టి సారించింది. ఇప్పటికే కేటాయించిన హాల్‌టికెట్లకు బదులుగా నూతన పరీక్షా కేంద్రాలతో కూడిన రివైజ్డ్ హాల్‌టికెట్లను త్వరలో తమ వెబ్‌సైట్‌లో పెట్టనున్నట్లు టీఎస్‌పీఎస్సీ మంగళవారం తెలిపింది. హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నవారు మరోమారు రివైజ్డ్ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది.

ఆర్టిజెన్స్‌కు స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలి

తెలంగాణ విద్యుత్ సంస్థ యాజమాన్యానికి ఉద్యోగుల సంఘం వినతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయడంలో విజయం సాధించిన ఆర్టిజెన్స్‌కు విద్యుత్ ఉద్యోగుల మాదిరిగానే స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే సాయిబాబు మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. విద్యుత్ ఉద్యోగుల మాదిరిగానే నెలకు రూ.1500 చొప్పున స్పెషల్ ఇంక్రిమెంట్ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

పథకాల లక్ష్యాల్ని పూర్తిగా సాధించాలి

మైనార్టీ శాఖ అధికారులతో భేటీలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల అమలులో నూటికి నూరు శాతం లక్ష్యాల్ని సాధించాలని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో మైనార్టీశాఖ ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం సమావేశం నిర్వహించారు. షాదీముబారక్, స్కాలర్‌షిప్‌లు, విదేశాలకు వెళ్లే మైనార్టీలకు ఇచ్చే ఆర్థిక సాయం, మైనార్టీ విద్యార్థులకు బ్యాంకు రుణాలు తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రభుత్వం పేద మైనార్టీలను ఆర్థికంగా ఆదుకుంటుందని, సీఎం కేసీఆర్ ఆశయాలకనుగుణంగా పని చేసి పూర్తిస్థాయిలో లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారుడు ఏకే ఖాన్, మైనార్టీ సెక్రటరీ దానకిశోర్, మైనార్టీ ఫైనాన్స్ చైర్మన్, టీఎంఆర్ఐఈఎస్ ఎండీ షఫీయుల్లా, వక్ఫ్‌బోర్డు సీఈఓ మన్నాన్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
ఆట
[హైదరాబాద్]
బుధవారం 21 ఫిబ్రవరి 2018

వాలీబాల్ విజేత ఖమ్మం, నిజామాబాద్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి డిగ్రీ కళాశాలల యువత రంగం వాలీబాల్ టోర్నీ బాలుర విభాగంలో ఖమ్మం, బాలికల విభాగంలో నిజామాబాద్ జట్లు విజేతలుగా నిలిచాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ ఈ పోటీలను ప్రారంభించారు. ఫైనల్ మ్యాచ్‌లో బాలుర విభాగంలో ఖమ్మం (సత్తుపల్లి) జట్టు, నిజామాబాద్(గిరిరాజ)పై 25-23, 25-18 స్కోర్ తేడాతో గెలువగా.. బాలికల విభాగంలో నిజామాబాద్ (కామరెడ్డి) జట్టు హైదరాబాద్(బేగంపేట)పై 25-20, 25-20, 15-09 స్కోర్ తేడాతో గెలిచి విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో వాలీబాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు శాంతికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యాదగిరి పాల్గొన్నారు.



బాలికల విభాగంలో విజేతగా నిలిచిన నిజామాబాద్ జట్టు



బాలుర విభాగంలో విజేతగా నిలిచిన ఖమ్మం జట్టు

కోహ్లీ కొత్త చరిత్ర

దుబాయ్: క్రికెట్ ప్రపంచంలో 'పరుగుల యంత్రం'గా పేరొందిన భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ మరో అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. టెస్టు, వన్డేల్లో 900లకు పైగా ర్యాంకింగ్ పాయింట్లను నమోదు చేసి సరికొత్త చరిత్ర సృష్టించాడు. తద్వారా ఒకేసారి టెస్టు, వన్డేల్లో 900ల పాయింట్లు సాధించిన రెండో బ్యాట్స్‌మన్‌గా రికార్డులకెక్కాడు. గతంలో డివిలియర్స్ (దక్షిణాఫ్రికా) ఈ ఘనత అందుకున్నాడు. మంగళవారం ఐసీసీ తాజాగా విడుదల చేసిన జాబితాలో కోహ్లీ టెస్టుల్లో 912, వన్డేల్లో 909 ర్యాంకింగ్ పాయింట్లు సాధించాడు. సఫారీ గడ్డపై విశేషంగా రాణించడం అతనికి బాగా కలిసొచ్చింది. ఐదు రోజుల ఫార్మాట్‌లో రెండో ర్యాంక్‌లో కొనసాగుతున్న విరాట్.. వన్డే ర్యాంకింగ్స్‌లో టాపర్‌గా ఉన్నాడు. భారత్ తరపున వన్డేల్లో 900 రేటింగ్ పాయింట్లు సాధించిన ఏకైక క్రికెటర్ కోహ్లీ. గతంలో సచిన్ 887 పాయింట్ల వరకు వచ్చాడు. ఓవరాల్‌గా 900 రేటింగ్ పాయింట్లను సాధించిన జాబితాలో విరాట్ ఐదో క్రికెటర్. అయితే 'ఆల్‌టైమ్ వన్డే రేటింగ్ పాయింట్ల జాబితా'లో విండీస్ దిగ్గజం వీవీయన్ రిచర్డ్స్ (935) అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ జాబితాలో విరాట్‌ది ఏడో స్థానం. ఇక 25 ఏండ్ల తర్వాత వన్డేల్లో అత్యధిక రేటింగ్ పాయింట్లు నమోదు చేసిన ఆటగాడిగా విరాట్.. బ్రియాన్ లారా రికార్డును అధిగమించాడు. 1993లో లారా 911 పాయింట్లను నమోదు చేశాడు.

గెలిస్తే 'రెండు'లోకి

ఈ మ్యాచ్‌లో నెగ్గితే భారత్ ఐసీసీ ర్యాంక్ కూడా మెరుగుపడుతుంది. ప్రస్తుతం మూడోస్థానంలో ఉన్న టీమ్‌ఇండియా (122 పాయింట్లు) రెండో ర్యాంక్‌కు ఎగబాకుతుంది. అయితే బుధవారమే జరిగే ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ముక్కోణపు ఫైనల్లో ఒకవేళ కంగారూలు గెలిస్తే విరాట్‌సేన మళ్లీ మూడో ర్యాంక్‌కు పరిమితమవుతుంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా రెండో ర్యాంక్‌లో కొనసాగుతున్నది.

బుమ్రా 'టాప్'



ఐసీసీ వన్డే బౌలర్ల జాబితాలో జస్‌ప్రీత్ బుమ్రా (787) రెండు స్థానాలు ఎగబాకి టాప్ ర్యాంక్‌ను చేజిక్కించుకున్నాడు. అయితే ఆఫ్ఘనిస్థాన్ లెగ్ స్పిన్నర్ రషీద్‌తో కలిసి సంయుక్తంగా నంబర్‌వన్ ర్యాంక్‌ను పంచుకున్నాడు. ఈ ర్యాంక్ సాధించిన అతి పిన్న వయస్కుడిగా రషీద్ రికార్డులోకెక్కాడు. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో 16 వికెట్లు తీసిన చాహల్ 8 స్థానాలు మెరుగుపర్చుకుని 21వ ర్యాంక్లో నిలువగా, కుల్దీప్ (17 వికెట్లు) 47వ ర్యాంక్‌లో నిలిచాడు.



కోహ్లీ

రాత్రి 9.30 నుంచి సోనీ టెన్-1, 3లో

భారత్‌కు ఎదురుందా..!

భారత్ ఆరాటం.. సిరీస్ గెలువడం
దక్షిణాఫ్రికా పోరాటం.. పరువు నిలబెట్టు
కోవడం కానీ ఇద్దరి లక్ష్యం..
మ్యాచ్ గెలువడం..!వన్డే సిరీస్ ఇచ్చిన ఉత్సాహం
ఒకరిది..పొట్టి ఫార్మాట్ సిరీస్‌ను గెలువాలన్న పట్టుదల
మరొకరిది..కానీ ఇద్దరి ఆశ, ఆకాంక్ష..
గెలిచి ముందుకు సాగాలని..!
ఈ నేపథ్యంలో విదేశీ అననుకూలతను జయించిన
విరాట్‌సేన బలానికి..స్వదేశీ అనుకూలతను సొమ్ము చేసుకోలేకపోతున్న
సఫారీ బౌలింగ్ బలగానికి.. మధ్య కీలకమైన
రెండో టీ20 మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది.

నేడు దక్షిణాఫ్రికాతో రెండో టీ20

సఫారీలకు చావో రేవో

సిరీస్ గెలుపే టీమ్‌ఇండియా లక్ష్యం

సెంచూరియన్:

టెస్టుల్లో ఓటమికి వన్డే సిరీస్‌తో తిరుగులేని ప్రతీకారం తీర్చుకున్న భారత్ జట్టు.. ఇప్పుడు ఆ జోష్‌ను రెట్టింపు చేసుకునే పనిలో పడింది. సఫారీ గడ్డపై వరుసగా రెండో సిరీస్ గెలువాలన్న ఏకైక లక్ష్యంతో ముందుకెళ్తున్నది. ఈ నేపథ్యంలో బుధవారం జరిగే రెండో టీ20లో దక్షిణాఫ్రికాతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమైంది. వన్డే సిరీస్‌ను 5-1తో గెలుచుకున్న టీమ్‌ఇండియా మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉన్నది. ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్న విరాట్‌సేన ఈ మ్యాచ్‌లో గెలువడం ద్వారా ఐసీసీ ర్యాంకింగ్స్‌ను కూడా మెరుగుపర్చుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. ఇరుజట్ల బలాబలాలను పరిశీలిస్తే కీలక ఆటగాళ్ల గాయాలతో సఫారీ జట్టు కాస్త వెనుకబడిపోయింది. కానీ పొట్టి ఫార్మాట్‌లో ఒక్క ఓవర్‌లోనే ఫలితాన్ని తారుమారు చేయొచ్చు. అలాంటి ఆటగాళ్లకు ప్రత్యర్థి జట్టులో కొదువలేదు. కాబట్టి భారత్ ఏమాత్రం అలసత్వం వహించినా మూల్యం చెల్లించుకోక తప్పదు.

కోహ్లీ ఆడుతాడా?

తొలి టీ20లో ఫీల్డింగ్ చేస్తూ గాయపడ్డ కెప్టెన్ విరాట్ ఈ మ్యాచ్‌లో ఆడటంపై సందిగ్ధత నెలకొంది. ప్రస్తుతానికి అతను నడుం నొప్పితో బాధపడుతున్నట్లు సమాచారం. అయితే మ్యాచ్ సమయానికి పూర్తిస్థాయిలో కోలుకుంటాడని టీమ్ మేనేజ్‌మెంట్ సంకేతాలిచ్చింది. మరోవైపు పని భారంతో పాటు మోకాలి నొప్పితో కూడా విరాట్ ఇబ్బందులుపడుతున్నట్లు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో కెప్టెన్‌కు విశ్రాంతి ఇస్తే కేఎల్ రాహుల్ తుది జట్టులోకి రానున్నాడు. జొహన్నెస్‌బర్గ్‌లో మూడోస్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి అందర్ని ఆశ్చర్యపరిచిన సురేశ్ రైనా ఫామ్‌పై ఆందోళన కొనసాగుతూనే ఉంది. ఇక ఓపెనింగ్‌లో ధవన్‌కు తోడు రోహిత్ మెరిస్తే భారత్‌కు తిరుగుండదు. టాప్ ఆర్డర్ సాఫీగా ఆడుతున్నా మిడిలార్డర్‌లో సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. మనీష్ పాండే అంచనాలను అందుకోవడం లేదు. ధోనీ ఆటలో వేగం మందగించింది. పాండ్యా ఆల్‌రౌండర్ పాత్రకు న్యాయం చేయడం లేదు. వీళ్లలో ఒక్కరు కుదురుకున్నా భారీ స్కోరు ఖాయం. పొట్టి ఫార్మాట్‌లో లెఫ్టార్మ్ పేసర్ అవసరం చాలా ఎక్కువ కాబట్టి జైదేవ్ ఉనాద్కట్ చోటు ఖాయం. భువనేశ్వర్, బుమ్రా ఎలాగూ ఉంటారు. గత కొంతకాలంగా సూపర్ స్పోర్ట్స్ పార్క్ మందకొడిగా మారుతున్నది. దీనిని దృష్టిలో చాహల్‌కు తోడుగా కుల్దీప్‌ను తిరిగి జట్టులోకి తీసుకునే అవకాశం కూడా ఉంది. ఫీల్డింగ్‌లోనూ భారత్ పైచేయి చూపిస్తే సిరీస్ మనదే..!



పరువు నిలబెట్టుకుంటారా?

గత మంగళవారమే దక్షిణాఫ్రికా చావోరేవో మ్యాచ్ ఆడింది. మళ్లీ ఎనిమిది రోజుల్లోనే అలాంటి పరిస్థితిలో పడింది. సీనియర్లందరూ గాయాలతో అందుబాటులో లేకపోవడంతో ఇప్పుడు కుర్రాళ్లపైనే భారం పడింది. ఈ ఒత్తిడి నుంచి బయపటడి భారత్‌ను నిలువరించాలంటే శక్తికి మించి పోరాడాలి. డాషింగ్ హిట్టర్ డివిలియర్స్ లేకపోవడం అతిపెద్ద లోటు. కాబట్టి అందుబాటులో ఉన్న ఆటగాళ్లలో అత్యుత్తమ జట్టును ఎంచుకోవడం కెప్టెన్ డుమినికి కత్తిమీద సామే. పవర్‌ప్లేలో షార్ట్ బంతులతో టీమ్‌ఇండియాను వణికించాలన్న వ్యూహం బెడిసికొట్టడంతో సఫారీలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కనీసం ఈ మ్యాచ్‌లోనైనా ఈ ప్రణాళికను సమర్థంగా అమలు చేస్తారా లేదా చూడాలి.

కొడితే రికార్డు బద్దలే..

రికార్డుల రారాజు విరాట్‌ను ఇప్పుడు బ్రాడ్‌మన్ రికార్డు ఊరిస్తున్నది. చివరి రెండు టీ20ల్లో గనుక 104 పరుగులు చేస్తే ఒకే టూర్‌లో 974 పరుగులు చేసిన బ్రాడ్‌మన్ రికార్డు బద్దలవుతుంది. ఒకవేళ 130 పరుగులు చేస్తే వీవీయన్ రిచర్డ్స్ (ఒకే టూర్ 1045 పరుగులు) రికార్డుకు చేరువగా వస్తాడు. 1976లో ఇంగ్లండ్‌పై రిచర్డ్స్ నెలకొల్పిన ఈ రికార్డు ఇప్పటివరకు చెదిరిపోలేదు. 1930లో బ్రాడ్‌మన్ ఇంగ్లండ్‌పై ఐదు టెస్టుల్లో 974 పరుగులు సాధించాడు. సఫారీ పర్యటనలో విరాట్ 13 ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఇప్పటివరకు 870 పరుగులు చేశాడు. విదేశీ గడ్డపై ద్వైపాక్షిక సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాట్స్‌మన్‌గానూ రికార్డును సొంతం చేసుకున్నాడు. మూడు టెస్టుల్లో 286, ఆరు వన్డేల్లో 558 పరుగులు చేశాడు. గతంలో రిచర్డ్స్ ఈ ఘనత సాధించాడు.

పిచ్, వాతావరణం

మందకొడిగా ఉంది. భారీ స్కోరు చేయొచ్చు. స్పిన్నర్లకు అనుకూలంగా ఉండొద్దని క్యూరేటర్ ప్రయత్నిస్తున్నాడు. మధ్యాహ్నం వర్షం పడే అవకాశాలు 80 శాతం ఉన్నాయి.

జట్లు (అంచనా)

భారత్: కోహ్లీ (కెప్టెన్), రోహిత్, ధవన్, రైనా, మనీష్, ధోనీ, హార్దిక్, భువనేశ్వర్, ఉనాద్కట్, బుమ్రా, చాహల్.
దక్షిణాఫ్రికా: డుమిని (కెప్టెన్), స్మట్స్, హెండ్రిక్స్, మిల్లర్, బెహర్డిన్, క్లాసెన్, పెహెల్‌కావో, మోరిస్, పీటర్సన్, డాల, షమ్సీ / ఫాంగిసో.

మళ్లీ సర్దార్‌కు హాకీ జట్టు పగ్గాలు

న్యూఢిల్లీ: భారత హాకీ జట్టుకు ఎన్నో చిరస్మరణీయ విజయాలు సాధించిపెట్టిన వెటరన్ మిడ్‌ఫీల్డర్ సర్దార్ సింగ్‌కు సెలెక్టర్లు మరో అవకాశం ఇచ్చారు. మార్చి 3 నుంచి 11 వరకు మలేసియాలో జరుగనున్న సుల్తాన్ అజ్లాన్ షా కప్‌లో పాల్గొనే టీమ్‌ఇండియా పగ్గాలు అతనికి అప్పగించారు. కొత్త కోచ్ జొయర్డ్ మారీన్ విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. రెగ్యులర్ కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్‌కు విశ్రాంతి ఇచ్చారు. గతేడాది డిసెంబర్‌లో జట్టు నుంచి ఉద్వాసనకు గురైన సర్దార్‌ను తర్వాత జరిగిన న్యూజిలాండ్ పర్యటనకు కూడా ఎంపిక చేయలేదు. దీంతో అతని అంతర్జాతీయ కెరీర్ ముగిసేనట్లేనని ఊహాగానాలు చెలరేగాయి.

సైనా, శ్రీకాంత్, సింధు సారథ్యంలో

కామన్వెల్త్‌కు భారత బ్యాడ్మింటన్ జట్టు



న్యూఢిల్లీ: కామన్వెల్త్‌గేమ్స్‌లో పాల్గొనే భారత బ్యాడ్మింటన్ జట్టులో స్టార్‌షట్లర్లకు చోటు కల్పించారు. మంగళవారం జరిగిన సెలక్షన్ కమిటీ సమావేశంలో 10 మందితో కూడిన భారత జట్టును ఎంపిక చేసినట్లు భారత బ్యాడ్మింటన్ సంఘం(బాయ్) కార్యదర్శి అనూప్ నారంగ్ వెల్లడించారు. ప్రపంచ నంబర్ 3 కిడాంబి శ్రీకాంత్, 11వ ర్యాంకర్ హెచ్‌ఎస్ ప్రణయ్, మహిళా స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, పీవీ సింధులతో పాటు డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప, సిక్కిరెడ్డిలను ఎంపిక చేశామన్నారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కిరెడ్డికి జోడీగా ప్రణవ్ చోప్రా ఆడుతాడని చెప్పారు. ఆస్ట్రేలియాలో వచ్చే ఏప్రిల్ 4 నుంచి 15 వరకు కామన్వెల్త్ క్రీడలు జరుగనున్నాయి. భారత బ్యాడ్మింటన్ జట్టు గ్రూప్‌ఏలో భాగంగా పాకిస్థాన్, శ్రీలంక, స్కాట్లండ్‌తో తలపడనుంది. అనంతరం నాకౌట్ పోటీలలో విజయంతో మన జట్టు కచ్చితంగా పతకం సాధిస్తుందని నారంగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. పురుషులతో పాటు మహిళల జట్ల విభాగంలో కలిసి ఆడే భారత షట్లర్లు సింగిల్స్‌లో పరస్పరం తలపడడం ఆసక్తిని కలిగిస్తుంది. పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్, శ్రీకాంత్.. మహిళల సింగిల్స్‌లో సింధు, సైనాల పోరాటం అలరించనుంది.

పురుషుల జట్టు: కిడాంబి శ్రీకాంత్, హెచ్‌ఎస్ ప్రణయ్,చిరాగ్ షెట్టి, సాత్విక్ సాయిరాజ్, ప్రణవ్ చోప్రా
మహిళల జట్టు: సింధు, సైనా, అశ్విని పొన్నప్ప, సిక్కిరెడ్డి, రుత్విక శివాని.

చీరల్లో కాదు ప్యాంట్, షర్టుల్లో..

న్యూఢిల్లీ: భారత ఒలింపిక్ సమాఖ్య(ఐవోఏ) కొత్త సంప్రదాయానికి తెరతీసింది. నాలుగేండ్లకోసారి జరిగే ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్, కామన్వెల్త్, ఆసియా గేమ్స్‌లాంటి మెగా టోర్నీల ఆరంభ వేడుకల్లో భారత క్రీడాకారిణీలు సంప్రదాయ చీరకట్టులో ఆకట్టుకునేవారు. జాతీయ జెండా చేతిలో పట్టుకుని కోట్లాదిమంది తరపున ప్రాతినిధ్యం వహించేవారు. అయితే ఏప్రిల్ 4 నుంచి గోల్డ్‌కోస్ట్(ఆస్ట్రేలియా)లో మొదలయ్యే 21వ కామన్వెల్త్ క్రీడల్లో భారత అమ్మాయిలు ఈసారి చీరల్లో కాకుండా ప్యాంట్, షర్టుల్లో మార్చ్‌ఫాస్ట్ చేయనున్నారు. 'అథ్లెట్లను అందరిని సంప్రదించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నాం. ప్రారంభ వేడుకలు దాదాపు మూడు, నాలుగు గంటల పాటు జరుగుతాయి. దీనికి తోడు కొంత మంది చీరలు కట్టుకోవడంలో సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని మహిళలకు ఆధునిక రీతిలో ప్యాంట్లు, షర్టులను ఎంపిక చేశాం' అని ఐవోఏ జనరల్ సెక్రెటరీ రాజీవ్ మెహతా అన్నారు.



చరిత్రకు అడుగుదూరంలో..

సిరీస్‌పై హర్మన్‌ప్రీత్‌సేన నజర్ ■ దక్షిణాఫ్రికాతో నాలుగో టీ20 నేడు

సెంచూరియన్: భారత మహిళల క్రికెట్ జట్టు కొత్త చరిత్ర సృష్టించేందుకు మరో అడుగు దూరంలో ఉన్నది. దక్షిణాఫ్రికా గడ్డపై ఇప్పటికే వన్డే సిరీస్ సొంతం చేసుకున్న హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని టీమ్‌ఇండియా..టీ20 సిరీస్‌పై కన్నేసింది. బుధవారం సెంచూరియన్‌లో జరిగే నాలుగో టీ20లో ఇరు జట్లు తలపడనున్నాయి. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-1 ఆధిక్యంలో ఉన్న టీమ్‌ఇండియా మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్ గెలువాలన్న పట్టుదలతో ఉన్నది. మరోవైపు సమిష్టి ప్రదర్శనతో మూడో టీ20 విజయంతో సిరీస్‌లో నిలిచిన దక్షిణాఫ్రికా అదే జోరును సెంచూరియన్‌లోనూ కొనసాగించాలన్న కసితో ఉన్నది. ఈ నేపథ్యంలో ఇరు జట్ల మధ్య ఆసక్తికర పోరుకు తెరలేసే అవకాశమున్నది. నాలుగో టీ20 మ్యాచ్‌లో భారత్ గెలిస్తే..సరికొత్త అధ్యాయం మొదలైనట్లే. దక్షిణాఫ్రికా గడ్డపై వన్డే సిరీస్‌తో పాటు టీ20 సిరీస్ గెలిచిన తొలి భారత మహిళల జట్టుగా రికార్డుల్లోకెక్కింది. దీనికి తోడు ఆస్ట్రేలియాపై టీ20 సిరీస్ విజయం తర్వాత వరుసగా రెండోది మన ఖాతాలోకి చేరుతుంది. ఇదిలా ఉంటే మూడో టీ20 ఓటమి నుంచి తేరుకుని సఫారీలకు దీటైన పోటీనిస్తుందా లేక తలొగ్గుతుందా అన్నది ఆసక్తి కల్గించే అంశంగా మారింది.



సాయంత్రం: 4.30 నుంచి సోనీ టెన్-1, టెన్-3లో

పోటీలోకి వస్తారా?

వన్డే సిరీస్ విజయమిచ్చిన ఊపుతో టీ20 సిరీస్‌లో బరిలోకి దిగిన హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని టీమ్‌ఇండియా.. అదే జోరులో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో గెలిచింది. తమ విజయాలు గాలివాటం కాదని నిరూపిస్తూ..దక్షిణాఫ్రికాను మట్టికరిపించింది. అటు బ్యాటింగ్‌లో సీనియర్లు మిథాలీరాజ్, హర్మన్‌ప్రీత్‌కౌర్, వేదా కృష్ణమూర్తి రాణించగా, తామేం తక్కువ కాదన్నట్లు జూనియర్లు స్మృతి మందన, జెమీమా రోడ్రిగెజ్‌లు అదురగొట్టడంతో టీమ్‌ఇండియా గెలుపు నల్లేరుపై నడక అయ్యింది. అయితే మూడో మ్యాచ్‌లో అంచనాలు పూర్తిగా తారుమారు అయ్యాయి. టాపార్డర్ రాణించినా..మిడిలార్డర్ కుప్పకూలడంతో భారత్ స్వల్ప స్కోరుకే పరిమితమైంది. సిరీస్‌లో నిలువాలంటే తప్పక గెలువాల్సిన మ్యాచ్‌లో సఫారీలు జూలు విదిల్చారు. పేసర్ షబ్నీమ్ ఇస్మాల్ ఐదు వికెట్లతో విజృంభించి సఫారీ జట్టు గెలుపులో కీలకమైంది. దీనికి తోడు బ్యాటింగ్ గాడిలో పడటం దక్షిణాఫ్రికాకు బాగా కలిసొచ్చింది. ఇదే జోరును నాలుగో టీ20లోనూ కొనసాగించి సిరీస్‌ను మరింత ఆసక్తికరంగా మార్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నది. మరోవైపు ఓటమి నేర్పిన గుణపాఠంతో తప్పులు ఎంచుకుని భారత్ మళ్లీ పోటీలోకి రావాలని తహతహలాడుతున్నది.

హైదరాబాద్, మెదక్ విజయం



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న మెదక్ ఆటగాడు జైస్వాల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: జీ వెంకటస్వామి మెమోరియల్ తెలంగాణ టీ 20 లీగ్‌లో హైదరాబాద్ థండర్స్, మెదక్ మావెరిక్స్ జోరు కొనసాగుతున్నది. ఏవోసీ మైదానంలో నిజామాబాద్ నైట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 5 పరుగుల తేడాతో విజయం నమోదు చేసింది. తొలుత మిచిల్ జైస్వాల్ 52, అభిరాత్ రెడ్డి 36 రాణించడంతో మెదక్ 4 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. తర్వాత సమిష్టిగా రాణించడంతో నిజామాబాద్ 19.4 ఓవర్లలో 153/8 స్కోరు చేసింది. జైస్వాల్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.కరీంనగర్ వారియర్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో హైదరాబాద్ విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కరీంనగర్ జట్టు 51.4 ఓవర్లలో 63 పరుగులకే ఆలౌట్ కాగా.. కేఎస్‌కే చైతన్య 48 పరుగులతో రాణించడంతో హైదరాబాద్ జట్టు సునాయాస విజయం నమోదు చేసింది.

పాక్ యువ క్రికెటర్ ఆత్మహత్య

కరాచీ: సెలెక్టర్లు, కోచ్‌లు తనను జట్టుకు ఎంపిక చేయకపోవడంపై మనస్థాపం చెందిన పాకిస్థాన్ యువ క్రికెటర్ మహ్మద్ జర్యాబ్ మంగళవారం తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పాక్ మాజీ క్రికెటర్ హనీఫ్ కొడుకైన జర్యాబ్..కరాచీ అండర్-19 జట్టు తరపున ప్రాతినిధ్యం వహించాడు. గాయం కారణంగా టోర్నీ మధ్యలోనే అర్ధంతరంగా జట్టుకు దూరమయ్యాడు. వయస్సు పెద్దగా ఉందన్న కారణంతో తప్పిస్తూ సెలెక్టర్లు నిర్ణయం తీసుకోవడం అతన్ని కలిచివేసింది. దీన్ని మనస్సులో పెట్టుకున్న జర్యాబ్ ఆత్మహత్యే శరణ్యమని భావించాడు.



హైదరాబాద్ విఠల్ నగర్‌లోని లక్ష్మీనారాయణ యాదవ్ (పహిల్వాన్) స్వగృహంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే రాజాసింగ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు

జలగర్భ గుహలో చరిత్ర

పురాతన మానవ, జంతు అవశేషాలు లభ్యం

మాయన్ కాలంనాటివని పరిశోధనల్లో వెల్లడి

మెక్సికో సిటీ, ఫిబ్రవరి 20: మెక్సికోలో ఇటీవల బయల్పడిన ప్రపంచంలోనే అతిపెద్ద జలగర్భ గుహలో అన్వేషణ సాగిస్తున్న పురావస్తు శాస్త్రవేత్తలు అనేక ఆసక్తికరమైన అంశాలను కనుగొన్నారు. భారీ జంతువుల శిలాజాలు, మాయన్ దేవుని ఆలయం వంటివి వాటిలో ఉన్నాయి. మెక్సికోలోని యుకాటాన్ ద్వీపకల్పంలో గత నెలలో రెండు భారీ జలగర్భ గుహలను కనుగొన్నారు. అవి ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉన్నాయి. కొన్ని వేల సంవత్సరాలుగా ఆ గుహల్లో దాగి ఉన్న రహస్యాలను ఛేదించేందుకు మెక్సికో జాతీయ చరిత్ర, మానవ శాస్త్ర సంస్థ (ఐఎన్ఏహెచ్) పూనుకుంది. ఆ గుహల్లోకి ప్రవేశించిన మానవులు, జంతువులు తిరిగి రాలేకపోయినట్టు పురావస్తు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. జలగర్భంలోని ఆ గుహలు 26 లక్షల ఏండ్ల నుంచి 11,700 సంవత్సరాల మధ్య ఏర్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. ఆ గుహల్లో ఏనుగు వంటి జంతువులు, భారీ దేవాంగి పిల్లులు, ఎలుగుబంట్ల అవశేషాలు లభించినట్లు వారు తెలిపారు. అలాగే మానవులు ఉపయోగించిన కొన్ని పింగాణీ వస్తువులు, మానవుల కాలిన ఎముకలు, గోడలపై రాతలు కనిపించినట్టు చెప్పారు. గుహ లోపల ఆసక్తికరమైన కళాఖండాలున్నాయని,



వాటిని పరిరక్షించిన విధానం మరింత ఆసక్తిని గొలుపుతున్నదని పేర్కొన్నారు. ఇవి కాకుండా ఒక మాయన్ దేవుని ఆలయం ఉందని, అడవి మధ్య నుంచి దాని వద్దకు వెళ్లేందుకు మెట్లు ఉన్నాయని తెలిపారు. నీటిలోనుంచి ఆ గుహల్లోకి వెళ్లేందుకు వందల సంఖ్యలో రంధ్రాలున్నాయని, వాటన్నింటినీ మరింత లోతుగా పరిశోధించాల్సి ఉందని గిలెర్మో డి ఆండా అనే పురావస్తు శాస్త్రవేత్త చెప్పారు.

స్మార్ట్‌ఫోన్‌ను మైక్రోస్కోప్‌గా మార్చొచ్చు

3డీ క్లిప్‌ను రూపొందించిన శాస్త్రవేత్తలు



మెల్‌బోర్న్, ఫిబ్రవరి 20: ఒక చిన్న క్లిప్‌ను మీ స్మార్ట్‌ఫోన్‌కు అమర్చుకోవడం ద్వారా దానిని మైక్రోస్కోప్‌గా మార్చవచ్చు. మిల్లీమీటర్‌లో 200వ వంతు పరిమాణం ఉన్నవాటిని స్మార్ట్‌ఫోన్ తెరపై ప్రత్యక్షంగా చూడొచ్చు. అంటే జంతు, వృక్ష కణాలను, మన రక్త కణాలను, మానవ కణంలోని అంతర్గత భాగాలను, సూక్ష్మజీవులను ప్రత్యక్షంగా చూడొచ్చు. ఆస్ట్రేలియాలోని ఆర్ఎంఐటీ యూనివర్సిటీలో దీనిని అభివృద్ధి చేశారు. 3డీ ప్రింటింగ్ సాయంతో ఈ క్లిప్‌ను తయారు చేయవచ్చు. 3డీ ప్రింటర్ ఉన్నవారు ఎవరైనా తమను సంప్రదిస్తే క్లిప్ తయారీకి కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉచితంగా అందజేస్తామని శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈ క్లిప్‌ను బిగిస్తే ఏ స్మార్ట్‌ఫోన్‌నైనా మైక్రోస్కోప్‌గా మార్చొచ్చని చెప్తున్నారు. క్లిప్ పనిచేయడానికి కరెంటు, బ్యాటరీలు వంటివేవీ అవసరం లేదన్నారు. సాధారణ మైక్రోస్కోప్‌తో సమానంగా ఇది పనిచేస్తుందన్నారు. మారుమూల ప్రాంతాల్లో పరిశోధనలు చేసేవారికి ఈ క్లిప్ ఎంతో ఉపయోగపడుతుందని పరిశోధనకు నేతృత్వం వహించిన ఆంటోనీ ఓర్త్ తెలిపారు.





పాము తలను కొరికేసిన సోనేలాల్

ప్రతీకారంతో పాము తల కొరికేశాడు!

ఉత్తరప్రదేశ్‌లో వింత ఘటన

లక్నో: తనను పాము కాటేసిందని దానిని వెంటపడి పట్టుకొని ప్రతీకారంతో తలకొరికేశాడు ఓ వ్యక్తి. ఆ తర్వాత అపస్మారస్థితికి వెళ్లిపోయాడు. ఉత్తరప్రదేశ్‌లోని శుక్లాపూర్ భగర్ గ్రామానికి చెందిన సోనేలాల్‌ను మొఘాగంజ్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా, వైద్యులు అత్యవసర చికిత్స అందించారు. స్పృహలోకి వచ్చిన తర్వాత సోనేలాల్‌ను వైద్యులు అసలు విషయం అడుగగా.. 'పశువులను మేపుతుండగా నన్ను పాము కాటేసింది. కోపంతో దానిని పట్టుకొని తల కొరికి తర్వాత దానిని ఉమ్మేశాను' అనడంతో అంతా అవాక్కయ్యారు. తనను కాటేసిందనే భ్రమలో పాము తలను కొరుకడంతో దాని విషప్రభావంతో సోనేలాల్ అపస్మారక స్థితికి చేరాడని వైద్యులు తెలిపారు.

పేపర్, పెన్సిల్‌తో.. కరెంటుని పుట్టించారు



బెర్లిన్: థర్మోలైటిక్ ఎఫెక్ట్ విధానంలో ఉష్ణం నుంచి కరెంటును ఉత్పత్తి చేసే ప్రక్రియలో సులువైన, పర్యావరణ హిత మార్గాన్ని కనిపెట్టినట్టు జర్మనీ శాస్త్రవేత్తలు ప్రకటించారు. పేపర్, పెన్సిల్, కండక్టివ్ పెయింట్ సాయంతో దీన్ని తయారుచేశారు. ఒకటి వేడిగా, మరొకటి చల్లగా ఉన్న రెండు లోహ పదార్థాలను కలిపినప్పుడు లేదా వాహకంతో అనుసంధానించినప్పుడు ఉష్ణం ఎక్కువ నుంచి తక్కువకు ప్రయాణిస్తుంది. ఈ క్రమంలో ఎలక్ట్రాన్ల ప్రవాహంతో కరెంటు ఉత్పత్తి అవుతుంది. దీనిని థర్మోలైటిక్ ఎఫెక్ట్ అంటారు. ఓ పెన్సిల్, పేపర్, పెయింట్ ఉపయోగించి కరెంటును విజయవంతంగా ఉత్పత్తి చేశామని, అయితే ఈవిధానంలో చాలా తక్కువ స్థాయిలో కరెంటు ఉత్పత్తి అవుతుందని వారు తెలిపారు.

మహిళపై దారుణమైన లైంగికదాడి

మర్మాంగంలోకి ఇనుప రాడ్డును జొప్పించి హింసించిన మృగాళ్లు

పశ్చిమబెంగాల్‌లో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి

కోల్‌కతా, ఫిబ్రవరి 20: పశ్చిమబెంగాల్‌లో ఓ మహిళపై(20) ఇద్దరు వ్యక్తులు సామూహిక లైంగికదాడికి పాల్పడి, ఆమె మర్మాంగంలో ఇనుప రాడ్డును జొప్పించి హింసించారు. దక్షిణ దినాజ్‌పూర్‌లోని ఓ గ్రామంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫిబ్రవరి 17న శివరాత్రి ఉత్సవం నుంచి ఇంటికి తిరిగివెళ్తున్న దేహబంద్‌కు చెందిన బాధితురాలిని దుండగులు అపహరించినట్లు దక్షిణ దినాజ్‌పూర్ ఎస్పీ ప్రసూన్ బెనర్జీ చెప్పారు. అనంతరం స్థానికంగా ఉన్న వంతెన కిందికి తీసుకెళ్లి ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపారు. ఈ ఘాతుకానికి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు. 'వంతెన కింద అపస్మారకస్థితిలో పడి ఉన్న ఓ మహిళను చూశాను. ఆమె మర్మాంగం నుంచి పేగు బయటికి రావడాన్ని గుర్తించి దవాఖానకు తరలించాను' అని ధాము సోరెన్ అనే స్థానికుడు పోలీస్ ఫిర్యాదులో పేర్కొన్నారు. దేహబంద్‌కు చెందిన రామ్‌ప్రబేశ్ శర్మతో పాటు కొందరు తనని ఎత్తుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డారని బాధితురాలు పేర్కొన్నారు. బాధితురాలికి మాల్దా దవాఖాన వైద్యుల బృందం రెండు శస్త్రచికిత్సలు నిర్వహించింది.



లైంగికదాడి నిందితులను
ఠాణా నుంచి లాక్కొచ్చి కొట్టిచంపారు

అరుణాచల్‌ప్రదేశ్‌లో ఘటన

డిబ్రుగఢ్, ఫిబ్రవరి 20: చిన్నారిపై లైంగికదాడికి పాల్పడిన ఇద్దరు నిందితులను ప్రజలు పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు లాక్కొచ్చి మరీ కొట్టిచంపారు. ఈ ఘటన అరుణాచల్‌ప్రదేశ్‌లోని లోహిత్ జిల్లాలో సోమవారం చోటుచేసుకుంది. వాక్రో రెవెన్యూ సర్కిల్‌లోని నామ్‌గో గ్రామంలో 12 ఏండ్ల బాలిక ఈ నెల 12న కనిపించకుండా పోయింది. ఐదురోజుల తర్వాత ఇంటికి సమీపంలో టీ గార్డెన్‌లో నగ్నంగా బాలిక శవం కనిపించింది. పోస్టుమార్టం రిపోర్టులో బాలికపై దారుణంగా లైంగికదాడి జరిగినట్టు తేలింది. ఈ కేసులో నిందితులైన అస్సాం వలస కూలీలు సంజయ్ సోబర్ (30), జగదీశ్ లోహర్ (25)లను పోలీసులు అరెస్టు చేశారు. అయితే తేజూ పోలీస్‌స్టేషన్‌పై దాడి సుమారు 800 మంది నామ్‌గో గ్రామస్థులు దాడిచేశారు.నిందితులిద్దరిని పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు లాక్కొచ్చి బట్టలు ఊడదీసి కర్రలు, రాళ్లతో కొట్టి చంపేశారు.



కర్ణాటకలో కాంగ్రెస్ నేత నారాయణస్వామి బెంగళూరు కార్పొరేషన్ కార్యాలయంలో అలజడి సృష్టించాడు. పెట్రోల్‌ను కార్యాలయంలో చల్లి నిప్పపెడుతానని బెదిరించాడు. భూమికి సంబంధించి తప్పడు ధ్రువీకరణ పత్రాన్ని ఇవ్వడానికి అధికారులు నిరాకరించడంతో నారాయణస్వామి ఈ చర్యకు పాల్పడ్డాడు. ఆయన సస్పెన్షన్‌కు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు పరమేశ్వర ఆదేశించారు.

డెనా పర్వత శ్రేణులపై ఇరాన్ విమాన శకలాలు!

టెహ్రాన్, ఫిబ్రవరి 20: ఇరాన్‌లోని పర్వతాల్లో కూలిపోయిన విమాన శకలాలను మంగళవారం కనుగొన్నారు. టెహ్రాన్ నుంచి ఆదివారం ఉదయం బయలుదేరిన విమానం 45 నిమిషాల్లోనే మంచు తుఫాన్‌కుతోడు సాంకేతిక సమస్యలు తలెత్తడంతో పర్వత శ్రేణుల్లో కూలిపోవడంతో 66 మంది మృతి చెందిన సంగతి తెలిసిందే. డ్రోన్ల సాయంతో సోమవారం ఉదయం నుంచి విమాన శకలాల కోసం ఇరాన్ సైన్యానికి చెందిన 60 హెలికాప్టర్లు గాలింపు చేపట్టాయి. నొఘోల్ గ్రామానికి సమీపంలో 4000 మీటర్ల ఎత్తున డెనా పర్వత శ్రేణులపై ముక్కలైన విమాన శకలాలు, వాటిపై చెల్లాచెదరుగా పడి ఉన్న మృతదేహాలను హెలికాప్టర్ పైలట్ గుర్తించారని ప్రభుత్వ అధికార ప్రతినిధి రమేజాన్ షరీఫ్ తెలిపారు. సహాయ, పునరావాస సిబ్బందితోపాటు వందమంది పర్వతారోహకులు కూడా విమాన శకలాల గాలింపులో పాల్గొన్నారు.

హిందూ మహాసముద్రంలో
చైనా యుద్ధ నౌకల మోహరింపు

బీజింగ్/ కొలంబో/ మాలె: మాల్దీవుల సంక్షోభం నేపథ్యంలో హిందూ మహా సముద్రంలో చైనా ఐదు యుద్ధ నౌకలను మోహరించింది. దీంతో హిందూ మహా సముద్ర జలాల్లో తిష్ఠ వేసిన చైనా యుద్ధ నౌకల సంఖ్య 11కు చేరిందని ఆ దేశ వార్తా వెబ్‌సైట్ పేర్కొన్నది. శ్రీలంకలో ప్రవాస జీవితం గడుపుతున్న మాల్దీవుల మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్.. తమ దేశంలోని సమస్య పరిష్కారానికి సైనిక జోక్యం చేసుకోవాలని భారత్‌ను కోరారు. ఈ విషయ మై భారత్ జోక్యాన్ని వ్యతిరేకించిన చైనా.. హిందూ మహా సముద్ర జలాల్లో యుద్ధ నౌకలను మోహరించింది.

ఇస్రోలో సైంటిస్టు పోస్టులు

డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ పరిధిలో పనిచేస్తున్న ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)లోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న సైంటిస్ట్/ఇంజినీర్స్ (ఎస్‌సీ) పోస్టుల భర్తీకి ఇస్రో సెంట్రలైజ్‌డ్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ఐసీఆర్‌బీ) అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

బెంగళూరు ప్రధాన కార్యాలయంగా ఏర్పాటుచేసిన ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)ను విక్రమ్ సారాభాయ్ 1969 ఆగస్టు 15న స్థాపించారు. ఇది అంతరిక్ష పరిశోధనల కోసం భారత ప్రభుత్వం నెలకొల్పిన సంస్థ.

- **పోస్టు పేరు** : సైంటిస్ట్/ఇంజినీర్స్(ఎస్‌సీ)
- **మొత్తం పోస్టుల సంఖ్య** : 28
- **పోస్టు పేరు** : సైంటిస్ట్/ఇంజినీర్స్(ఎస్‌సీ)

విభాగాలవారీగా ఖాళీలు:

- **ఇస్రో హెడ్‌క్వార్టర్‌లో** – సివిల్–11, ఎలక్ట్రికల్–5, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషనింగ్–6
- **ఫిజికల్ రిసెర్చ్ ల్యాబొరేటరీ (అహ్మదాబాద్)లో** – సివిల్–3, ఎలక్ట్రికల్–1, ఆర్కిటెక్చర్–1
- **సెమీ కండక్టర్ ల్యాబొరేటరీ (చండీగఢ్)లో** – రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషనింగ్–1
- **అర్హత:** బీఈ/బీటెక్ (సివిల్, ఎలక్ట్రికల్, ఈసీఈ, మెకానికల్‌తోపాటు ఎయిర్ కండీషనింగ్ & రిఫ్రిజిరేషన్, అల్లైడ్ సబ్జెక్టుల్లో), ఆర్కిటెక్చర్‌లో బ్యాచిలర్ డిగ్రీలో సీజీపీఏ 6.84 టెన్ స్కేల్ లేదా 65 శాతం మార్కులతో ఉత్తీర్ణత. 2018 ఆగస్ట్ 31 నాటికి డిగ్రీ ఫైనల్ ఇయర్ పూర్తి చేయనున్న అభ్యర్థులు కూడా అప్లై చేయవచ్చు.
- **వయస్సు:** 2018 మార్చి 5 నాటికి 35 ఏండ్లకు మించరాదు. రిజర్వేషన్ అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **పేస్కేల్:** రూ. 56,100/– అదనంగా ఇంటిఅద్దె, రవాణా అలవెన్స్, ఉద్యోగుల కొత్త పెన్షన్ పథకం, గ్రూప్ ఇన్సూరెన్స్, వైద్యసౌకర్యాలు తదితర సౌకర్యాలను కల్పిస్తారు.
- **పనిచేసే ప్రదేశం:** దేశవ్యాప్తంగానున్న ఇస్రో సెంటర్/యూనిట్లలో
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 100/–, ఎస్సీ, ఎస్టీ, ఎక్స్‌సర్వీస్‌మెన్, మహిళా, పీహెచ్‌సీలకు ఫీజు లేదు.
- **ఎంపిక విధానం:** అకడమిక్ ప్రతిభ, బయోడేటా ఆధారంగా మొదట స్క్రీనింగ్ చేస్తారు. ఆ తర్వాత రాతపరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
- రాతపరీక్షకు షార్ట్‌లిస్ట్ పొందిన అభ్యర్థులకు ఈ–మెయిల్ ద్వారా మార్చి రెండో/మూడోవారంలో తెలియజేస్తారు.
- రాతపరీక్షలో ఆబ్జెక్టివ్ విధానంలో సంబంధిత సబ్జెక్ట్ నుంచి 80 ప్రశ్నలు ఇస్తారు. 80 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- రాతపరీక్షలో కనీసం 60 శాతం మార్కులు సాధించినవారికి మాత్రమే ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
- **రాతపరీక్ష తేదీ:** 2018 ఏప్రిల్ 22
- **పరీక్ష కేంద్రాలు** : హైదరాబాద్, బెంగళూరు, అహ్మదాబాద్, భోపాల్, చండీగఢ్, చెన్నై, గువాహటి, లక్నో, కోల్‌కతా, ముంబై, న్యూఢిల్లీ, తిరువనంతపురం.

గమనిక: ఈ పోస్టులు ప్రస్తుతం తాత్కాలికమైనవి, తర్వాత పర్మినెంట్‌గా చేసే అవకాశం ఉంది


- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు వినియోగంలో ఉన్న ఈ– మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్‌ను తప్పనిసరిగా ఎంటర్‌చేయాలి. తదితర సర్టిఫికెట్లను జతచేసి సంబంధిత పర్సనల్ అధికారికి ఆర్డినరీ పోస్ట్‌లో పంపాలి.

చిరునామా: Antariksh Bhavan,
ISRO Headquarters,
New BEL Road,
Bengaluru–5600231

- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** మార్చి 5
- **హార్డ్‌కాపీలను పంపడానికి చివరితేదీ:** మార్చి 11
- **వెబ్‌సైట్:** http://www.isro.gov.in

ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో1898 అప్రెంటిస్‌లు

బీహార్ (పాట్నా)లోని ఈస్ట్ సెంట్రల్ రైల్వే వివిధ వర్క్‌షాప్/డివిజన్‌ల్లో ఖాళీగా ఉన్న అప్రెంటిస్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



- మొత్తం ఖాళీల సంఖ్య – 1898

డివిజన్‌లవారీగా ఖాళీలు:

- డానాపూర్–626 ఖాళీలు (ఫిట్టర్–190, వెల్డర్ (జీ & ఈ)–6, మెకానిక్(డీజిల్)–32, రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ మెకానిక్–68, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్–20, కార్పెంటర్–10, ఎలక్ట్రానిక్ మెకానిక్–130, పెయింటర్ (జనరల్)–14, ఎలక్ట్రీషియన్–134, వైర్‌మ్యాన్–22)
- ధన్‌బాద్–142 ఖాళీలు (ఫిట్టర్–38, టర్నర్–21, మెషినిస్ట్–6, కార్పెంటర్–6, వెల్డర్ (జీ & ఈ)–41, మెకానిక్ (డీజిల్)–12, వైర్‌మ్యాన్–18)
- మొఘల్‌సరాయి–844 ఖాళీలు (ఫిట్టర్–480, మెషినిస్ట్–4, వెల్డర్ (జీ & ఈ)–24, ఎలక్ట్రీషియన్–36, ఎంఎంటీఎం–2, టర్నర్–6, వైర్‌మ్యాన్–58, రిఫ్రిజిరేషన్ & ఏసీ మెకానిక్–16, ఎలక్ట్రానిక్ మెకానిక్–140, మెకానిక్(డీజిల్)–78
- సమష్టిపూర్–70 ఖాళీలు (ఫిట్టర్–14, టర్నర్–4, వెల్డర్ (జీ అండ్ ఈ)–4, ఎలక్ట్రీషియన్–10,పెయింటర్ –2, కార్పెంటర్–2, మెకానిక్(డీజిల్)–20,
- ల్యాబొరేటరీ అసిస్టెంట్–4
- ప్లాంట్ డిపో/మొఘల్‌సరాయి–116 ఖాళీలు (ఫిట్టర్–54, మెషినిస్ట్–10, వెల్డర్ (జీ అండ్ ఈ)–10, ఎలక్ట్రీషియన్–4, మెషినిస్ట్/గ్రైండర్–12, టర్నర్–10, మెకానిక్(డీజిల్)–8, మెకానిక్ ఎంవీ–8
- మెకానికల్ వర్క్‌షాప్/సమష్టిపూర్–100 ఖాళీలు (ఫిట్టర్–50, మెషినిస్ట్–10, వెల్డర్ (జీ అండ్ ఈ)–32, ఎలక్ట్రీషియన్–8
- **వయస్సు:** 2018,జనవరి 1 నాటికి 15 నుంచి 24 ఏండ్ల మధ్య ఉండాలి.
- **విద్యార్హతలు:** పదోతరగతిలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఎస్‌సీవీటీ/ఎన్‌సీవీటీ నుంచి సంబంధిత ట్రేడ్ విభాగంలో ఐటీఐ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- **ఫీజు:** రూ. 100/–, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళా అభ్యర్థులకు ఫీజు లేదు.
- **ఎంపిక విధానం:** పదోతరగతి, ఐటీఐలో వచ్చిన మార్కుల ఆధారంగా (50:50) ఎంపికచేస్తారు.
- **శారీరక ప్రమాణాలు** : 1961 అప్రెంటిస్ యాక్ట్ ప్రకారం నిర్దేశిత ప్రమాణాలు కలిగి ఉండాలి.
- **స్టయిఫండ్:** రైల్వే అప్రెంటిషిప్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం స్టయిఫండ్ చెల్లిస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో. అర్హత కలిగిన అభ్యర్థులు పూర్తి వివరాలతోపాటు ఆధార్ నంబర్ కూడా తప్పనిసరిగా ఎంటర్ చేయాలి.
- **చివరితేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** www.rrcecr.gov.in

వెటర్నరీ యూనివర్సిటీలో

హైదరాబాద్‌లోని పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ వివిధ విభాగాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 6
- **విభాగాలవారీగా ఖాళీలు:** రిజిస్ట్రార్–1, డీన్ (వెటర్నరీ, డెయిరీ అండ్ ఫిషరీస్)–1, డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్–1, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్–1, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్–1, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్–1
- **అర్హత:** యూనివర్సిటీ నిబంధనల ప్రకారం అర్హతలను కలిగి ఉండాలి.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 1000/– ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ. 500/–చెల్లించాలి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరితేదీ:** మార్చి 19
- **వెబ్‌సైట్:** http://tsvu.nic.in

ఎన్ఐఏబీలో ఖాళీలు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ (ఎన్ఐఏబీ) ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 6
- సైంటిస్ట్–4
- టెక్నికల్ ఆఫీసర్–2
- **అర్హత:** బీఎస్సీ, బీవీఎస్సీ, బీఫార్మసీ, బీఈ/బీటెక్‌లో ఉత్తీర్ణత. సైంటిస్ట్ పోస్టుకు పీహెచ్‌డీతోపాటు సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేదీ:** మార్చి 19
- **హార్డ్‌కాపీలకు చివరితేదీ:** మార్చి 24
- **వెబ్‌సైట్:** www.niab.org.in

విద్య, ఉద్యోగ సమాచారం

రైట్స్ లిమిటెడ్‌లో ఇంజినీర్లు

రైల్వే మంత్రిత్వశాఖ పరిధిలో పనిచేస్తున్న రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనమిక్ సర్వీస్ (రైట్స్) మెకానికల్ /ఎలక్ట్రికల్ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఇంజినీర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

రైట్స్ ఒక మినీరత్న సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్

- మొత్తం పోస్టుల సంఖ్య: 30 (మెకానికల్–8, ఎలక్ట్రికల్–22)
- **పోస్టు పేరు** : ఇంజినీర్
- **అర్హత:** ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. సంబంధిత విభాగంలో రెండేండ్ల అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేదీ:** ఫిబ్రవరి 22
- **రాతపరీక్ష/ ఇంటర్వ్యూ తేదీ:** ఫిబ్రవరి 24, 25
- **వెబ్‌సైట్:** www.rites.com

బీహెచ్‌ఈఎల్‌లో ఇంజినీర్ ట్రెయినీలు

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఇంజినీర్ ట్రెయినీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

బీహెచ్‌ఈఎల్‌ను 1964లో ఏర్పాటు చేశారు. ఈ సంస్థ మహారత్న హోదా కలిగి ఉంది.

- **పోస్టు పేరు:** ఇంజినీర్ ట్రెయినీ
- **మొత్తం ట్రెయినీల సంఖ్య:** 50 (మెకానికల్–30, ఎలక్ట్రికల్–20)
- **అర్హత:** సంబంధిత ఇంజినీరింగ్ బ్రాంచిలో బీఈ/బీటెక్, ఐందేండ్ల మాస్టర్ డిగ్రీ లేదా డ్యూయల్ డిగ్రీలో ఉత్తీర్ణత. గేట్–2018 పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి.
- **వయస్సు:** 2017 సెప్టెంబర్ 1 నాటికి 27 ఏండ్లకు మించరాదు పీజీ చేసిన అభ్యర్థులకు 29 ఏండ్ల వరకు సడలింపు ఉంటుంది.
- **ప్రొబేషనరీ పీరియడ్:** ఏడాది
- **పే స్కేల్:** రూ. 24900–50500/–
- **ఎంపిక:** గేట్ 2018 స్కోర్, ఇంటర్వ్యూ ద్వారా
- గేట్ స్కోర్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ఇంటర్వ్యూకు 1:10 నిష్పత్తిలో ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** మార్చి 12
- **ఫీజు చెల్లించడానికి చివరితేదీ:** మార్చి 13
- **వెబ్‌సైట్:** www.bheledn.com.

హెచ్‌ఎన్‌ఎల్‌లో ట్రెయినీ టెక్నీషియన్లు

హిందుస్థాన్ పేపర్ కార్పొరేషన్ లిమిటెడ్ పరిధిలో పనిచేస్తున్న హిందుస్థాన్ న్యూస్ ప్రింట్ లిమిటెడ్‌లో కంపెనీ ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



- **పోస్టు పేరు:అడ్వాన్స్‌డ్ ట్రెయినీ టెక్నీషియన్**
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 22

విభాగాలవారీగా ఖాళీలు:

- బాయిలర్ అటెండెంట్ (ఐటీఐ) –4, వెల్డర్ (ఐటీఐ)–2, డిప్లొమా ఇన్ మెకానికల్–4, ప్రాసెస్ ఆపరేటర్స్ (ఐటీఐ/డిప్లొమా)–10, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్–2
- **అర్హత:** పదోతరగతితో పాటు సంబంధిత ఐటీఐ ట్రేడ్/ డిప్లొమాలో ఉత్తీర్ణత.
- **స్టయిఫండ్:** ఐటీఐవారికి రూ. 10,000/– డిప్లొమా అభ్యర్థులకు 11,000/– చెల్లిస్తారు
- **ఎంపిక:** రాత పరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 22
- **వెబ్‌సైట్:** http://www.hnlonline.com